అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

సోమవారం 17-7-2023

www.navatelangana.com

సంపుటి : 9 | సంచిక : 197 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 12 పేజీలు | వెల : 6.50



బోనమెత్తిన భాగ్యనగరం

భారీగా తరలివచ్చిన భక్తులు

నవతెలంగాణ-చాంద్రాయణగుట్ట

చారిత్రాత్మకమైన లాల్‌దర్వాజా సింహవాహిని అమ్మవారి దేవాలయంలో బోనాల జాతర ఘనంగా జరిగింది. తెల్ల వారు.ఆము నుంచి అమ్మవారికి బోనాలు సమర్పించేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి లైన్లలో వేచి ఉన్నారు. అమ్మవారికి ప్రజా ప్రతినిధులు, ప్రముఖులు, భక్తులు తమ తమ మొక్కులు చెల్లించుకుని బోనాలు సమర్పించుకున్నారు. దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అమ్మవారికి ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మి బంగారు బోనం సమర్పించారు. ఉమ్మడి దేవాలయాల ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలోని దాదాపు 460 దేవాలయాలు బోనాల కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. సందర్శకులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా పోలీస్ యంత్రాంగం చర్యలు తీసుకున్నది. అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖుల్లో.. రాజ్యసభ సభ్యులు ...5లో

593 ఐసీటీసీ కేంద్రాలు

మూసివేత





రాష్ట్రంలో 40 హెచ్ఐవీ పరీక్షా కేంద్రాల తొలగింపు

- హేతుబద్ధీకరణ పేరుతో మోడీ సర్కార్ ఏకపక్ష నిర్ణయం
- ఎయిడ్స్ రోగులకు చిక్కులు
- వెల్లువెత్తుతున్న నిరసనలు

కరోనా సమయంలో దేశంలో వైద్య సేవలు అందక లక్షలాదిమంది మరణించిన విషయం అనుభవంలోనిదే. ఆ ఆపత్కాలం నుంచి కేంద్ర ప్రభుత్వం ఎలాంటి గుణపాఠాలు నేర్చుకోలేదు. అత్యంత ప్రమాదకరమైన ఎయిడ్స్ వ్యాధితో చెలగాటమాడేందుకు సిద్ధమైంది. దేశవ్యాప్తంగా 593 హెచ్ఐవీ నిర్ధారణ కేంద్రాలను మూసివేయాలని నిర్ణయించింది. ఈ దుష్ప్రభావం భవిష్యత్ సమాజంపై తీవ్రంగానే పడుతుందని వైద్యరంగ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

కొత్తూరు ప్రియకుమార్

పేదలకు అందుతున్న వైద్య సేవలను విస్తరించాల్సి ఉండగా, అందుకు భిన్నంగా హేతుబద్ధీకరణ పేరుతో కేంద్ర ప్రభుత్వం వాటిని మరింత కుదించింది. ఆరోగ్య రంగంలో ఇప్పటికే అనేక పథకాల్లో కోతలు, షరతులు విధించి, పేదల ఆరోగ్యాలతో చెలగాటమాడుతున్న విషయం తెలిసిందే. క్షేత్రస్థాయి అవగాహన లేకుండా రోగులు, ప్రజల అభిప్రాయంతో నిమిత్తం లేకుండా తీసుకుంటున్న నిర్ణయాల పట్ల కేంద్ర సర్కారుపై తీవ్ర ప్రజాగ్రహం వ్యక్తమవుతున్నది. తాజాగా దేశంలో హెచ్ఐవీ, ఎయిడ్స్ నిర్మూలన కోసం దశాబ్దాలుగా పని చేస్తున్న 593 ఇంటిగ్రేటెడ్ కౌన్సిలింగ్ అండ్ టెస్టింగ్ సెంటర్ (ఐసీటీసీ)ల మూసివేతకు ఆదేశాలిచ్చింది. వీటన్నింటినీ దశలవారీగా 2024 నాటికి పూర్తిగా మూసివేయాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఫలితంగా రాష్ట్రంలోనూ 40 ఐసీటీసీలు మూసివేతకు గురికానున్నాయి. దీనివల్లో ప్రభుత్వాస్పత్రులపైనే ఆధారపడే లక్షలాది మంది పేద గర్భిణీలు, శస్త్రచికిత్స అవసరమైన రోగులు ఇబ్బందుల పాలవుతారు. హేతుబద్ధీకరణ పేరుతో కేంద్ర ప్రభుత్వం ఈ మూసివేతలకు పాల్పడుతున్నది.

రాష్ట్రంలో 158 ఐసీటీసీ కేంద్రాలున్నాయి. వీటిలో 40 కేంద్రాలను కేవలం స్క్రీనింగ్ సైట్లకు పరిమితం చేయడంతో 118 మాత్రమే అందుబాటులో ఉన్నాయి. దీంతో పేదలు హెచ్ఐవీ నిర్ధారణ పరీక్షల కోసం ప్రయివేటును ఆశ్రయించాల్సి వస్తుంది. లేదంటే దూర ప్రాంతాల్లోనే ఐసీటీసీ కేంద్రానికి వెళ్లాల్సి ఉంటుంది. ఈ విషయాన్ని వైద్యరంగ నిపుణులు, ఉద్యోగ సంఘాల నేతలు నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్ (న్యాకో)తో వాదించినప్పటికీ పరిగణనలోకి తీసుకోలేదు. కేవలం హెచ్ఐవీ పాజిటివ్ రేషియో తక్కువగా ఉన్న చోట అలాంటి కేంద్రాలను కొనసాగించడంలో హేతుబద్ధత లేదంటూ కొట్టేసింది. అయితే హెచ్ఐవీ పాజిటివ్ రేషియోతో నిమిత్తం లేకుండా ప్రతి గర్భిణీకి, శస్త్రచికిత్సలు చేయించుకునే వారికి, హైరిస్క్ గ్రూప్ ఉన్న వారికి ఈ పరీక్షలు రెగ్యులర్‌గా చేయాల్సి ఉంటుందనే కనీస విషయాన్ని విస్మరించింది. ఈ నిర్ధారణ జరక్కుంటే వైద్య సేవల సమయంలో వైద్యులకూ ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడే అవకాశాలున్నాయి.

2021 నాటికి రాష్ట్ర జనాభా 3.77 కోట్లు. గడచిన పదేండ్లలో జనాభా పెరుగుదల రేటు 12.45 శాతంగా నమోదైంది. ఏడాదికి ఆరు లక్షల డెలివరీలు జరుగుతున్నాయి. శస్త్రచికిత్సలు, డెలివరీలు గతంతో పోలిస్తే ప్రభుత్వాస్పత్రుల్లో భారీగా పెరిగాయి. ఉన్న ఆస్పత్రులు, పరీక్షా కేంద్రాల్లో రద్దీ పెరిగి, వైద్యులు, పారామెడికల్ సిబ్బందిపై విపరీతమైన పనిభారాలు పడుతున్నాయి. ప్రభుత్వాసుపత్రుల సంఖ్య పెంచితే, రోగులకూ వైద్యసేవలు లభించడం ...2లో

ఉద్యోగులకూ అన్యాయమే

2000 సంవత్సరంలో హెచ్ఐవీ, ఎయిడ్స్ నిర్మూలనే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం న్యాకోను ఒక కార్యక్రమంగా ముందుకు తెచ్చింది. ఈ పథకం అమలులో భాగంగా రాష్ట్రాల వారీగా ఎయిడ్స్ నియంత్రణ మండళ్లను ఏర్పాటు చేసింది. అందులో కొద్ది మంది ఉన్నతాధికారులు తప్ప, వేలాది మంది కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ప్రాతిపదికన తక్కువ జీతాలతో పని చేస్తున్నారు. జీతాల పెంపు, సేవల క్రమబద్ధీకరణ కోసం సుదీర్ఘపోరాటం చేస్తున్నారు. ఎయిడ్స్ నిర్మూలన పూర్తికాకుండానే ఈ కేంద్రాల్లో పని చేసే ల్యాబ్ టెక్నీషియన్లు ఇతరులను ఇంటికి సాగనంపేందుకు కేంద్రం ప్రయత్నిస్తున్నదని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మోడీ సర్కార్ అనాలోచిత చర్యలను రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకోవాలని ఉద్యోగులు కోరుతున్నారు.



హెచ్ఐవీ విస్తరించే ప్రమాదం

ఐసీటీసీ కేంద్రాలను మూసివేస్తే హెచ్ఐవీ మరింత ప్రబలే ప్రమాదముందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇప్ప టికే జనాభా ఆధారంగా ఐసీటీసీ కేంద్రాల్లో అనుభవజ్ఞులైన ల్యాబ్ టెక్నీషియన్లు మూడు దశల్లో పరీక్షలు చేసి హెచ్ఐవీని నిర్ధారిస్తున్నారు. వీరికి తోడు హెచ్ఐవీ రాకముందు, హైరిస్క్ గ్రూపులకు కౌన్సిలర్లు అవగాహన కల్పిస్తున్నారు. వీరి సేవలు నిలిచిపోతే వ్యాధిబారిన పడే వారి సంఖ్య పెరిగే ప్రమాదముంది.



ధరల నియంత్రణలో కేంద్రం విఫలం

టమాటా రేట్లే ప్రత్యక్ష ఉదాహరణ

- టోకు వ్యాపారులకు కనక వర్షమే బీజేపీ విధానం
- వచ్చే ఎన్నికల్లో లబ్ధి కోసమే యూసీసీపై చర్చ
- సంఘపరివార్ వల్లే మణిపూర్‌లో మంటలు
- తెలుగు రాష్ట్రాల్లోకి బీజేపీని రానివ్వం
- మతోన్మాద, ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా వచ్చే వారితో కలిసి పనిచేస్తాం: సీపీఎం రాష్ట్ర కమిటీ సమావేశాల్లో బీవీ రాఘవులు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

కేంద్రంలోని బీజేపీ సర్కార్ ప్రాబల్యం రోజురోజుకు వేగంగా దిగజారుతున్నదనీ, పెరు గుతున్న ధరలను నియంత్రించడంలో ఆపార్టీ ఘోరంగా వైఫల్యం చెందిందని సీపీఐ(ఎం) పొలిట్ బ్యూరో సభ్యులు బీవీ రాఘవులు అన్నారు. హైదరాబాద్‌లోని ఎమ్‌బీ భవన్‌లో శనివారం ...5లో



ఎన్నికల కోసమే బీజేపీ యూసీసీ నాటకం

ఎఐయూడీఎఫ్ విమర్శ

న్యూఢిల్లీ : ఎన్నికల్లో లబ్ధి పొందే దురుద్దేశంతోనే బీజేపీ ఉమ్మడి పౌర స్మృతి (యూసీసీ) నాటకానికి తెర లేపిందని ఆల్ ఇండియా యునైటెడ్ డెమొక్రటిక్ ఫ్రంట్ (ఎఐయూడీఎఫ్) విమర్శించింది. ఏ అంశం లేకపోవడంతోనే త్వరలో జరిగే అయిదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు, వచ్చే ఏడాది జరిగే సార్వత్రిక ఎన్నికలకు ముందు కాషాయ పార్టీ యుసిసిని ముందుకు తెస్తోందని ఎఐయుడిఎఫ్ ప్రధాన కార్యదర్శి అమినుల్ ఇస్లాం అన్నారు. బీజేపీ ముస్లింలను టార్గెట్ చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. తమ పార్టీ యూసీసీకి వ్యతిరేకమని స్పష్టం చేశారు.కూరగాయల ధరల పెరుగుదలపై అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ చేసిన వ్యాఖ్యలను ఆయన ఖండించారు. రాజకీయ ప్రయోజనాల కోసం కులం, మతం ఆధారంగా బిజెపి ప్రజలను విభజిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈశాన్య ప్రాంతంలో అనుకూల పరిస్థితి లేకపోవడంతో ప్రజల మధ్య అంతరం సష్టించేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని విమర్శించారు. కూరగాయల ధరల పెరుగుదలకు మియా ముస్లింలే కారణమని హిమంత బిశ్వ శర్మ అనడం బాధ్యతారాహిత్యమని విమర్శించారు.

రుణమాఫీ ఏమైంది?

ధాన్యం కొన్న డబ్బులు ఎప్పుడు జమ చేస్తారు



- పోడు రైతులు 11.50 లక్షల మంది ఉంటే, నాలుగు లక్షల మందికి పట్టాలిచ్చి చేతులు దులుపుకున్నారు
- ఉచితంగా ఇస్తానన్న ఎరువులు ఏమయ్యాయి?
- రైతు వేదికల్ని రాజకీయ వేదికలుగా మారుస్తారా? :రేవంత్‌రెడ్డి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

సకాలంలో రైతు రుణమాఫీ చేయకపోవడంతో అప్పుల బారినపడుతున్నారని టీపీసీసీ అధ్యక్షులు,ఎంపీ ఎనుముల రేవంత్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. రుణమాఫీ కోసం ఇన్నాళ్లు మనం కండ్లు కాయలు కాచేలా ఎదురు చూశామని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఆఖరి ఆర్థిక బడ్జెట్ ప్రవేశపెట్టడం కూడా అయిపోయిందని తెలిపారు. ఇక రుణమాఫీ చేయబోదన్న విషయాన్ని తేటతెల్లం చేసిందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ...11లో

గాంధీ భవన్‌లో గాడ్సే

తెలంగాణ పీసీసీ చీఫ్ ఆర్ఎస్ఎస్ ఏజెంట్

- కాంగ్రెస్ పాలనలో అధ్వాన్నంగా విద్యుత్ వ్యవస్థ: మంత్రి కేటీఆర్



నవతెలంగాణ- జగిత్యాల

రోజుకి 24 గంటలు.. కరెంట్ ఇస్తున్నామా లేదా అన్న ఏకైక ఎజెండా మీద రైతుల వద్దకు వెళ్దామని అందుకు కాంగ్రెస్ పార్టీ సిద్ధమేనా అని ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్ సవాల్ విసిరారు. జగిత్యాలలో ఎమ్మెల్సీ ఎల్ రమణ తండ్రి సంస్మరణ సభకు హాజరైన మంత్రి కేటీఆర్.. కార్యక్రమం అనంతరం స్థానిక ఎమ్మెల్యే సంజయ్ కుమార్ నివాసంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. రేవంత్‌రెడ్డి ఏబీవీపీ, ఆర్ఎస్ఎస్‌లో ...11లో

యువతిపై సామూహిక లైంగికదాడి...

- బీజేపీ నేత కుమారుడి అఘాయిత్యం..
- మధ్యప్రదేశ్‌లో శృతిమించుతున్న కాషాయపార్టీ నేతల ఆగడాలు



భోపాల్: మధ్యప్రదేశ్‌లోని దతియా జిల్లాలో ఓ యువతిపై నలుగురు యువకులు సామూహిక లైంగికదాడికి తెగబడ్డారు. యువతి సోదరి పైనా కూడా వారు లైంగిక దాడికి పాల్పడ్డారు. దీంతో మనస్తాపం చెందిన బాధిత యువతి ఆత్మహత్యకు యత్నించింది. తమపై జరిగిన దారుణంపై బాలిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు ...11లో

ఢిల్లీ ఆర్డినెన్స్‌ను వ్యతిరేకిస్తాం

- కేజ్రీవాల్‌కు కాంగ్రెస్ భరోసా
- ప్రతిపక్షాల భేటీకి హాజరవుతాం : ఆప్
- నేడు, రేపు బెంగళూరులో ప్రతిపక్షాల భేటీ



న్యూఢిల్లీ : బెంగళూరులో ప్రతిపక్ష పార్టీల రెండు రోజుల ముందు కీలక పరిణామం చోటు చేసుకుంది. ఢిల్లీ అధికారాలను హరించివేస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఆర్డినెన్స్‌ను వ్యతిరేకిస్తున్నట్లు కాంగ్రెస్ తన వైఖరిని స్పష్టం చేసింది. కాంగ్రెస్ ఈ ప్రకటన చేసిన కొద్ది ...2లో

ఇంజినీరింగ్ మొదటి దశలో 70,665 సీట్ల కేటాయింపు

కంప్యూటర్ సైన్స్ అనుబంధ కోర్సులకే మొగ్గు

- ఎలక్ట్రికల్, మెకానికల్, సివిల్‌కు తగ్గిన ఆదరణ
- 31 కాలేజీల్లో 100 శాతం నిండిన సీట్లు
- ఈనెల 22 వరకు సెల్ఫ్ రిపోర్టు చేయాలి

వివరాలు 11లో..

వర్షాకాల సమావేశాల్లో 21 బిల్లులు



- ఢిల్లీ ఆర్డినెన్స్‌పై వాడివేడి చర్చకు అవకాశం
- అదానీ గ్రూప్ అవకతవకలపై కూడా...

న్యూఢిల్లీ : పార్లమెంట్ వర్షాకాల సమావేశాలలో నరేంద్ర మోడీ ప్రభుత్వం 21 బిల్లులను ప్రవేశపెట్టబోతోంది. ఈ సమావేశాలు ఈ నెల 20న ప్రారంభమై ఆగస్ట్ 11వ తేదీ వరకూ కొనసాగుతాయి. లోక్‌సభలో ఇప్పటికే ...11లో

ఓల్డ్‌సిటీకి మెట్రో రైలు..

సన్నాహక పనులు ప్రారంభించిన హెచ్ఎంఆర్ఎల్

- నెలరోజుల్లో భూ సేకరణకు నోటీసులు జారీ
- ఎంజీబీఎస్ టూ ఫలక్‌నుమా రూట్లో 5స్టేషన్లు : హెచ్ఎంఆర్ఎల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి



నవతెలంగాణ-సిటీబ్యూరో

నగరవాసులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న పాతబస్తీకి మెట్రో రైలు త్వరలోనే పరుగులు పెట్టనున్నది. ఈ పనులకు సంబంధించిన కసరత్తుని హెచ్ఎంఆర్ఎల్ మొదలుపెట్టనున్నట్టు, నెలరోజుల్లో భూసేకరణకు సంబంధించిన నోటీసులు జారీ చేయనున్నామని మెట్రో రైల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి ఆదివారం వెల్లడించారు. ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు ఆదేశాల ...11లో

దేశంలో 44 శాతం మంది ఎమ్మెల్యేలు నేరచరితులే!

బీజేపీ వారే ఎక్కువ : ఏడీఆర్ వెల్లడి





న్యూఢిల్లీ : దేశంలోని వివిధ రాష్ట్రాలలో 4,001 మంది ఎమ్మెల్యేలు ఉండగా వారిలో 1,777 మంది ఎమ్మెల్యేలు...అంటే 44% మంది నేరచరితులే. వీరిపై క్రిమినల్ కేసులు నమోదై ఉన్నాయి. ప్రజాస్వామ్య హక్కుల సంస్థ (ఏడీఆర్) శనివారం విడుదల చేసిన నివేదికలో ఈ విషయాన్ని తెలియజేసింది. క్రిమినల్ కేసులు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేలలో బీజేపీకి చెందిన వారే ఎక్కువ మంది ఉన్నారు. 479 మంది బీజేపీ ఎమ్మెల్యేలపై క్రిమినల్ కేసులు నమోదై ఉండగా 334 మంది కాంగ్రెస్ శాసనసభ్యులు, 99 మంది డీఎంకే సభ్యులపై కేసులు ఉన్నాయి. తీవ్రమైన క్రిమినల్ కేసులు నమోదై ఉన్న ఎమ్మెల్యేలలో బీజేపీకి చెందిన వారు 337 మంది, కాంగ్రెస్ సభ్యులు 194 మంది, తృణమూల్ కాంగ్రెస్‌కు చెందిన వారు 77 మంది ఉన్నారు. తీవ్రమైన కేసులు అంటే నాన్-బెయిలబుల్ కేసులు. నేరం రుజువైతే గరిష్టంగా ఐదు అంతకంటే ఎక్కువ సంవత్సరాల కారాగార శిక్ష పడుతుంది. వేధింపులు, హత్య, కిడ్నాప్, లైంగిక దాడి, మహిళలపై నేరాలు, అవినీతి కేసులు వంటివి ఈ నేరాల కోవలోకి వస్తాయి.

క్రిమినల్ కేసులలో చిక్కుకున్న ఎమ్మెల్యేలలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన వారే ఎక్కువ. యూపీకి చెందిన వారు 202 మంది, మహారాష్ట్రకు చెందిన వారు 175 మంది, బీహార్‌కు చెందిన 161 మంది ఈ తరహా కేసులలో నిందితులుగా ఉన్నారు. ఆస్తిపాస్తులకు సంబంధించి ముగ్గురు ఎమ్మెల్యేలకు... కాంగ్రెస్ ఎమ్మెల్యేలు డీకే శివకుమార్, ప్రియకృష్ణ, స్వతంత్ర సభ్యుడు కేహెచ్ పుట్టస్వామి గౌడ... వెయ్యి కోట్లు, అంతకంటే ఎక్కువ విలువైన ఆస్తులు ఉన్నాయి. బీజేపీకి చెందిన నిర్మల్ కుమార్ ధారా ఆస్తి విలువ కేవలం రూ.1,700 మాత్రమేనట!. స్వతంత్ర ఎమ్మెల్యే మకరంద ముదులి ఆస్తి విలువ రూ.15 వేలు, ఆమ్‌ఆద్మీ పార్టీ ఎమ్మెల్యే నరేంద్ర పాల్ సింగ్ సావ్నా ఆస్తి విలువ రూ.18,370గా ...5లో

చేనేతపై కేంద్రం దొంగ దెబ్బ

పట్టు,నూలుపై జీఎస్‌టీ తగ్గించేందుకు ససేమిరా అడిగిందే తడవుగా సూరత్ జరీపై తగ్గింపు



న్యూఢిల్లీ: చేనేత రంగంపై కేంద్ర ప్రభుత్వం మరోసారి దొంగదెబ్బ కొట్టింది. వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) నుంచి చేనేత రంగానికి సంబంధించిన పట్టు, నూలు, రంగులను జీఎస్‌టీ నుంచి మినహాయించి కార్మికులను ఆదుకోవాలని పదేపదే ఆందోళనలు చేస్తున్నా.. పలు రాష్ట్ర ప్రభుత్వాలు ఈ మేరకు విజ్ఞప్తులు చేస్తున్నా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం పెడచెవిన పెడుతూవస్తోంది. చేనేతను ఇంత నిర్లక్ష్యం చేసిన మోడీ సర్కార్ ఇప్పుడు గుజరాత్ వ్యాపారులు అడిగిందే తడవుగా సూరత్ జరీపై జీఎస్‌టీని 12 శాతం నుంచి 5 శాతానికి తగ్గించింది. ఈ మేరకు తాజా జీఎస్‌టీ కౌన్సిల్ సమావేశంలో నిర్ణయం చేశారు. దీంతో తెలుగు రాష్ట్రాల్లోని చేనేత కార్మిక సంఘాలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

దేశంలో ఉత్పత్తి అవుతున్న 90 శాతం జరీ ఉత్పత్తులు సూరత్ పట్టణంలోనే తయారవుతున్నాయి. 2017లో జీఎస్‌టీ పన్నుల విధానం అమలులోకి వచ్చినప్పుడు రియల్, ఇమిటేషన్ జరీలపై 12 శాతంగా జీఎస్‌టీ వేయాలని నిర్ణయించారు. సూరత్‌కు చెందిన వ్యాపారులు, స్థానిక నాయకత్వం, గుజరాత్ ప్రజా ప్రతినిధులు రియల్ జరీ పన్నును 12 శాతం నుంచి 5 శాతానికి తగ్గించుకున్నారు. మళ్లీ ఇప్పుడు అదే సూరత్ వ్యాపారులు కేంద్రంపై ఒత్తిడి తెచ్చి ఇమిటేషన్ జరీపై ఉన్న 12 శాతం జీఎస్‌టీని కూడా 5 శాతానికి తగ్గించుకున్నారు. మిల్లులపై ఉత్పత్తి చేసే బట్టలపై విధించే పన్నులు, చేనేత మగ్గంపై తయారు చేసే బట్టలపై విధిస్తున్న పన్నులు ఒకే స్లాబ్ కింద ఉండకూడదని దేశవ్యాప్తంగా ఉన్న చేనేత కార్మికులు మొదటి నుంచీ వాదిస్తూ వస్తున్నారు. పవర్‌లూమ్స్‌తో హ్యాండ్లూమ్ పోటీ పడలేదని తెలిసి కూడా కేంద్రం ఆ రెండింటినీ ఒకే గాటన కట్టడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వాస్తవంగా తెలుగు, కర్నాటక, తమిళనాడు రాష్ట్రాల్లో చేనేత మగ్గాలపై వేసే వస్త్రాలకు పట్టు, నూలు, కొంత వరకూ జరీ వాడుతారు. పట్టుపై 19 శాతం, నూలుపై 5 శాతం, రంగులపై 5 శాతం జీఎస్‌టి కొనసాగుతోంది. పవర్‌లూమ్స్‌లోనూ ప్రస్తుతం నూలు, పట్టు వినియోగిస్తున్నారు. కానీ ఎక్కువ మోతాదులో ఫ్లోరా జరీ అనే దారాన్ని వినియోగిస్తున్నారు. ఇప్పుడు మోడీ సర్కార్ జరీపై జీఎస్‌టిని 7 శాతం మేర తగ్గించి నూలుతో సమానంగా 5 శాతానికి చేసింది. దీనిపైనే ఇప్పుడు చేనేత కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఏండ్లుగా పోరాడుతున్నా..

కేంద్రంలోని బీజేపీ సర్కారు అధికారం చేపట్టిన నాటి నుంచి చేనేత రంగాన్ని నిర్వీర్యం చేస్తూవ స్తోందని కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 2017 నుంచి 5 శాతం జీఎస్‌టీని చేనేతపై విధించింది. నాటి నుంచి జీఎస్‌టీ తొలగించాలని చేనేత కార్మికులు, సంఘాలు డిమాండ్ చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ నుంచి నుంచి ప్రధాని నరేంద్ర మోడీ, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు లక్షలాది మంది ఉత్తరాలు పంపించారు. చేనేత పై జీఎస్‌టీ పన్ను తొలగించాలని దాదాపు 100 మంది పార్లమెంటు సభ్యులు సంతకాలు చేనేత మహా వస్త్ర లేఖపై సంతకాలు కూడా చేశారు. చేనేత రంగాన్ని జీఎస్‌టి నుంచి మినహాయింపు ఇవ్వాలని కొనసాగుతున్న ఉద్యమానికి ఇప్పటివరకు దేశవ్యాప్తంగా 13 రాష్ట్రాలు, 15 రాజకీయా పార్టీలు మద్దతు ప్రకటించా యి. అయినప్పటికీ కేంద్ర సర్కారు మాత్రం చలించడం లేదు.

కార్పొరేట్ల కొమ్ముకాస్తున్న కేంద్రం

మోడీ సర్కార్ ఆది నుంచీ కార్పొరేట్ల కొమ్ముకాస్తున్నదని చేనేత కార్మిక సంఘాలు నేతలు విమర్శించారు. జీఎస్‌టీని తొలగించాలని ఏండ్లుగా డిమాండ్ చేస్తున్నా పట్టించుకోని కేంద్రం, కేవలం గుజరాత్ జరీ పరిశ్రమ రక్షణ కోసం మాత్రం జీఎస్‌టీని 7 శాతానికి తగ్గించిందని విమర్శిస్తున్నారు. కేంద్రం ఇప్పటికైనా వివక్ష పూరిత విధానాలు మార్చు కోవాలని, లేదంటే మూల్యం చెల్లించకతప్పదని కార్మికులు హెచ్చరిస్తు న్నారు. చేనేతకు సంబంధించిన పట్టు, నూలు, రంగులపై జీఎస్‌టిని పూర్తిగా ఎత్తివేయాలని డిమాండ్ చేస్తున్నారు.

కుల, లింగ వివక్షతలకు వ్యతిరేకంగా సాగిన ప్రతిఘటనా స్రవంతి - బసవ సిద్ధాంతం

- ఎస్వీకే వెబినార్‌లో డాక్టర్ మీనాక్షి బాలి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కుల, లింగ వివక్షతలకు వ్యతిరేకంగా సాగిన ప్రతిఘటనా స్రవంతి బసవ సిద్ధాంతం అని రిటైర్డ్ అసోసియేట్ ప్రొఫెసర్, రచయిత, ఐద్వా కర్నాటక అధ్యక్షురాలు డాక్టర్ మీనాక్షి బాలి తెలిపారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రం మేనేజింగ్ కమిటీ కార్యదర్శి ఎస్.వినయ కుమార్ అధ్యక్షతన బసవ సిద్ధాంతం, మహిళలు-కులం అనే అంశంపై వెబినార్‌లో ఆమె మాట్లాడారు. ఆర్థిక అసమానతలను బసవ సిద్ధాంతం ప్రశ్నించిందని తెలిపారు. బసవేశ్వరుని అనేక పద్యాలను ఉటంకిస్తూ, మాతృభాషల్లో మాండలికలంలో తొలిసారిగా వ్యాకరణం, ఛందస్సు వంటివి లేకుండా సాహిత్యాన్ని సష్టించారని తెలిపారు. తొలి కులాంతర వివాహాన్ని జరిపించారన్నారు. గుడిలో మట్టి, నీరు, అంటరానివాని ఇంటిలో మట్టి, నీరు ఒకటే అయినప్పుడు అక్కడ శుద్ధమైనవీ, ఇక్కడ అశుద్ధమైనవి ఎలా అవుతాయని బసవేశ్వరుడు ప్రశ్నించారని గుర్తుచేశారు. 12వ శతాబ్దంలోనే వైదికేతర సాహిత్యాన్ని తెచ్చారని కొనియాడారు. ప్రతిభ, సామర్థ్యాలది ఏ లింగమంటూ ప్రశ్నిస్తూ , స్త్రీ, పురుషులు సమానులనే భావన ముందుకు తెచ్చారని తెలిపారు. బసవేశ్వరుని సంస్కరణవాదాన్ని సనాతన ధర్మం మాదిరిగా మతాలు, సాంప్రదాయాలమయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆధిపత్య ఆర్‌ఎస్‌ఎస్ సంప్రదాయాన్ని ప్రతిఘటించడంలో బసవ సిద్ధాంతం ఉపయోగపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆమె హిందీలో చేసిన ప్రసంగాన్ని కొండూరు వీరయ్య తెలుగులోకి అనువదించారు.

593 ఐసీటీసీ కేంద్రాలు మూసివేత

(మొదటిపేజీ తరువాయి)

సులభమవుతుంది. కానీ కేంద్ర ప్రభుత్వం ఇందుకు భిన్నంగా ఉన్నవాటినే మూసివేస్తుండటం విమర్శలకు తావిస్తోంది. హైదరాబాద్ వంటి పట్టణాల్లో వలస కార్మికులు, నిరక్షరాస్యులు, హైరిస్క్ గ్రూప్, అవగాహనారాహిత్యంతో సురక్షితం కానీ లైంగిక అలవాట్లు కలిగిన వారిలో చైతన్యం తీసుకురావాల్సి ఉన్నది. ఇలాంటి చోట ఉన్న 22 కేంద్రాల్లో 11 కేంద్రాలను తొలగించాలని నిర్ణయిస్తూ కేంద్రం జాబితాను విడుదల చేసింది. దీనికి సంబంధించిన లేఖను 'న్యాకో' రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ ప్రాజెక్ట్ డైరెక్టర్‌కు పంపించినట్టు సమాచారం.

అమెరికాలో కాల్పుల కలకలం..
నలుగురు మృతి

న్యూయార్క్: అమెరికా మరోసారి తుపాకీ కాల్పులతో వణికిపోయింది. జార్జియాలోని హెన్రీ కౌంటిలో ఉన్న హాంప్టన్ ప్రాంతంలో ఓ దుండగుడు జరిపిన కాల్పుల్లో నలుగురు మృతి చెందారు. మరణించినవారిలో ముగ్గురు పురుషులు, ఓ మహిళ ఉన్నారని అధికారులు తెలిపారు. నిందితుడు పరారీలో ఉన్నాడని, అతడి కోసం ముమ్మరంగా గాలిస్తున్నామని హాంప్టన్ పోలీస్ చీఫ్ జేమ్స్ టర్నర్ వెల్లడించారు.

హాంప్టన్ చెందిన 40 ఏండ్ల వయస్సున్న ఆండ్రీ లాంగ్‌మోర్ అనే వ్యక్తి ఈ ఘాతుకానికి పాల్పడినట్టు అనుమానిస్తున్నామని చెప్పారు. అతడి గురించి సమాచారం అందించినవారికి 10 వేల డాలర్ల రివార్డు ప్రకటించారు. నలుపు రంగులో ఉన్న జీఎంసీ అకాడియా ఎస్‌యూవీలో అతడు తప్పించుకుని ఉండొచ్చని చెప్పారు. అతని ఫొటోను అధికారులు విడుదల చేశారు. కాగా, అమెరికాలో ఈ ఏడాది ఇప్పటివరకు 31 కాల్పుల ఘటనలు చోటుచేసుకున్నాయి. అందులో 153 మంది ప్రాణాలు కోల్పోయారు.

అలస్కా సమీపంలో భారీ భూకంపం

వాషింగ్టన్: అమెరికాలోని అలస్కా భారీ భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేలుపై దాని తీవ్రత 7.4గా నమోదైనట్టు అమెరికా జియోలాజికల్ సర్వే వెల్లడించింది. ఈ క్రమంలోనే అధికారులు సునామీ హెచ్చరికలు జారీ చేశారు. అలస్కాకు సమీపంలో 9.3 కిలోమీటర్ల లోతులో భూకంప కేంద్రాన్ని గుర్తించారు.

టమాటాలు అమ్మి..
నెల రోజుల్లో కోటీశ్వరుడైన రైతు

మహారాష్ట్ర : దేశవ్యాప్తంగా పెరిగిన టమాటా ధరలు మహారాష్ట్ర రైతును కోటీశ్వరుడిని చేశాయి. పూణె జిల్లాకు చెందిన తుకారామ్ భాగోజీ గయాకర్ టమాటా రైతు. ధరలు పెరిగిన తర్వాత గత నెలరోజుల్లో 13 వేల క్రేట్ల టమాటాలు విక్రయించడం ద్వారా ఏకంగారూ. 1.5 కోట్లు ఆర్జించాడు. అతడికున్న 18 ఎకరాల భూమిలో 12 ఎకరాల్లో టమాటాలు సాగుచేస్తున్నాడు. ఇప్పుడు ధరల పెరుగుదల అతడికి కలిసొచ్చింది. నారాయణ్‌గంజ్ మార్కెట్లో ఒక్క క్రేట్ టమాటాలను రూ. 2,100కు విక్రయించాడు. శుక్రవారం 900 క్రేట్ల టమాటాలు విక్రయించడం ద్వారా ఒక్క రోజే రూ. 18 లక్షలు సంపాదించాడు. గత నెలలో ఒక్కో క్రేట్ టమాటాలను రూ. 1000 నుంచి రూ. 2,400 మధ్య విక్రయించాడు. తుకారామ్ టమాటాల విక్రయం ద్వారా కోటీశ్వరుడిగా మారడంతో జిల్లాలోని జున్నార్ రైతులు కూడా ఇప్పుడు పెద్ద ఎత్తున టమాటాల సాగుకు నడుంబిగించారు.

ఇది యుద్ధ నేరమే!

- ఉక్రెయిన్‌కు అమెరికా క్లస్టర్ బాంబుల సరఫరాపై పుతిన్

మాస్కో: ఉక్రెయిన్‌కు అమెరికా క్లస్టర్ బాంబులను సరఫరా చేయడం యుద్ధ నేరమేనని రష్యా అధ్యక్షుడు వ్లదిమిర్ పుతిన్ అన్నారు. ఇందుకు ప్రతీకారం తీర్చుకునే హక్కు రష్యాకు ఉంటుందని హెచ్చరించారు. ఆదివారం ఆయన జర్నలిస్టు జరుబిన్‌తో మాట్లాడుతూ, క్లస్టర్ బాంబులు ఎంతో మంది అమాయకుల ప్రాణాలను బలిగొన్నాయి. ఇప్పటికీ బలిగొంటున్నాయి. అందువల్లే ఈ ఆయుధాల వినియోగాన్ని, సరఫరాను నిషేధిస్తూ తెచ్చిన ఒడంబడికను వందకుపైగా దేశాలు ఆమోదించాయి. అమెరికా ఇప్పుడు వీటిని ఉక్రెయిన్‌కు అందించడాన్ని యుద్ధ నేరంగానే పరిగణిస్తున్నామని ఆయన అన్నారు. మా దగ్గర కూడా క్లస్టర్ ఆయుధాలు ఉన్నాయి. ఇప్పటివరకు మేము వాటిని వినియోగించలేదు. ఉక్రెయిన్ గనుక ఈ ఆయుధాలను ప్రయోగిస్తే అందుకు ప్రతీకారం తప్పదని పుతిన్ హెచ్చరించారు.

అమెరికా తనను తాను దిగజార్చుకుంటోంది: ఎలాన్ మస్క్

విస్తృతంగా నిషేధించిన క్లస్టర్ బాంబులను ఉక్రెయిన్‌కు సరఫరా చేయడం ద్వారా అమెరికా తనను తాను దిగజార్చుకుంటోందని టెస్లా, స్పేస్ ఎక్స్ సిఇవో ఎలాన్ మస్క్ పేర్కొన్నారు. ఆయన ట్విట్టర్‌లో ట్వీట్ చేస్తూ, 'ఉక్రెయిన్‌కు పంపడానికి మా దగ్గర మందుగుండు సామగ్రి అయిపోయింది.కాబట్టి నిరాశతో క్లస్టర్ బాంబులను వారికి పంపుతున్నాము' అని అమెరికా ఈ చర్య ద్వారా తెలిపినట్లైందని అన్నారు. క్లస్టర్ ఆయుధాల సరఫరా చేయాలన్న బైడెన్ ప్రభుత్వ నిర్ణయాన్నిఅమెరికన్ కాంగ్రెస్‌లోని 98 మంది రిపబ్లికన్లు, 49 మంది డెమొక్రాట్లు వ్యతిరేకించడాన్ని మస్క్ ప్రశంసించారు. అయినా, ప్రభుత్వం తన వైఖరిని మార్చుకోకపోవడం అమెరికాకే అవమానం అని ఆయన వ్యాఖ్యానించారు. అమెరికా చర్యను బ్రిటన్, జర్మనీతో సహా దాని మిత్రదేశాలు తీవ్రంగా వ్యతిరేకించాయి.

ఆధిపత్యం కోసమే హత్య: ఎస్పీ దీపిక

ఏపీలో ఉపాధ్యాయుడి హత్య కేసులో వీడిన మిస్టరీ... నలుగురు నిందితుల అరెస్టు



విలేకర్ల సమావేశంలో నిందితులను చూపుతున్న ఎస్‌పి ఎం.దీపిక



(ఫైల్)

విజయనగరం: గ్రామంలో ఆధిపత్యం కోసం, ఆర్థికంగా నష్టపరిచాడన్న కారణంతో విజయనగరం జిల్లా తెర్లాం మండలం ఉద్దవోలు గ్రామానికి చెందిన ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు ఏగిరెడ్డి కృష్ణను ప్రత్యర్థులు హత్య చేశారని ఎస్పీ ఎం.దీపిక తెలిపారు. హత్యకు పాల్పడిన నలుగురు నిందితులను అరెస్టు చేశామని, మరొక నిందితుడి కోసం గాలిస్తున్నామని చెప్పారు. హత్య కేసుకు సంబంధించిన వివరాలను విలేకర్ల సమావేశంలో ఆమె ఆదివారం వెల్లడించారు.

ఉద్దవోలు గ్రామంలో ఉపాధ్యాయుడు ఏగిరెడ్డి కృష్ణ క్రియాశీలకంగా వ్యవహరించేవారు. గత కొన్నేళ్లుగా అదే గ్రామానికి చెందిన మరడాన వెంకటనాయుడు కుటుంబంతో గ్రామంలో ఆధిపత్యం కోసం గొడవలున్నాయి. వెంకట నాయుడు గ్రామంలో ప్రభుత్వ భవనాలకు కాంట్రాక్టు పనులు చేశారు. బిల్లులు మంజూరు కాకుండా కృష్ణ అడ్డుపడుతున్నారనే అనుమానంతో కక్ష పెంచుకున్నారు. ఆయనను చంపేస్తే తమ కక్ష తీరడంతోపాటు, గ్రామంలో ఆధిపత్యం సాధించవచ్చని భావించారు. తమ కుటుంబ సభ్యులతో కలిసి పథకం ప్రకారం కృష్ణను హత్య చేసేందుకు రెక్కీ నిర్వహించారు. శనివారం ఉదయం పాఠశాలకు బైక్‌పై బయలుదేరిన సమాచారాన్ని వెంకట నాయుడుకు, ఆయన సోదరుడు మరడాన మోహనరావుకు అందించారు. మోహనరావు, రెడ్డి రాము కలిసి బొలేరో వాహనంతో కృష్ణను వెంబడించి వెనుక నుంచి ఢీకొట్టారు. వాహనాన్ని ఆపి ఆయన ముఖంపై ఇనుప రాడ్డుతో విచక్షణారహితంగా కొట్టి చంపేశారు. హత్య అనంతరం నిందితులు బొలేరో వాహనాన్ని సంఘటనా స్థలంలోనే విడిచిపెట్టి పరారయ్యారు. ఈ కేసులో దర్యాప్తును ప్రారంభించిన రాజాం పోలీసులు ప్రధాన పాత్ర పోషించిన మరడాన మోహనరావు, రెడ్డి రాము, మరడాన వెంకటనాయుడు, మరడాన రామస్వామిలను అరెస్టు చేసి, రిమాండుకు తరలించారు.

హత్య దారుణం : చంద్రబాబు

ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఏగిరెడ్డి కృష్ణ హత్యను టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఖండించారు. రాజకీయ కారణాలతో ఒక ఉపాధ్యాయుడిని చంపడం దారుణమని ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాజకీయ దాడులపై ప్రభుత్వ పెద్దల, అధికారుల ఉదాసీన వైఖరే ఇలాంటి ఘటనలకు కారణమని పేర్కొన్నారు. బాధితుని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

ఉద్రిక్తతల నడుమ అంత్యక్రియలు

ఉపాధ్యాయుడు కృష్ణ మృతదేహానికి తీవ్ర ఉద్రిక్తతల నడుమ ఆదివారం స్వగ్రామం ఉద్దవోలులో అంత్యక్రియలు జరిగాయి. కృష్ణను హత్య చేసిన వారి ఇళ్లపై ఆయన బంధువులు, గ్రామస్తులు దాడులు చేశారు. గడ్డి కుప్పలకు నిప్పు పెట్టారు. ప్రత్యర్థుల కారు, ఇంటి అద్దాలను ధ్వంసం చేశారు. దాడి విషయం పోలీసులకు తెలియడంతో ఉద్దవోలులో భారీ బందోబస్తు నిర్వహించారు. ఉద్రిక్తత పరిస్థితులను అదుపు చేశారు. ఆందోళనకారుల నుంచి పెట్రోల్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. గ్రామంలో పోలీసు పికెట్ ఏర్పాటు చేశారు. కృష్ణ అంత్యక్రియలకు మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు, మండల నాయకులు హాజరయ్యారు.

ఢిల్లీ ఆర్డినెన్స్‌ను వ్యతిరేకిస్తాం

(మొదటిపేజీ తరువాయి)

గంటలకే ఆమ్‌ఆద్మీ పార్టీ నేత, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ సోమ, మంగళవారాల్లో బెంగళూరులో జరిగే ప్రతిపక్షాల భేటీకి తాము హాజరవుతున్నామని చెప్పారు. కేంద్ర ఆర్డినెన్స్‌కు వ్యతిరేకంగా పార్లమెంటులో ఓటు చేస్తామని కాంగ్రెస్ హామీ ఇవ్వకపోతే తాము బెంగళూరు సమావేశానికి హాజరుకాబోమని కేజ్రీవాల్ అంతకుముందు హెచ్చరించారు. దీంతో కాంగ్రెస్ అంతర్గత కమిటీ సమావేశమై కేంద్ర ఆర్డినెన్స్‌పై కేజ్రీవాల్‌కు బాసటగా నిలవాలని నిర్ణయించింది. గవర్నర్ల వ్యవస్థను దుర్వినియోగం చేసి ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల అధికారాల్లో జోక్యం చేసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం తీసుకునే ఏ చర్యకైనా తమ పార్టీ వ్యతిరేకమని కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి కెసి వేణుగోపాల్ చెప్పారు. ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడుతూ ఈ విషయం చెప్పారు. పార్లమెంటులో ఢిల్లీ ఆర్డినెన్స్ బిల్లు ఎప్పుడు ప్రవేశపెట్టినా వ్యతిరేకించాలని పార్టీ నిర్ణయించినట్లు తెలిపారు.

'సమాఖ్య వ్యవస్థను దెబ్బతీసే కేంద్ర ప్రభుత్వ ప్రయత్నాలన్నిటినీ నికరంగా వ్యతిరేకిస్తూనేవున్నాం. గవర్నర్ల ద్వారా రాష్ట్రాలను పాలించాలన్న కేంద్ర ప్రభుత్వ వైఖరిని వ్యతిరేకిస్తూనేవున్నాం. మా వైఖరి చాలా స్పష్టం. ఢిల్లీ ఆర్డినెన్స్‌కు ఎట్టి పరిస్థితుల్లోనూ మద్దతు ఇవ్వబోం' అని కెసి వేణుగోపాల్ చెప్పారు. ఆ వెంటనే ఆప్ ఎంపీ, జాతీయ అధికార ప్రతినిధి రాఘవ్ చద్దా దీనిపై హర్షం వ్యక్తం చేస్తూ,కాంగ్రెస్ ప్రతిపక్షాల ఐక్య గళాన్ని వినిపించడం ఓ సానుకూల పరిణామం' అని వ్యాఖ్యానించారు. ఢిల్లీలో బ్యూరోక్రాట్ల నియామకాలు, బదిలీల విషయంలో అంతిమ నిర్ణయం ప్రజలు ఎన్నుకున్న రాష్ట్ర ప్రభుత్వానిదేనని సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పుకు భిన్నంగా బ్యూరోక్రాట్లపై అధికారాన్ని లెఫ్టినెంట్ గవర్నరుకు కట్టబెడుతూ కేంద్రం ఒక దుర్మార్గమైన ఆర్డినెన్స్ తీసుకొచ్చింది. పార్లమెంటులో దీనిపై బిల్లు పెడితే వ్యతిరేకించాలని కోరుతూ ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఇదివరకే ప్రతిపక్షాల నేతలను కలిసి విన్నవించిన సంగతి తెలిసిందే. ఈ విషయంలో కాంగ్రెస్ కూడా తన వైఖరేమిటో చెప్పాలని ఆప్ డిమాండ్ చేసింది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ తాను ఢిల్లీ ఆర్డినెన్స్‌కు వ్యతిరేకమని స్పష్టం చేసింది.

బెంగళూరు సమావేశానికి సర్వం సిద్ధం

కేంద్రంలోనూ, రాష్ట్రాల్లోనూ బిజెపిని ఓడించడమే లక్ష్యంగా దేశంలోని ప్రతిపక్షాలన్నీ ఒక్కటొక్కటిగా జట్టు కడుతున్నాయి. బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ నేతృత్వంలో పాట్నాలో గత జూన్ 23న తొలిసారి సమావేశమైన ప్రతిపక్షాల పార్టీల నేతలు మలి విడతలో భాగంగా బెంగళూరులో రెండు రోజుల పాటు (సోమవారం, మంగళవారం) సమావేశం కానున్నారు. ఈ సమావేశానికి మొత్తం 24 పార్టీలకు చెందిన అధినేతలు, ప్రతినిధులు హాజరయ్యే అవకాశముంది. బెంగళూరులోని తాజ్ వెస్ట్ ఎండ్ హోటల్ దీనికి వేదికగా నిలవనుంది. ఆదివారం రాత్రి కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జి రణదీప్ సూర్జేవాలా, రాష్ట్ర హోంమంత్రి పరమేశ్వరన్ అక్కడి ఏర్పాట్లను పరిశీలించారు. పాట్నాలో జరిగిన తొలి సమావేశంలో 2024 సార్వత్రిక ఎన్నికల్లో బిజెపిని ఓడించి తీరాలని ప్రతిపక్షాల నేతలు తీర్మానించిన సంగతి తెలిసిందే. 2024 సార్వత్రిక ఎన్నికల్లో బిజెపిని ఓడించేందుకు ఎత్తుగడలపై ప్రధానంగా ఈ సమావేశంలో చర్చించనున్నారు. కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, మాజీ అధినేత్రి సోనియా గాంధీ, సీనియర్ నేత రాహుల్ గాంధీ ఈ సమావేశాలకు హాజరుకానున్నారు. ప్రతిపక్షాల పార్టీల నాయకుల కోసం సోమవారం రాత్రి విందు ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి హాజరవుతున్నట్టు పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ ,శివసేన (యుబిటి) నాయకులు ఉద్ధవ్ థాకరే, సంజయ్ రౌత్, ఆదిత్య థాకరే, బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్, ఆర్‌జెడి అధినేత లాలూ ప్రసాద్ యాదవ్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ సిపిఎం నేత సీతారాం ఏచూరి, సిపిఐ నేత డి రాజా, అలాగే డిఎంకె, సమాజ్‌వాదీ పార్టీ, ఎన్‌సిపితో పాటు మరుమలార్చి ద్రవిడ మున్నేట్ర కఝగం (ఎండిఎంకె), కొంగు దశ మక్కల్ కచ్చి (కెడిఎంకె), విదుథులై చిరుథైగల్ కచ్చి (విసికె), రెవల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ (ఆర్ఎస్‌పి), ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్, ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (ఐయుఎంఎల్), కేరళ కాంగ్రెస్ (జోసెఫ్), కేరళ కాంగ్రెస్ (మణి) తదితర పక్షాల నేతలు హాజరుఎకానున్నారు.

కాంగ్రెస్ సలహా బృందం

ప్రస్తుతం దేశానికి ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ) అవసరం లేదని కాంగ్రెస్ సలహా కమిటీ అభిప్రాయం వ్యక్తం చేసింది. వ్యక్తిగత చట్టాల సంస్కరణలకు అవకాశం ఉన్నప్పుడు యుసిసి అవసరం లేదని తెలిపింది. యూసీసీ పై సలహా ఇవ్వడం కోసం ఎనిమిది సభ్యులతో సలహా బృందాన్ని కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో శనివారం ఈ బృందం అంతర్గత సమావేశమయింది. ఈ సమావేశంలో అత్యధిక మంది యూసీసీ అవసరంలేదని అభిప్రాయం వ్యక్తం చేసినట్లు సమాచారం. అలాగే కేంద్రం డ్రాఫ్ట్ ముసాయిదా విడుదల చేసే వరకూ కాంగ్రెస్ పార్టీ యూసీసీ పై వైఖరి వెల్లడించకూడదనే అభిప్రాయాన్ని బృందం వ్యక్తం చేసినట్లు తెలిసింది.

అక్కడ మళ్లీ సిట్టింగులకే!

వారసులను దింపేందుకు ప్రయత్నాలు
- బీఆర్‌ఎస్‌లో ఆశావహులకు నిరాశ తప్పదా?
- కాంగ్రెస్‌ నుంచి పోటా పోటీ
- వలస వచ్చిన నేతలపైనే బీజేపీ ఆశలు
- ఉమ్మడి నిజామాబాద్‌లో రాజకీయం ఉత్కంఠం

నవతెలంగాణ-నిజామాబాద్‌ ప్రాంతీయ ప్రతినిధి

ఉమ్మడి నిజామాబాద్‌ జిల్లాలో రాజకీయ పరిణామాలు రోజురోజుకూ ఆసక్తికరంగా, ఉత్కంఠగా మారుతున్నాయి. అధికార, ప్రతిపక్ష పార్టీలు ఇప్పటి నుంచే ఎత్తుకు పైఎత్తు వేస్తూ ఓటర్లను ఆకర్షించే పనిలో పడ్డాయి. గత అసెంబ్లీ ఎన్నికల్లో నిజామాబాద్‌, కామారెడ్డి జిల్లాల్లోని 8 అసెంబ్లీ స్థానాల్లో బీఆర్‌ఎస్‌ జెండా ఎగురవేసింది. ఎల్లారెడ్డి అసెంబ్లీ స్థానంలో కాంగ్రెస్‌ పార్టీ అభ్యర్థి జాజుల సురేందర్‌ గెలుపొందారు. ఆ తరువాత ఆయన బీఆర్‌ఎస్‌ తీర్థం పుచ్చుకున్నారు. ఈసారి ఎన్నికలకు అన్ని పార్టీల్లోనూ ఆశావాహులు టిక్కెట్ల కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే బీఆర్‌ఎస్‌లో సిట్టింగ్‌లకే మళ్లీ సీట్లు ఇస్తామని కేసీఆర్‌ ప్రకటించడంతో ఎమ్మెల్యేలు ఆత్మీయ సమ్మేళనాలతో పాటు అభివృద్ధి పనుల్లో బిజీగా ఉన్నారు. దీంతో ఆశావహులకు నిరాశ తప్పదా అన్న కోణంలో ఉన్నారు. అయినా తమ ప్రయత్నాల నుంచి వెనక్కి తగ్గడం లేదు. కేసీఆర్‌ను ప్రసన్నం చేసుకునేందుకు సిట్టింగ్‌లతోపాటు ఆశావహులూ ప్రయత్నిస్తున్నారు. కాంగ్రెస్‌ నుంచి పోటీ ఎక్కువగా ఉంది. బీఆర్‌ఎస్‌కు సవాల్‌ విసురుతున్నారు ఆ పార్టీ నేతలు. వలస వచ్చిన నేతలపైనే బీజేపీ ఆశలు పెట్టుకుంది.

నిజామాబాద్‌ అసెంబ్లీ స్థానం నుంచి సిట్టింగ్‌ ఎమ్మెల్యే బిగాల గణేష్‌గుప్తా మరోసారి పోటీకి సిద్ధమవుతున్నారు. కాంగ్రెస్‌ నుంచి ఇద్దరు ముగ్గురు టిక్కెట్లు ఆశిస్తున్నారు. అందులో మాజీ మేయర్‌, డీఎస్‌ తనయుడు ధర్మపురి సంజయ్‌, నగర అధ్యక్షులు కేశ వేణు, కాంగ్రెస్‌ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు మహేష్‌కుమార్‌ గౌడ్‌ పోటీకి సిద్ధంగా ఉన్నారు. బీజేపీ నుంచి ధన్‌పాల్‌ సూర్యనారాయణ గుప్తా పోటీకి సిద్ధమయ్యారు. అయితే, యెండల లక్ష్మీనారాయణ గ్రూపు నుంచి మరొకరిని పోటీకి దించేందుకు సిద్ధమయ్యారు. పటేల్‌ ప్రసాద్‌ అనే నేతను తెరమీదకు తీసుకొస్తున్నారు. ధన్‌పాల్‌కు ఎంపీ అరవింద్‌ గతంలోనే సీటు వస్తుందని భరోసా ఇచ్చారు.

నిజామాబాద్‌ రూరల్‌ నుంచి సిట్టింగ్‌ ఎమ్మెల్యే, ఆర్టీసీ చైర్మెన్‌ బాజిరెడ్డి గోవర్దన్‌ తన కుమారుడు బాజిరెడ్డి జగన్‌ను బరిలోకి దించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. గతంలో జెడ్పీ చైర్మెన్‌ పదవి ఆశించగా.. మరుసటి ఎన్నికల్లో అవకాశమిస్తామని హైకమాండ్‌ హామీనిచ్చినట్టు సమాచారం. ఎవరి వైపు మొగ్గు చూపుతారన్నది ఇంకా బీఆర్‌ఎస్‌ అధిష్టానం ఫైనల్‌ చేయలేదు. బీజేపీ నుంచి నిజామాబాద్‌ వ్యవసాయ కమిటీ మాజీ చైర్మెన్‌ దినేష్‌రెడ్డి పోటీకి సిద్ధంగా ఉన్నారు. కాంగ్రెస్‌ నుంచి గత ఎన్నికల్లో పోటీ చేసిన మాజీ ఎమ్మెల్సీ డాక్టర్‌ భూపతిరెడ్డితోపాటు ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన మరో మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి టిక్కెట్టు ఆశిస్తున్నారు.

మండవ వెంకటేశ్వర్‌రావు కాంగ్రెస్‌లో చేరతారనే ప్రచారం జరుగుతోంది. బోధన్‌ నుంచి బీఆర్‌ఎస్‌ ఎమ్మెల్యే షకీల్‌ ఆమేర్‌ ఈసారి ఆయన సతీమణి ఆయేషా ఫాతిమాను బరిలోకి దించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రస్తుతం షకీల్‌ అమేర్‌ నాందేడ్‌లో కేంద్రీకరిస్తున్నారు. రెండు సంవత్సరాలుగా నియోజకవర్గంలో అధికార పార్టీ కార్యక్రమాలకు ఫాతిమా హాజరవుతున్నారు. ఇక్కడా తేల్చి చెప్పలేదు. బీఆర్‌ఎస్‌ నుంచి బీజేపీలోకి చేరిన మోహన్‌రెడ్డి బరిలోకి దిగేందుకు సిద్ధంగా ఉన్నారు. కాంగ్రెస్‌ నుంచి మాజీ మంత్రి సుదర్శన్‌రెడ్డి మరోసారి పోటీ చేస్తాననే సంకేతాలు ఇచ్చారు. కెప్టెన్‌ కరుణాకర్‌రెడ్డి సైతం పోటీకి సిద్ధపడుతున్నారు.



ఆర్మూర్‌ నుంచి సిట్టింగ్‌ ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్‌ జిల్లా అధ్యక్షులు జీవన్‌రెడ్డి పోటీకి సిద్ధంగా ఉండగా.. బీజేపీ నుంచి ప్రముఖ పారిశ్రామికవేత్త పైడి రాకేష్‌రెడ్డి రెడీ అవుతున్నారు. కానీ బీజేపీ నుంచి గత ఎన్నికల్లో పోటీ చేసిన వినయ్‌రెడ్డి కూడా సిద్ధంగా ఉన్నారు. ఆయనకు యెండల లక్ష్మీనారాయణ మద్దతు పలుకుతున్నారు. కాంగ్రెస్‌ నుంచి ఇప్పటి వరకు అభ్యర్థి ఎవరనేది తేలలేదు. ఈ స్థానం నుంచి రేవంత్‌రెడ్డి పోటీ చేస్తారనే ప్రచారమూ ఉంది.

బాల్కొండలో మరోసారి మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి పోటీకి సిద్ధంగా ఉన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి కార్యక్రమాలకు పెద్దఎత్తున శ్రీకారం చుడుతున్నారు. కాంగ్రెస్‌ నుంచి పార్టీ జిల్లా అధ్యక్షులు మానాల మోహన్‌రెడ్డి పోటీకి సిద్ధమయ్యారు. అయితే గత ఎన్నికల్లో బీఎస్పీ నుంచి పోటీ చేసిన ఆరేంజ్‌ ట్రావెల్స్‌ అధినేత ముత్యాల సునీల్‌కుమార్‌ కాంగ్రెస్‌లో చేరేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. గతంలో బీజేపీలో చేరాలని ప్రయత్నించగా.. ఎంపీ అరవింద్‌ అడ్డుకున్నారనే ప్రచారం ఉంది. ప్రస్తుతం కాంగ్రెస్‌ అధిష్టానం గ్రీన్‌ సిగ్నల్‌ ఇస్తే ముత్యాల సునీల్‌ చేరేందుకు సిద్ధంగా ఉన్నారు. బీజేపీ నుంచి మాజీ ఎమ్మెల్యే మంత్రి అన్నపూర్ణమ్మ కుమారుడు మల్లికార్జున్‌రెడ్డి పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నారు.

కామారెడ్డి నుంచి సిట్టింగ్‌ ఎమ్మెల్యే గంప గోవర్దన్‌ పోటీకి సిద్ధమవ్వగా.. ప్రముఖ వ్యాపారవేత్త కూడా పోటీకి సిద్ధమవుతున్నారు. అలాగే ఆ పార్టీ సీనియర్‌ నాయకులు, జిల్లా అధ్యక్షులు ముజీబ్‌ సైతం టిక్కెట్టు ఆశిస్తున్నారు. కాంగ్రెస్‌ నుంచి మాజీ మంత్రి షబ్బీర్‌ అలీ పోటీలో ఉన్నారు. సంవత్సర కాలంగా నియోజకవర్గంలో కలియతిరుగుతున్నారు. కామారెడ్డి నుంచి ప్రముఖ క్రికెటర్‌ అజారుద్దీన్‌ ప్రయత్నం చేస్తున్నారు. బీజేపీ నుంచి వెంకటరమణారెడ్డి పోటీకి సిద్ధమయ్యారు.

ఎల్లారెడ్డి నుంచి కాంగ్రెస్‌ పార్టీలో ఇద్దరు పోటీ చేస్తున్నారు. వడ్డేపల్లి సుభాష్‌రెడ్డితోపాటు ఆ పార్టీ రాష్ట్ర నాయకులు మదన్‌మోహన్‌ టిక్కెట్టు ఆశిస్తున్నారు. రెండు, మూడు సంవత్సరాలుగా ఇద్దరూ వేర్వేరు గ్రూపులుగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. బీఆర్‌ఎస్‌ నుంచి జాజుల సురేందర్‌ పోటీకి సిద్ధమయ్యారు. బీజేపీ నుంచి ఏనుగు రవీందర్‌రెడ్డి, బాణాల లక్ష్మారెడ్డి, పైళ్ల కృష్ణారెడ్డి టిక్కెట్టు ఆశిస్తున్నారు. బాన్సువాడ నుంచి మళ్లీ స్పీకర్‌ పోచారం శ్రీనివాసరెడ్డి పోటీ చేయబోతున్నారు. గత ఎన్నికల్లో అదే చివరి ఎన్నిక అని ప్రకటించారు. దీంతో ఈసారి ఆయన కుమారుడు భాస్కర్‌రెడ్డి పోటీ చేస్తారని అంతా భావించారు. కాంగ్రెస్‌ నుంచి గత ఎన్నికల్లో పోటీ చేసిన కాసుల బాల్‌రాజ్‌ మళ్లీ లైన్‌లో ఉండగా.. ఈసారి ఎలమంచలి శ్రీనివాస్‌ సైతం పోటీ చేసేందుకు ఉత్సాహం చూపుతున్నారు. బీజేపీలో మల్యాద్రిరెడ్డి పేరు బలంగా వినిపిస్తోంది.

జుక్కల్‌ నుంచి మరోసారి గెలిచేందుకు సిట్టింగ్‌ ఎమ్మెల్యే హన్మంత్‌షిండే ప్రయత్నం చేస్తున్నారు. ఆయన హ్యాట్రిక్‌గా మూడుసార్లు గెలిచారు. కాంగ్రెస్‌ నుంచి గత ఎన్నికల్లో పోటీ చేసిన గంగారం, నిజామాబాద్‌కు చెందిన సీనియర్‌ నాయకులు గడుగు గంగాధర్‌, ఎన్‌ఆర్‌ఐ లక్ష్మీకాంతం టిక్కెట్టు ఆశిస్తున్నారు.

బీజేపీ నుంచి అరుణతార పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నారు. అయితే ఈ స్థానంలో మఠాధిపతిని బరిలోకి దించేందుకు ఎంపీ అరవింద్‌ సిద్ధమవుతున్నట్టు ప్రచారం జరుగుతోంది.

ప్రతి కార్టూనిస్టు సామాజిక శాస్త్రవేత్తనే

- మనిషి కాదు కళే శాశ్వతం
- కార్టూనిస్టులపై అధ్యయనం పెరగాలి : ఎమ్మెల్సీలు గోరటి వెంకన్న, దేశపతి శ్రీనివాస్‌, కవి సీతారాం
- కార్టూనిస్ట్‌ శేఖర్‌ మెమోరియల్‌ అవార్డు-2023ను అందుకున్న శంకర్‌



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్‌

ప్రతి కార్టూనిస్టు కూడా గొప్ప సామాజిక శాస్త్రవేత్త అనీ, ఆ రంగంలో శేఖర్‌ గొప్పగా రాణించి పేరుప్రతిష్టలు సాధించారని పలువురు వక్తలు కొనియాడారు. ఆయన పేరుతో అవార్డు ఇస్తున్న అతని మిత్రులు, కుటుంబసభ్యులకు అభినందనలు తెలిపారు. ఆదివారం హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో కార్టూనిస్టు శేఖర్‌ మెమోరియల్‌ అవార్డు-2023ను పామర్తి శంకర్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీలు దేశపతి శ్రీనివాస్‌, గోరటి వెంకన్న, ప్రెస్‌ అకాడమీ చైర్మెన్‌ అల్లం నారాయణ, కవి డాక్టర్‌ సీతారాం, చిత్రకారులు కూరెళ్ళ శ్రీనివాస్‌, బోధి ఫౌండేషన్‌ అధ్యక్షులు బంగారు బ్రహ్మం, శేఖర్‌ భార్య చంద్రకళ, సీనియర్‌ జర్నలిస్టు కంబాలపల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు. ఓయూ అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌ డాక్టర్‌ ఎస్‌.రఘు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో దేశపతి శ్రీనివాస్‌ మాట్లాడుతూ..తెలంగాణ ఉద్యమంలో శేఖర్‌ తన వంతు పాత్ర పోషించారన్నారు. శేఖర్‌ 'గీదీ తెలంగాణ' పుస్తకంలోని కార్టూన్లు తెలంగాణ ఉద్యమానికి ఎంతో దోహదపడ్డాయన్నారు. ఆయన నిరంతర అధ్యయన శీలి అనీ, తాజా రాజకీయ పరిణామాలను పరిశీలిస్తూ అప్పటికప్పుడు అద్భుతమైన కార్టూన్లను వేయడంలో ఆయన దిట్ట అని కొనియాడారు. కార్టూన్‌ రంగంపై పరిశోధనలు పెరగాలనీ, మంచిమంచి పుస్తకాలు రావాలని ఆకాంక్షించారు. అల్లం నారాయణ మాట్లాడుతూ.. కార్టూన్‌ రంగంలో శిఖరం మీద నిలబడ్డ కార్టూనిస్ట్‌ శేఖర్‌ అని కొనియాడారు. పొలిటికల్‌ కార్టూనిస్టుల అవస్థలు అన్నీఇన్నీ కావన్నారు. కాలంతో పోటీపడిన కార్టూనిస్టులు మాత్రమే సక్సెస్‌ అయ్యారన్నారు. నల్లగొండలోని ఎన్‌జీ కాలేజీ నుంచి ఎక్కువమంది కార్టూనిస్టులు రావడం ఆ పోరుగడ్డ ప్రభావం, సార్ల చైతన్యమే కారణం అయ్యి ఉండొచ్చన్నారు. ఎమ్మెల్సీ గోరటి వెంకన్న మాట్లాడుతూ..మనిషి అశాశ్వతమనీ, కళ శాశ్వతమని అన్నారు. ఒక బొమ్మ ద్వారా చెప్పాల్సిన భావం మొత్తాన్ని చెప్పడమంటే మామూలు విషయం కాదన్నారు. కార్టూన్‌ గీయడం కత్తిమీద సాములాంటిదేనన్నారు. సమాజాన్ని చైతన్యం చేయడమే కవులు, కార్టూనిస్టుల ప్రధాన లక్ష్యం అన్నారు. సీతారాం మాట్లాడుతూ..శేఖర్‌ నిరంతర అధ్యయనీ శీలి అనీ, కొత్తదనాన్ని నేర్చుకోవడం, కొత్తదారులు వెతకడం కోసం ఆయన నిరంతరం కష్టపడేశారని గుర్తుచేశారు. కార్టూన్‌ కూడా ఒక సాహిత్యమేనన్నారు. అకాడమిక్‌గా కార్టూన్లపై పరిశోధనలుగానీ, పీహెచ్‌డీ చేసినవారు గానీ లేకపోవడం బాధాకరమన్నారు. వనరుల పట్ల అప్రమత్తం ఉండాలనీ, భవిష్యత్‌ తరాలకు అందించాలనే లక్ష్యంతో శేఖర్‌ గీసిన కార్టూన్లు అద్భుతంగా పేలాయని చెప్పారు. కార్టూన్లను నవ్వు పుట్టించేవిగా మాత్రమే చూడొద్దన్నారు. ప్రజల కడుపును మండించడం, గుండెను రగల్చగలిగే శక్తి కార్టూన్లకు ఉంటుందన్నారు. మతాన్ని రాజకీయం నుంచి వేరు చేయాలనీ, అమలు చేయని మ్యానిఫెస్టోలు ఎందుకని రాజకీయ నేతలను ప్రశ్నిస్తూ శేఖర్‌ వేసిన కార్టూన్లు నిజంగా అద్భుతమైనవన్నారు. చిత్రకారులు కూరెళ్ళ శ్రీనివాస్‌ మాట్లాడుతూ..చదుకునే సమయంలో శేఖర్‌తో తనకున్న అనుబంధాన్ని పంచుకున్నారు.

అంబేద్కర్‌ జన్మస్థలాన్ని వీక్షించడం గొప్ప అనుభూతి

- తెలంగాణ ఫుడ్స్‌ చైర్మెన్‌ మేడే రాజీవ్‌సాగర్‌

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్‌

దేశంలోని ప్రతి ఒక్కరికీ స్వేచ్ఛగా బతికే హక్కును కల్పించిన రాజ్యాంగ నిర్మాత డాక్టర్‌ బీఆర్‌ అంబేద్కర్‌ జన్మస్థలాన్ని వీక్షించడం గొప్ప అనుభూతిని ఇచ్చిందని తెలంగాణ ఫుడ్స్‌ చైర్మెన్‌ మేడే రాజీవ్‌ సాగర్‌ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు రోజుల అహ్మదాబాద్‌, ఇండోర్‌ పర్యటన సందర్భంగా మహులోని అంబేద్కర్‌ జన్మస్థలాన్ని సందర్శించినట్టు పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని 125 అడుగుల అంబేద్కర్‌ విగ్రహాన్ని సందర్శించేందుకు రావాలని అంబేద్కర్‌ మెమోరియల్‌ ట్రస్ట్‌ జనరల్‌ సెక్రటరీ రాజేష్‌ వాంఖడేను ఆహ్వానించినట్టు తెలిపారు. మహు ప్రాంతాన్ని మధ్యప్రదేశ్‌ బీఆర్‌ఎస్‌ నేత డాక్టర్‌ ఆనంద్‌ రాయ్‌తో కలిసి మెమోరియల్‌ ట్రస్ట్‌ను తిలకించినట్టు పేర్కొన్నారు. ఈ ప్రాంతాన్ని పర్యాటక ప్రదేశంగా తీర్చిదిద్దడం గొప్ప విషయమని తెలిపారు.

కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డికి గ్లోబల్‌ ఇన్‌క్రెడిబుల్‌ ఐఎన్‌సీ లీడర్‌షిప్‌ అవార్డు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్‌

కేంద్ర పర్యాటక, సాంస్కృతిక, ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి శాఖ మంత్రి జి.కిషన్‌ రెడ్డిని ప్రతిష్టాత్మకమైన 'గ్లోబల్‌ ఇన్‌క్రెడిబుల్‌ ఐఎన్‌సీ లీడర్‌షిప్‌ అవార్డు' వరించింది. భారత్‌-అమెరికాల మధ్య వాణిజ్యం, వ్యాపారం, పీపుల్‌-టు-పీపుల్‌ ఎక్స్‌చేంజ్‌ కార్యక్రమాలు నిర్వహించే.. 'యూఎస్‌ ఇండియా ఎస్‌ఎమ్‌ఈ కౌన్సిల్‌ సంస్థ ఈ అవార్డును కేంద్రమంత్రికి అందజేసింది. భారతదేశపు ఘనమైన సంస్కృతిని ప్రోత్సహించడంతో పాటు పర్యాటకాభివృద్ధికి కేంద్రమంత్రి కిషన్‌ రెడ్డి చేసిన కృషికిగానూ.. అమెరికాలోని మేరీలాండ్‌ స్టేట్‌ నుంచి వచ్చిన పలువురు ప్రముఖులు ఈ అవార్డును కేంద్రమంత్రికి అందజేశారు. ఈ అవార్డు అందుకున్న సందర్భంగా కిషన్‌ రెడ్డి ట్విట్టర్‌లో స్పందిస్తూ.. 'యూఎస్‌ ఇండియా ఎస్‌ఎమ్‌ఈ కౌన్సిల్‌ సంస్థ నుంచి లీడర్‌ షిప్‌ అవార్డు అందుకోవడం సంతోషంగా ఉంది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ నేతృత్వంలో భారతదేశంలో ఘనమైన చరిత్రను, సంస్కృతిని కాపాడుకోవడంతోపాటు పర్యాటక రంగాభివృద్ధికి చేస్తున్న కృషికి ఈ అవార్డు దక్కింది' అని పేర్కొన్నారు.

పారిశుధ్య కార్మికుని అవతారమెత్తిన ఎంపీటీసీ

- కార్మికుల నిరవధిక సమ్మెతో గ్రామాల్లో పడకేసిన పనులు



నవతెలంగాణ-బెజ్జంకి

స్వయానా గ్రామ పంచాయతీ ట్రాక్టర్‌ నడుపుతూ.. ఇంటింటా చెత్తను సేకరిస్తూ గుగ్గిల్ల ఎంపీటీసీ కొమిరే మల్లేశం పారిశుధ్య కార్మికుని అవతారమెత్తిన దృశ్యం సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలం గాగీల్లపూర్‌ గ్రామంలో ఆదివారం కనిపించింది. పది రోజులుగా గ్రామ పంచాయతీ కార్మికులు చేపట్టిన నిరవధిక సమ్మెతో గ్రామాల్లో పారిశుధ్య పనులు, ఇంటింటా చెత్త సేకరణ పడకేశాయి. ఎంపీటీసీ కొమిరే మల్లేశం ఇంటింటా చెత్తను సేకరించి పారిశుధ్య కార్మికునిగా సేవలందించడం అభినందనీయమని పలువురు ప్రశంసలు కురిపించారు.

రోగ నిరోధక వ్యవస్థను పెంచుకోవాలి

- ట్రాన్స్‌ప్లాంట్‌ ఇమ్యూనాలజీ పై సదస్సులో : నిమ్స్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ నగరి భీరప్ప



నవతెలంగాణ-సిటీబ్యూరో

శరీరంలో రోగ నిరోధక వ్యవస్థను పెంచుకుంటే సంపూర్ణ ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవచ్చని నిమ్స్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ నగరి భీరప్ప అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని నిమ్స్‌ ఆస్పత్రిలో హైదరాబాద్‌ నెఫ్రాలజీ ఫోరం ఆధ్వర్యంలో 'ట్రాన్స్‌ప్లాంట్‌ ఇమ్యూనాలజీ' పై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో డైరెక్టర్‌ భీరప్ప ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మనిషికి ఏదైనా రోగం వస్తే రోగ నిరోధక శక్తి వెంటనే స్పందిస్తుందన్నారు. హాని కలిగించే వైరస్‌లు శరీరంలోకి ప్రవేశిస్తే రోగ నిరోధకాలు వేగంగా విడుదలై వాటిపై పోరాడతాయని తెలిపారు. నగర జీవన విధానంలో మార్పులు ఉంటున్నాయని, వ్యాపారం, ఉద్యోగమని సమయానికి నాణ్యమైన ఆహారాన్ని తీసుకోలేకపోతున్నారన్నారు. జీవన విధానంలో మార్పులు చేసుకొని, ప్రతి ఒక్కరూ ఆహార నియమాలను పాటిస్తే సంపూర్ణ ఆరోగ్యాన్ని సొంతం చేసుకోవచ్చని సూచించారు. నిమ్స్‌ నెఫ్రాలజిస్ట్‌ డా॥స్వర్ణలత మాట్లాడుతూ.. ప్రస్తుతం ఉన్న సాంకేతికతతో వైద్య విధానంలో విప్లవాత్మకమైన మార్పులు వచ్చాయన్నారు. కిడ్నీల మార్పిడి వేగవంతంగా పూర్తవుతుందని, రోగులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో సీఎం కార్యాలయ ఓఎస్డీ డాక్టర్‌ గంగాధర్‌, నెఫ్రాలజీ ప్రొఫెసర్‌ భూషణ్‌ రాజ్‌, ప్రముఖ వైద్యులు సీరాపాణి గోపాలుని, అనురాధ రామన్‌, మంజూష, కిరణ్మయి, నీరజ, గిరీష్‌ నారాయణ్‌, విజయ్‌ కుమార్‌, రాజేశ్వరి, కేవీ దక్షణామూర్తి, జ్యోత్స్న, అనిల్‌, ప్రదీప్‌ దేశ్‌ పాండే, రాజశేఖర్‌ చక్రవర్తి, శ్రీకాంత్‌, శృతి టపియవాల, కృష్ణన్‌, రమేష్‌, ధనలక్ష్మి, ఫిరోజ్‌ అజీజ్‌, కమల్‌ కిరణ్‌, ఉర్మిళ, శ్రీధర్‌, అంకిత్‌, కృష్ణ మోహన్‌, శశికిరణ్‌, కార్తీక్‌, తదితరులు పాల్గొన్నారు.

178 కిలోల గంజాయి పట్టివేత

- సుమారు రూ.60లక్షల విలువ
- వివరాలు వెల్లడించిన శంషాబాద్‌ జోన్‌ డీసీపీ నారాయణరెడ్డి



నవతెలంగాణ-శంషాబాద్‌

గుట్టు చప్పుడు కాకుండా నిషేధిత గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్న అంతర్రాష్ట్ర ముఠాను పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. వారి నుంచి సుమారు రూ.60లక్షల విలువ చేసే 178 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు నిందితులను అరెస్టు చేశారు. కేసుకు సంబంధించిన వివరాలను శంషాబాద్‌ జోన్‌ డీసీపీ కార్యాలయంలో డీసీపీ నారాయణరెడ్డి మీడియాకు వెల్లడించారు. ఛత్తీస్‌గడ్‌లోని సుక్మా జిల్లాకు చెందిన బైద్యధర్‌ కీర్తానియా, ప్రశాంత్‌ బిస్వాస్‌, ఒడిశాలోని మల్కాన్‌ గిరికి చెందిన సిప్రా కాజీ.. మరికొందరితో కలిసి ఈ నెల 14న ప్రధాన నిందితుడు దీపాంకర్‌ ఆంధ్రప్రదేశ్‌ మోతుగూడెంలో రహస్యంగా గంజాయి సాగు చేస్తున్న వ్యక్తి వద్ద నుంచి 89 ప్యాకెట్లు (సుమారు 178 కిలోలు) కొనుగోలు చేసి కర్నాటకలోని బెంగళూరుకు తరలించేందుకు ప్రయత్నం చేశాడు. తరలించే క్రమంలో డ్రైవర్లకు రూ.40 వేలు, ఎస్కార్ట్‌ వాహనదారులకు రూ.10 వేల చొప్పున ఇచ్చారు. కాగా ఈ నెల 15న అక్రమ రవాణా చేస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం అందుకున్న.. మాదాపూర్‌ ఎస్‌ఓటీ పోలీసులు.. షాద్‌నగర్‌ రూరల్‌ పోలీసులతో కలిసి లాల్‌ పహాడ్‌ చౌరస్తా సమీపంలోని జీబీబీఐ బిస్కెట్‌ కంపెనీ వద్ద నిఘా పెట్టారు. గంజాయి తరలిస్తున్న రెండు వాహనాలను ఆదివారం అడ్డగించారు. వాహనాలు తనిఖీ చేయగా గంజాయి లభ్యమైంది. మొత్తం గంజాయి 178కిలోలు కాగా.. దాని విలువ సుమారు రూ. 60లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. ఈ ఘటనలో బైద్యధర్‌ కీర్తానియా, ప్రశాంత్‌ బిస్వాస్‌, సిప్రా కాజీతోపాటు ఓ మహిళను అరెస్టు చేశారు. ఒడిశాలోని మల్కాన్‌గిరికి చెందిన దెబాషిస్‌, విశ్వనాథ్‌, దీపాంకర్‌, బెంగళూరుకు చెందిన జుబేర్‌ పరారీలో ఉన్నారు. దీపాంకర్‌ పాత నేరస్తుడు. ఇతనిపై ఆర్‌సీపురం పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో గతంలో కేసు నమోదైంది. గంజాయిని పట్టుకున్న శంషాబాద్‌ జోన్‌ ఎస్‌ఓటీ డీసీపీ రషీద్‌, అదనపు ఎస్‌ఓటీ డీసీపీ రామ్‌ కుమార్‌, శంషాబాద్‌ జోన్‌ అదనపు ఎస్‌ఓటీ డీసీపీ నారాయణగౌడ్‌, షాద్‌నగర్‌ ఏసీపీ రంగస్వామిలను డీసీపీ నారాయణరెడ్డి అభినందించారు.

రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలి

ఆర్టీసీని పరిరక్షించి, కార్మికుల సమస్యలు పరిష్కరించాలి
- లేకుంటే భవిష్యత్‌ పరిణామాలకు సీఎం కేసీఆర్‌ బాధ్యత వహించాలి
- కేంద్ర దుర్మార్గ విధాన నిర్ణయాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- ప్రభుత్వరంగంలోనే ఆర్టీసీ ఉంటుందని అన్ని పార్టీలు మేనిఫెస్టోల్లో ప్రకటించాలి : టీఎస్‌ఆర్టీసీ జేఏసీ రౌండ్‌టేబుల్‌లో రాజకీయపార్టీలు, కార్మిక సంఘాలహెచ్చరిక



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

నిస్వార్థంగా ప్రజలకు సేవలు అందిస్తున్న టీఎస్‌ఆర్టీసీని పరిరక్షిస్తూ, కార్మికుల పెండింగ్‌ సమస్యలన్నింటినీ తక్షణం పరిష్కరించాలని పలు రాజకీయపార్టీలు, కార్మిక సంఘాల నేతలు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్‌ చేశారు. అరిగోస పడుతున్న ఆర్టీసీ కార్మికులు, వారి కుటుంబాలు వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తమకు అండగా నిలిచే వారికే మద్దతుగా ఉంటాయన్నారు. ఆర్టీసీని ప్రభుత్వరంగంలోనే కొనసాగిస్తామని అన్ని రాజకీయపార్టీలు తమ ఎన్నికల మేనిఫెస్టోల్లో ప్రకటించాలని స్పష్టం చేశారు. టీఎస్‌ఆర్టీసీ కార్మిక సంఘాల సంయుక్త కార్యాచరణ కమిటీ (జేఏసీ) ఆధ్వర్యంలో ఆదివారంనాడిక్కడి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో 'తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలు-ఆర్టీసీ, కార్మికుల స్థితి' అంశంపై రౌండ్‌ టేబుల్‌ సమావేశం జరిగింది. జేఏసీ చైర్మెన్‌ కే రాజిరెడ్డి (టీఎస్‌ఆర్టీసీ ఎంప్లాయిస్‌ యూనియన్‌) అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, సీపీఐ కార్యదర్శి ఎన్‌ బాలమల్లేష్‌, ఎమ్‌సీపీఐ (యూ) నాయకులు అనిల్‌కుమార్‌, ఆప్‌ కన్వీనర్‌ డాక్టర్‌ డీ సుధాకర్‌, సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్‌, ఏఐటీయూసీ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ఎమ్‌ నర్సింహా, ఐఎఫ్‌టీయూ ప్రధాన కార్యదర్శి ఎం శ్రీనివాస్‌, ఐఎఫ్‌టీయూ ప్రధాన కార్యదర్శి ఆర్‌ జనార్దన్‌, ఆవ్‌ బహుజన ఎంప్లాయిస్‌ ఉపాధ్యక్షులు సదన్‌తేజ్‌, పౌరహక్కుల సంఘం ప్రధాన కార్యదర్శి నారాయణరావు, ఏఐటీయూసీ రాష్ట్ర నాయకులు వీఎస్‌ బోస్‌ తదితరులు మాట్లాడారు. అంతకుముందు జేఏసీ కో కన్వీనర్‌ కత్తుల యాదయ్య (బహుజన వర్కర్స్‌ యూనియన్‌) ఆహ్వానం పలికారు. జేఏసీ కన్వీనర్‌ వీఎస్‌ రావు (టీఎస్‌ఆర్టీసీ స్టాఫ్‌ అండ్‌ వర్కర్స్‌ ఫెడరేషన్‌) సమావేశంలో ఆర్టీసీ స్థితిగతులు, కార్మికుల సమస్యలపై సవివర నివేదికను ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజా రవాణాను నిర్వీర్యం చేస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మోటారు వాహన చట్టంపై ప్రజల్లో జరగాల్సినంత చర్చ జరగట్లేదని అభిప్రాయపడ్డారు. ఆర్టీసీలను పూర్తిగా ధ్వంసం చేస్తూ, కార్పొరేట్‌ రవాణా సంస్థలకు రెడ్‌ కార్పెట్‌ పరుస్తూ కేంద్ర ప్రభుత్వం అనేక కీలక నిర్ణయాలు తీసుకుంటున్నదని వివరించారు. ఆర్టీసీల్లోకి వస్తున్న ప్రయివేటు అద్దె ఎలక్ట్రిక్‌ బస్సుల ప్రవేశం కూడా దానిలో భాగమేనని తెలిపారు. ఎలక్ట్రిక్‌ బస్సుల్ని కార్మిక సంఘాలు స్వాగతిస్తున్నాయనీ, అయితే వాటిని ఆర్టీసీలే కొనుగోలు చేసేలా చట్టాలను మార్చాలని డిమాండ్‌ చేశారు. ఇప్పటి వరకు ఆర్టీసీలకు థర్డ్‌పార్టీ ఇన్సూరెన్స్‌ చెల్లింపులపై మినహాయింపులు ఉన్నాయనీ, సంస్థ క్లెయిమ్స్‌ ఏడాదికి రూ.60 కోట్లు దాటబోవని తెలిపారు. ఇప్పుడు ఏటా దాదాపు రూ.380 కోట్లను ఆర్టీసీలు థర్డ్‌పార్టీ ప్రీమియం చెల్లించాలని కేంద్రం ఆదేశిస్తున్నదనీ, ఇది కార్పొరేట్‌ బీమా సంస్థలకు ప్రజల సొమ్మును దోచిపెట్టడం తప్ప మరొకటి కాదని విమర్శించారు. కేంద్రం పెంచిన డీజిల్‌ ధరలు ఆర్టీసీలను ఆర్థికంగా కుంగిపోయేలా చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తన పరిధిలో సంస్థ పరిరక్షణ, విస్తరణ, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్‌ చేశారు. ఆర్టీసీలో కార్మిక సంఘాలను పునరుద్ధరించి, వారిని చర్చలకు పిలవాలని కోరారు. లేనిపక్షంలో ప్రజాబలంతో ఆర్టీసీలో మరో కార్మికోద్యమం తప్పదనీ, దానికి ముఖ్యమంత్రి కేసీఆర్‌ బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

ఈ మేరకు సీఎంకు లేఖ రాస్తామని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలు, ఆర్టీసీ విధ్వంసం, ప్రజలకు జరిగే నష్టంపై ప్రజాక్షేత్రంలోకి మరింత బలంగా తీసుకెళ్లాలని నిర్ణయించారు. జేఏసీ భవిష్యత్‌ కార్యాచరణకు అన్ని పార్టీలు, కార్మిక సంఘాలు మద్దతు తెలిపాయి.

బోనాలకు ప్రభుత్వం ఆహ్వానించలేదు

- రాజ్‌భవన్‌ బోనాల వేడుకల్లో గవర్నర్‌ తమిళిసై

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్‌

బోనాల పండుగకు రాష్ట్ర ప్రభుత్వం తనను ఆహ్వానించలేదని రాష్ట్ర గవర్నర్‌ తమిళిసై సౌందరరాజన్‌ ఆవేదన వ్యక్తం చేశారు. అయినా ఇది తనకు కొత్తేమీ కాదనీ, గతకొద్ది రోజులుగా జరుగుతున్న తంతేనని తెలిపారు. ప్రభుత్వ ఆహ్వానాలు అందినా, అందకపోయినా తాను హ్యాపీ అనీ, తెలంగాణ ప్రజలే తనకు పరివార్‌ అని చెప్పారు. అందుకే రాజ్‌భవన్‌లో బోనాల వేడుకలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఆదివారం హైదరాబాద్‌ లాల్‌దర్వాజా బోనాల సందర్భంగా రాజ్‌భవన్‌లోని నల్లపోచమ్మ అమ్మవారి ఆలయంలో గవర్నర్‌ బోనం సమర్పించి వడి బియ్యం పోశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణ ప్రజలందరికీ బోనాల శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ప్రజలంతా సుఖ సంతోషాలు, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకగా బోనాలు జరుపుకొంటున్నారని తెలిపారు. మరోవైపు చంద్రయాన్‌-3ను విజయవంతంగా ప్రయోగించిన ఇస్రో శాస్త్రవేత్తలకు గవర్నర్‌ అభినందనలు తెలిపారు.

రైతుల సాధికారతతోనే దేశాభివృద్ధి

- వ్యవసాయ రంగంలో సాంకేతికతను అందిపుచ్చుకోవాలి
- 'నాబార్డు ఫౌండేషన్‌ డే' లో గవర్నర్‌ తమిళిసై

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్‌

దేశంలో 60శాతం ప్రజలు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారని, రైతుల సాధికారతతోనే గ్రామీణ భారతం అభివృద్ధి చెందుతుందని గవర్నర్‌ తమిళిసై సౌందరరాజన్‌ తెలిపారు. హైదరాబాద్‌లోని నాబార్డు కార్యాలయంలో ఆదివారం 'నాబార్డు ఫౌండేషన్‌ డే' కార్యక్రమంలో పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని నాబార్డు ఆధ్వర్యంలో సక్సెస్‌ఫుల్‌ స్టోరీలతో ప్రచురించిన నాలుగు పుస్తకాలను గవర్నర్‌ ఆవిష్కరించారు. అంతకుముందు మిల్లెట్‌ స్టాళ్లను సందర్శించారు. గ్రామీణ మహిళలను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రైతులను ఆదుకోవడానికి బ్యాంకులు, నాబార్డు ముందుకు రావాలని, బ్యాంకు రుణాలు, ఇతర కార్యక్రమాలపై రైతులకు అవగాహన కల్పించాలని అన్నారు. రైతులను కేవలం వ్యవసాయ రంగంతోనే ముడిపెట్టకుండా వ్యాపారవేత్తలుగా మార్చడానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. స్వయం సహాయక మహిళా గ్రూపులకు రుణాలు ఇచ్చిన ప్రోత్సహించాలని, రైతులు పండించే



పంటలను కొనుగోలు చేసేవిధంగా సాయం చేయాలని చెప్పారు. వ్యవసాయ రంగంలో సాంకేతికతను అందిపుచ్చుకోవాలని, అందుకు బ్యాంకులు సాయం చేయాలని సూచించారు. భారతదేశంలో నాయకుల విగ్రహాలు పెడుతున్నారని, అట్లాంటాలో మాత్రం వ్యవసాయ రంగానికి కీలకంగా ఉన్న కీటకాల విగ్రహాలను ప్రతిష్ఠించారని గుర్తుచేశారు. నాబార్డు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మిల్లెట్‌ స్టాల్స్‌ ఆకట్టుకున్నాయని, తాను మూడు పూటలా మిల్లెట్‌ లడ్డూలు తింటానని తెలిపారు. ముఖ్యంగా మహిళలు మిల్లెట్‌ ఆహారాన్ని తీసుకుంటే ఆరోగ్యంతోపాటు అందంగా తయారవుతారని, ఈ విషయాన్ని గవర్నర్‌గా కాకుండా డాక్టర్‌గా చెబుతున్నానని వివరించారు. ఎస్‌బీఐ డిప్యూటీ మేనేజింగ్‌ డైరెక్టర్‌ అమిత్‌ జింగారన్‌ మాట్లాడుతూ నాబార్డు క్రెడిట్‌ ప్లానింగ్‌ బాగుందన్నారు. ఎస్‌హెచ్‌జీలను ఆర్థికంగా ఆదుకోవడం ద్వారా గ్రామాల్లో పేదరిక నిర్మూలన సాధ్యమవుతుందన్నారు. రైతులను స్టార్టప్‌లను ఏర్పాటు చేసేవిధంగా ప్రోత్సహించాలని సూచించారు. నాబార్డు తెలంగాణ రీజియన్‌ సీజీఎం సుశీల చింతల మాట్లాడుతూ గ్రామీణాభివృద్ధిలో నాబార్డు కీలకపాత్ర పోషిస్తున్నదని అన్నారు. అభివృద్ధి ఫలాలను అందరి అందించేందుకు చర్యలు తీసుకుంటున్నదని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాబార్డు ఆంధ్రప్రదేశ్‌ రీజియన్‌ సీజీఎం ఎంఆర్‌ గోపాల్‌. యూనియన్‌ బ్యాంక్‌ ఆఫ్‌ ఇండియా సీజీఎం కారే భాస్కరరావు, ఎస్‌ఎల్‌బీసీ కన్వీనర్‌ దెబాశిశ్‌ మిత్ర, తెలంగాణ స్టేట్‌ కో-ఆపరేటివ్‌ అపెక్స్‌ బ్యాంకు ఎండీ నేతి మురళీధర్‌, తెలంగాణ గ్రామీణ బ్యాంకు చైర్‌పర్సన్‌ వై.శోభా, ఆంధ్రప్రదేశ్‌ గ్రామీణ వికాస్‌ బ్యాంకు చైర్మెన్‌ కె.ప్రతాపరెడ్డి, నాబార్డు ఏజీఎం డి.రవిశంకర్‌, అధికారులు పాల్గొన్నారు.

తలపుల మడి

తూనీగను చూసినప్పుడల్లా
రెక్కలు విరిచి పట్టుకున్న
నా రెండు వేళ్ళకు నే వేసుకోవాల్సిన
శిక్షేమిటో అర్థం కాకుండా ఉంటుంది

నెమలీకను తల్చుకున్నప్పుడల్లా
రెండయ్యే ఆశ గొంతులో
ఉండ చుట్టుకున్నట్టు అనిపిస్తుంది

వాన చినుకు రాలక ముందే
కోకొల్లల ఉసిళ్ల అద్దం చిమ్నిపైకి
యుద్ధానికి ఎలా వస్తాయో
జవాబు తెలవక
ప్రశ్నే పక్కదారి పట్టింది

కాకులకీ చుట్టాలకి ఉన్న
బాదరాయణ సంబంధం
బామ్మలు ఇప్పటికీ ఎందుకు చెప్పరు ?

ఆటలో అరటి పండు
ఇచ్చింది ఎవ్వరూ లేదు



తీసుకున్నదీ కూడా లేదు

ఇప్పటికీ గెలిచిన వాడిని చూస్తే
చిన్నప్పుడు దొంగాట ఆడినవాడే
ఎందుకో యాదికి వస్తాడు

పంతులుగారు నేర్పిన చదువు కన్నా
పంతులమ్మగారు పెట్టిన పొద్దటి అన్నమే
పదే పదే తలుపుకు వస్తుంది

ఇసుకలో దాగి ఉన్న క్రప్పుల్లను
ఆనాడు గుర్తించలేకపోయా
వేళ్ళ మధ్య నుంచి ఇసుకలా జారిపోతున్న
ఆనందాలను ఈనాడు ఆపలేక పోతున్నా

ముళ్ల తప్పించి రేగు పళ్ళు ఏరుకున్న
చాక చక్యం ఇప్పుడు ఎటు పోయిందో
బళ్ళు తెరిస్తే కొత్తబట్టలేసుకున్న పుస్తకాలే కానీ
నాన్న చినుగుల చొక్కా కనిపించేది కాదు

చెట్టు మీద జామ పండు చూస్తే
ఒంటి మీది గోడ దూకిన గుర్తులు
తడుముకుని చూస్కుంటా

గవ్వలేరి గుది గుచ్చి దండ చేసి
వేసుకున్నప్పటి ఆనందం ఇప్పుడు
రవ్వలతో రతనాలతో రావట్లేదేమి ?

బాల్యమే బాగుంది
కలిమి, లేములు కన్ను కొట్టవు
బామ్మ పోయినా
బాధ అన్నది తట్టదు

- రెబ్బారం రాంబాబు

నవతెలంగాణ
దర్వాజ 4
సోమవారం 17-7-2023 ‖ రంగారెడ్డి

బాలల మనసులే బాలసాహిత్య పరిశోధనాలయాలు

ఐదేండ్ల చిన్నారిని పడుకోబెడుతూ తల్లి కథ చెబుతానంది. నేనే చెబుతానంది ఆ పాప. " ఒక రాజు ఉండేవాడు. అతనికి పేరు లేదు. కనపడిన అందరినీ పేరు పెట్టమని అడిగాడు. కానీ ఎవరూ పెట్టలేదు. ఎందుకంటే అతను అన్నీ పిచ్చి పనులు చేసేవాడు. చివరికి ఒక చిన్న పిల్లవాడు రాజుకు 'లిసి' అనే పేరు పెట్టాడు. రాజు అందరితో మంచిగా ఉంటేనే ఆ పేరు ఉంచుతా లేకపోతే తీసేస్తా అన్నాడు. రాజు ఆనందంగా సరేనన్నాడు" ఇదీ ఆ పాప చెప్పిన కథ. తల్లి పాపను అభినందించి ముద్దిచ్చింది. ఆ చిన్నారి తృప్తిగా నిద్ర పోయింది. ఈ సన్నివేశంలో రాజుకు పేరు లేకుండా ఎలా ఉంటుంది అని గానీ, రాజు అందర్నీ శాసించగల శక్తిమంతుడనీ ఆ తల్లి తన కూతురి కథను సరిదిద్దలేదు. అలా చేసి తన చిన్నారిని చిన్నబుచ్చలేదు. కథ తన ఊహ ! తన ఊహలో కూడా పూర్తి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు లేకపోతే ఎలా? అందుకే ఊరుకుంది. పిల్లలను సరిదిద్దకపోవడం తల్లి తప్పు అని కొంతమంది అనవచ్చు. కానీ ఐదేండ్ల ప్రాయానికి అప్పడే పురుడు పోసుకుంటున్న సృజనాత్మకతను తప్పు పట్టడం ఆ పాపను నిరాశ పరచడమే కదా అన్నది తల్లి ఆలోచన. ఈ సారి తాను రాజు కథ చెప్పేటప్పుడు చెప్పొచ్చులే అని అనుకుంది. మూడేండ్ల పాప సూర్యుని బొమ్మకు ఆకుపచ్చ రంగు వేస్తే తప్పేంటి ? మర్నాడు తన కిటికీలో కనపడే సూర్యుణ్ణి చూసి నెమ్మదిగా తనే మారుస్తుంది. ఆదిలోనే హంస పాదులా వేసిన వెంటనే ఇది కాదు అనడం ఎందుకు? యీ రెండు సంఘటనలు కల్పితం కాదు వాస్తవం.



నేటి బాల్యం పరిస్థితి ఇలాగే ఉంది. పురుట్లో బిడ్డ నుంచి పదిహేనేండ్ల వయసు దాకా పిల్లలంటే ఇలా ఉండాలి, అలా ఉండాలి అంటూ ఎన్నో నియమాలు, నీతులు, సుద్దులు, బుద్ధులు చెప్తున్నాం. ఒకప్పుడు ఆటలు ఎలా అయినా ఆడుకునేవాళ్ళం. ఇప్పుడు పిల్లల ఆటల్లో కూడా పెద్దవారి జోక్యం ఉంటోంది. మీకు ఉపయోగపడే ఆటలే ఆడుకోవాలి అంటూ ఆంక్షలు. వాళ్ళను ప్రతీ కోణంలో నుంచి విశ్లేషించి, ఫలానా వ్యక్తిత్వం కలవారు అని నిర్ణయించేస్తున్నాం. చేస్తున్న ప్రతీ పనిని పెద్దవాళ్ళు సరిదిద్దుతుంటే తాము తప్పులు మాత్రమే చేస్తున్నమేమో అనే భావన పిల్లలకు కలుగుతోంది. పిల్లల పరిస్థితి పంజరంలో చిలుకల్లాగా ఉంది. ఆలోచిస్తే ఒకరకంగా పిల్లల పట్ల మనం నియంతల్లాగా వ్యవహరిస్తున్నామా అని అనిపించక మానదు. కాకపోతే పిల్లల్ని వేలెత్తి చూపినట్లుగా పెద్దల్ని చూపితే ఒప్పుకోరుగా! అందుకే మనం 'పెద్ద' మనుషులం.

మరి పిల్లలని మంచి దారిలో ఎవరు నడిపిస్తారు అంటారేమో? వాళ్ళే నడుస్తారు, మనం నడుస్తుంటే! ఈ తరం పిల్లల మేధ మనకు అందనిది. వారి అంచనాలు, ఆశలు, ఆశయాలు అన్నీ ఆకాశమంత ఎత్తులో ఉంటాయి. 'చందమామ రావే..' అని మనం పాడితే, చందమామ రాదు మనమే అక్కడకు వెళ్దాం అంటారు. అక్కడకు వెళ్దాం అనే వారి ఉత్సాహాన్ని నీరుగార్చే కంటే వారితో పాటు ప్రయాణానికి ప్రణాళిక వేస్తే వారికెంత సంతోషమో ఆలోచిద్దాం. చందమామ దగ్గరకు వెళ్లాలనే కోరిక తప్ప అందుకు ఎలా సన్నద్ధం కావాలో తెలియని వారి కల సాకారం కావాలంటే ఒక మార్గదర్శకుడు కావాలి. ఆ మార్గదర్శకులు మనమవుదాం. శ్రీరామునికి అద్దంలో చందమామను చూపించి మరిపించి మురిపించిన కథ మన రామాయణంలో తెలుసుకున్నాం. ఏడు చేపల కథ విని కేరింతలు కొట్టాం. 'చమ్మ చక్క చారెడేసి మొగ్గ' అంటూ ఆటలాడాం. 'చిట్టి చిలకమ్మా' అంటూ గేయాలు పాడాం. ఇంకా పెద్దలు చెప్పిన, మనం చదివిన ఎన్నో కథలు, గేయాల నుంచి ఎన్నో విషయాలు తెలుసుకున్నాం. బాల్యానికి కావలసిన ఆనందం, ఆహ్లాదం, విద్య, విజ్ఞానం, స్ఫూర్తి ఇలా అన్నీ ఇచ్చే కల్పవృక్షం బాలసాహిత్యమే అని అనిపించక మానదు. ఇప్పటి పిల్లలకు ఇవన్నీ చెబితే వింటున్నారా? అసలు పుస్తకాలే చదవట్లేదు అని వాపోయే తల్లిదండ్రులు ఎంతో మంది ఉన్నారు. వారి బాధ నిజమే ! ఎవరూ ఆసక్తి చూపట్లేదు. ఎందుకంటే మనం కథ చదవడం అనేది కూడా ఒక హోంవర్క్ లాగా ఇస్తున్నాం. పిల్లలకు సాహిత్యాన్ని ఆస్వాదించే అవకాశం ఏదీ? పోనీ కథ చెప్తే అందులో ఒకరిని మంచివాడు అని చూపించడం కోసం ఇంకొకరిని చెడ్డవారిగా చిత్రీకరిస్తాం. ఒక తల్లి తన పిల్లాడు అల్లరివాడని చెప్తూ 'బ్యాడ్ బాయ్ కదా నీ ఫ్రెండు' అని ఆ పిల్లాడి స్నేహితురాల్ని అడిగింది. ఐదేండ్ల ఆ పాప 'నేను కూడా అల్లరి చేస్తా. కానీ మేమిద్దరం గుడ్' అని సమాధానం ఇచ్చింది. పిల్లల ఆటలు మనకు అల్లరిగా అనిపిస్తాయి. అవి వాళ్ళ దృష్టిలో ఆటలే. చూసే దృక్పథంలో తేడా అంతే !

పిల్లలు టీవీలు, ఫోన్లు పట్టుకుని వదలట్లేదంటే ఎలా? వారికి వేరే వ్యాపకం ఏం తెలుసు ? ఇన్‌స్టాగ్రామ్‌లో తప్ప ఇంట్లో ఉండే మనుషులు ఉండరు. కంప్యూటర్‌లో ప్రోగ్రాం రాసినట్టు వాళ్లకు ఈ పుస్తకాలు చదవాలి అని టైం టేబుల్ ఇచ్చేస్తాం. చదివి ఊరుకుంటే సరిపోదు. దాని మీద పెద్ద థీసిస్ రాయాలి అనే సాధించలేని టార్గెట్స్ ఇచ్చేస్తాం. వాళ్ళకు పుస్తకం చదువుతున్నంత సేపు టార్గెట్ మాత్రమే కనపడుతోంది తప్ప చదివిన సాహిత్యాన్ని ఆస్వాదించే వీలు ఎక్కడ దొరుకుతోంది? పోటీ పరీక్షల్లో కూడా ఈ టార్గెట్లే పిల్లల్ని భయపెడుతున్నవి. ఇవేవి లేకపోతే ఎంతటి అడ్డంకులనైనా అవలీలాగా దాటే సత్తా నేటి తరం పిల్లలకు ఉంది. మనం ఆ దశ దాటి వచ్చిన వాళ్ళమే కదా! వాళ్ళకు నచ్చే సాహిత్యాన్ని ఎంచుకునే అవకాశం లేదు. నీతి లేని కథ చదవడం దండగ. అందులో దొరికే ఆహ్లాదం, ఆనందం పిల్లల మానసిక వికాసానికి దోహదమవుతాయనే సంగతి మరిచిపోతే ఎలా?


ఈ మధ్య 'జస్ట్ ఆడ్ మేజిక్' అనే వెబ్ సిరీస్ చూసాను. అది ముగ్గురు టీనేజ్ ఆడపిల్లల కథ. మ్యాజికల్ స్పైసెస్‌తో కుక్ బుక్‌లో ఉన్నట్టుగా వండటం, ఆ పుస్తకంలో ఉన్న విధానాల ద్వారా గతం మరిచి మాట పడిపోయిన నాయనమ్మకు మళ్ళీ మాములు మనిషిని చేయడం కోసం పరితపించే మనుమరాలు ఇవన్నీ ఉన్నాయి. పిల్లలకు ఎంతో నచ్చుతుంది. నేటి తరం పిల్లలకు ఈ తరహా సాహిత్యం ఎక్కువ దగ్గరవుతుందేమో అనిపించింది. వాళ్ళని చదివింపజేసేలా సాహిత్యం ఉండాలి. కథల్లో చాలా చెప్పాలన్న ఉత్సాహంతో ఒక్కోసారి తెలియకుండా కథలో సహజత్వం కోల్పోతున్నాం. పిల్లలకు అరటిపండు వలిచినట్లుగా చెప్పాల్సిన అవసరం లేదు. అలా చెప్పి పిల్లల్లో తార్కిక నైపుణ్యాన్ని, విజ్ఞతను కోల్పోయేలా చేస్తున్నామేమో అనిపిస్తోంది. ఫలితంగా పిల్లలు చెప్పింది మాత్రమే చేయగల రోబోలుగా మారే ప్రమాదం ఉంది. బాల సాహితీవేత్తలు ప్రత్యేకంగా దృష్టి పెట్టాల్సిన విషయం అది. కాసేపు పడుకుని లేచి చదువుకోమంటే, చదువుతున్న కథల పుస్తకం తలగడ కింద దాచుకుని కాసేపు పడుకున్నట్లే నటించి అందరూ పడుకున్నాక లేచి చదువుకుంటోంది నా ఎనిమిదేళ్ల కూతురు. అంతటి ఆసక్తి కలిగించింది ఆ పుస్తకం. నేను అనుకున్నది సాధించినట్టే! సాహిత్యంతో సావాసం చేస్తే ప్రపంచాన్ని మరిచిపోతాం. అందులోనే ఆహ్లాదం, ఆనందం, స్వాంతన పొందుతాం. ఆ స్థితికి చేరుకోవాలంటే సాహిత్యాన్ని పూర్తిగా ఆస్వాదించగలగాలి. పిల్లల్ని ఆ స్థాయికి తీసుకెళ్లాలంటే బాలసాహిత్యంలో మూస ధోరణికి చోటు ఉండకూడదు. కథ ఇలాగే ఉండాలి అన్న చట్రంలో రచయిత బిగించబడి ఉండకూడదు. ఎల్లలు ఎరుగని పిల్లలకు పరిధులు లేని సాహిత్యాన్ని సృజిద్దాం. పిల్లల మనసుకు హత్తుకునే కథ ఏదైనా అద్భుతమే!

పిల్లల మనసులే బాలసాహిత్య పరిశోధనాలయాలు. వారి మాటలు

పిల్లలకు

గెలుపు ఎంత ముఖ్యమో, విజయం ఎంత గొప్పదో చెప్పే స్ఫూర్తి కథలు, విజయ గాథలు చాలా ఉన్నాయి. కానీ చిన్న చిన్న సమస్యలను భూతద్దంలో చూసి ఓటమిని భూతంలా ఊహించుకుని చిరుప్రాయంలోనే జీవితాలను అంతం చేసుకుంటున్న చిన్నారులను చూసే దుస్థితి మనకెందుకు వస్తోంది? వారిలో ఆత్మన్యూనతను పోగొట్టడానికి మనమేం చేస్తున్నాం? అసలు గెలుపోటములకు నిర్వచనాలు ఉన్నాయా? అనుకున్నది అందుకోలేకపోయినా జీవితం మనకు ఇంకా అవకాశాలు ఇస్తుందనే స్పృహ పిల్లలకు కలిగించగలగాలి. ఓటమిని స్వీకరించగలిగే మానసిక స్థితి పిల్లాడికుండాలి. మన కథల్లో,గేయాల్లో ఓటమి తరువాత కూడా ఉండే చక్కటి అవకాశాల గురించి పిల్లలకు పరిచయం చేద్దాం. ఫలితం కన్నా ప్రయత్నమే గొప్పదని చెప్పే సాహిత్యం ద్వారా పిల్లలకు ఉత్సాహం ఇద్దాం. ఇలాంటి సాహిత్యం రావాల్సిన అవసరం చాలా ఉంది. రేపటి భారతాన్ని మానసిక రుగ్మతల నుంచి కాపాడుదాం.

- డా. హారిక చెరుకుపల్లి, 9000559913



బాల సాహిత్య నిఘంటువులు. వాళ్ళలో వెతికితే దొరకని కథా వస్తువు ఉండదు. వాళ్ళతో సమయం గడిపితే వాళ్ళేం ఆలోచిస్తున్నారో, ఎలాంటి కథలు వారికి ఉపయోగపడతాయో, ఆహ్లాదానిస్తాయో మనం తెలుసుకోవచ్చు. ప్రతీ బాల సాహితీవేత్త కనీసం నెలలో ఒకసారైనా పసి మనసులను చదివి అప్ గ్రేడ్ అవ్వాల్సిన అవసరం ఉంది.

పిల్లలకూ సమస్యలుంటాయి. రెండవ తరగతి పిల్లాడికి తన పాలపళ్ళు ఇంకా ఎందుకు ఊడట్లేదని బెంగ. ఐదవ తరగతి పిల్లకు తన జుట్టు అందరిలా నల్లగా కాక ఎర్రగా ఉంటుందని బాధ. ఎంత చదివినా నాలుగు మార్కుల్లో క్లాస్ ఫస్ట్ పోతోందని తొమ్మిదవ తరగతి అఖిల్ వాళ్ళ అమ్మ బాధ. లలిత్ టెన్నిస్ కోచింగ్ తీసుకుంటున్నా కూడా జాతీయ స్థాయికి సెలెక్ట్ కాలేకపోయినందుకు జీవితం వృథా అనుకుంటున్నాడు. వీళ్ళందరిలోనూ తప్పుందా?

పిల్లల్ని

తాము చూడని రంగయ్య, రామయ్య కన్నా తోటి పిల్లలైన రాము, రమలే ఎక్కువ ప్రభావితం చేస్తారని నా అభిప్రాయం. పిల్లల పాత్రలతో నడిచే కథలను వారి స్వభావాలు అన్వయించుకుంటారు. నేను దానినే అనుసరి స్తున్నాను. ఇటీవల అనేకమంది రచనల్లో కూడా చూస్తున్నాను. బాల సాహిత్యం భావి భారతాన్ని నిర్మిస్తుంది. అందువల్ల పిల్లలకు కావాల్సిన స్ఫూర్తి, నైతిక విలువలు, బాధ్యత నేర్పే కథలు రావాల్సిన అవసరం ఉంది. కానీ ఇవన్నీ విభిన్న కథనాలతో ఈ - తరం పిల్లల మనసుకు హత్తుకునేలా ఉండాలి. మన కథను మన కన్నా గొప్పగా ఎవరూ అధ్యయనం చేయలేరు. ఒకటికి పదిసార్లు మనం చదువుకుని విశ్లేషించుకుంటే అద్భుతమైన ఆణిముత్యాలు భావి తరానికి అందించవచ్చు.

అన్నిటిలోనూ ముందు ఉంటేనే వాళ్ళు మంచి పిల్లలా? ప్రతీ పిల్లాడు ప్రత్యేకమే అని వాళ్ళకు అనిపించాలంటే బాల సాహితీవేత్తలుగా మనమేం చేయగలం?

డిగ్రీ రెండో ఏడాది చదువుతున్న పిల్లలు కూడా ఇంకా తమ పనులకు తల్లిదండ్రులపై ఆధారపడి ఉంటున్నారు. మా ముందు తరం వారు ఇరవై ఏండ్లకు కుటుంబ బాధ్యతలను స్వీకరించే స్థాయిలో ఉండేవారు. అప్పటికి ఇప్పటికీ పోలిక లేదు. కానీ స్వతంత్రంగా బతకడం మాత్రం ఎప్పుడైనా అవసరమైన జీవన నైపుణ్యం. వెనకటి తరాల వారిలో ఉన్న మానవ సంబంధాలు నేడు కరువయ్యాయి. తప్పులు ఎత్తిచూపే వేళ్ళే తప్ప, కలిసి పని చేసే పిడికిళ్లు లేవు. ఎవరికీ వారే ఒంటరి పోరాటం. ఇలాంటి పరిస్థితిని మనమెలా మార్చాలి? పాత చింతకాయ పచ్చడి ఎప్పుడూ ఆరోగ్యానికి మంచిదే! వేడి వేడి అన్నంలో నెయ్యి కలిపి దాని రుచి పిల్లలకు చూపించాలి. కానీ ఆకర్షణీయమైన కొత్త పళ్లెంలో ! ముందు తరాల బంధాలు, బాధ్యతలు, విలువలు, నైపుణ్యాలు అన్నీ కొత్తగా, ఆసక్తిగా కమ్మటి కథలుగా అందించాలి. చందమామ, బాలమిత్ర మన తాతల తరంలో అలా అందించబడినవే! అందుకే అంత ఆదరణ పొంది కథలంటే ఇలా ఉండాలి అనే విశిష్ట ప్రామాణికతను ఏర్పరిచేసాయి. వాటితో పోలిక లేదు. బేతాళ కథల్లో సాహసం, ధైర్యం; చందమామ కథల్లో ఉన్న నీతి, రీతి మన వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దాయని చెప్పడంలో సందేహం లేదు. కానీ తరాలు మారాయి. అవసరాలు మారాయి. సమాజం మారింది. ఆలోచనలు మారాయి. అంతరిక్షంలోకి వెళ్ళి ఇంకెన్ని చందమామలు ఉన్నాయో పిల్లలకు చూపిద్దాం. మనం మాయాబజార్ సినిమాలో 'ఆహా నా పెళ్ళి అంట' అని పాడుకుంటే ఇప్పటి తరం 'నాటు నాటు' పాటకు చిందులేస్తారు. మన పాటకు స్టెప్పులేయలేదని తప్పు పట్టలేం కదా! ఇప్పటి తరానికి ఆసక్తి కలిగించే బాలసాహిత్యాన్ని సృజించడానికి కొత్త ప్రామాణికత సృష్టించుకుందాం.

ఇంకొక ప్రధానమైన అంశం... నేటి సైబర్ నేరాల్లో గానీ, ఇతర నేరాల్లో అయినా టీనేజ్ పిల్లలు ఎక్కువగా నిందితులుగా ఉంటున్నారు. కారణాలు అనేకం. సమాజంలో మంచి చెడు ఎప్పుడూ ఉన్నాయి. ఏ దిశలో వెళ్ళాలో నిర్ణయించుకునే విజ్ఞత మన రచనల ద్వారా పిల్లలకు కలిగించగలగాలి. నెల పసికందు నుంచి పిల్లలు వీడియోల ద్వారా సామజిక మాధ్యమాల్లో ఉంటూనే ఉంటున్నారు. ప్రశంసల జల్లులో తడుస్తూనే ఉంటున్నారు. వయసు వచ్చేసరికి ఒక రకమైన గర్వం వాళ్ళను వాస్తవికతకు దూరం చేస్తోంది. ఇలాంటి వర్చ్యువల్ ప్రశంసల జల్లులో తడవకుండా గొడుగులా కాపాడాల్సిన బాధ్యత మనపై ఉంది. ప్రలోభాలకు లొంగకుండా సామజిక మాధ్యమాలను ఎలా ఉపయోగించుకోవాలో తెలిపే సాహిత్యాన్ని అందించాల్సిన అవసరం చాలా చాలా ఉంది. నేటి బాలసాహిత్యాన్ని అధ్యయనం చేస్తున్న క్రమంలో నేటి పరిస్థితులను, సామజిక అంశాలను బేరీజు వేసుకుని చూస్తున్నప్పుడు ఇటువంటి అనేక అంశాలు తోస్తూనే ఉన్నాయి. తల్లిగా ఆలోచిస్తున్నప్పుడు కొన్నిసార్లు తొలుస్తున్నాయి కూడా!

బాలసాహిత్య రచయిత్రి గానే కాక అమ్మగా నేను చూసిన, చూస్తున్న అనేక అంశాలు ఈ వ్యాసం రాయటానికి నన్ను పురికొల్పాయి. ఈ అంశాలన్నిటి మీద మీరు, నేను, మనందరం సుదీర్ఘ చర్చ జరిపి బాలసాహిత్యం ద్వారా పిల్లలను రెక్కల ఊయలలో పిల్లల్ని చంద్రమండలానికి తీసుకెళ్దాం. విహరించడం వాళ్ళ పని!

సాహితీ వార్తలు

21న 'మనసు పలికిన' ఆవిష్కరణ

జొలాది రత్నసుధీర్ కథల సంపుటి మనసు పలికిన... ఆవిష్కరణ సభ పాలపిట్ట, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 21న శుక్రవారం సాయంత్రం 6.00 గంటలకు రవీంద్ర భారతి కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించనున్నారు. సి.ఎస్.రాంబాబు అధ్యక్షతన నిర్వహించే ఈ కార్యక్రమంలో ఆచార్య కొలుకలూరి ఇనాక్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తారు. కార్యక్రమంలో విహారి, ఎ.దినకరబాబు, గుడిపాటి ప్రసంగిస్తారు.

22న 'చీకటి వెన్నెల' ఆవిష్కరణ

ఝాన్సీ కొప్పిశెట్టి కథల సంపుటి - చీకటి వెన్నెల, దీర్ఘకవిత - ఎడారి చినుకు పుస్తకాల ఆవిష్కరణ సభ పాలపిట్ట, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 22న శనివారం సాయంత్రం 6.00 గంటలకు రవీంద్రభారతి పైడి జయరాజ్ హాల్‌లో నిర్వహించనున్నారు. ఓల్గా అధ్యక్షతన నిర్వహించే ఈ కార్యక్రమంలో కొండేపూడి నిర్మల, సమ్మెట ఉమాదేవిలు పుస్తకాలను ఆవిష్కరిస్తారు. సభలో పింగళి చైతన్య, అపర్ణ తోట, మానస ఎండ్లూరి, నస్రీన్‌ఖాన్, కళా తాటికొండ ప్రసంగిస్తారు.

తెలంగాణ మహిళా కథల పోటీలు

విహంగ అంతర్జాల అంతర్జాతీయ త్రైమాసిక స్త్రీవాద పత్రిక, తెలుగు తల్లి కెనడా మాసపత్రిక, హెచ్ ఆర్ సి లిటరరీ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో తెలంగాణ దశాబ్ది సందర్భంగా తెలంగాణ మహిళా కథల పోటీలు నిర్వహించనున్నారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.5000/-, రూ.4000/-, రూ.3000/-లతో పాటు రూ. 1000/- చొప్పున ఐదు ప్రత్యేక బహుమతులకు ఇవ్వనున్నారు. తెలంగాణ చరిత్ర, సంస్కృతి సంప్రదాయాలు ప్రతిబింబించేలా అంశాన్ని ఎంచుకుని ఏడు పేజీలు మించకుండా యూనికోడ్ లేదా వర్డ్ డాక్యుమెంట్‌లో ఆగస్టు 30లోగా telanganamahilakathalu@gmail.com మెయిల్‌కు పంపవచ్చు. వివరాలకు 7995820736 నంబరు నందు సంప్రదించవచ్చు.

బండికల్లు ఫౌండేషన్ కథల పోటీ

బండికల్లు వెంకటేశ్వర్లు ఫౌండేషన్ 'విశాఖ సంస్కృతి' తెలుగు మాసపత్రిక సౌజన్యంతో జాతీయ స్థాయి కథల పోటీ నిర్వహిస్తోంది. ఆరు కథలకు ఒక్కింటికి రూ.2000/- చొప్పున బహుమతి అందించనున్నారు. కథల్లో కుటుంబ వ్యవస్థ, నైతికవిలువలు, సామాజిక అంశాలు ప్రతిబింబించాలి. ఆసక్తి కలిగిన వారు ఆగస్టు 24 లోగా బండికల్లు జమదగ్ని, అధ్యక్షులు, బండికల్లు వెంకటేశ్వర్లు ఫౌండేషన్, 402, హిమజ టవర్స్, 3/10, బ్రాడీపేట, గుంటూరు - 522002 చిరునామాకు పంపవచ్చు. వివరాలకు 9848264742 నంబరు నందు సంప్రదించవచ్చు.

'నెచ్చెలి' కథా, కవితా పురస్కార ఫలితాలు

'నెచ్చెలి' ఆధ్వర్యంలో నిర్వహించిన 'శ్రీమతి కె.వరలక్ష్మి ఉత్తమ కథా పురస్కారం' ఫలితాలు వెలువరించారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులకు బ్రిస్బేన్ శారద -ధీర, ఝాన్సీ కొప్పిశెట్టి-వాడని నీడలు, భాగవతుల భారతి -గంట గడిస్తే చాలు తో పాటు బి.కళాగోపాల్, జొన్నలగడ్డ రామలక్ష్మిల కథలు ప్రత్యేక బహుమతులకు ఎంపికయ్యాయి.

'డా.కె.గీత ఉత్తమ కవితా పురస్కారం' లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా పెనుగొండ బసవేశ్వర్ - ఇరాము లేని ఈగురం, దుద్దుంపూడి అనసూయ - జ్ఞాపకాల ఊడలు, అవధానం అమృతవల్లి - అధిగమిస్తూ.. అంబరాన్ని చుంబిస్తూ లు ఎంపికయ్యాయి. వీటితో పాటు సుంక ధరణి, జి. రంగబాబు, డా.కటుకోఝ్వల రమేష్, చొక్కర తాతారావు కవితలు ప్రత్యేక బహుమతులుగా ఎంపికయ్యాయి.

ఏనుగు నరసింహారెడ్డికి సినారె సాహితీ పురస్కారం

'ఊహాల వేదిక' ఆవిష్కరణ

డా॥ సి. నారాయణరెడ్డి 92వ జయంతి సందర్భంగా సృజన భారతి సాహిత్య సాంస్కృతిక సంస్థ డా॥ ఏనుగు నరసింహారెడ్డి రచించిన 'ఊహల వేదిక' ఆధునిక కవిత్వ విమర్శ ఆవిష్కరణతో పాటు సినారె సాహితీ పురస్కారాన్ని ఆయనకు అందజేస్తోంది. ఈ నెల 23న ఆదివారం సాయంత్రం 6 గం॥లకు తెలంగాణ సారస్వత పరిషత్తులో ఈ కార్యక్రమం జరుగనుంది. ఈ సభలో డా॥ కె.వి.రమణ, డా॥ ఎల్లూరి శివారెడ్డి, డా॥ నందిని సిధారెడ్డి, డా॥ ఎం.కె. రాము, డా॥ సి. మృణాళిని, డా॥ టి. గౌరీశంకర్, డా॥ నాళేశ్వరం శంకరం తదితరులు పాల్గొంటారు.

- డా॥ కొమ్మూరి ప్రసాద్, వ్యవస్థాపక అధ్యక్షులు, సృజనభారతి

పెండెం జగదీశ్వర్ స్మారక పురస్కార కార్యక్రమం

పెండెం జగదీశ్వర్ స్మారక పురస్కారాన్ని ప్రముఖ బాల సాహితీవేత్త దార్ల బుజ్జిబాబుకు ఇవ్వనున్నారు. ఈ పురస్కార ప్రదాన కార్యక్రమం ఈ నెల 17న నల్లగొండ జిల్లా కేంద్రంలోని నాగార్జున ప్రభుత్వ కళాశాల అలుమ్ని హాల్‌లో ఉదయం 10 గంటలకు సాహితీ మిత్ర మండలి అధ్యక్షులు డా. తండు కృష్ణ కౌండిన్య సభాధ్యక్షతన నిర్వహిస్తున్నారు. ముఖ్య అతిథిగా ప్రముఖ సాహితీవేత్త ఏనుగు నరసింహారెడ్డి, గౌరవ అతిథిగా డా. పత్తిపాక మోహన్ రానున్నారు.

బహుముఖ ప్రతిభాశాలి మరింగంటి భట్టరాచార్యులు

- పింగళి భాగ్యలక్ష్మి, 9704725609



మరింగంటి భట్టరాచార్యులు... విద్యావేత్త, సాహితీకారులు, సంగీత విద్వాంసులు, బహుభాషా కోవిదులు, సంఘ సేవకులు, పేదల పాలిట పెన్నిధి, స్వాతంత్ర్య సమరయోధులు, రేడియో, టీవీ కళాకారులు... ఇలా ఎన్నో రంగాలలో ఓ ధృవతారలా వెలిగిపోయినవారు. ఖమ్మం జిల్లాలోని కల్లూరు మండలం, నారాయణపురం గ్రామంలో 1930 సెప్టెంబర్ 28న రంగాచార్యులు, వీర రాఘవమ్మ దంపతులకు జన్మించారు. తర్వాత కాలంలో కృష్ణా జిల్లా తిరువూరు వలస వెళ్లారు. విశ్వనాథ సత్యనారాయణ దగ్గర శిష్యరికం చేరి చదువు ప్రారంభించారు.

చిన్నతనంలోనే తండ్రిని పోగొట్టుకోవడంతో పేదరికం వల్ల ఈయన చదువులో కొంత వెనకబడ్డారు. అటువంటి సమయంలో పెద్ద అన్న మరింగంటి సీతారామాచార్యులు వీరి చదువుకు అండగా నిలిచారు. హిందీలో విశారద పట్టా పుచ్చుకున్నారు. అలాగే సంస్కృతంలో ఉన్నత విద్యను అభ్యసించారు. తర్వాత రంగ నాయకమ్మను వివాహం చేసుకున్నారు. వీరికి ముగ్గురు ఆడపిల్లలు, ఇద్దరు మగ పిల్లలు. వీరిలో డాక్టర్ మరింగంటి మురళీకృష్ణ జర్నలిస్టుగా, సాహితీవేత్తగా రాణిస్తున్నారు. భట్టరాచార్యులు సాహిత్యంలో అనేక ప్రక్రియల్లో



నిష్ణాతులు. పరిశోధనాత్మక వ్యాసాలు, అనువాద రచనలు, పద్యాలు, కవితలు, కథానికలు, లలిత గీతాలు, ధారావాహికలు, అష్టావధాన ప్రవచనాలు పాఠకులకు అందించారు. వీరికి తెలుగు, సంస్కృతం, హిందీ, అరబిక్, ఉర్దూ, పర్షియన్ భాషల్లో మంచి పాండిత్యం ఉంది. విశ్వనాథ వారి కిన్నెరసాని పాటలు, కోకిలమ్మ పెళ్లి కావ్యాలను "కిన్నెరసేని కీ గీత్ ఔర్ కోయల్ కీ షాదీ" పేరుతో హిందీలోకి అనువదించారు. ప్రముఖ హిందీ నవలా రచయిత మోహన్‌లాల్ మహతో వియోగి నవల 'ఆర్యావర్త్'ను 'ఆర్యావర్తం' పేరుతో తెలుగులోకి అనువదించారు. జయశంకర్ ప్రసాద్ కావ్యం 'అంశు'ను 'అశ్రుబిందువు' పేరుతో తెలుగులోకి అనువదించారు. వీరు రాసిన ప్రముఖ గ్రంథాలు కథానాయకుడు, మన గాంధీ, శ్రీమద్ భగవద్గీతాసారం, తిరుప్పావై ప్రవచనాలు, కబీర్, వేమన తులనాత్మక అధ్యయనం, విశ్వనాథ వారి కవితా వైభవం ప్రసిద్ధి చెందినవి. విశ్వనాథ వారి రామాయణ కల్పవృక్షం, తులసీదాసు రామచరిత మానసాలను అధ్యయనం చేసి కృష్ణపత్రిక వారి పత్రికలో పరిశోధనాత్మక వ్యాసాలు రాశారు. యాజ్ఞవల్క్య వారి రామానుజ వేదాంతంపై వీరితో వీడియో ఉపన్యాసాలు చేశారు. ఈ ఉపన్యాసాలు దేశవ్యాప్తంగా చక్కని గుర్తింపు తెచ్చిపెట్టాయి. దూరదర్శన్‌లో కూడా ఎన్నో కార్యక్రమాలు చేశారు. ఆస్ట్రేలియా నుంచి వెలువడిన 'తెలుగు పలుకు' పత్రికలో అప్పట్లో ఎన్నో సాహితీ, ధార్మిక వ్యాసాలు రాశారు. ఢిల్లీ నుంచి వెలువడే 'తెలుగు వాణి'లో కూడా లెక్కకు మిన్నగా వ్యాసాలు రాశారు. ఆకాశవాణి హైదరాబాద్, విజయవాడ, కొత్తగూడెం కేంద్రాలలో అనేక గీతాలు రాశారు.

బెజవాడ గోపాల్ రెడ్డి, నీలం సంజీవరెడ్డి, ఎన్నేస్ సుబ్రహ్మణ్యం, అనంతశయనం అయ్యంగార్, ప్రకాశం పంతులు సాహచర్యంతో ఆచార్య వినోబా భావే నేతృత్వంలో స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నారు. స్త్రీ విద్య, గ్రామ పారిశుధ్యం, ఖద్దరు వస్త్రాల వినియోగం, రాట్నం వడకటం, హరిజనులకు దేవాలయాల ప్రవేశం లాంటి కార్యక్రమాలలో పాల్గొన్నారు. ఇంకా ఖమ్మం జిల్లా గార్ల కేంద్రంగా నిజాం వ్యతిరేక ఉద్యమంలో పాల్గొని జైలు శిక్ష అనుభవించారు.

భట్టరాచార్యుల వారు "పండిత, సాహిత్య భూషణ, ప్రవచన దిట్ట...." లాంటి వందకు పైగా పురస్కారాలను సొంతం చేసుకుని వన్నె తెచ్చారు. ఇలా అపారమైన జ్ఞాన సంపదతో అందరి మదిలో నిలిచిపోయిన మరింగంటి భట్టరాచార్యుల వారు 2012 జులై 18న తుదిశ్వాస విడిచారు.

ప్రపంచ గమనం

తరుగుతున్న ఉక్రెయిన్ సైన్యానికి మద్దతుగా విదేశీ కిరాయి సైన్యాన్ని దించుతున్న అమెరికా



న్యూయార్క్: ఒకవైపు అమెరి కన్లను ఉక్రెయిన్ యుద్ధానికి దూరంగా ఉండమని చెబుతూనే మరోవైపు అమెరికా ప్రయోజనాల కోసం బైడెన్ కిరాయి సైనికులను వినియోగిస్తున్నాడు. ఇప్పటి వరకున్న కిరాయి సైనికులలో అమెరికన్లు అంతగా లేరని రష్యా చానెల్ ఒన్ న్యూస్ పేర్కొంది. పోలండ్, కెనడా దేశాల నుంచే కిరాయి సైనికులు ఎక్కువగా ఉన్నారు. ఆ తరువాత స్థానం అమెరికాది.

ఉక్రెయిన్‌లో రష్యాకు వ్యతిరేకంగా అమెరికా ప్రయోజనాల కోసం పని చేయటానికి, రోజురోజుకూ తరుగుతున్న ఉక్రెయిన్ సైన్యానికి మద్దతుగా పనిచేయటానికి అమెరికా గూఢచార సంస్థలు విదేశీ కిరాయి సైనికులను సమీకరిస్తున్నాయి. రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ అంచనా ప్రకారం 7000మంది కిరాయి సైనికులలో 2000 మంది యుద్ధంలో చనిపోయారు. పశ్చిమ దేశాల నుంచి ఉక్రెయిన్ యుద్ధంలో పాల్గొంటున్న కిరాయి సైనికులు ఎక్కువగా చనిపోతుండటం ఆయా దేశాలను కలవరపరుస్తోంది. వీరిలో చాలామందికి సైనిక శిక్షణ పొందిన చరిత్ర కూడా లేదు. మే నెలలో ఉక్రెయిన్‌లో కిరాయి సైన్యం గ్రూపులో ఇద్దరు కెనడా కిరాయి సైనికులు చేరారు. వీరు బాఖ్మత్‌లో జరిగిన యుద్ధంలో తమ ప్రాణాలను కోల్పోయారు. వీరిలో ఒకరు కెనడా సైన్యంలో డాక్టర్‌గా పనిచేశాడు. యుద్ధంలో గాయపడిన సైనికులకు కట్లు కట్టిన అనుభవంవున్న వాళ్ళు యుద్ధ రంగంలో ఆయుధాలను ఉపయోగించటం ఎలా సాధ్యం? అనే ప్రశ్నకు సమాధానం చెప్పటానికి కెనడా ప్రభుత్వం సుముఖంగా లేదు. ఏప్రిల్ నెలలో అమెరికన్ కూపర్ హారిస్ బాఖ్మత్ యుద్ధంలోనే చనిపోయాడని ఫాక్స్ న్యూస్ ప్రకటించింది. ఇతను గ్రౌండ్ ఎలెక్ట్రానిక్ సిస్టెమ్ ఇంజినీర్‌గా పనిచేశాడే తప్ప సైనిక శిక్షణ ఉన్నవాడు కాదు. ఖార్కీవ్‌లో పట్టుబడిన మరో ఇద్దరు అమెరికన్లకు కూడా సైనిక శిక్షణ లేదని చానల్ ఒన్ చెప్పింది. ఇక్కడ తెలుస్తున్నదేమంటే విదేశీ కిరాయి సైనికులకు చాలావరకు సైనిక శిక్షణ లేకపోవటమే కాకుండా వీరికి ఉక్రెయిన్ ప్రభుత్వం నుంచి సరియైన మద్దతు కూడా అందటం లేదు. ఉక్రెయిన్‌లో పనిచేస్తున్న విదేశీ కిరాయి సైనికుల సంఖ్య యుద్ధంలో చనిపోవటం వల్లనూ, పరిస్థితిని అర్థం చేసుకుని నిష్క్రమించటం వల్లనూ తరిగిపోతూవుంది. సిరియాలో అమెరికా గూఢచార సంస్థలు కొత్తగా కిరాయి సైనికులను రిక్రూట్ చేసుకుంటున్నాయని మిడిల్ ఈస్టర్న్ మీడియా నుంచి అనధికార వార్తలు అందుతున్నాయి. అమెరికాకు తన సైన్యాన్నిగానీ, తన పౌరులనుగానీ ఉక్రెయిన్ యుద్ధంలో రష్యాతో తలపడేలా చెయ్యటం ఇష్టం లేదు. ప్రాణాలు తమవి కానంతవరకూ ఉక్రెయిన్‌లోగానీ, మరే ఇతర దేశంలోగానీ మానవ హననం ఎంత జరిగినా అమెరికా హృదయం కరగదని మరోమారు రుజువౌతోంది.

బుస్..బుస్..

- **పాముకాటు కేసులపై ఐసీఎంఆర్ అప్రమత్తం**
- **అవగాహన కల్పించనున్న అధికారులు**

న్యూఢిల్లీ : భారత్‌లో పాము కాటు కేసులు పెరుగుతున్న నేపథ్యంలో ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్) అప్రమత్తమవుతున్నది. పాము కాటు కేసులపై అవగాహన కల్పించేందుకు సిద్ధమవుతున్నది. పాము కాటు కేసులు భారత్‌లో సంవత్సరానికి సగటున 58 వేల మరణాలకు కారణమవుతున్నది. దేశంలో రుతుపవనాల రాకతో పాము కాటు కేసుల సంఖ్య పెరుగుతుందని ఐసీఎంఆర్ అంచనా వేస్తున్నది. ఈ విషయంలో వైద్యాధికారులు, ప్రజలతో పాటు ఆరోగ్య కేంద్రాల కోసం హిందీ, ఇంగ్లీష్, ఒడియా భాషలలో విద్యా సామాగ్రిని ఐసీఎంఆర్ విడుదల చేయబోతున్నది. ఆరోగ్య కార్యకర్తలకు సంబంధించిన విద్యా విషయాలు ఇతర ప్రాంతీయ భాషలలో, ముఖ్యంగా పాము కాటు కేసులు ఎక్కువగా ఉన్న రాష్ట్రాలలో ప్రచురించబడతాయి. ఆశా (గుర్తింపు పొందిన సామాజిక ఆరోగ్య కార్యకర్తలు) కార్మికులు, సహాయక నర్స్ మిడ్‌వైవ్‌లు (ఏఎన్‌ఎం), ఇతర ఆరోగ్య కార్యకర్తలకు పాము కాటును ముందుగానే గుర్తించడం, సమర్థవంతమైన ప్రథమ చికిత్స అందించడం, సమీప ఆరోగ్య సంరక్షణకు సకాలంలో రిఫరల్‌లు అందించడం వంటి వాటిపై చర్యలు తీసుకోనున్నది. ఐసీఎంఆర్ బుక్‌లెట్‌లో సాధారణంగా కనిపించే పాము జాతులు, పాము కాటు విషం యొక్క సంకేతాలు, లక్షణాల చిత్రమైన వర్ణనలు ఉన్నాయి. ఇది ప్రథమ చికిత్స, నివారణ చర్యలను కూడా వివరిస్తుంది.



వరద బాధిత కుటుంబాలకు సాయం

- ప్రకటించిన కేజ్రీవాల్

న్యూఢిల్లీ: ఉత్తరాదిన భారీ వరదలతో అతలాకుతలమైన ఢిల్లీ నగరం ఇప్పుడిప్పుడే సాధారణ స్థితికి చేరుకుంటోంది. యమునా నదివద్ద నీటి మట్టం స్థాయి కాస్త తగ్గుముఖం పడుతోంది. ఈ నేపథ్యంలో ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ కీలక ప్రకటన చేశారు. యమునా నది ఒడ్డున నివసించే చాలా పేద కుటుంబాలు ఈ వరదల కారణంగా నష్టపోవడంతో వారిని ఆదుకుంటామని తెలిపారు.కొన్ని కుటుంబాల్లో ఇంటి సామన్లు సైతం కొట్టుకుపోయాయి. వరద బాధిత కుటుంబాలన్నింటికీ రూ.10వేలు చొప్పున ఆర్థిక సాయం ప్రకటించారు. ఆధార్ కార్డు తదితర పత్రాలు కొట్టుకుపోయిన వారి కోసం ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తామన్నారు.

రివర్స్ గేర్...

- పేదలకు నామాలు... పెద్దలకు వరాలు
- కార్పొరేట్ శక్తులకు మోడీ ప్రభుత్వ దన్ను
- పన్నుల్లో కోతలు... రాయితీలు... ప్రోత్సాహకాలు
- మధ్య తరగతికి మొండిచెయ్యే



న్యూఢిల్లీ : అధిక లాభాలు ఆర్జించే బహుళజాతి కార్పొరేట్ కంపెనీల నుంచి వసూలు చేస్తున్న పన్నులను పెంచాలని జీ-20 దేశాల సమావేశంలో ప్రధాని నరేంద్ర మోడీ ప్రతిపాదించబోతున్నారు. చూడడానికి ఇది ఓ సానుకూల ప్రతిపాదన లాగా కన్పిస్తున్నప్పటికీ దీని వెనుక పరమార్థం వేరే ఉంది. వాస్తవానికి కార్పొరేట్ కంపెనీలకు వరాలు, రాయితీలు ప్రకటించి సామాన్యులపై అధిక పన్నుల భారం మోపి వారి నడ్డి విరవడమే మోడీ ప్రభుత్వ ఉద్దేశం. ఆ దిశగా ప్రభుత్వం ఇప్పటికే పలు చర్యలు చేపట్టింది కూడా.

బడా కార్పొరేట్ సంస్థలపై కనీసం పదిహేను శాతం పన్ను విధించాలని, అధిక లాభాలు ఆర్జించే సంస్థల నుంచి అదనంగా ఇరవై ఐదు శాతం పన్ను వసూలు చేయాలని ఆర్థిక సహకార, అభివృద్ధి సంస్థ (ఓఈసీడీ) ప్రతిపాదిస్తోంది. దీనికి మన దేశం మద్దతు తెలిపింది. దీనిపై జీ-20 దేశాల సమావేశంలో విస్తృతంగా చర్చిస్తారు. కంపెనీలు ఏ దేశంలో అయితే వ్యాపారాలు చేస్తున్నాయో అవి చెల్లించే పన్నులలో ఆ దేశాలకు చెప్పుకోదగిన వాటా



ఇవ్వాలని భారత్ కోరుతోంది.

మన దేశంలో ఏం జరుగుతోంది?

మన దేశంలో పేదల కడుపు కొట్టి పెద్దలకు దోచిపెట్టే విధానాన్ని ప్రభుత్వం అమలు చేస్తోంది. ఏ ప్రభుత్వమైనా సమాజంలోని సంపన్నులకే కొమ్ము కాస్తుంది. అయితే కేంద్రంలో నరేంద్ర మోడీ నేతృత్వంలోని బీజేపీ ప్రభుత్వం ఈ విధానాన్ని మరింత విశృంఖలంగా అనుసరిస్తోంది. దేశంలో శక్తివంతమైన కార్పొరేట్ శక్తుల ప్రయోజనాల రక్షణ కోసం చేయాల్సిందంతా చేస్తూనే ఉంది. ఉదాహరణకు పన్నుల విధానాన్నే తీసుకుందాం. కార్పొరేట్ సంస్థలపై అధిక పన్నులు విధించాలని ఓ వైపు జీ-20 దేశాలకు సుద్దులు చెబుతూనే మన దేశంలో దానికి పూర్తి భిన్నంగా వ్యవహరిస్తోంది. బడా కార్పొరేట్ కంపెనీలు దేశ ఆర్థికాభివృద్ధికి దోహదపడుతున్నాయని, ఉపాధి కల్పనకు చేయూత ఇస్తున్నాయని చెబుతూ వాటిపై పన్నులు తగ్గిస్తూ రాయితీలు అందిస్తోంది. అదే సమయంలో సామాన్యులపై ప్రత్యక్ష, పరోక్ష పన్నుల పేరుతో భారం మోపుతోంది. దేశంలోకి విదేశీ వస్తువుల ప్రవాహాన్ని ప్రోత్సహించేందుకు దిగుమతులపై విధించే కస్టమ్స్ సుంకాలను తగ్గిస్తోంది. దీనివల్ల దేశీయ పరిశ్రమలు ఆర్థికంగా దెబ్బ తింటున్నాయి. ముఖ్యంగా చిన్న, మధ్య తరహా పరిశ్రమలు కుదేలవుతున్నాయి.

సంపన్నులకే వరాలు

కార్పొరేట్ పన్ను రేట్లలో అసాధారణ కోత విధిస్తూ 2019లో ఆర్థిక మంత్రి ప్రకటన చేసిన తర్వాత కార్పొరేట్ పన్ను వసూళ్లు గణనీయంగా తగ్గిపోయాయి. పన్ను రేట్లు తగ్గించడంతో సరిపుచ్చుకుండా వివిధ రకాల రాయితీలు కూడా ప్రకటించారు. పన్ను రాయితీలు ఇస్తే కార్పొరేట్ పెట్టుబడులు పెరుగుతాయని, ఫలితంగా ఉద్యోగాల కల్పన ఊపందుకుంటుందని ప్రభుత్వం వాదిస్తోంది. అయితే అలాంటిదేమీ జరగలేదు. ఉద్యోగాలలో వృద్ధి కన్పించలేదు సరికదా కోవిడ్ కారణంగా పరిస్థితి మరింత దిగజారి, ఆర్థిక వ్యవస్థ బాగా దెబ్బతిన్నది. అదే సమయంలో కార్పొరేట్ రంగం మాత్రం మంచి ఫలితాలు సాధించడం విశేషం. 2020లో లిస్టెడ్ కంపెనీల లాభాలు ఇబ్బడిముబ్బడిగా పెరిగాయి. కార్పొరేట్ పన్ను రేట్ల తగ్గింపుతో లాభపడడంతో పాటు కరోనా సమయంలో వేతనాల ఖర్చు తగ్గించుకునేందుకు బడా కంపెనీలు ఉద్యోగులను ఇంటికి సాగనంపడంతో వాటి లాభాలు చెక్కుచెదరక పోగా మరింత పెరిగాయి.

గత కొంతకాలంగా రాయితీలు, రిబేట్లు, బ్యాంకు రుణాల రద్దు, రుణ ఎగవేతదారులకు జరిమానాల విషయంలో కంపెనీ చట్టంలో మినహాయింపులు వంటి వివిధ రూపాలలో కార్పొరేట్ రంగానికి అక్షరాలా ఆరు లక్షల కోట్ల రూపాయల మేర ప్రయోజనం చేకూర్చారు. వీటన్నింటికీ తోడు ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా కార్పొరేట్ కంపెనీలకు అమ్మేశారు. ఇటీవల ఎయిర్ ఇండియాను టాటా గ్రూప్‌కు విక్రయించిన వ్యవహారంలో రూ.46 వేల కోట్ల అప్పులను పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వం పైనే పడింది. టాటాలు మాత్రం కేవలం రూ.27,500 కోట్లు వెచ్చించి ఎయిర్ ఇండియాను సొంతం చేసుకున్నారు.

సంపన్నులకు రాయితీలు కల్పించే ఆర్థిక విధానం ఏ మాత్రం సమర్థనీయం కాదు. అది ప్రభుత్వ సంకుచిత ధోరణికి తార్కాణం. బడా కార్పొరేట్ శక్తులకు రాయితీలు అందిస్తే అది ఆర్థిక వ్యవస్థకు ఎంతమాత్రం ఊతమివ్వదు. ఎందుకంటే కొనుగోలు శక్తి పేదల చేతిలోనే ఉంటుంది తప్ప సంపన్నుల చేతిలో కాదు. కాబట్టి పేదలపై పెట్టే ఖర్చును పెంచి, సంపన్నులపై పన్నుల భారం మోపితే ఆర్థిక వ్యవస్థ బలపడుతుంది. అయితే మోడీ ప్రభుత్వం మాత్రం దీనికి వ్యతిరేక దిశలో సాగుతోంది. ఫలితం...దేశంలోని సామాన్య, మధ్యతరగతి ప్రజలు ఇబ్బందులు పడుతూనే ఉన్నారు.

సామాన్యులపై మోయలేని భారం

మోడీ ప్రభుత్వంలోని వివిధ మంత్రిత్వ శాఖలు వ్యయ నియంత్రణ చర్యలు చేపట్టాయి. పేదల సంక్షేమం కోసం ఖర్చు చేయాల్సిన మొత్తంలో కోత పెట్టి తద్వారా ఆదా చేసిన సొమ్మును కార్పొరేట్ సంస్థల పాలు చేస్తున్నాయి. డబ్బును ఆదా చేసే పేరుతో ఆహార ధాన్యాల పంపిణీ, వంటగ్యాస్ సబ్సిడీ వంటి విషయాలలో ప్రభుత్వం ఖర్చును తగ్గించుకుంటోంది. ప్రభుత్వ గిడ్డంగుల నిండా ఆహార ధాన్యాల నిల్వలు పేరుకుపోయి ఉన్నప్పటికీ వాటిని పేదలకు పంపిణీ చేసేందుకు ఇష్టపడడం లేదు. మరోవైపు పరోక్ష పన్నుల రూపంలో పెట్రో ఉత్పత్తుల ధరలను పెంచుతూ మధ్యతరగతి ప్రజలపై భారం మోపుతోంది. పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్‌పై ఎక్సైజ్ సుంకాన్ని పెంచి ఖజానాను నింపుకుంటోంది. ఈ సుంకాల ద్వారా 2014-15లో ప్రభుత్వానికి రూ.99 వేల కోట్ల ఆదాయం లభించగా అది 2020-21 నాటికి రూ.3.73 లక్షల కోట్లకు... అంటే ఏడు సంవత్సరాలలో దాదాపు 277శాతం పెరిగింది. ఫలితంగా పెట్రోల్ ధరలు 79శాతం, డీజిల్ ధరలు 101శాతం పెరిగాయి. వంటగ్యాస్ ధర గత సంవత్సర కాలంలోనే రూ.300 పెరిగింది. దీనిపై సబ్సిడీని ప్రభుత్వం 2019లోనే ఆపేసింది.

కార్పొరేట్ పన్నులలో కోత

మోడీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆదాయపన్ను వసూళ్లు 117శాతం పెరిగాయి. 2014-15లో రూ.2.6 లక్షల కోట్లుగా ఉన్న ఈ వసూళ్లు 2021-22 నాటికి రూ.5.6 లక్షల కోట్లకు చేరాయి. అయితే ఇదే కాలంలో కార్పొరేట్ సంస్థల నుంచి వసూలు చేసే పన్నులు రూ.4.3 లక్షల కోట్ల నుంచి రూ.5.5 లక్షల కోట్లకు...అంటే 28శాతం మాత్రమే పెరిగాయి. ఈ కాలంలోనే స్థూల పన్ను వసూళ్లు 78శాతం పెరిగాయి. వాస్తవానికి దేశంలో కస్టమ్స్ సుంకాల వసూళ్లు పడిపోతున్నాయి. ఈ సుంకాల ద్వారా 2014-15లో రూ.1.9 లక్షల కోట్ల ఆదాయం లభించగా అది 2021-22 నాటికి రూ.1.4 లక్షల కోట్లకు పడిపోయింది. అంటే 28శాతం తగ్గింది. 2016-17 నాటికి కస్టమ్స్ సుంకాల ద్వారా ఆదాయం రూ.2.3 లక్షల కోట్లకు చేరినప్పటికీ ఆ తర్వాత బాగా తగ్గిపోయింది. ఇవి కాకి లెక్కలు కావు. కేంద్ర బడ్జెట్ పత్రాల నుంచి సేకరించిన సమాచారమే. స్థూల పన్ను వసూళ్లలో కార్పొరేట్ పన్నుల వాటా 2014-15లో 34.5శాతం ఉంటే అది 2021-22 నాటికి 24.7శాతానికి పడిపోయింది. కస్టమ్స్ ఆదాయం మరింత దారుణంగా తగ్గింది. ఇదే కాలంలో ఈ ఆదాయం 15శాతం నుంచి 6శాతానికి తగ్గిపోయింది. కానీ ఆదాయపన్ను వసూళ్లు మాత్రం 20.8శాతం నుంచి 25.3శాతంకి పెరగడం గమనార్హం.

కార్పొరేట్ పన్ను అంటే...



1961వ సంవత్సరపు ఆదాయపన్ను చట్టం ప్రకారం దేశీయ, విదేశీ కంపెనీలపై కార్పొరేట్ పన్ను విధిస్తున్నారు. దేశీయ కంపెనీలు ఆర్జించే ఆదాయాన్ని బట్టి పన్ను వసూలు చేస్తారు. అదే విదేశీ కంపెనీలు అయితే భారత్‌లో అవి పొందిన ఆదాయం పైన మాత్రమే పన్ను వేస్తారు. కంపెనీ సంపాదించే నికర ఆదాయాన్ని బట్టి కార్పొరేట్ పన్ను విధిస్తారు. ప్రస్తుతం దేశీయ కంపెనీలపై 30శాతం పన్ను విధిస్తున్నారు. అయితే నికర ఆదాయం కోటి నుంచి పది కోట్ల రూపాయల వరకూ ఉంటే అదనంగా 7శాతం సర్‌చార్జీ వసూలు చేస్తారు. అదే నికర ఆదాయం పది కోట్ల రూపాయలు దాటితే 12శాతం సర్‌చార్జీ చెల్లించాల్సి ఉంటుంది. విదేశీ కంపెనీలకు సంబంధించి అవి ముందుగా నిర్ణయించిన కాలపరిమితిలో పొందే ఆదాయంపై కార్పొరేట్ ఆదాయపన్ను విధిస్తారు. రాయల్టీలు, ఫీజులపై వసూలు చేసే కార్పొరేట్ పన్ను రేటు 50శాతం కాగా ఇతర ఆదాయాలపై వసూలు చేసే పన్ను 40శాతంగా ఉంటోంది. విదేశీ కంపెనీల నికర ఆదాయం కోటి నుంచి పది కోట్ల రూపాయలు ఉంటే 2శాతం, ఆ మొత్తం దాటితే 5శాతం సర్‌చార్జీ వసూలు చేస్తారు.

ధరల నియంత్రణలో కేంద్రం విఫలం

(మొదటిపేజీ తరువాయి)

ప్రారంభమైన సీపీఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర కమిటీ సమావేశాలు ఆదివారం ముగిసాయి. ఈ సందర్భంగా బీవీ రాఘవులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ లెక్కల ప్రకారమే ద్రవ్యోల్బణం 4.8 శాతానికి చేరిందన్నారు. కూరగాయలు, తృణధాన్యాలు, పప్పులు, పాలు, పండ్ల ధరలు విపరీతంగా పెరిగాయనీ, టమాటా ధర రూ.150కి చేరిందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ వైఫల్యాలకి టమాటా ధరే ప్రత్యక్ష ఉదాహరణ అని చెప్పారు. ధరల స్థిరీకరణ కోసం అన్ని రాష్ట్రాలకు డబ్బు కేటాయించి, సబ్సిడీపై నిత్యవసర వస్తువులు సరఫరా చేయాలని సూచించారు. టోకు వ్యాపారులకు కనక వర్షం కురిపించడం కోసమే మోడీ సర్కారు ధరల నియంత్రణ చర్యలు చేపట్టట్లేదని విమర్శించారు.

ఎన్నికల్లో లబ్దిపొందేందుకే ఉమ్మడి పౌరస్మృతి..

తన పాలనా వైఫల్యాలను కప్పిపుచ్చుకొనేందుకు, వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో లబ్ది పొందే ఉద్దేశ్యంతోనే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం లా కమిషన్ ముందు పెట్టిన ఉమ్మడి పౌరస్మృతి(యూసీసీ) అంశంపై చర్చను లేవదీసిందని విశ్లేషించారు. దీనికి ప్రధాని నరేంద్రమోడీనే స్వయంగా సారధ్యం వహిస్తున్నారని తెలిపారు. ఈ చర్యను సమర్థించుకొనేలా బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్, సంఘ్‌పరివార్ దుర్మార్గమైన ప్రచారాన్ని ప్రజల్లోకి తీసుకెళ్తున్నాయనీ, వాటికి ప్రజాక్షేత్రంలోనే అడ్డుకట్ట వేయాల్సి ఉందని స్పష్టం చేశారు. యూసీసీపై ఇప్పటి వరకు కేంద్రం ఒక నివేదికను రూపొందించి చర్చకు పెట్టలేదనీ, కేవలం ఊహాగానాలతో ప్రజల మధ్య చర్చను జరుపుతున్నదని అభ్యంతరం వ్యక్తం చేశారు. కేవలం మెజార్టీ మతస్తుల ఓట్లను రాబట్టుకోవాలనేదే బీజేపీ తాపత్రయమని విశ్లేషించారు.

మణిపూర్‌లో మంటలు రాజేసింది సంఘ్‌పరివారమే..

మణిపూర్‌లో ప్రజల మధ్య వైషమ్యాలు సృష్టించి, విధ్వంసాన్ని సృష్టించడంలో సంఘ్‌పరివార్ పాత్ర ప్రధానమైందని విమర్శించారు. అక్కడి మైటీ, కుకీ తెగల మధ్య మతం ప్రాతిపదికన విద్వేష బీజాలను సంఘ్‌పరివార్ శక్తులు చాలా కాలం నుంచి నాటుతున్నా యని తెలిపారు. ఆ రాష్ట్రంలో అధికారం లోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం రిజర్వేషన్ సమస్యను సక్ర మంగా పరిష్కరిం చకుండా, వివాద స్పదం చేసి, ఘర్షణ వాతా వరణం తలెత్తటానికి కారణ మైందని వివరించారు. మణి పూర్‌లో హింసాకాండను అరికట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్రంగా విఫలమయ్యాయన్నారు. తీవ్రంగా ప్రాణ, ఆస్తి నష్టాలు జరుగుతున్నా ప్రధాని నరేంద్ర మోడీ చూసీ చూడనట్టు మౌనంగా ఉండటాన్ని ఆయన తప్పుపట్టారు. ఇది పాలనా సమర్థత ఎంతమాత్రం కాదని తేల్చిచెప్పారు. ఈ పరిణామాల దుష్ప్రభావం భవిష్యత్‌లో ఈశాన్య రాష్ట్రాలపై పడే అవకాశం ఉందని అన్నారు.

బీజేపీ ప్రమాదాన్ని తక్కువగా చూడొద్దు..
తెలంగాణలో కర్ణాటక ఎన్నికల ఫలితాల తర్వాత పట్టు సంపాదించాలని బీజేపీ శతవిధాల ప్రయత్నం చేస్తున్నదన్నారు. ఇతర పార్టీల నుంచి ఫిరాయింపులను రాబట్టి బలపడాలని చేసిన ప్రయత్నాలు బెడిసికొట్టాయన్నారు. క్షేత్ర స్థాయిలో బీజేపీ ప్రమాదాన్ని తక్కువ అంచనా వేయొద్దని చెప్పారు. సైద్ధాంతికంగా రాజకీయంగా ఎన్నికల రంగంలోనూ బీజేపీ, సంఘ్‌పరివారాన్ని నిరంతరం ఎదుర్కోవాల్సిందేనని తేల్చిచెప్పారు.

వైషమ్యాలు సృష్టించి..

దేశంలో ఎక్కడోదగ్గర వైషమ్యాలు సృష్టించి, ప్రజల దృష్టిని మళ్లించి, దొడ్డితోవన విద్యుత్ చార్జీలు పెంచడం, మోటార్లకు మీటర్లు బిగించడం, కరెంటుకు పగలు ఒక చార్జి, రాత్రి మరొక చార్జి అంటూ సంస్కరణల పేరుతో దోపిడీకి పాల్పడుతున్నారని విమర్శించారు. పట్టణ సంస్కరణల పేరుతో రాష్ట్రాల్లో నీరు, చెత్త, మురుగుపారుదల వంటి వాటిపై యూజర్ చార్జీలు వసూలు చేస్తున్నారని తెలిపారు. ఆస్తి పన్ను పెంచేందుకు బిల్డింగ్ రూల్స్, భూ వినియోగ నిబంధనలను నిర్మాణ కంపెనీలకు అనుకూలంగా మారుస్తున్నారనీ, మురికి వాడల అభివృద్ధి పేరుతో బిల్డర్స్‌కు భూమిలో వాటా కల్పించాలనే షరతులు విధిస్తున్నారని చెప్పారు. ఈ నిబంధ నలకు అంగీకరించక పోతే కేంద్రం నుంచి నిధులు ఇవ్వబోమని షరతులు విధిస్తు న్నారని వివరించారు. సరళీకరణ విధానా లను రాష్ట్రాల మీద రుద్దడంలో బీజేపీ ప్రభుత్వం ప్రయివేటు సంస్థలను ఆయా రంగాల్లోకి ప్రవేశ పెట్టాలనే దురుద్దేశ్యం ఇమిడి ఉందన్నారు. ఇది ప్రజా స్వామ్యం, ఫెడరలిజం, సామాజిక న్యాయానికి హానీ కలిగించే తప్పుడు విధానాలని స్పష్టం చేశారు.

బీజేపీని ఓడించటమే సీపీఐ(ఎం) లక్ష్యం

రాబోయే ఎన్నికల్లో బీజేపీని ఓడించటం సీపీఐ(ఎం) ముఖ్యమైన కర్తవ్యంగా నిర్దేశించుకుందని తెలిపారు. దానికోసం భావసారూప్యత కల్గిన రాజకీయ శక్తులను సమీకరించటానికి కృషి చేస్తున్నామన్నారు. ఆయా రాష్ట్రాల్లోని వైవిధ్య పరిస్థితులను బట్టి, రాజకీయ విధానాన్ని నిర్ణయించుకుంటామన్నారు. బీజేపీని ఓడించటం కోసం కేంద్ర స్థాయిలో ఒక కూటమి ఏర్పడాలనేది కొందరి ఆకాంక్ష అనీ, అది మంచిదే అయినా ఆయా రాష్ట్రాల్లోని వైవిధ్య పరిస్థితుల రీత్యా సాధ్యం కాదనేది తమపార్టీ అంచనా అని తెలిపారు. అందుకే బీజేపీ లబ్దిపొందకుండా ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రంలో ప్రతిపక్ష రాజకీయ శక్తులు కలిసి పనిచేయాలని తాము భావిస్తున్నామని వివరించారు. ఇటీవల పాట్నాలో బీహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ నేతృత్వంలో ఏర్పడిన రాజకీయ కూటమి సమావేశాల్లో ప్రతిపక్ష పార్టీలు తమ మధ్య విబేధాలను వదిలి బీజేపీని ఓడించడమే లక్ష్యంగా పనిచేయాలనే ఆకాంక్షను వ్యక్తం చేశాయన్నారు. రాజకీయంగా బీజేపీని ఓడించగలమనే విశ్వాసానికి ఇదో ముందడుగు అని విశ్లేషించారు.

ఇంటర్నెట్ లేక 73 రోజులు

- 20 వరకు నిషేధం పొడిగించిన మణిపూర్ ప్రభుత్వం
- పలు సంస్థలు, ఉద్యోగులు, విద్యార్థులు, ప్రజలకు ఇక్కట్లు

ఇంఫాల్ : జాతి హింసతో అల్లర్లు చెలరేగిన ఈశాన్య రాష్ట్రం మణిపూర్‌లో గత 73 రోజులుగా ఇంటర్నెట్ లేదు. అక్కడి బీజేపీ ప్రభుత్వం ఇంటర్నెట్ బ్యాన్‌ను విధించింది. అయితే ఈ నిషేధాన్ని అక్కడి సర్కారు మరో ఐదు రోజులు పొడిగించింది. దీంతో ఇంటర్నెట్ బ్యాన్ రాష్ట్రంలో ఈనెల 20 వరకు కొనసాగనున్నది. హింసాత్మక ఘటనలు, దాడులు, ఇండ్లకు నిప్పు పెడుతున్న ఘటనలు ఇప్పటికీ కొనసాగుతున్నాయని రాష్ట్ర డీజీపీ సమర్పించిన నివేదికలో వెల్లడైందని ఈనెల 15న జారీ చేసిన నోటిఫికేషన్‌లో రాష్ట్ర హోం శాఖ కమిషనర్ టి. రంజిత్ సింగ్ వివరించారు. ఇంటర్నెట్ లేకపోవటంతో అక్కడి సంస్థలతో పాటు ఉద్యోగులు, విద్యార్థులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. రాష్ట్రంలో ఇంటర్నెట్ సదుపాయాన్ని పునరుద్ధరించాలని అనేక సంస్థలు, ప్రజలు మణిపూర్ హైకోర్టుతో పాటు దేశ సర్వోన్నత న్యాయస్థానాన్ని సైతం ఆశ్రయించారు.

హైకోర్టు ఆదేశాలను సవాలు చేస్తూ సుప్రీం కోర్టుకు రాష్ట్ర ప్రభుత్వం

కొన్ని ప్రాంతాల్లో పరిమిత ఇంటర్నెట్‌కు అను మతినిస్తూ గత నెల 16న మణిపూర్ హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. అలాగే, దాదాపు నెల తర్వాత ఈనెల 7న ఇంటర్నెట్ కనెక్షన్లపై నిషేధాన్ని ఎత్తివేయాలంటూ మరోసారి రాష్ట్ర ప్రభుత్వాన్ని మణిపూర్ హైకోర్టు ఆదేశించింది. అయితే, హైకోర్టు ఆదేశాలను రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాలు చేసింది. పిటిషన్ విచారణకు భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) డి.వై చంద్రచూడ్, న్యాయమూర్తి జస్టిస్ పి.ఎస్. నరసింహ లతో కూడిన ధర్మాసనం అంగీకరించింది. నేడు (సోమవారం) ఈ పిటిషన్‌ను న్యాయస్థానం విచారించనున్నది.

బోనమెత్తిన భాగ్యనగరం

(మొదటిపేజీ తరువాయి)



డాక్టర్ కె.లక్ష్మణ్. ఎమ్మెల్సీ వాణిదేవి. ఎమ్మెల్యే దానం నాగేందర్, హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, భారత మాజీ క్రికెటర్ మిథాలీ రాజ్, డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి, బడంగ్‌పేట్ మేయర్ చిగురింత పారిజాత నర్సింహారెడ్డి, తదితరులు ఉన్నారు. కాగా, క్యాసినోలు నిర్వహిస్తూ గతంలో పోలీసులకు చిక్కిన చీకోటి ప్రవీణ్‌కుమార్.. లాల్‌దర్వాజ అమ్మవారిని దర్శించుకునే క్రమంలో భద్రతా సిబ్బంది గన్‌తో ఆలయంలోకి వెళ్లేందుకు ప్రయత్నించగా వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కాగా, బోనాల ఉత్సవాల్లో నృత్యం చేసుకుంటూ ఒక్కసారిగా బోనాలతో ఆలయానికి వచ్చిన సందర్శకులను అదుపుచేసేందుకు వారిపై పోలీసులు లాఠీచార్జి చేశారు. ఇరువురి మధ్య తోపులాట జరిగింది. కొందరికి తీవ్రగాయాలయ్యాయి. దాంతో పోలీసుల వ్యవహార శైలిపై సందర్శకులు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు.

దేశంలో 44శాతం మంది ఎమ్మెల్యేలు నేర చరితులే!

(మొదటిపేజీ తరువాయి)

ప్రకటించారు. వంద కోట్ల రూపాయల కంటే ఎక్కువ ఆస్తులున్న ఎమ్మెల్యేలలో కాంగ్రెస్‌కు చెందిన వారు 33 మంది, బీజేపీకి చెందిన వారు 24 మంది, వైసీపీకి చెందిన వారు 8 మంది ఉన్నారు. దేశంలోని ఎమ్మెల్యేలలో కేవలం 9% మంది (378) మాత్రమే మహిళలు. ఉత్తరప్రదేశ్‌లో అత్యధికంగా 48 మంది మహిళా ఎమ్మెల్యేలు ఉండగా పశ్చిమ బెంగాల్‌లో 41 మంది, బీహార్‌లో 18 మంది ఉన్నారు. మిజోరంలోని మొత్తం 40 మంది శాసనసభ్యులూ పురుషులే.

దిగ్విజయంగా కాశ్మీర్ యాపిల్ రైతుల తొలి రాష్ట్ర మహాసభ

షోపియాన్‌లో రెండు రోజుల పాటు నిర్వహణ



శ్రీనగర్ : యాపిల్ రైతుల సమస్యలపై జాతీయస్థాయి ఉద్యమాలను నిర్మించడంలో కీలక పాత్ర పోషిస్తున్న యాపిల్ ఫార్మర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియాకు చెందిన జమ్ముకాశ్మీర్ విభాగం (జెఅండ్‌కె ఎఎఫ్‌ఎఫ్‌ఐ) మొట్టమొదటి రాష్ట్ర మహాసభ దిగ్విజయంగా జరిగింది. షోపియాన్‌లో శని, ఆదివారాల్లో నిర్వహించిన ఈ మహాసభకు జమ్ము ప్రాంతం నుంచి, కాశ్మీర్ లోయ నుంచి పెద్ద సంఖ్యలో యాపిల్ రైతులు హాజరయ్యారు. ఈ సమావేశానికి రెండు ప్రత్యేకతలు ఉన్నాయి. ఇందులో మొదటిది జమ్ముకాశ్మీర్ ప్రాంతానికి చెందిన యాపిల్ రైతులు ఈ విధంగా సమావేశమవ్వడం ఇదే మొదటిసారి. అలాగే కల్లోల ప్రాంతంగా గుర్తింపు పొందిన షోపియాన్ జిల్లాలో మహాసభ జరగడం రెండో ప్రత్యేకత. మహాసభకు 165 మంది ప్రతినిధులు హాజరయ్యారు.

అఖిల భారత కిసాన్ సభ (ఎఐకెఎస్) ఆర్థిక కార్యదర్శి పి కృష్ణప్రసాద్, గుప్కార్ కూటమి అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే మహ్మద్ యూసఫ్ తరిగామి మహాసభకు హాజరై సంఘీభావం తెలిపారు. తగ్గుతున్న ధరలు, ప్రభుత్వ మద్దతు లేకపోవడం వంటివి యాపిల్ ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేసే అంశాలపై నివేదికను జహూర్ అహ్మద్ రాథర్ సమర్పించారు. అలాగే 14 డిమాండ్లను కూడా ప్రతినిధులు ఏకగ్రీవంగా ఆమోదించారు.

అధ్యక్షకార్యదర్శులుగా జహూర్, రషీద్

మహాసభ 11 సభ్యులతో రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు. జహూర్ అహ్మద్‌ను అధ్యక్షులుగానూ, అబ్దుల్ రషీద్‌ను కార్యదర్శిగానూ ఎన్నుకున్నారు. ఎఐకెఎస్ అధ్యక్షులు అశోక్ ధవే ప్రసంగంతో తొలి రోజు సమావేశం ముగిసింది. రెండో రోజున ఈ నెల 16న షోపియాన్‌లో భారీ బహిరంగ సభను నిర్వహించారు. ఆకస్మిక భారీ వర్షాలను, భద్రతా సమస్యలను దాటుకుంటూ భారీ సంఖ్యలో యాపిల్ రైతులు ఈ సమావేశానికి హాజరయ్యారు. అశోక్ ధవాలే, పి కృష్ణప్రసాద్, జహూర్ అహ్మద్, గులాం నబీ మాలిక్, అద్దుల్ రషీద్ పండిట్, ఓం ప్రకాశ్ ప్రసంగించారు. మహాసభ ముగింపు సందర్భంగా నిర్వహించిన సభలో తరిగామి ప్రసంగించారు. యాపిల్ రైతుల పోరాటాలకు గుప్కార్ కూటమి అండగా నిలుస్తుందని తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం : కార్పొరేటర్



నవతెలంగాణ- బడంగ్ పేట్

సీఎంఆర్ఎఫ్ పేదలకు ఓ వరం అని 12వ డివిజన్ కార్పొరేటర్ యాతం పవన్ యాదవ్ అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న మామిడిపల్లి గ్రామానికి చెందిన ఈశ్వరయ్యకు రూ.60వేల చెక్కు మంజూరైంది. ఆ మేరకు ఆదివారం విద్యా శాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి ఆదేశానుసారం కార్పొరేటర్ ఆ చెక్కును ఈశ్వరయ్యకు అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ సీఎం 'అర్హులు సీఎం రిలీఫ్ ఫండ్‌ను వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బాలాజీ టెంపుల్ మాజీ చైర్మన్ బండారి గోపాల్ యాదవ్, నాయకులు అశోక్ ముదిరాజ్, నందీశ్వర్, బాబు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం పట్టివేత



నవతెలంగాణ-అబ్దుల్లాపూర్ మెట్

అక్రమ మద్యాన్ని విక్రయిస్తున్న ఓ వ్యక్తిని అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. సీఐ మన్మోహన్ తెలిపిన వివరాల ప్రకారం.. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, బాటసింగారం గ్రామపంచాయతీ పరిధిలోని కొత్తగూడెంలో బైరు ప్రభాకర్ అనే వ్యక్తి అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో..తనిఖీ చేశారు. దీంట్లో మూడు రాయల్ స్టాగ్ విస్కీ బాటిల్స్(180 ఎం ఎల్), 27 ఆఫీసర్ ఛాయిస్ విస్కీ బాటిల్స్(90 ఎం.ఎల్), 7 ఆఫీసర్ ఛాయిస్ విస్కీ బాటిల్స్ (180 ఎం ఎల్), 7 మాన్సన్ హౌస్ బ్రాందీ బాటిల్స్ (180 ఎంఎల్), 6 ఇంపీరియల్ బ్లూ విస్కీ బాటిల్ (180 ఎంఎల్), 7 డైమండ్ ఫైన్ విస్కీ (180 ఎం ఎల్), 12 హయ్ వాట్స్ 5,000 బీర్ బాటిల్స్, 6 కింగ్ ఫిషర్ ప్రీమియం బీర్ బాటిళ్లను స్వాధీనం చేసుకొని సీజ్ చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం : ఉప్పల శ్రీనివాసగుప్త



నవతెలంగాణ- నాగోల్

క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక ధారుడ్యానికి ఎంతో ఉపయోగపడతాయని రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్, అంతర్జాతీయ వైశ్య సామాఖ్య ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస గుప్త అన్నారు. నాగోలు డివిజన్‌లోని బండ్లగూడలో ఉన్న వి-స్పోర్ట్స్ అకాడమీలో ఆదివారం జరిగిన అంతర్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సీఎం కేసీఆర్ నాయక త్వంలో బీఆర్ఎస్ ప్రభుత్వం క్రీడా మైదానాల నిర్మాణా లను చేపడుతూ క్రీడాకార్లను ప్రోత్సహిస్తోందని తెలిపారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయి క్రీడాకారులను స్ఫూర్తిగా తీసుకొని.. క్రీడల్లో రాణిస్తూ దేశానికి, రాష్ట్రానికి మంచి పేరు తీసుకొని రావాలని సూచించారు. అనంతరం టోర్న మెంటులో విజేతలై ప్రథమ స్థానంలో ఉన్న గోపి, వేద వ్యాసు, ద్వితీయ స్థానంలో అనిల్ కుమార్, వికాస్, తృతీయ స్థానంలో నిలిచిన భువన్, యశ్వంతులకు శ్రీనివాసగుప్త బహుమతులను అందజేశారు. ఈ కార్య క్రమంలో ప్రశాంత్, రవి, శ్రీకాంత్, వినోద్‌లు పాల్గొన్నారు.

బడంగ్‌పేట్‌ను ఆదర్శ మున్సిపల్‌గా తీర్చిదిద్దుతా

- మంత్రి సబితా ఇంద్రారెడ్డి



నవతెలంగాణ- బడంగ్ పేట్

సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌ల సహకారంతో కోట్లాది రూపాయల ప్రత్యేక నిధులతో బడంగ్ పేట్‌ను ఆదర్శ మున్సిపల్ కార్పొరేషన్ గా తీర్చి దిద్దటానికి కృషి చేస్తున్నట్లు రాష్ట్ర విద్యా శాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం బడంగ్ పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న గుర్రంగూడ, బడంగ్‌పేట్‌లోని పలు డివిజన్లలో రూ.4 కోట్ల 26 లక్షల నిధులతో ఆదివారం పలు అభివృద్ధి కార్యక్రమాలకు మేయర్ పారిజాత నర్సింహా రెడ్డితో కలిసి మంత్రి సబితా ఇంద్రారెడ్డి శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ 7వ డివిజన్‌లోని టీచర్స్ కాలనీలో రూ.31 లక్షల రూపాయలతో పైప్ లైన్ పనులకు, రూ.1.50 లక్షలతో సీసీ, బీటీ రోడ్ల, 6వ డివిజన్ లోని వినాయక నగర్ కాలనీలో రూ.10 లక్షలతో పైప్ లైన్ నిర్మాణ పనులకు, శ్రీ కృష్ణ నగర్ కాలనీలో రూ.10 లక్షలతో ఎస్ డబ్ల్యూ పైప్ లైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేసినట్లు వివరించారు.

అదేవిధంగా 28వ డివిజన్‌లో రూ.1.50 లక్షలతో సిరిపురం యాదయ్య స్మారక క్రీడా మైదానం, రూ.30 లక్షలతో డివిజన్ 18, 19, 20, 32ల నందు వీధి దీపాలను, రూ.45 లక్షలతో డివిజన్ 1, 2, 3, 21, 22, 32 నందు వీధి దీపాలను ప్రారంభించినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం సీఎం కేసీఆర్ నాయకత్వంలో మహేశ్వరం నియోజకవర్గ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలలో కోట్లాది రూపాయలతో అనేక అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ ఇబ్రహీం శేఖర్, దీఈఈలు అశోక్ రెడ్డి, జ్యోతి, కార్పొరేటర్లు సూర్లగంటి అర్జున్, గడ్డం లక్ష్మారెడ్డి, దడిగ శంకర్, సంరెడ్డి స్వప్న వెంకట్ రెడ్డి, ఏనుగు రాంరెడ్డి, పెద్దబావి ఆనంద్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, స్వప్న జంగారెడ్డి, అర్.సంతోషి శ్రీనివాస్ రెడ్డి, వై.పవన్ యాదవ్, కో ఆప్షన్ సభ్యులు సమైక్య జ్యోతి అశోక్, జే.శ్రీనివాస్, మాజీ కౌన్సిలర్లు సాయి కిరణ్ రెడ్డి, దండు గణేష్, జే.విష్ణువర్ధన్ రెడ్డి, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మద్యం విక్రయిస్తున్న ముగ్గురు అరెస్టు



నవతెలంగాణ-వనస్థలిపురం

కిరాణ షాప్‌లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ముగ్గురు నిందితుల్ని పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘటన వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. వనస్థలిపురం సీఐ జలంధర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం...సాహెబ్ నగర్‌కు చెందిన చిల్లు మూల రాజు, నిరసన మెట్ల అరవింద, కమ్మగూగకు చెందిన కుర్ర పద్మలు తమ కిరణా షాప్‌లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారని విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో వెంటనే పోలీసులు మెరుపు దాడి చేసి ఆ ముగ్గురి నిందితులను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 410 విస్కీ సీసాలు,15 బీరు బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ జలంధర్ రెడ్డి తెలిపారు.

'సమాజసేవలో ముందు ఉండాలి'

నవతెలంగాణ -సంతోష్ నగర్

పీస్ కమిటీ సభ్యులందరూ సమాజ సేవలో ముందు ఉండాలని అడ్వకేట్ కిషన్ శర్మ అన్నారు. యాకుత్‌పూర నియోజకవర్గం సంతోష్ నగర్ డివిజన్ పరిధిలోని మీథాని బస్ డిపో ఎదురుగా ఎం.కె కన్వెన్షన్ హాల్లో ఆదివారం ఏర్పాటు చేసిన సెంట్రల్ పీస్ అండ్ వెల్ ఫర్ కమిటీ హైదరాబాద్ సౌత్ ఈస్ట్ జోన్ కమిటీ సభ్యుల పరిచయాల సమావేశానికి అడ్వకేట్ కిషన్ శర్మ, ఆల్ జూన్ ఆల్ జోన్స్ జనరల్ సెక్రెటరీ ఖాజా షుజవుద్దీన్‌లు ముఖ్య అతిథులుగా



హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొహరం, వినాయక చవితి ఉత్సవాలకు పీస్ కమిటీ సభ్యుల సహకారం ఎంతో అవసరమన్నారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీస్ కమిటీ సభ్యులు, తేజు, సంతోష్ నగర్, మాదన్నపేట్ సౌత్ ఈస్ట్ జోన్ పీస్ కమిటీ ఆర్గనైజేషన్ సెక్రటరీ గోవింద్ సాగర్, సంతోష్ నగర్ మైనార్టీ బీఆర్ఎస్ అధ్యక్షులు సలీం కాజా, పీస్ కమిటీ సభ్యులు, తెలంగాణ రాష్ట్ర మీడియా ఇంచార్జి జర్నలిస్టు సింగ్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో రాజీ పడే ప్రసక్తే లేదు

- ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి



నవతెలంగాణ-తుర్కయాంజల్

అభివృద్ధి పనులలో రాజీ పడే ప్రసక్తే లేదని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి అన్నారు. తుర్కయాంజల్ నుండి మహేశ్వరం నియోజకవర్గంలోని నాదర్‌గుల్ వరకు రూ.16 కోట్ల నిధులతో చేపట్టిన బీటీ రోడ్డు విస్తరణ పనులకు ఆదివారం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్, విద్యుత్, నేషనల్ హైవే అథార్టీ అధికారులు సమన్వయంతో పనులు పూర్తి చేయాలని సూచించారు. పనులలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ వైస్ చైర్మన్ కొరాకూర్మ సత్తయ్య, జిల్లా రైతు బంధు అధ్యక్షుడు వంగేటి లక్ష్మారెడ్డి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కళ్యాణ్ నాయక్, కౌన్సిలర్లు కీర్తన విజయానంద రెడ్డి, వేముల స్వాతి అమరేందర్ రెడ్డి, గుండ భాగ్యమ్మ ధనరాజ్, బొక్క రవిందర్ రెడ్డి, కొండ్రు మల్లేష్, కో ఆప్షన్ సభ్యులు పోరెడ్డి నర్సింహ రెడ్డి, మాజీ సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

సీవైఆర్ కాలనీలో ఘనంగా చండీయాగం



నవతెలంగాణ-బడంగ్ పేట్

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి అల్మాస్‌గూడలోని సీవైఆర్ కాలనీలో ఉన్న శ్రీ కృష్ణ దేవాలయంలో సీవైఆర్ కాలనీ అధ్యక్షులు దగ్గుల కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం చండీయాగాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దేవాలయ అర్చకులు భక్తి శ్రద్ధలతో వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు సరేందర్ రెడ్డి, కృష్ణమూర్తి, నాయకులు కృష్ణా రెడ్డి ,దంతేశ్వరి, వెంకటేశ్వర్లు గౌడ్, రంగ మోహన్, జగాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చైతన్యపురి డీఐగా నాగరాజు గౌడ్



నవ తెలంగాణ - చైతన్యపురి

చైతన్యపురి పోలీస్ స్టేషన్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌గా (డీఐ) నాగరాజ్ గౌడ్ ఆదివారం బాధ్యతలు తీసుకున్నారు. 2009 బ్యాచ్ కు చెందిన నాగరాజు గౌడ్ జవహర్ నగర్ పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐగా విధులు నిర్వహించేవారు. ప్రమోషన్‌లో భాగంగా డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్‌గా చైతన్యపురి పోలీస్ స్టేషన్ కు బదిలీ అయ్యారు.

సంస్కృతికి ప్రతీక బోనాలు



నవతెలంగాణ- చైతన్యపురి



ఆర్కేపురం డివిజన్ పరిధిలోని ఖిల్లా మైసమ్మ దేవాలయంలో ఆదివారం జరిగిన బోనాల ఉత్సవాల్లో విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి పాల్గొని అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. తర్వాత ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ దయనంద్ గుప్తా, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ శ్రీధర్, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి అరవింద్ శర్మ, డివిజన్ అధ్యక్షుడు పెండ్యాల నగేష్, నేలకొండ శ్రీనివాస్ రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ గౌడుగు శ్రీనివాస్ ముదిరాజ్, డివిజన్ యూత్ వింగ్ మాజీ అధ్యక్షుడు శ్యామ్ గుప్తా, నియోజకవర్గ మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ పటేల్ సునీత రెడ్డి, మారం సుజాత, స్వప్న రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వనస్థలిపురం :



బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని సాయి గార్డెన్స్ కట్ట మైసమ్మ అమ్మవారి ఆలయంలో ఆదివారం బోనాల పండుగ ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ ఉత్సవాలలో ఆలయ అధ్యక్షులు బొమ్మిడి రంగారెడ్డి, సుమన్ గౌడ్, జంగారెడ్డి, పార్టీ డివిజన్ ప్రధాన కార్యదర్శి ముదుపు సందీప్ రెడ్డి, ఉపాధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి, నాయకులు శ్రావణ్ రెడ్డి, దుర్గ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వనస్థలిపురం :



ఎల్బీనగర్ నియోజకవర్గ పరిధిలోని వనస థలిపురం డివిజన్ నందు ఆదివారం నిర్వహించిన బోనాల వేడుకల్లో ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జిట్టా రాజశేఖర్ రెడ్డి, డివిజన్ అధ్యక్షులు చింతల రవికుమార్ గుప్తా, సీనియర్ నాయకులు కుంట్లూరు వెంకటేష్ గౌడ్, లగ్గోని శ్రీధర్ గౌడ్, ఆనంద్ రాజ్ స్థానిక నాయకులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

వనస్థలిపురం :

బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని టీచర్స్ కాలనీలో ఉన్న పోచమ్మ తల్లి ఆలయంలో ఆదివారం నిర్వహించిన బోనాల పండుగ ఉత్సవాలకు కార్పొరేటర్ మొద్దు లచ్చి రెడ్డి హాజరయ్యారు. ఈ



కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు భూపాల్ రెడ్డి, సంజీవ యాదవ్, పార్టీ రంగారెడ్డి అర్బన్ జిల్లా కార్యవర్గ సభ్యులు నరసింహారెడ్డి, డివిజన్ ప్రధాన కార్యదర్శి ముదుపు సందీప్ రెడ్డి, ఉపాధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి, నాయకులు శ్రావణ్ రెడ్డి, దుర్గ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సంతోష్ నగర్ :



చంపాపేట నల్ల పోచమ్మ, ఎర్ర పోచమ్మ అమ్మవారి దేవాలయంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన బోనాల ఉత్సవాలకు ఎల్బీనగర్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జి ముద్దగౌని రామ్మోహన్ గౌడ్, చంపాపేట మాజీ కార్పొరేటర్ సామ రమణా రెడ్డిలు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు దాసరి కృష్ణా రెడ్డి, మెట్టు వెంకట రెడ్డి, రంగా రెడ్డి, ప్రవీణ్ గౌడ్, శ్రీకాంత్ రెడ్డి, సతీష్, రాము లక్ష్మణ్, హుస్సేన్ యాదవ్, బాబు, గుమ్మడివెల్లి సాయి కిరణ్, విశాల్, పాండు, యాదగిరి, చింటు తదితరులు పాల్గొన్నారు.

సంతోష్ నగర్ :

ఎల్బీనగర్ నియోజకవర్గం చంపాపేట్ డివిజన్ దుర్గా భవాని నగర్ కాలనీలో అమ్మవారి ఆలయంలో ఆదివారం ఏర్పాటున బోనాల పండుగకు ఎమ్మెల్యే



దేవీ రెడ్డి సుధీర్ రెడ్డి హాజరై బోనం సమర్పించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు శ్రీనివాసచార్యులు, సీనియర్ నాయకులు నల్ల రఘుమా రెడ్డి, పార్టీ నాయకులు శ్రీకాంత్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ ముద్రబోయిన శ్రీనివాసులు, దుర్గ భవాని నగర్ అసోసియేషన్ కమిటీ అధ్యక్షులు రమేష్ రెడ్డి, యదిరెడ్డి, భాను ప్రకాశ్ రెడ్డి పాల్గొన్నారు.

చైతన్యపురి :



మహేశ్వరం నియోజకవర్గం ఆర్కేపురం డివిజన్ పరిధిలోని అతి ప్రాచీనమైన ఖిల్లా మైసమ్మ దేవాలయంలో ఆదివారం బోనాల ఉత్సవాలను నిర్వహించారు. అమ్మ వారిని దర్శించుకున్న వారిలో రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక మధుర ఉపేందర్ రెడ్డి, కళ్యాణ్, వంగాల శ్రీకాంత్ రెడ్డి, శ్రీధర్, మహేష్, శ్రావణ్, శివ, విజయ్, నగేష్, అనిల్, రాజు, విప్లవ్ రెడ్డి తదితరులు ఉన్నారు.

సంతోష్ నగర్ :

యకూత్‌పురా నియోజకవర్గం కుర్మాగూడ డివిజన్ మాదన్నపేట్ పరిధిలోని అమ్మవారి ఆలయంలో ఆదివారం బోనాల వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక పూజలో హైదరాబాద్ సౌత్ ఈస్ట్ డీసీపీ



సిహెచ్ రూపేష్ పాల్గొని అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ వేడుకలలో మలక్ పేట్ ఏసీపీ శ్యాంసుందర్, మాదన్నపేట్ ఏసీపీ జానయ్య, పోలీస్ అధికారులు, సిబ్బంది, సంతోష్ నగర్ మదన్నపేట సౌత్ ఈస్ట్ పీస్ కమిటీ ఆర్గనైజేషన్ సెక్రటరీ గోవింద్ సాగర్, స్థానిక నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎల్బీనగర్ :



బోనాల పండుగను పురస్కరించుకొని ఎల్బీనగర్ పరిధిలోని పలు దేవాలయాలను ఆదివారం ఎల్బీనగర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మల్ రెడ్డి రాంరెడ్డి, కాంగ్రెస్ శ్రేణులతో కలిసి సందర్శించి..ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట డివిజన్ అధ్యక్షులు కిషోర్ గౌడ్, నర్సింహా యాదవ్, మంజులా రెడ్డి, సదా శివుడు, వేణు యాదవ్, సురేందర్ రెడ్డి,శ్రీపాల్ రెడ్డి, శ్రీనివాస్, స్వర్ణ మాధవి,రమేష్ నాయక్, రాజశేఖర్, భాను, సాయి తదితరులు ఉన్నారు.

వనస్థలిపురం :

బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్‌లోని పలు ఆలయాల్లో బోనాల పండుగ సందర్భంగా ఆదివారం నిర్వహించిన ప్రత్యేక పూజల్లో మాజీ కార్పొరేటర్ ముద్దగౌని లక్ష్మీప్రసన్న రామ్మోహన్ గౌడ్ పాల్గొని అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈ కార్యక్రమాల్లో



ఆయా దేవాలయ కమిటీ, కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు ముత్యం రావు, రాజారెడ్డి , ముద్దగౌని శేఖర్ గౌడ్, ముద్దగౌని సుమన్ గౌడ్, ఇబ్రహీంపట్నం కౌన్సిలర్ శ్వేత, ముద్దగౌని చంద్రకాంత్ గౌడ్ , సరస్వతి, వెంకటేశ్వర్లు, బొమ్మిడి రంగారెడ్డి, హన్మంత్ రెడ్డి, కృష్ణ, మూర్తి, జగన్మోహన్ రావు, రామాంజనేలు, ఉమాకాంత్ పాల్గొన్నారు.

వనస్థలిపురం :



వనస్థలిపురం డివిజన్ గుంటి జంగయ్య కాలనీ, ప్రశాంత్ నగర్ కాలనీ సంక్షేమ సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన బోనాల వేడుకలను ఎల్బీనగర్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జెక్కిడి ప్రభాకర్ రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో భుజంగ రెడ్డి, పద్మా రెడ్డి, ప్రకాష్, సత్తిరెడ్డి, దశరథ్, విజయ్ కుమార్, రామావత్ రవి, బాలరాజ్, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

సంతోష్‌నగర్ :



యాకుత్‌పురా నియోజకవర్గం సంతోష్ నగర్ డివిజన్ పరిధిలోని మైసమ్మ మహాలక్ష్మి ఆలయంలో ఆదివారం నిర్వహించిన బోనాల వేడుకల్లో హైదరాబాద్ సౌత్ ఈస్ట్ జోన్ డీసీపీ సిహెచ్ రూపేష్ ఐపీఎస్ అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధి వీరేందర్ యాదవ్, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

బడంగ్‌పేట్ :



మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో ఆదివారం జరిగిన పోచమ్మ, మహంకాళీ అమ్మవారి బోనాల వేడుకల్లో ఆ నియోజకవర్గం బీజేపీ ఇంచార్జి అందెల శ్రీరాములు యాదవ్, కార్పొరేటర్లు పెద్దబావి శోభా ఆనంద్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, బీమిడి స్వప్న జంగారెడ్డి,రాళ్లగూడెం సంతోషి శ్రీనివాస్ రెడ్డి,అనితాప్రభాకర్, గౌర రమాదేవి శ్రీనివాస్, అమితా శ్రీశైలం చారిలు పాల్గొన్నారు.

హయత్ నగర్ :



మన్సూరాబాద్ డివిజన్, హయత్ నగర్ డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో ఆదివారం నిర్వహించిన బోనాల వేడుకలను ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, కార్పొరేటర్ కొప్పుల నర్సింహ రెడ్డి, మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్ రెడ్డి, డివిజన్ మాజీ అధ్యక్షులు టంగుటూరి నాగరాజు, జగదీష్ యాదవ్, కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ సామ తిరుమల రెడ్డి, బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు చెన్నగోని శ్రీధర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

తుర్కయాంజల్ :




తుర్కయాంజల్ గ్రామంలో బోనాల పండుగను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీసీబీ వైస్ చైర్మన్ కొత్త కురుమ సత్తయ్య కుటుంబ సభ్యులతో కలిసి అమ్మవారికి బోనం సమర్పించారు.

నాగోల్ :



బోనాల వేడుకల సందర్భంగా హైదరాబాద్ లోని గౌరెల్లి శ్రీ సాయి శ్రీనివాస బాటిలింగ్ కంపెనీ లో ఉన్న రేణుకా ఎల్లమ్మ, మైసమ్మ తల్లి అమ్మవార్లకు ఆదివారం తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్, అంతర్జాతీయ వైశ్య సామాఖ్య జాతీయ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస గుప్తా దంపతులు బోనాలు సమర్పించారు.



ప్రతి ఒక్కరూ రాజ్యాంగ హక్కులను తెలుసుకోవాలి



నవతెలంగాణ-కాప్రా

ప్రతి ఒక్కరూ అంబేద్కర్ రచించిన రాజ్యాంగ హక్కులను తెలుసుకోవాలని అంబేద్కర్ యువజన సంఘం ప్రతినిధి తాడూరి గగన్ కుమార్ ఆధ్వర్యంలో చేపట్టిన జ్ఞానమాల కార్యక్రమం 59వ వారానికి చేరింది. ఈ కార్యక్రమంలో భాగంగా స్థానికుడు వెంకట్రావు శనివారం అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళుర్పించారు. అంబేద్కర్ ఆశన సాధనకు ప్రతివ ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఆయన వెంట బీజేఆర్ కాలనీ అధ్యక్షులు రహీ, సభ్యులు దయానంద్ రవి, నాయక్, కొండల్ నాగేష్, రాజు, మురళీకృష్ణ ఉన్నారు.

ఏకపక్ష కమిటీల ఎన్నిక చెల్లదు : మల్లేష్



నవతెలంగాణ-బోడుప్పల్

బోడుప్పల్ నగర పరిధిలో అధికార పార్టీ నేతలు కాలనీల మధ్య చిచ్చు పెట్టేందుకు ఏకపక్ష కమిటీలు వేస్తూ కాలనీ ప్రజల మధ్య వైరం సృష్టిస్తున్నారని దేవేందర్ నగర్ ఫేజ్-2 కాలనీ అధ్యక్షుడు బైరుగొండ మల్లేష్ అన్నారు. ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. కార్పొరేటర్ భర్త తన అగడాలకు కాలనీ అధ్యక్షుడు అడ్డు వస్తున్నాడనే నెపంతో గతంలో అనుచరులతో దాడి చేశాడని తెలిపారు. ఇప్పుడు ఎలాంటి సమాచారం లేకుండా ఐక్యంగా ఉన్న కాలనీలో అలజడి సృష్టించాలని కాలనీ కమిటీ పేరుతో కొందరు వ్యక్తులతో నూతన కమిటీ ఏర్పాటు చేయించాడని వాపోయారు. తనకు ఈ విషయం సామాజిక మాధ్యమాల ద్వారా తెలిసిందని పేర్కొన్నారు. నాపై కక్ష్యతో ఇలాంటివి చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం ఉన్న కాలనీ కమిటీ లేకుండా ఏకపక్షంగా తీసుకున్న నిర్ణయాలు చెల్లవన్నారు. వచ్చే వారంలో కాలనీవాసులతో సమావేశం ఏర్పాటు చేసి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

వార్డు అభివృద్ధే ధ్యేయం : 17వార్డు కౌన్సిలర్ అర్చన



నవతెలంగాణ-మేడ్చల్

మేడ్చల్ మున్సిపల్ పరిధిలోని 17వ వార్డు అభివృద్ధే ధ్యేయంగా నిరంతరం కృషి చేస్తున్నట్లు కౌన్సిలర్ అర్చన సందీప్‌గౌడ్ అన్నారు.ఆదివారం వార్డు పరిధిలోని దుర్గమ్మ ఆలయం వద్ద తన సొంత నిధులతో ఏర్పాటు చేసిన ఐమ్యాక్స్ లైట్‌ను మాజీ ఉప సర్పంచ్ మర్రి నర్సింహారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దుర్గమ్మ బోనాల ఉత్సవాలను పురస్కరించుకొని ఆలయ ప్రాంగణంలో చెట్టు కొమ్మలను తొలగించామని తెలిపారు. కార్యక్రమంలో సందీప్‌గౌడ్, వార్డు బీఆర్ ఎస్ అధ్యక్షుడు మహేష్ యాదవ్, లాయక్‌అలీ, సాయికమల్, ఇనాయత్, శ్రీకాంత్ ,భాస్కర్, చింటు, మహేష్, పృథ్వీ పాల్గొన్నారు.

గోదావరి నీటిని సద్వినియోగం చేసుకోవాలి



- కౌన్సిలర్ బెర్రి బాల్‌రాజు

నవతెలంగాణ-మేడ్చల్

గుండ్లపోచంపల్లి మున్సిపల్ పరిధి లోని 5వ వార్డు ప్రజలు గోదావరి నీటిని సద్వినియం చేసుకోవాలని కౌన్సిలర్ బెర్రి బాల్‌రాజ్ అన్నారు. ఆదివారం వార్డు పరిధిలో ఇంటింటికీ గోదావరి నీటిని సరఫరా చేసే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మద్దుల శ్రీనివాస్‌రెడ్డి, రంజిత్ రెడ్డి, కౌన్సిలర్లు దొడ్ల మల్లికార్జున్ ముదిరాజ్, హేమంత్ రెడ్డి, నాయకులు శ్రీనివాస్ ముదిరాజ్, జగన్ ఉన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు వినియోగించుకోవాలి



నవతెలంగాణ-ఘట్కేసర్

వెంకటాపూర్ నీలిమ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగ పరుచుకోవాలని నీలిమ ఆస్పత్రి సీఈవో నీలిమ తెలిపారు. ఆదివారం మండలంలోని కొరియర్ల గ్రామంలోని కమ్యూనిటీ హాల్‌లో నీలిమ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పా టు చేశారు. ఈ వైద్య శిబిరంలో 490 మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్ర మానికి ముఖ్య అతిథిగా నీలిమ ఆస్పత్రి సీఈవో మాట్లాడుతూ.. నీలిమ ఆస్పత్రి ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం గ్రామాలలో, మున్సిపల్‌లో ఉచితంగా వైద్య శిబిరాలు నిర్వహించి పేద ప్రజలకు వైద్యం చేస్తామ ని చెప్పారు. వైద్య శిబిరంలో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ 50 శాతం రాయితీ అందించేం దుకు కార్డులు పంపిణీ చేస్తున్నట్లు ఆమె తెలిపారు. ప్రతినెలా తొమ్మిదో తేదీన నీలిమ గర్భిణీ స్త్రీలకు ఉచితంగా వైద్య సేవ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఓరుగంటి వెంకటేష్ గౌడ్, గ్రామ ప్రజలు ఉన్నారు.

కాంగ్రెస్ పార్టీ ఏ బ్లాక్ ఎస్సీ సెల్ అధ్యక్షుడికి సన్మానం



నవతెలంగాణ-మేడ్చల్

ఆషాఢమాస బోనాల పండుగ సందర్భంగా మేడ్చల్ పట్టణంలోని శ్రీపాద వల్లభ ట్రస్ట్ చైర్మెన్ తాళ్లపల్లి రమేష్ గుప్తా కాంగ్రెస్ పార్టీ ఏ బ్లాక్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పానుగంటి మహేష్ కుమార్‌ను ఆదివారం సన్మానించి శ్రీదత్తాత్రేయ స్వామి వారి జ్ఞాపికని అందజేశారు. ఈ సందర్భంగా పానుగంటి మహేష్ జైగురుదత్త ట్రస్ట్ ద్వారా పేద వారికి అన్నదానం చేస్తున్న ట్రస్ట్ సభ్యులను అభినందించారు.

అన్నదానం అనే పుణ్య కార్యక్రమానికి ప్రతి నెలా తనవంతు సహకారం అదిస్తానని చెప్పారు. కార్యక్రమంలో జై గురుదత్త ట్రస్ట్ చైర్మెన్ తాళ్లపల్లి రమేష్ గుప్తా, ప్రధాన కార్యదర్శి దశరద్ ముదిరాజ్, ట్రస్ట్ సభ్యులు జామ్లా నాయక్ తదిరులు పాల్గొన్నారు.







అంగరంగ వైభవంగా బోనాల ఉత్సవాలు

- అమ్మవారిని దర్శించుకున్న ఆయా పార్టీల ప్రజాప్రతినిధులు
- బోనాలను సమర్పించిన మహిళలు
- కోరికలు తీర్చాలని మొక్కులు
- భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

















నవతెలంగాణ-బోడుప్పల్

బోనాల వేడుకలు పీర్జాదిగూడ నగరంలో తెల్లవారుజాము నుంచే అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. వివిధ కాలనీల నుంచి తరలివచ్చిన భక్తులు అమ్మవారికి బోనం, నైవేద్యం, సాక సమర్పించి మొక్కుకున్నారు. ఈ పర్వదినాన అమ్మవారికి బోనాలు సమర్పించి తమ భక్తీ శ్రద్ధలత గ్రామ దేవతలను కొలిచారు. ఈ బోనాలకు మేడ్చల్ జిల్లాకు చెందిన వివిధ రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులతోపాటు అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పీర్జాదిగూడ మేయర్ జక్క వెంకట్ రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మెన్ బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు దర్గా దయాకర్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్, కార్పొరేటర్లు దొంతిరి హరిశంకర్ రెడ్డి, పాశం శశిరేఖ బుచ్చి యాదవ్, బండి రమ్యాసతీష్ గౌడ్, బైటింటి శారదా ఈశ్వర్‌రెడ్డి, బొడిగే స్వాతీకృష్ణాగౌడ్, తూంకుంట్ల ప్రసన్న లక్ష్మీశ్రీధర్‌రెడ్డి, కె.సుభాష్ నాయక్, బండారి మంజుల రవీందర్‌లతో పాటు వివిధ డివిజన్లకు చెందిన కాలనీ అసోసియేషన్ సభ్యులు, నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

తెలంగాణ రాష్ట్రంలో వచ్చే ఏడాది కాంగ్రెస్ పార్టీ సర్కారు ఏర్పాటు వచ్చేలా చూడాలని అమ్మవారికి మొక్కినట్లు టీపీసీసీ ఉపాధ్యక్షుడు, మేడ్చల్ అసెంబ్లీ కో ఆర్డినేటర్ తోటకూర వజ్రేష్ యాదవ్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం పీర్జాదిగూడ నగరంలోని వివిధ ప్రాంతాలలో జరిగిన బోనాల ఉత్సవాలలో నగర అధ్యక్షుడు తుంగతుర్తి రవిచారితో కలిసి దేవాలయాలను సందర్శించి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ తెలంగాణలో అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకునే పండుగ బోనాల పండుగ అని అన్నారు. వచ్చే ఏడాది కాంగ్రెస్ ప్రభుత్వ హయంలో అత్యంత వైభవంగా బోనాలు సమర్పిస్తామని మొక్కినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

కాప్రాలో..

ప్రకృతి శక్తి ఆరాధనే బోనాల పండుగ అని బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బండారి లక్ష్మారెడ్డి అన్నారు. బోనాల పండుగ సందర్భంగా ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని అన్ని డివిజన్లలో జరిగిన బోనాల పండుగ వేడుకల్లో పాల్గొని దేవాలయంలో ప్రత్యేక పూజలు చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. నియోజకవర్గ ప్రజలు సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సృష్టి అంతా అమ్మవారి మాయనే అన్నారు. ప్రకృతి స్వరూపిణి అయిన పరమాత్మను కొలడానికి అనేక మార్గాలు ఉన్నాయని తెలిపారు. అందులో బోనాలు ఒకటి అని గుర్తు చేశారు. కార్యక్రమంలో బండారు వెంకట్ రావు, వెంకట్ రెడ్డి,అర్జున్, బీఎల్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు నరేశ్, సూరం పాల్గొన్నారు.

బోనాల ఉత్సవాల్లో భాగంగా మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ దంపతులు ఉప్పల్ నియోజకవర్గంలోని కట్ట మైసమ్మ, నల్ల పోచమ్మ, ఎల్లమ్మ, మహంకాళి, చక్రిపురం ముత్యాలమ్మ, పోచమ్మ, కుషాయిగూడలో పోచమ్మ గుడిలో ప్రత్యేక పూజలు చేశారు. వారి వెంట చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి యాదవ్, కాప్రా డివిజన్ కార్పొరేటర్ స్వర్ణరాజ్, మాజీ కార్పొరేటర్ గొల్లూరి అంజయ్య, బీఆర్ఎస్ నాయకులు ప్రజలు ఉన్నారు.

ఘట్కేసర్‌లో..

ఘట్కేసర్ మున్సిపల్ ఎన్ఎఫ్‌సీ నగర్, చందుపట్ల గూడెం, బొక్కయింగూడలో ఆదివారం బోనాల జాతర సందర్భంగా ఘట్కేసర్ మున్సిపల్ వైస్ చైర్మెన్ పలుగుల మాధవ్ రెడ్డి, ఘట్కేసర్ మున్సిపల్ బీఆర్ఎస్ అధ్యక్షులు బండారి శ్రీనివాస్‌గౌడ్, కౌన్సిలర్స్ చందుపట్ల వెంకట్ రెడ్డి, కొమ్మగోని రమాదేవి మహిపాల్ గౌడ్, బండారి ఆంజనేయులు గౌడ్‌తో కలిసి పోచమ్మ అమ్మవా రిని, చిత్తరమ్మ అమ్మవారిని దర్శించుకోని బోనం సమర్పించి ప్రత్యే క పూజలు నిర్వహించారు. అనంతరం మున్సిపల్ వైస్ చైర్మెన్ పలుగుల మాధవరెడ్డి మాట్లాడుతూ అందరికీ బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపారు. బోనాల జాతరకు వచ్చే భక్తులకు, ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మెన్ వెంకటేష్, ఏఎస్ఐ ఇంద్రారెడ్డి, బీఆర్ఎస్‌రావు 2వ వార్డ్ ప్రెసిడెంట్ జనగామ యాదగిరి రావు, బొక్క ప్రభాకర్ రెడ్డి, బీఆర్ఎస్ యువ నాయకులు బొక్క విష్ణువర్ధన్, అనుష, ప్రణయ్, రాజేష్ పాల్గొన్నారు.



ఉప్పల్‌లో..

అమ్మవారి ఆశీస్సులు ప్రజలపై ఉండాలని చిలుకానగర్ డివిజన్ కార్పొరేటర్ బన్నాల గీత అమ్మవారిని కోరినట్టు తెలిపారు. ఆదివారం చిల్కానగర్ డివిజన్ బ్యాంకు కాలనీలోని అమ్మవారి ఆలయంలో కార్పొరేటర్ గీతాప్రవీణ్ దంపతులు అమ్మవారికి బోనాలను సమర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. తెలంగాణ సాంప్రదాయాలలో బోనాలకు ప్రత్యేకస్థానం ఉందన్నారు. ప్రజలందరూ సుఖ శాంతులతో జీవించా లని అమ్మవారిని వేడుకున్న ట్లు తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగ కుండా తగిన ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. జీహెచ్ ఎంసీ, పోలీసులు, జలమండలి,విద్యుత్ శాఖ అధికారు ల సమన్వయంతో బోనాల ఉత్సవాలను నిర్వహి స్తున్నా మని తెలిపారు.

బోనాల సందర్భంగా చిల్కానగర్, రామంతాపూర్, హబ్సిగూడ ఆలయాలు పోతు రాజు విన్యాసాలు భక్తుల తో కిటకిటలాడాయి.





భక్తులు ఉదయం నుండి నూతన వస్త్రాలు ధరించి అమ్మవారికి బోనాలను సమర్పించారు. పలు ఆలయాలలో ఉప్పల్ ఎమ్మెల్యే సుభాష్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతికి ప్రతీక బోనాల ఉత్సవాలు అని, ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉత్సవాలు జరుపుకున్నారని తెలిపారు.

ఆషాఢ మాస బోనాల పండుగ సందర్భంగా ఆదివారం రామంతపూర్ మెయిన్ రోడ్ లో ఉన్న కట్ట మైసమ్మ దేవాలయంలో కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకటరావు తొలి బోనం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం రామంతపూర్‌లో ఉన్న నెహ్రూ నగర్‌లో బద్ధి పోచమ్మ, నల్ల పోచమ్మ, బాలకృష్ణ నగర్‌లోని భూలక్ష్మమ్మ, మైసమ్మ, సాయి కృష్ణ నగర్ కట్ట మైసమ్మ, కామాక్షిపురంలోని కామాక్షి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆమె వెంట అల్లాడి నిరంజన్‌గౌడ్, నారాయణ దాస్, పడిగం నాగేష్, కుమ్మరి స్వామి, శ్రీకాంత్, కంటే శ్యామ్, కల్మికల లింగం, రవి, పలువుల అంజయ్య. తదితరులు ఉన్నారు.

శామీర్‌పేటలో..

దైవచింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు నక్క ప్రభాకర్ గౌడ్ అన్నారు. మేడ్చల్ జిల్లా మూడుచింతల పల్లి మండలంలోని ఉద్దెమర్రి గ్రామ పంచాయతీ అనుబంధ గ్రామం ఉషారుపల్లిలో ఆదివారం బోనాల పండుగ నిర్వహించారు. ఈ సందర్భంగా నక్క ప్రభాకర్ గౌడ్ ముత్యాల మ్మ, పోచమ్మ, నల్ల పోచమ్మ గుడిని దర్శించుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. యువత పెడదారిన పట్టకుండా భక్తిభావం పెరగడానికి గ్రామదేవతల ఆలయాలు అవసరమన్నారు. అనంతరం దేవాలయానికి చుట్టూ ప్రహరీ గోడ నిర్మించేందుకు తన సొంత నిధులు ర.4లక్షలు విరాళంగా అందజేస్తామని హామీ ఇచ్చారు. ఉషారుపల్లి నుంచి ముత్యాలమ్మ దేవాలయం వరకు హైమస్ట్ లైట్లను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో దేవాలయం చైర్మెన్ నల్ల నర్సింహారెడ్డి, ఉప సర్పంచ్ నల్ల కృష్ణారెడ్డి, ఉద్దెమర్రి శ్రీ విష్ణు శివాలయం చైర్మెన్ నల్ల బుచ్చిరెడ్డి, వార్డు మెంబర్ బలవంత్‌రెడ్డి, సీతారాంరెడ్డి, తదితరులున్నారు.

జవహర్‌నగర్‌లో..

అమ్మవారి ఆశీస్సులతోనే తెలంగాణలో వర్షాలు సమృద్ధిగా పడుతున్నాయని, ప్రతి గ్రామంలో చెరువులు నిండటంతో రైతులు సంతోషంగా ఉన్నారని మేయర్ మేకల కావ్య అన్నారు. ఆదివారం జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో మహంకాళి అమ్మవారి బోనాల పండుగ సందర్భంగా మేయర్ మేకల కావ్య బోనమెత్తి అమ్మవారికి సమర్పించారు. కార్యక్రమంలో మేయర్ కావ్య మాట్లాడుతూ.. బోనాలు తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు నిలయమని, అమ్మవారి కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని కోరారు. ఆషాఢ మాసంలో నిర్వహించే బోనాలతో వర్షాకాలంలో సంభవించే అంటు రోగాలు దరిచేరవని పేర్కొన్నారు. జవహర్ నగర్ కురుమ సంఘం అధ్యక్షుడు మండల సురేందర్ ఆధ్వర్యంలో ఘనంగా బోనాలు చేశారు. డప్పుచప్పులతో, పోతరాజుల విన్యాసాలతో ఆలయ ప్రాంగాణమంతా మారుమోగింది. కార్యక్రమంలో మేడ్చల్ నియోజవకర్గ ఇన్‌చార్జి చామకూర మహేందర్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్, కార్పొరేటర్లు, జిల్లా నాయకుడు మేకల అయ్యప్ప, ఆలూరి రాజశేఖర్, మాజీ సర్పంచ్ శంకర్ గౌడ్ పార్టీనాయకులు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

కీసరలో..

కీసర పరిధిలోని దమ్మాయిగూడలో బోనాల వేడుకల్లో భాగంగా కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గ కో ఆర్డినేటర్ హరి వర్ధన్ రెడ్డి, మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ సామల శ్రీనివాస్‌రెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు. నాగారం లో బోనాల వేడుకల్లో పాల్గొన్న నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి, వైస్ చైర్మెన్ మల్లేష్, కౌన్సిలర్లు సబితా ఆంజనేయులు ప్రత్యేక పూజలు చేశారు.చీర్యాలలో బోనాల వేడుకల్లో అమ్మవారికి కీసర ఎంపీపీ మల్లారపు ఇందిరా లక్ష్మీనారాయణ,సర్పంచ్ ధర్మేందర్ ,ఉప సర్పంచ్ తిరుమలరెడ్డి పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.



బస్తీ అభివృద్ధిలో ప్రజాప్రతినిధుల సహకారం మరువలేనిది

- అధ్యక్షుడు ఊట్ల చంద్రారెడ్డి

నవతెలంగాణ-కూకట్‌పల్లి



కూకట్‌పల్లి డివిజన్‌లోని పాపిరెడ్డినగర్ బస్తీ అభివృద్ధికి, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకెపుడి గాంధీ, కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణల సహకారం ఎన్నటికీ మరువలేనిదని, వారికి బస్తీ వాసుల తరపున వెల్ఫేర్ అధ్యక్షుడు ఊట్ల చంద్రారెడ్డి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. బస్తీలోని రోడ్ నెం. 09 తదితర గల్లీల్లో నూతనంగా వేసిన సీసీ రోడ్లను ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ సత్యనారాయణ, చంద్రారెడ్డి ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బస్తీ ప్రధాన కార్యదర్శి భగవంత రెడ్డి, కోశాధికారి నర్సింహులు, ముదిరాజ్ నాయకులు ధర్మారావు, చెర్ల రామకృష్ణా రెడ్డి, ప్రభాకర్ , శ్రీనివాస్, కనకా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చిత్తారమ్మ అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించిన గాంధీ

నవతెలంగాణ-కూకట్‌పల్లి



తెలంగాణ రాష్ట్ర సంస్కృతి ,సంప్రదాయాలకు ప్రతీక అయిన బోనాల పర్వదిన సందర్భంగా ,వివేకానంద నగర్ డివిజన్ పరిధిలోని శ్రీ శ్రీ శ్రీ చిత్తారమ్మ దేవాలయంలో బోనాలు పండగ ఘనంగా జరిగాయి. ఉత్సవాలలో కార్పొరేటర్, రోజాదేవి రంగరావుతో కలిసి ప్రత్యేక పూజలు చేసి, పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ గాంధీ మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్ర సంస్కృతి ,సంప్రదాయాలకు ప్రతీక అయిన బోనాల పర్వదినం సందర్భంగా, ప్రజలందరికి బోనాల పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. అమ్మ వారి దీవెనలతో ప్రజలంతా సుఖ సంతోషాలతో జీవించాలని అమ్మవారిని వేడుకుంటున్న అని ప్రభుత్వ విప్ గాంధీ తెలియచేశారు. ఈ కార్యక్రమంలోఅంజనేయులు,మాజీ కార్పొరేటర్ మాధవరం రంగరావు, గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ గణేష్ ముదిరాజు, వివేకానంద నగర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వాడ వాడాల ఘనంగా ఆషాడ మాస బోనాలు



నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

ఆషాడ మాస బోనాల పండుగ సందర్భంగా ఆదివారం హైదర్ నగర్ డివిజన్ పరిధిలోని హైదర్ నగర్ ప్రధాన రహదారి వద్ద వెలసిన జయదుర్గ మైసమ్మ ఆలయంలో అమ్మవారి బోనాలు వైభవంగా జరిగాయి. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా కార్పొరేటర్ నార్నె శ్రీనివాస రావు హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మెన్ అడుసుమిల్లి వెంకటేశ్వర రావు, ఆర్కె రాజు, సంజయ్ కుమార్, జ్యోతి లక్ష్మి, పద్మావతి, డివిజన్ ఉపాధ్యక్షుడు పోతులం తదితరులు పాల్గొన్నారు.

కేపీహెచ్‌బీ: కూకట్‌పల్లి నియోజకవర్గం కేపీహెచ్‌బీ కాలనీ డివిజన్ పరిధిలోని శ్రీశ్రీశ్రీ పోచమ్మ తల్లి ఆలయం, బాలనగర్,



ఫతేనగర్ డివిజన్ అమ్మవార్ల ఆలయాలను జనసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర ఇంచార్జ్ నేమూరి శంకర్ గౌడ్ ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ప్రెసిడెంట్ కొల్లా శంకర్, తుమ్మల మోహన్ కుమార్, నాగరాజు, వెంకటేశ్వరరావు, వెంకటలక్ష్మి, ఆలయ కమిటీ సభ్యులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

కేపీహెచ్‌బీ: ఆషాడమాస అమ్మవారి బోనాల పండుగను పు



రస్కరించుకుని కేపీహెచ్‌బీ డివిజన్లోని 6వ ఫేజ్‌లో గల శ్రీ విజయ దుర్గ రామలింగేశ్వర స్వామి వారి ఆలయంలో డివిజన్ కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు, శైలజ దంపతులు స్వామి, అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆషాడ మాసంలో వచ్చే బోనాల పండుగ అమ్మ వారి కృపతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

బాలానగర్: సంస్కృతీ సంప్రదాయాలకు ప్రతీకగా నిర్వహి



ంచిన బోనాల పండుగ సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కొంపల్లి మున్సిపల్ కౌన్సిలర్ కందాడి జ్యోత్స్నా శివా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బాలానగర్: కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలోని



బాలానగర్, ఫత్తేనగర్ డివిజన్ల పరిధిలో గల జవహార్ లాల్ కాలనీలో వెలసిన కనకదుర్గదేవి, దేవి, కాళికా దేవి ఆలయంలో ఆదివారం అమ్మవార్లకు అభిషేకం చేసి అమ్మవారికి శాఖంబరి అలంకరణ అన్ని కూరగాయలతో అలంకరణ జరిపించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మ వారికి బోనాలు సమర్పించారు. డివిజన్ పరిధిలోని పలు బస్తీలల్లో తొట్టెల ఊరేగింపులు, పోతరాజుల విన్యాసాలతో ప్రజలు ఘనంగా బోనాల ఉత్సవాలను జరుపుకున్నారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయకమిటి అధ్యర్యంలో ప్రధాన అర్చకులు దోర్బల కాశీనాథ్ శర్మ పర్య వేక్షణలో ఆలయంలో ఉత్సవాలు నిర్వహించారు.

బాలానగర్: ఆషాడ మాస బోనాలు పురస్కరించుకొని ఆదివా



రం ఫతేనగర్ డివిజన్ పరిధిలోని ఫతేనగర్, శివశంకర్ నగర్, గౌతమ్ నగర్, హరిజన బస్తీలో పోచమ్మ తల్లి దేవాలయాలను కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, స్థానిక కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్‌తో కలిసి ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే తెలంగాణ రాష్ట్ర ప్రజలందరినీ చల్లంగా చూడాలని మొక్కులు మొక్కుకున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత దేశ, విదేశాల్లో సైతం ప్రజలు బోనాలు, బతుకమ్మ వేడుకలను ఘనంగా చేసుకుంటున్నారని అన్నారు. అమ్మవారులకు మహిళలు బోనాలు తీసి నైవే ధ్యాలు సమర్పించారు. బోనాల ఊరేగింపులో డప్పు, చప్పుళ్లతో ఊరేగింపు నిర్వహించారు.

నేరేడ్‌మెట్ : అల్వాల్, మల్కాజిగిరి సర్కిళ్ల పరిధిలోని పలు ప్రాంతాలలో ఆదివారం బోనాల పండుగను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ప్రధానంగా సఫిల్ గూడ ట్యాంక్ బండ్ కట్టమైసమ్మ దేవాలయం, వినాయక్ నగర్, నేరేడ్‌మెట్, మౌలాలి, అల్వాల్, మచ్చబొల్లారం, వెంకటాపురం డివిజన్‌లలో బోనాల ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి ఉదయం నుంచి అభిషేకాలు



ప్రత్యేక అలంకరణ చేశారు. మహిళలు తలపై బోనాలతో ఆలయాలకు ఊరేగి ంపుగా తరలి వచ్చారు. జాతర ఉత్సవాల సందర్భంగా ప్రజాప్రతినిధులు, రాజ కీయ నాయకులు ఆలయాలను సందర్శించి అమ్మవారిని ప్రత్యేకంగా దర్శించుకుని పూజలు నిర్వహించారు. ప్రతి ఇంటి నుంచి మహిళలు భారీ ఎత్తున బోనాలతో ఊరేగింపుగా తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

నేరేడ్‌మెట్ : శ్రీ ఓల్డ్ అల్వాల్ లక్ష్మీ నగర్ కాలనీలోని దుర్గామాత, నల్ల పోచమ్మ అమ్మవార్ల గుడిలో బోనాల పండు గ సందర్భంగా 8 గంటలకు పంతులు రాంప్రసాద్ శర్మ గారి అధ్వర్యంలో ఘనంగా పూజలు నిర్వహించారు. మహిళలు బోనాలతో తరలి వచ్చారు. అల్వాల్ కార్పొరేటర్ విజయశాంతి శ్రీనివాస రెడ్డి అమ్మగవారిని దర్శించుకొన్నారు. కాలనీ అధ్యక్షులు బి. నాగేశ్వర్ రావు, దేవాలయ కమిటి అధ్యక్షులు సుధాకరరెడ్డి ఈ సందర్భంగా కార్పొరేటర్‌ను శాలువతో ఘనంగా సన్మానించారు. కాలని ప్రజలు ఈ రాష్ట్ర ప్రజలు అందరు సుఖ సంతోషాలతో ప్రశాంతంగా ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమములో కాలనీ అధ్యక్షులు



బి. నాగేశ్వర్ రావు గారు, సుధాకరరెడ్డి శివరాజ్, శ్రీకాంత్ రావు భాస్కర్ గౌడ్, శివశరణప్పా, దినేష్, కాలనీలో భక్తులు పాల్గొన్నారు.

నేరేడ్‌మెట్ : వినాయక నగర్ డివిజన్ పరిధిలోని అమ్మవారి దేవాలయంలో, జేకే కాలనిలోని దేవాలయంలో ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత రావు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రేమ్ కుమార్, మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్, బద్దమ్ పరశురాం రెడ్డి, పిట్ల శ్రీనివాస్, సతీష్ కుమార్, ధర్మేష్ గుప్త పాల్గొన్నారు. సైనిక్‌పురిలోని అంబేద్కర్ నగర్‌లో ఉన్న నల్ల పోచమ్మ ఆలయంలో నేరేడ్‌మెట్ కార్పొరేటర్ కొత్తపల్లి మీనా ఉపేందర్ రెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా తలపై బోనమెత్తి వచ్చి అమ్మవారికి బోనం సమర్పించారు. ఈ సందర్భంగా నేరేడ్‌మెట్ డివిజన్ ప్రజలందరికి ఆమె బోనాల పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.



జగద్గిరిగుట్ట: ఆషాడమాసం చివరి ఆదివారం పురస్కరించు



కొని కుత్బుల్లాపూర్, గాజులరామారం జంట సర్కిళ్ల పరిధిలోని ప్రాంతాల్లో బోనాల ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఆయా ప్రాంతాల్లో గల పోచమ్మ, మహంకాళి, రేణుక ఎల్లమ్మ, దేవాలయాల్లో ప్రజాప్రతినిధులు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కేపీ వివేకానంద, కార్పొరేటర్ బి. విజయ శేఖర్ గౌడ్, ఆలయ కమిటీ నిర్వాహకులు , బాలరాజ్ కురుమ, జి. నరసింహ, దేవేందర్, సుధాకర్, పురుషోత్తం, రమేష్, పరిష వేణు, తదితరులు పాల్గొన్నారు.

జగద్గిరిగుట్ట: డివిజన్ పరిధి కేపీహెచ్‌బీ కాలనీలో గల రేణుక ఎల్లమ్మ ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ స్థానిక కార్పొరేటర్ బి .విజయ శేఖర్ గౌడ్, బీజేపీ జిల్లా నాయకులు సీహెచ్. భరత్ సింహారెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కమిటీ చైర్మెన్ ఎన్. శ్రీనివాస్ రెడ్డి, వైస్ చైర్మెన్ .పరుచూరి ప్రేమ్ కుమార్, ప్రధాన కార్యదర్శి పి .వెంకట సుధాకర్ రావు, కోశాధికారి రమణయ్య, గౌరవ అధ్యక్షులు పి. జగ



న్ మోహన్ రావు ,రామచంద్ర రావు , సాయి కిరణ్ ,కార్యదర్శి బి. సాయి బాబా, కోశాధికారి తదితరులు పాల్గొన్నారు.

జగద్గిరిగుట్ట: గిరినగర్‌లో గల మహంకాళి పోచమ్మ దేవాలయంలో బోనాల పర్వదినాన్ని పురస్కరించుకుని వేడుకలు ఘనంగా జరిగాయి. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై పూజలు చేశారు ఎటువంటి అవాంఛ నీయ సంఘటనలు జరగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాటు చేశారు.



జగద్గిరిగుట్ట: భగత్ సింగ్ నగర్‌లోని నల్ల పోచమ్మ దేవాలయంలో బోనాల పండుగ ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఉదయం నుండే భక్తుల తాకిడితో ఆలయం ప్రాంగణం కిటకిటలాడాయి . స్థానిక ఎమ్మెల్యే కేపీ వివేకానందతో పాటు డివిజన్ బీఆర్ఎస్ మాజీ అధ్యక్షులు మహమ్మద్ రఫీ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు



గుజ్జుల శ్రీనివాస్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి సాంబయ్య, కమిటీ సభ్యులు సామ్రాట్, గిరినాల ప్రభాకర్, లక్ష్మణ్ ,ఉప్పలయ్య, చందు, శ్రీధర్, తదితరులు పాల్గొన్నారు.

జగద్గిరిగుట్ట: దుర్గయ్య నగర్‌లో గల రేణుక ఎల్లమ్మ, పోచమ్మ దేవాలయంలో ఏర్పాటు చేసిన వేడుకల్లో భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై పూజలు చేశారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు, కార్యదర్శులు శ్రీశైలం యాదవ్, ఎం. సురేష్, కమిటీ సభ్యులు ఏ. రాజు, మీరా వెంకట్, బాలు ,తదితరులు పాల్గొన్నారు.





మల్కాజిగిరి: పాత మల్కాజిగిరిలోని ఉజ్జయిని మహంకాళి దేవాలయంలో బోనాల పండుగా సందర్భంగా ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ప్రేమ్ కుమార్, సునీత రాముయాదవ్, మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్, బద్దమ్ పరశురాం రెడ్డి, సతీష్ కుమార్, పిట్ల శ్రీనివాస్, రామూయాదవ్, సంతోష్ రాందాస్, మోహన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.




మల్కాజిగిరి: సఫిల్ గూడ కట్ట మైసమ్మ అమ్మవారిని, నేరేడ్‌మేట్‌లోని మూడు గుళ్లను ఆదివారం కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షులు నందికంటి శ్రీధర్ దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెంట తుమ్మల వెంకటేష్ యాదవ్, గుత్తి రామచందర్, సంతోష్ ముదిరాజ్, ఎమ్మార్ శ్రీనివాస్ యాదవ్, సానాది శంకర్ తదితరులు పాల్గొన్నారు.



మల్కాజిగిరి: నేడు, రేపు జరుగు బోనాల పండుగ సమయంలో భక్తులు అధిక సంఖ్యలో తరలివస్తున్నారు. కాబట్టి కట్టుదిటమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్ ఐపీఎస్ అధికారులను ఆదేశించారు. మల్కాజిగిరిలో నేడు, రేపు జరగబోయే బోనాల ఉత్సవాల సందర్భంగా ఓల్డ్ మల్కాజిగిరి మహంకాళి అమ్మవారి గుడి, సఫీల్ గూడ కట్టమైసమ్మ గుడిని సీపీ చౌహాన్ ఆదివారం సందర్శించి బందోబస్తు ఏర్పాట్లను సమీక్షించారు. అనంతరం క్యూ లైన్‌లో ఉన్న భక్తులతో కొద్దిసేపు ముచ్చటించారు. మహిళా భక్తులు, పిల్లలు, వృద్ధుల కోసం ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఆలయ ఆవరణలో వాహనాలను క్రమ పద్ధతిలో పార్కింగ్ చేయడానికి తగు ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. షీ టీం బృందాలు కూడా మహిళా భక్తుల రక్షణ కోసం విధుల్లో ఉంటారని పేర్కొన్నారు. భక్తులు పోలీసు వారికి సహకరించాలని, సంతోషంగా బోనాల పండుగ జరుపుకోవాలని ఆకాక్షించారు. ఈయన వెంట మల్కాజ్ గిరి డీసీపీ డి.జానకి ఐపీఎస్, మల్కాజిగిరి ఏసీపీ నరేష్ రెడ్డి, కుషాయిగూడ ఏసీపీ వెంకట్ రెడ్డి, నేరేడ్‌మెట్, అధికారులు, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



కుత్బుల్లాపూర్: ఆషాడ బోనాల పండుగ సందర్భంగా ఆదివారం ఎమ్మెల్యే కె.పి. వివేకానంద్ కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని పలు అమ్మవారి ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతు గ్రామదేవతలుగా పూజించే పోచమ్మ, మైసమ్మ ఎల్లమ్మ తల్లులు తమ చల్లని చూపులతో నియోజకవర్గ ప్రజలను దీవించాలన్నారు. రాష్ట్రంలో సకాలంలో వర్షాలు కురిసి, పాడి పంటలతో ప్రతి ఇల్లు శోభిల్లాలని ప్రార్థించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్ర ప్రజలు ప్రతి పండుగను సంతోషంగా జరుపుకోవడానికి ప్రత్యేక నిధులు మంజూరు చేస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజా ప్రతి నిధులు,బిఆర్ఎస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు, నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు, కాలనీ వాసులు, భక్తులు పాల్గొన్నారు.



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని వివిధ కాలనీలు, బస్తీలకు చెందిన ప్రజలు, పార్టీ శ్రేణులు ప్ర భుత్వ విప్, మేడ్చల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, ఎమ్మె ల్సీ శంభీపూర్ రాజుని ఆదివారం శంభీపూర్ కార్యాలయంలో కలిశారు. వారి సమస్యలను పరిష్కరించాలని కోరగా సానుకూలంగా స్పందించారు.

నవతెలంగాణ-దుండిగల్



ఎన్ఆర్ఈసీలో బ్లాక్ చైన్ టెక్నాలజీ వర్క్‌షాప్



నవతెలంగాణ-దుండిగల్

మైసమ్మగూడలోని నర్సింహారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగం వారు సొసైటల్ అప్లికేషన్ ఆఫ్ బ్లాక్ చైన్ టెక్నాలజీ, సైబర్ ఫిజికల్ సిస్టమ్స్ అనే అంశంపై భారత ప్రభుత్వ రంగ సంస్థ అయిన (సైన్స్ అండ్ ఇంజనీరింగ్ రీసెర్చ్ బోర్డు) వారి సహకారంతో కళాశాల ప్రాంగణంలో వారం రోజులపాటు వర్క్ షాప్ నిర్వహించారు. శనివారం ముంగింపు కార్యక్రమానికి విశిష్ట అతిథిగా స్కూల్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ, ఇంజనీరింగ్ , వీఐటీ వెల్లూరు తమిళనాడు నుండి డా.జీఎన్ వివేకానంద హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ బ్లాక్ చైన్ టెక్నాలజీ సమాజానికి ఎంతగానో ఉపయోగకరమని దీనివల్ల బ్యాంకు లావాదేవీలు సురక్షితంగా ఉంటాయని తెలిపారు. వారం రోజుల పాటు నిర్వహించిన బ్లాక్ చైన్ వర్క్ షాప్‌కు దేశంలో వివిధ రాష్ట్రాల నుంచి పలు కళాశాలల అధ్యాపకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూబ్లాక్ చైన్ వర్క్ షాప్‌ల వల్ల అధ్యాపకులు ఎంతగానో నేర్చుకున్నాం అన్నారు. ఇలాంటి సాంకేతికపర మైన విషయాలను నేర్చుకోవడం వల్ల భావితరాల విద్యార్థులకు అందించగలమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి జె. త్రిశూల్ రెడ్డి మాట్లాడుతూ ఇలాంటి వర్క్ షాప్‌లు మరెన్నో నిర్వహించాలని తద్వారా సమాజానికి విద్యార్థులకు ఎంతగానో ఉపయోగం జరుగుతుందని తెలిపారు. ఈ వర్క్ షాప్‌లో పాల్గొన్న అధ్యాపకులందరికీ కళాశాల ప్రిన్సిపల్ ఆర్.లోకనాథం సర్టిఫికెట్స్ అందచేశారు. అనంతరం కళాశాల డైరెక్టర్ ఏ.మోహన్ బాబు మాట్లాడుతూ తమ కళాశాలలో వర్క్ షాప్ మంజూరు చేసిన ఎస్ఈఆర్‌బీడీఎస్‌టీ వారికి కృతజ్ఞతలు తెలిపారు. వారం రోజుల పాటు కార్యక్రమాన్ని నిర్వహించిన సీఎస్ఈ విభాగాధిపతి డా.ఏవీఎల్ఎన్.సుజిత్, సీఎస్ఈడీ రామసుబ్బారెడ్డి, కార్యక్రమ కార్యకర్త డా.దిలీప్ కుమార్ రెడ్డిలను కళాశాల యాజమాన్యం అభినందించింది. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మెన్ జె.నర్సింహారెడ్డి, కార్యదర్శి జె. త్రిశూల్ రెడ్డి కోశాధికారి జె.త్రిలోక్ రెడ్డి, వివిధ కళాశాలల నుంచి పలువురు అధ్యాపకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఇండ్ల పై మరో సారి కబ్జా దారుల దౌర్జన్యం

- న్యాయస్థానంలో కేస్ పెండింగ్‌లో ఉండగానే కబ్జాకు యత్నం

నవతెలంగాణ-కూకట్‌పల్లి



గతంలో మాదిరిగా కూకట్‌పల్లి ఎల్లమ్మ బండ ఫోర్త్ ఎస్టేట్ కాలనీ (జర్నలిస్ట్ కాలనీ) పై శనివారం తెల్లవారు జామున మరో సారి రౌడీలు, కబ్జా దారులు అర్ధరాత్రి భూకబ్జా చేసే ప్రయత్నం చేశారు. గతంలో నివాసం వుంటున్న కొన్ని ఇండ్లను అర్ధరాత్రి కూల్చి వేయగా, దౌర్జన్యంగా ఇండ్ల చుట్టూ బారికేడ్ల నిర్మాణాలు చేపట్టి విఫలమయ్యారు. అప్పటి కలెక్టర్ ఆదేశాలతో రెవెన్యూ అధికారులు బారికేడ్లను తొలగించి వారి మీద కేసులు నమోదు చేశారు. కాగా ప్రస్తుతం కుడా శనివారం తెల్లవారు జామున సమారు 1 గంట ప్రాంతంలో సుమారు వంద మంది వరకు రౌడీ మూకలు దౌర్జన్యంగా జర్నలిస్టులు నివాసం వుంటున్న ఇండ్ల చూట్టూ బారికేడ్లను వేసే ప్రయత్నం చేస్తుండటంతో స్థానికులు, జర్నలిస్టులు కలసి వారి పనులను అడ్డుకున్నారు. వెంటనే 100 కు, పిర్యాదు చేయడంతో. సమాచారం అందుకున్న, జగద్గిరిగుట్ట పోలిసులు సంఘటనా స్థలానికి చేరుకొని పలువురినీ అరెస్ట్ చేశారు. మరికొంత మంది రౌడీలు పారిపోయారు. కాగా నివాసం ఉంటున్న ఇండ్ల పై భయ బ్రాంతులకు గురి చేసే విధంగా దౌర్జన్యంగా బారికేడ్లు వేయడానికి ప్రయత్నించడంతో అక్కడి నివాసితులు ఆందోళన గురవుతున్నారు.

అమ్మవారి ఆశీస్సులు ప్రజలపై ఉండాలి



దుండిగల్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో నిజాంపేట్ గ్రామ బొర్రాయి పోచమ్మ ఆలయంలో ఆదివారం బోనాల పండుగ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా మేయర్ కోలన్ నీలా గోపాల్ రెడ్డి వారికుటుంబ సభ్యులతో కలిసి బోనం సమర్పించి, అమ్మవారికి బియ్యం, వస్త్రం అందించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మేయర్ గారి కుటుంబ సభ్యులు, వారి అనుచరులు పాల్గొన్నారు.

దుండిగల్: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో బోనాల పండుగ సందర్భంగా నిజాంపేట్‌లోని వివిధ అమ్మవారి దేవాలయాలను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, కార్పొరేటర్ ప్రణయ ధనరాజ్ యాదవ్, మాజీ సర్పంచ్ శనిగల ప్రమీల సాయిలు యాదవ్, కుటుంబ సమేతంగా బోనాలు సమర్పించుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అమ్మవారి దయవల్ల ప్రజలంతా సురక్షితంగా సుభిక్షంగా ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎంసీ, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్, కార్పొరేటర్లు రవి కిరణ్, ఆగం రాజు, కాసాని సుధాకర్, నాయకులు, వివిధ కాలనీ వాసులు, భక్తులు పాల్గొన్నారు.



దుండిగల్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఆదివారం బోనాల పండుగ పలు దేవాలయాల్లో వైభవంగా నిర్వహించారు. బోనాల పండుగ సందర్భంగా రాష్ట్ర సీనియర్ నాయకులు కొలను శ్రీనివాస్ రెడ్డి నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో గల అమ్మ వారి ఆలయాల్లో ప్రత్యేక పూజలలో ముఖ్య అతిథిగా హాజరై పాల్గొన్నారు. అందరికీ సుప్రసిద్ధమైన శ్రీదుర్గాఅమ్మ వారి ఆలయ ధర్మకర్తగా శ్రీ కొలను శ్రీనివాస్ రెడ్డి సతీసమేతముగా బోనం, వస్త్రములు, సమర్పించారు. అలాగే నిజాంపేట్‌లోని 10 వ డివిజన్‌లోని పోచమ్మ గుడిలో, అంబేద్కర్ సర్కిల్‌లోని పోచమ్మ గుడిలో, 11 డివిజన్ నల్లపోచమ్మ గుడిలో ప్రత్యేకముగా రాజీవ్ గృహకల్పలో అమ్మ వారి గుడిలో మొదలు కొని నిజాంపేట్ మున్సిపల్‌లో అన్ని అమ్మ వార్ల ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



కూకట్‌పల్లి: బోనాల జాతర సందర్భంగా కూకట్‌పల్లి

లోని, చిత్తారమ్మ దేవాలయంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కుటుంబ సమేతంగా అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కూకట్‌పల్లి నియోజకవర్గం లోని పలు అమ్మవారి దేవాలయాలను సందర్శించి ప్రత్యేక పూజలో పాల్గొన్నారు.



కూకట్‌పల్లి: బోనాల పండుగ సందర్భంగా, కూకట్‌పల్లి మూసాపేట్‌లో కొలువుదీరిన, శ్రీ శ్రీ శ్రీ చిత్తారమ్మ అమ్మవారిని దర్శించుకున్న రాజ్యసభ సభ్యులు, బీఆర్ఎస్ పార్టీ సెక్రటరీ జనరల్, కే. కేశవరావు, మూసాపేట్ మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్ కుమార్ సందర్శించారు.



కూకట్‌పల్లి: కూకట్‌పల్లి చిత్తరమ్మ బోనాల జాతర సందర్భంగా, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు, చిత్తారమ్మ తల్లి దర్శనం చేసుకుని పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. కుటుంబ సమేతంగా వారి ఇంటి వద్ద నుంచి కూకట్‌పల్లి చిత్తారమ్మ తల్లి ఆలయానికి బోనం, ఒడిబియ్యంతో వచ్చి అమ్మవారికి సమర్పించారు. ఈ ఏడాది మంచి వర్షాలు పడి పుష్కలంగా పాడిపంట అభివృద్ధి చెందాలని, రైతు కళ్ళల్లో ఆనందం చూడాలని తెలియజేశారు.



కూకట్‌పల్లి: మూసాపేట్ కార్పొరేటర్ కొడిచెర్ల మహేందర్ ఆహ్వానం మేరకు, ఆషాడ బోనాల పండగ సందర్భంగా, ఆదివారం మూసాపేట్ చిత్తారమ్మ మాత దేవాలయంలో, ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ పార్లమెంట్ సభ్యురాలు, బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యురాలు, కూకట్‌పల్లి పాలక్ విజయశాంతి అమ్మవారి ఆశీస్సులు తీసుకున్నారు.



జిల్లా విశ్వకర్మ సెల్ కో కన్వీనర్‌గా శైలేష్ చారి

నవతెలంగాణ-కూకట్‌పల్లి



మేడ్చల్- మల్కాజ్గిరి అర్బన్ జిల్లా, బీజేపీ విశ్వకర్మ సెల్ కో కన్వీనర్‌గా ఈశ్వరోజు శైలేష్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆల్విన్ కాలనీలో తెలంగాణ రాష్ట్ర బీజేపీ విశ్వకర్మ సెల్ కో కన్వీనర్ నియామక పత్రం అందజేశారు. గోవర్ధన్ చారి మాట్లాడుతూ విశ్వకర్మల, అభ్యున్నతికి పాటుపడుతు ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖా చారి,వెంకట స్వామి, శివాజీ కస్తూరి, విద్యాసాగర్ చారి పాల్గొన్నారు.

అధ్యాత్మికవేత్త మనోహరరావుకు సత్కారం

నవతెలంగాణ-కల్చరల్

భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో కవి గాయకుడు ఈశ్వర చంద్ర విద్యా సాగర్ నిర్వహణలో రవీంద్రభారతి సమావేశ మందిరంలో రంగనాథ స్వామి ద్వాదశ గీతాల గానం ఆకట్టుకుంది. అనంతరం జరిగిన సభా కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త పాములపర్తి వెంకట మనోహర రావు పాల్గొని భక్తి సంగీతంలో ఈశ్వర చంద్ర విద్యాసాగర్ దిట్ట అని అభినందించారు. మాజీ శాసన సభ్యులు పాటి సుభద్రకు సేవా రత్న బిరుదును ప్రకటించారు. ఈశ్వర చంద్ర విద్య సాగర్ తాను రచించిన భాష అంగ సంగీతం సంపుటిని మంత్రి కే.తారక రామా రావుకు అంకిత మిస్తున్నట్లు ప్రకటించారు. వేదికపై మనోహరరావు దంపతులులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో సురభి శంకర శర్మ, వర ప్రసాద్,విజయ భాస్కర్ ప్రత్యూష తదితరులు సభలో పాల్గొన్నారు.



లాల్‌దర్వాజ మహంకాళి అమ్మవారిని దర్శించుకున్న జేటీసీ దంపతులు

నవతెలంగాణ-సిటీబ్యూరో

పాతబస్తీలోని లాల్‌దర్వాజ సింహవాహిని మహంకాళి అమ్మవారిని బోనాల జాతర పురస్కరించుకుని ఆదివారం హైదరాబాద్ జాయింట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్(జేటీసీ) జె.పాండురంగ నాయక్ దంపతులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలకు, భక్తులకు బోనాల పండుగ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ సంస్కృతిని చాటి చెప్పే పండుగ బోనాల పండుగ అని జేటీసీ అన్నారు. ఈ కార్యక్రమంలో సౌత్ జోన్ ఆర్టీవో సదానందం, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రభుత్వ బడులకు ఊరట

- తొలి విడుత కింద 50శాతం మేర నిర్వహణ నిధులు
- ఇందులోనే స్పోర్ట్స్ నిధులు కూడా..
- 691 పాఠశాలలు రూ.1.69కోట్లు విడుదల
- స్కూల్ మేనేజ్‌మెంట్ కమిట ఖాతాల్లో జమ
- ప్రధానోపాధ్యాయులకు తప్పనున్న నిర్వహణ భారం

నవతెలంగాణ-సిటీబ్యూరో

విద్యా సంవత్సరం ప్రారంభమైన నాటి నుంచి నిధుల లేమితో సతమతవుతున్న సర్కారు బడులకు ప్రభుత్వం భారీ ఊరటనిచ్చింది. ఈ విద్యాసంవత్సరం(2023-24) తొలి విడుత నిర్వహణ నిధులను తాజాగా విడుదల చేసింది. ఇందులో భాగంగా జిల్లావ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించి రూ.1.69 కోట్లు విడుదలయ్యాయి. విద్యాశాఖ అధికారులు కూడా ఈనిధులను స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ(ఎంఎస్‌సీ) ఖాతాల్లో జమ చేసింది. వీటిని పాఠశాల నిర్వహణకు ఇతర చిన్నపాటి మరమ్మత్తుల కోసం ఖర్చు చేయనున్నారు. కొవిడ్-19, మన బస్తీ-మనబడి అమలు నేపథ్యంలో సర్కారు కొన్నేండ్లుగా పాఠశాల నిర్వహణ నిధులు సకాలంలో విడుదల చేయకపోవడంతో జిల్లాలోని పలు స్కూళ్లు అరకొర వసతుల నడుమే నడుస్తున్నాయి. దానికితోడు పెరుగుతున్న ధరల మూలంగా బడుల్లో ఖర్చులు కూడా విపరీతంగా పెరిగిపోయాయి. నిర్వహణ కోసం ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు అనేక ఇబ్బందులు పడుతున్న తరుణంలో ఎట్టకేలకు రాష్ట్ర ప్రభుత్వం 50శాతం మేర నిధులు విడుదల చేయడంతో సర్కారు బడులకు ఆర్థిక భరోసా లభించినట్టయ్యిందని హెడ్‌మాస్టర్లు, టీచర్లు చెబుతున్నారు.

తీరనున్న సర్కారు బడి సమస్యలు!





హైదరాబాద్ జిల్లాలో 691 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలున్నాయి. వీటిలో 1,14,607 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. పాఠశాలల్లో 1-15 మంది విద్యార్థులుంటే.. రూ.12,500 మంజూరు చేస్తారు. 16 నుంచి 100 లోపు ఉంటే రూ.25 వేలు, 100 నుంచి 250 మందిలోపు ఉంటే రూ.50 వేలు, 251 నుంచి వెయ్యి లోపు ఉంటే రూ.75 వేలు, వెయ్యికి పైగా ఉంటే రూ.లక్ష వర కు నిధులు వస్తాయి. ఇక జిల్లావ్యాప్తంగా ఉన్న పాఠశాలలకు రూ.1.69కోట్లు నిధులు అందాయి. ఇందులో స్పోర్ట్స్ గ్రాంట్స్ కూడా ఉన్నాయి. వీటిని ఎస్ఎంసీ తీర్మానాలతో పాఠశాలలో నిర్వహణకు నిధులను వినియోగించుకునే అధికారాలు హెడ్‌మాస్టర్లకు ఉన్నాయి. ఈ నిధులతో విద్యుత్తు, స్టేషనరీ, చాక్‌పీస్‌లు, గదులకు సున్నం, చిన్న మరమ్మతులు, తాగునీరు, స్పోర్ట్స్ కిట్, వివిధ సామగ్రి మరమ్మతు వంటి వాటికి ప్రధానోపాధ్యాయులు ఖర్చు చేస్తారు. ఈ నిధులను సమగ్ర శిక్షా(ఎస్ఎస్) ద్వారా అందజేస్తారు. మొత్తం రెండు విడుతల్లో ప్రభుత్వం ఈ నిధులు అందజేస్తోంది. అయితే ఈ నిధులను పీఎఫ్ఎంఎస్ ఖాతాల్లో జమ చేస్తుండడంతో ఇబ్బందులు తప్పడం లేదని పాఠశాల ప్రధానోపాధ్యాయులు చెబుతున్నారు. పీఎఫ్ఎంఎస్ ఖాతాల్లో వేసిన నిధులు, వాటి ఖర్చులకు సంబంధించి ప్రతి బిల్లుకు జీఎస్టీ తప్పనిసరి. ప్రతి బిల్లును జీఎస్టీతో పాటు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. అసలే అరకొర నిధులతో నెట్టుకొస్తున్న స్కూళ్లకు అదనంగా జీఎస్టీ బిల్లు తొడవ్వడంతో ఆ కాస్త నిధులు నష్టపోతున్నామని హెచ్ఎంలు వాపోతున్నారు.

అంటు వ్యాధులపై అవగాహనా సదస్సు

నవతెలంగాణ-సిటీబ్యూరో



అంటు వ్యాధులపై షెరటాన్ హైదరాబాద్ హోటల్‌లో మెడికవర్ హాస్పిటల్స్ ఇంటర్నల్ మెడిసిన్ విభాగం ఆధ్వర్యంలో అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మెడికవర్ హాస్పిటల్స్ క్లినికల్ సర్వీసెస్ డైరెక్టర్ అండ్ సీనియర్ ఇంటర్వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ శరత్‌రెడ్డి, విశిష్ట అతిథిలుగా సీనియర్ కన్సల్టెంట్ న్యూరాలజిస్ట్ డాక్టర్ హరిరాధకృష్ణ, సీనియర్ కన్సల్టెంట్ న్యూరో సర్జన్ డాక్టర్ శ్రీకాంత్ రెడ్డి, వివిధ విభాగాల డాక్టర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి డాక్టర్ శరత్‌రెడ్డి మాట్లాడుతూ మెడికవర్ హాస్పిటల్స్ ఇలాంటి ఎడ్యుకేషనల్ కాన్ఫరెన్స్ నిర్వహించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఇంటర్నల్ మెడిసిన్ విభాగం వైద్య నిపుణులు డాక్టర్ నందన జాస్తి, డాక్టర్ మిథిల్ గుసే, డాక్టర్ లక్ష్మీకాంత్ రెడ్డి, డాక్టర్ నవీన్ కుమార్ మాట్లాడుతూ ఈ సదస్సు ముఖ్య ఉద్దేశం కష్టమైన లేదా అరుదైన అంటు వ్యాధుల నేపథ్యంలో అవగాహన పెంచడం, సంసిద్ధతను పెంపొందిండమే అన్నారు. అంటు వ్యాధులు దేశాలను ప్రభావితం చేసే ఒక ముఖ్యమైన ప్రపంచ సవాలుగా మారతాయనీ, ఇది వైరల్ వ్యాప్తి, బాక్టీరియల్ ఇన్ఫెక్షన్ లేదా కొత్త వ్యాధికారక ఆవిర్భావమైన, అంటు వ్యాధుల ప్రభావం తీవ్రంగా, చాలా దూరం ఉంటుందన్నారు. ఆరోగ్య సంరక్షణ నిపుణులు, సాధారణ ప్రజలకు సమాచారం ఇవ్వడం, అవసరమైన జ్ఞానాన్ని పొందడం, అంటు వ్యాధులతో సంబంధం ఉన్న ప్రమాదాలను తగ్గించడానికి నివారణ చర్యలను అనుసరించడం అత్యవసరం. అన్నారు. మెడిసిన్‌లోని వివిధ సూపర్-స్పెషాలిటీల నుంచి ప్రఖ్యాత స్పీకర్లను ఒకచోట చేర్చడం ద్వారా, మెడికవర్ హాస్పిటల్స్ వివిధ మెడిసిన్ సూపర్-స్పెషాలిటీ విభాగాల సహకార ప్రయత్నాలను ప్రోత్సహించడం, అంటు వ్యాధులను సమర్థవంతంగా ఎదుర్కోవడానికి సంసిద్ధత వ్యూహాలను మెరుగుపరచడం లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపారు. మెడికవర్ హాస్పిటల్స్‌కు చెందిన ప్రముఖ వైద్యులు, నిపుణులు తమ విలువైన నైపుణ్యాన్ని పంచుకుంటూ సదస్సులో ప్రసంగించారు. ఈ నిపుణులు వ్యాధి నివారణ చర్యలు, రోగనిర్ధారణ పద్ధతుల్లో పురోగతి, వినూత్న చికిత్సా విధానాలు, కమ్యూనిటీ-ఆధారిత జోక్యాలతో సహా అనేక రకాల అంశాలపై ప్రదర్శనలను అందించారు. ఈ కార్యక్రమంలో 200కి పైగా వివిధ కళాశాలల నుంచి మెడికల్ కాలేజీ స్టూడెంట్స్ పాల్గొన్నారు.

ఘనంగా బోనాల ఊరేగింపు

నవతెలంగాణ-సిటీబ్యూరో



సబ్జిమండి-నటరాజ్‌నగర్ ఉమ్మడి ఆలయాల ఆధ్వర్యంలో ఘనంగా రెండు కిలోమీటర్ల పొడవున అత్యంత భక్తి శ్రద్ధలతో తలపైన బోనంతో సామూహికంగా ఆడపడచులు బోనాలను ఊరేగించారు. 1922 నుంచి ఇక్కడి ప్రాచీన మందిరాలైన శ్రీ నల్లపోచమ్మ, శ్రీ మహంకాళి దేవి అమ్మవార్లకు భక్తిభావంతో బోనాలను సమర్పించి అమ్మవార్లను అప్పటి నుంచి నేటి వరకు నిరాటంకంగా బోనాలు సమర్పిస్తున్నారు. ఇక్కడి 14 బస్తీవాసులు ఒక కమిటీగా ఏర్పడి ప్రతి ఏడాదీ ఆషాఢ మాసం చివరి ఆదివారం అమ్మవారికి సామూహిక బోనాలు సమర్పించడం ఒక ఆనవాయితీగా పాటిస్తూ వస్తున్నారు. బోనాల పండుగను పురస్కరించుకుని సబ్జిమండిలోని శ్రీశ్రీశ్రీ నల్లపోచమ్మ, శ్రీ మహంకాళి దేవి మందిరం ఉమ్మడి ఆలయాల ఆధ్వర్యంలో 101వ వార్షిక బోనాల ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్టు ఉత్సవ అధ్యక్షులు ప్యాట నందకిశోర్ తెలిపారు. ఆదివారం సబ్జిమండిలో ఉన్న శ్రీ మహంకాళి ఆలయం నుంచి మహిళలు సాముహికంగా బయలుదేరి నటరాజ్‌నగర్‌లోని నల్లపోచమ్మ ఆలయంలో బోనాలను సమర్పించనున్నారు. ఈ సందర్భంగా ఏనుగు అంబారీపై అమ్మవారి ఘటాన్ని అతి సుందరంగా అలంకరణ చేసి జానపద కళాకారుల నత్యాలు, పోతరాజుల విన్యాసాలు, వాయిద్యాల సందడి నడుమ మహిళలు, చిన్నారులు, యువకులు ఎంతో ఉత్సాహంగా వెంటరాగా.. ఊరేగింపును ఎంతో కన్నులపండుగగా నిర్వహించనున్నట్టు ఆయన తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లను చేసినట్టు, ప్రభుత్వ, పోలీసు శాఖల సమన్వయం, సహకారంతో ఊరేగింపు జరగనున్నట్టు ఆయన తెలిపారు. భక్తిశ్రద్ధలతో అమ్మవారిని పూజించాలని ఉత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి కుడుముల రాకేశ్ ఈ సందర్భంగా ప్రజలను కోరారు. 101వ వార్షిక బోనాల మహోత్సవానికి ఆహ్వానం పలికిన వారిలో కోశాధికారి కట్ట శ్రీనివాస్, గంగపుత్ర సంఘం అధ్యక్షులు అనందేవీ, విజయ్ కిశోర్, కమిటీ సలహాదారులు కట్ట రాజయ్య, గుడబోయిన శివరత్నం, జలగల వేణు, బుర్ర వేణుకుమార్, కట్ట శివరాజ్, కట్ట నర్సింగ్‌రావు, ఆవుశెట్టి శ్యామ్ సుందర్, నిరంజన్ బాబు, కమిటీ సభ్యులందరూ పాల్గొన్నారు.

ఐటీ ఉద్యోగులకు కిడ్నీల్లో రాళ్లు

- ఎక్కువగా ఏసీలో ఉండి.. నీళ్లు తాగకపోవడం వల్లే సమస్య
- కొందరిలో ప్రొస్టేట్ క్యాన్సర్లు కూడా..
- ఆలస్యంగా పెళ్లి.. ఆపై సంతానరాహిత్యం..
- ప్రీతి యూరాలజీ, కిడ్నీ హాస్పిటల్ ఎండీ డాక్టర్ చంద్రమోహన్
- ఘనంగా ఆస్పత్రి రెండో వార్షికోత్సవం



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఐటీ రంగంలో చాలామంది ఎక్కువ సమయం ఏసీలలో గడపడం వల్ల మంచినీళ్లు సరిగా తాగడం లేదనీ, అందువల్ల వారికి కిడ్నీల్లో రాళ్లు ఏర్పడే సమస్య ఎక్కువగా కనిపిస్తోందని ప్రీతి యూరాలజీ హాస్పిటల్ ఎండీ, చీఫ్ యూరాలజిస్టు డాక్టర్ చంద్రమోహన్ తెలిపారు. కొందరిలో ప్రొస్టేట్ క్యాన్సర్లు కూడా కనిపిస్తున్నట్టు ఆయన చెప్పారు. ఇక ఈ రంగంలోని పురుషులు ఆర్థికంగా స్థిరపడి, ఆలస్యంగా పెండ్లి చేసుకోవడంతో వారిలో కొందరికి అంగస్తంభన సమస్యలు, కొందరికి వేరే తరహా సమస్యల వల్ల సంతానరాహిత్యం కూడా ఎక్కువగా ఉంటోందని వివరించారు. వీటన్నింటికీ తమ ఆస్పత్రిలో వైద్యపరమైన, శస్త్రచికిత్సల పరమైన పరిష్కారాలు ఉన్నట్టు ఆయన వెల్లడించారు. ప్రీతి కిడ్నీ అండ్ యూరాలజీ ఆస్పత్రి రెండో వార్షికోత్సవాన్ని ఆస్పత్రి ప్రాంగణంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఐటీ, సాఫ్ట్‌వేర్ పరిశ్రమ బాగా స్థిరపడిన ఈ ప్రాంతంలో ఆయా రంగాల్లోని ఉద్యోగులు, వాళ్ల తల్లిదండ్రులకు సేవలు అందించేందుకు ఈ ఆస్పత్రి బాగా పని చేస్తోందని ఆయన ప్రశంసించారు. ఆస్పత్రి ఎండీ డాక్టర్ చంద్రమోహన్ మాట్లాడుతూ'70 పడకల ఆస్పత్రిగా ప్రారంభించిన ఈ హాస్పిటల్‌లో గడిచిన రెండేండ్లలో 2 వేలకు పైగా వివిధ ప్రొసీజర్లు చేశాం. ఇక్కడ అన్ని రకాల లాప్రోస్కొపీ, లేజర్, అడ్వాన్స్‌డ్ సర్జరీలు చేస్తున్నాం. 12 మంది వైద్యులు సహా మొత్తం 75 మంది సిబ్బంది ఉన్నారు. ఈ రెండేండ్లలో దాదాపు 100కు పైగా గేటెడ్ కమ్యూనిటీల్లో ప్రీతి కిడ్నీ ఆస్పత్రి ద్వారా అవగాహనా శిబిరాలు నిర్వహించి, అసలు కిడ్నీ ఆరోగ్యం అంటే ఏంటో, యూరిన్ ఔట్‌పుట్, డయాబెటిస్, బీపీ అంటే ఏంటో చెప్పాం. దాంతో వారు అవగాహన పెంచుకుని స్వయంగా తాము రావడంతో పాటు తమ తల్లిదండ్రులను కూడా తీసుకొస్తున్నారు. ఇక్కడ పెద్ద ఆస్పత్రి కావడం, సింగిల్ స్పెషాలిటీ కావడంతో కిడ్నీలు-యూరాలజీకి సంబంధించి ఎలాంటి అనారోగ్యం వచ్చినా వెంటనే గుర్తించి ఇక్కడకు వస్తున్నారు. మా ఆస్పత్రికి వచ్చేవారిలో ఎక్కువమంది ఐటీ, కార్పొరేట్ ఉద్యోగులు, వాళ్ల కుటుంబ సభ్యులే ఉంటున్నారు. ఐటీ రంగంలోని మహిళల్లో కొందరికి యూరిన్ లీక్‌కావడం లాంటి సమస్యలు, పెద్ద వయసు వారికైతే ప్రొస్టేట్, ఇతర క్యాన్సర్లు కనిపిస్తున్నాయి. చాలా మంది లాప్రోస్కాపిక్ సర్జరీలపై ఆసక్తి చూపడం ఇక్కడ మరో విశేషం.

తక్కువ ధరలకే ప్యాకేజీలు

ఈ ప్రాంతవాసుల ఆరోగ్యాన్ని సంరక్షించాలన్న లక్ష్యంతో జనరల్ హెల్త్ చెకప్, కిడ్నీ చెకప్ ప్యాకేజీలను తక్కువ ధరలకే పెట్టాం. ఆదివారాలు ప్రత్యేకంగా 600-700 స్థాయిలోనే అల్ట్రాసౌండ్ స్కానింగ్ సహా సగం ధరకే కిడ్నీ హెల్త్ చెకప్ ప్యాకేజీలు అందిస్తున్నాం. దాంతో మేం నిర్వహించిన అవగాహనా శిబిరాలకు తోడు ఇంటర్‌నెట్ ద్వారా మరికొంత తెలుసుకుని, ముందు జాగ్రత్తగా కిడ్నీ ఆరోగ్యాన్ని కాపాడుకోడానికి ఎక్కువమంది వస్తున్నారు. దీంతో కిడ్నీ క్యాన్సర్లు, బ్లాడర్ క్యాన్సర్లు, కిడ్నీ వైఫల్యాలతో ఎవరూ మరణించకుండా ముందు జాగ్రత్తగా చికిత్సలు, పరీక్షలు అందిస్తున్నాం. ప్రస్తుతం ఆహారంలో ఉప్పు ఎక్కువగా తీసుకోవడం, మాంసాహారం వల్ల ఇవి వచ్చే ముప్పు ఉంది" అని డాక్టర్ చంద్రమోహన్ వివరించారు.

మూడు ప్రాంగణాల్లో చికిత్సలు

ప్రీతి యూరాలజీ అండ్ కిడ్నీ ఆస్పత్రి 2006లో చిన్న క్లినిక్‌గా ప్రారంభమైంది. 2012లో 50 పడకలతో కేపీహెచ్‌బీ ప్రాంతంలో పూర్తిస్థాయి ఆస్పత్రిగా ఏర్పాటైంది. 2018లో బీహెచ్ఈఎల్‌లో 100 పడకల ఆస్పత్రిని ప్రారంభించారు. ఈ ఆస్పత్రికి నీట్ ద్వారా డీఎన్‌బీ యూరాలజీ సీట్లు కూడా ఉండటం గమనార్హం. 2021లో కరోనా సమయంలో ఎమర్జెన్సీ ఆస్పత్రిని ప్రారంభించగా, తర్వాత అది యూరాలజీ ఆస్పత్రిగా మారింది. ఇక్కడ యూరాలజిస్టులు డాక్టర్ హేమ్‌నాథ్, డాక్టర్ రాకేష్, డాక్టర్ కార్తీక్, నెఫ్రాలజిస్టు డాక్టర్ శ్యాంసుందర్, కార్డియాలజిస్టు డాక్టర్ అజిత్ కుమార్, రేడియాలజిస్టు డాక్టర్ రూప, తదితరులు పూర్తి స్థాయిలో సేవలు అందిస్తున్నారు. ప్రధానంగా ఇక్కడ జనరల్, అడ్వాన్స్‌డ్ యూరాలజీ శస్త్రచికిత్సలు, లేజర్ ద్వారా కిడ్నీల్లో రాళ్ల తొలగింపు, ఆండ్రాలజీ, నెఫ్రాలజీ, కార్డియాలజీ సేవలు ఉన్నాయి. లేజర్, కీహోల్ పద్ధతుల ద్వారా యూరాలజీ, ఎండోయూరాలజీ శస్త్రచికిత్సలకు కూడా ఈ హాస్పిటల్ పెట్టింది పేరు.

బీసీలను మరోసారి మోసం చేసిన బీఆర్ఎస్

-చేతివత్తిదారులను మోసం చేసిన రాష్ట్ర ప్రభుత్వం

-ప్రజా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ దాసరి అజయ్ కుమార్

నవతెలంగాణ-సిటీబ్యూరో

బీసీ డిక్లరేషన్ల పేర్లతో బీజేపీ ,కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు బీసీలను మోసం చేస్తున్నాయి అని ప్రజా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ దాసరి అజయ్ కుమార్ యాదవ్ అన్నారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం బీసీ కులాల చేతివత్తులకు రూ.లక్ష ఆర్థిక సాయం అందించడంలో విఫలమైందన్నారు. బీఆర్ఎస్ పార్టీ మరోసారి బీసీలను మోసం చేసిందన్నారు. బీసీలు అంటే రాష్ట్ర ప్రభుత్వానికి చులకనగా కనిపిస్తున్నారన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ.లక్ష ఆర్థిక సాయం కోసం సుమారు 5,30,000 దరఖాస్తులు వస్తే ఒక్కొక్క నియోజకవర్గానికి 300 మందిని ఎంపిక చేయడం సరికాదన్నారు. ఎన్నికలు వచ్చినప్పుడే బీజేపీ, బీఆర్ఎస్ ,కాంగ్రెస్ పార్టీలకు బీసీలు గుర్తుకు వస్తారన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ బీసీ కుల గణన చేయకుండా బీసీ డిక్లరేషన్ ప్రకటించడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రజా పార్టీ అధికారంలోకి వస్తే బీసీలకు రూ.లక్ష కోట్లు బడ్జెట్ కేటాయిస్తామన్నారు. బీసీలకు 70 అసెంబ్లీ స్థానాలను, బీసీని సీఎంను చేస్తామన్నారు. ప్రజా పార్టీని బహుజనులంతా సొంతం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

ఆన్‌లైన్ మర్చండైజ్ స్టోర్ 'కేఫ్ లైఫ్' ప్రారంభం

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఇండియాలో అత్యంత దిగ్గజ బ్రాండ్‌లలో ఒకటైన కింగ్‌ఫిషర్, ఇప్పుడు తమ మొట్టమొదటి ఆన్‌లైన్ మర్చండైజ్ స్టోర్ 'కేఫ్ లైఫ్'ను ప్రారంభించింది. బెంగుళూరు కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహించే "ద ఫాంటమ్"తో ఈ ఉత్తేజకరమైన భాగస్వామ్యంతో, దేశవ్యాప్తంగా అభిమానులకు ప్రత్యేకమైన కింగ్‌ఫిషర్ మర్చండైజ్‌ను అందిస్తుంది, వీటిలో స్టైలిష్ బార్ యాక్సెసరీస్, ఆకర్షణీయమైన బోర్డ్ గేమ్స్, అందమైన వాల్ అలంకరణ వస్తువులు, అధునాతన దుస్తులు అందుబాటులో ఉంటాయి.' దేశంలోని అత్యంత ప్రసిద్ధ బ్రాండ్‌లలో కింగ్‌ఫిషర్ ఒకటి. మేం మా అభిమానుల కోసం ప్రత్యేకమైన బ్రాండ్ స్టోర్‌ను ప్రారంభిస్తున్నాం. వారు కేఫ్ లైఫ్‌లోకింగ్‌ఫిషర్ బ్రాండెడ్ మర్చండైజ్‌ను కొనుగోలు చేయవచ్చు. దీని ధరను ప్రజల్లో ఉండే అన్వేషణాత్మక ఆలోచనను దష్టిలో ఉంచుకుని రూపొందించాం. ద ఫాంటమ్‌తో మా సహకారం అనేది, కింగ్‌ఫిషర్‌కి చెందిన దిగ్గజ తత్వానికి తగినట్లుగా ఉండేలా అసరమైన, అధిక నాణ్యత గల ఉత్పత్తులను అందించడానికి మాకు వీలు కల్పిస్తుంది" అని చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ విక్రమ్ బహల్ తెలిపారు.



గాంధీ ఆస్పత్రికు ఎదురుగా ఉన్న బోంయిగూడలోని టింబర్‌డిపో వద్ద వీజేటీఎన్ఏయూ టీచర్స్ హోమ్ కాన్ఫరెన్స్ హాల్‌లో హెచ్ఆర్‌డీపీ గురించి, రానున్న టీఎస్ఎంసీ ఎన్నికలు, వాటి ఉపయోగం గురించి 'హెచ్ఆర్‌డీపీ మీట్ విత్ గాంధీ మెడికల్ కాలేజీ ఫ్యాకల్టీ, జూడాలు' కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశంలో క్యాన్సర్ స్పెషలిస్టు డాక్టర్ చింతమడక సాయిరాం తన సందేశాన్ని ఇచ్చారు.

-నవతెలంగాణ-సిటీబ్యూరో

రంగారెడ్డి కోర్టు ఆవరణలో బోనాలు



నవతెలంగాణ-సిటీబ్యూరో

రంగారెడ్డి జిల్లా కోర్టులో బోనాల పండుగ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షులు డికొండ రవీందర్, ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల మాధవ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అమ్మవారి బోనాల జాతరకి ముఖ్య అతిథిగా ప్రిన్సిపాల్ డిస్ట్రిక్ట్ జడ్జి సి.హరెకష్ణ భూపతి, మెట్రోపొలిటన్ సెషన్స్ జడ్జి కె.పట్టాభి రామారావు హాజరయ్యారు. రంగారెడ్డి జిల్లా కోర్టు న్యాయవాదులు అమ్మ వారికి పోతరాజుల ఆటలతో ప్రత్యేక బోనం సమర్పించి అమ్మవారి అశీస్సులు పొందారు. ఈ బోనాల జాతరలో రంగారెడ్డి జిల్లా బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు సల్లా వినోద్ కుమార్, సంయుక్త కార్యదర్శి చక్రాల రాంచందర్, మహిళా ప్రతినిధి జ్యోతి దేవర కొండ, కోశాధికారి ముక్కల రామకష్ణ, గ్రంథాలయ కార్యదర్శి రామకష్ణ యగ్నమర్తి, క్రీడా విభాగం కార్యదర్శి పెద్దగోని సందీప్‌గౌడ్, కార్యవర్గ సభ్యులు అనితా జూపల్లి, వి.దీప్తి నాగేందర్, కె.రామకష్టారెడ్డి, జి.గోపాల్, గణపురం వెంకట్ రెడ్డి, బజారు కిరణ్ కుమార్‌గౌడ్, సాయికుమార్‌రెడ్డి, పాల్గొన్నారు.

బీసీ ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలి

ఎంపీ ఆర్ కృష్ణయ్య

నవతెలంగాణ-అడిక్‌మెట్



పంచాయతీరాజ్ సంస్థలో బీసీ రిజర్వేషన్లను 34శాతం నుండి 52శాతానికి పెంచాలని, ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఎంపీ ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఆదివారం ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన బీసీ మహాగర్జన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎం పీ ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ పార్లమెంటులో బిల్లు పెట్టాలని, 50శాతం రిజర్వేషన్లు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం త్వరలో చేపట్టబోయే జనాభా గణనలో బీసీకుల గణన చేపట్టాలన్నారు. పంచాయతీరాజ్ సంస్థలో బీసీ రిజర్వేషన్లను 34 శాతం నుండి 52 శాతానికి పెంచాలని రిజర్వేషన్లకు రాజ్యాంగ భద్రత కల్పించాలి అని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించాలని, ఇందుకు రాజ్యాంగ సవరణ చేయాలన్నారు. కేంద్రంలో వారికి ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసి అభివృద్ధికి విద్యా అభివృద్ధికి ప్రత్యేక స్కీములను ఏర్పాటు చేయాలన్నారు. విద్యా, ఉద్యోగ రిజర్వేషన్ల పై ఉన్న క్రీమీ లేయర్‌ను తొలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ తదితర నాయకులు పాల్గొన్నారు.



బోనాల పండుగ సందర్భంగా ఖైరతాబాద్ నియోజకవర్గంలో ఖైరతాబాద్ డీసీసీ అధ్యక్షులు డా.సి రోహిన్‌రెడ్డి నియోజకవర్గంలోని అన్ని డివిజన్లలోనీ ఆలయాలను సందర్శించారు. బోనాల ఉత్సవాలలో హిమాయత్ నగర్ డివిజన్ అధ్యక్షులు సమీర్,బబ్లూ, బంజారాహిల్స్ డివిజన్ అధ్యక్షులు గొల్యల రాజు, జూబ్లీహిల్స్ డివిజన్ అధ్యక్షులు కాటూరి రమేష్, వెంకటేశ్వర కాలనీ డివిజన్ అధ్యక్షులు శ్రీనివాస్ యాదవ్, సోమజిగూడా డివిజన్ అధ్యక్షులు నరేశ్, నియోజకవర్గ ముఖ్య నాయకులు దిలీప్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, తదితరులతో కలిసి భాగస్వాములయ్యారు.

నవతెలంగాణ-బంజారాహిల్స్



బోనాల జాతర సందర్భంగా జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్‌లో గ్యానీజైల్ సింగ్ నగర్, బీజెఆర్ నగర్, అంబేద్కర్ నగర్, స్వామి వివేకానంద నగర్,రాజా రాజేశ్వరి అమ్మవారి గుడి,స్వామి వివేకా నంద నగర్,గురు బ్రహ్మ నగర్, ఇంద్రనగర్,జవహర్ నగర్,గాయత్రి హిల్స్ బస్తీలలో జరిగిన బోనాల ఉత్సవాల పాల్గొని ప్రత్యేక పూజలు చేసి అమ్మవారి ఆశీర్వాదం తీసుకున్న ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్,జూబ్లీహిల్స్ డివిజన్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్, ఆలయ కమిటీలు బస్తీ అధ్యక్షులు కార్యదర్శులు మహిళా నాయకురాలు యువజన నాయకులు పెద్ద ఎత్తున స్వాగతం పలికారు. జూబ్లీహిల్స్ డివిజన్ బిఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు మహిళలు యువకులు పాల్గొన్నారు. అధికారులు సరైన వసతులు కల్పించుకోవడం పట్ల భక్తులు నిరాశ, ఆగ్రహాన్ని కూడా వ్యక్తపరిచారు. ఆలయం వద్ద చెట్టుకు ప్రత్యేక పూజలు చేయడంతో పాటు టెంకాయలు దిపదరణ చేసి వాటిని సరైన విధానంలో శుభ్రం లేకపోవడం వల్ల ఎక్కడికక్కడే ఆ ప్రాంతంలో పూజ చేయడానికి వసతి లేకపోవడంతో ప్రధాన రహదారిపై భక్తులు పూజలు చేశారు.

- నవతెలంగాణ-బంజారాహిల్స్

బోనం సమర్పించిన ఈటెల

నవతెలంగాణ-ఓయు



బీజేపీ సీనియర్ నాయకుడు ఈటెల రాజేందర్ ఆదివారం బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాని ఆధ్వర్యంలో చిలకగూడ కట్టమైసమ్మ అమ్మవారి ఆలయంలో బోనం సమర్పించారు.

దీక్షను సందర్శించిన ఈటెల రాజేందర్

నవతెలంగాణ-ఓయూ



మనికేశ్వరి నగర్ భవిష్యత్ తరానికి ఆస్పత్రి నిర్మిద్దామని 104వ, రోజు దీక్షకు బీజేపీ హుజురాబాద్ ఎమ్మెల్యే, ఈటెల రాజేంద్ర ఆదివారం దీక్ష శిబిరానికి సందర్శించి సంఘీభావం తెలియజేశారు. ఈటెలకు మనికేశ్వర్ నగర్ అఖిలపక్షం తరపున ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ హాస్పటల్ అందరికీ ఉపయోగపడేదని, ఇలాంటి ఒక మంచి కార్యక్రమానికి ఆస్పత్రి నిర్మించడానికి నా వంతు సహాయ సహకారాలు తప్పకుండా అందిస్తానని, అలాగే ప్రభుత్వ అధికారులతో మాట్లాడి ఆస్పత్రి ఏర్పాటు కోసం నా ప్రయత్నం చేస్తాను అని చెప్పారు.కార్యక్రమంలో స్థానిక నేతలు,ప్రజలు,నిర్వాహకులు పాల్గొన్నారు.

బోనాలకు జిల్లా, వైద్య ఆరోగ్యశాఖ ఏర్పాట్లు



నవతెలంగాణ-సిటీబ్యూరో

బోనాల సందర్భంగా హైదరాబాద్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ విస్త్రత ఏర్పాట్లు చేసింది. జిల్లాలో 40 సెంటర్స్‌లలో భక్తుల కోసం మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేశారు. వైద్యులు, వైద్య సిబ్బది నిరంతరం భక్తులకు సేవలు అందిస్తున్నారు. భక్తులు ఎక్కువగా ఉన్న ఆలయాల వద్ద 15 అంబులెన్స్‌లను సైతం ఏర్పాటు చేశారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ జె.వెంకటి ప్రతి క్యాంపునీ సందర్శించి స్వయంగా భక్తులకు సేవలు అందిస్తున్నారు. ఈ సందర్భంగా డీఎఅండ్‌హెచ్ పరీక్షించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ లక్ష్మణ్, డాక్టర్ అన్నపూర్ణ, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మర్చండైజ్ స్టోర్ 'కేఫ్ లైఫ్' ప్రారంభం

నవతెలంగాణ-సిటీబ్యూరో

ఇండియాలో అత్యంత దిగ్గజ బ్రాండ్‌లలో ఒకటైన కింగ్‌ఫిషర్, ఇప్పుడు తమ మొట్టమొదటి ఆన్‌లైన్ మర్చండైజ్ స్టోర్ 'కేఫ్ లైఫ్'ను ప్రారంభించింది. బెంగుళూరు కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహించే "ద ఫాంటమ్"తో ఈ ఉత్తేజకరమైన భాగస్వామ్యంతో, దేశవ్యాప్తంగా అభిమానులకు ప్రత్యేకమైన కింగ్‌ఫిషర్ మర్చండైజ్‌ను అందిస్తుంది, వీటిలో స్టైలిష్ బార్ యాక్సెసరీస్, ఆకర్షణీయమైన బోర్డ్ గేమ్స్, అందమైన వాల్ అలంకరణ వస్తువులు, అధునాతన దుస్తులు అందుబాటులో ఉంటాయి.' దేశంలోని అత్యంత ప్రసిద్ధ బ్రాండ్‌లలో కింగ్‌ఫిషర్ ఒకటి. మేం మా అభిమానుల కోసం ప్రత్యేకమైన బ్రాండ్ స్టోర్‌ను ప్రారంభిస్తున్నాం. వారు కేఫ్ లైఫ్‌లోకింగ్‌ఫిషర్ బ్రాండెడ్ మర్చండైజ్‌ను కొనుగోలు చేయవచ్చు. దీని ధరను ప్రజల్లో ఉండే అన్వేషణాత్మక ఆలోచనను దష్టిలో ఉంచుకుని రూపొందించాం. ద ఫాంటమ్‌తో మా సహకారం అనేది, కింగ్‌ఫిషర్‌కి చెందిన దిగ్గజ తత్వానికి తగినట్లుగా ఉండేలా అసరమైన, అధిక నాణ్యత గల ఉత్పత్తులను అందించడానికి మాకు వీలు కల్పిస్తుంది" అని చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ విక్రమ్ బహల్ తెలిపారు.

దోమలగూడ గ్యాస్ లీకేజ్ ఘటనలో ఆరుకు చేరిన మృతుల సంఖ్య

కన్నీరుమున్నిరవుతున్న బంధువులు



నవ తెలంగాణ- అడిక్ మెట్

దోమలగూడ గ్యాస్ లీకేజ్ ఘటనలో మరో ఒకరు మృత్యువాత పడ్డారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయ పడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతి చెందిన వారి సంఖ్య ఆరు కు చేరింది. వీరిలో విహన్ (4) ఆదివారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. దోమలగూడ పోలీస్ స్టే షన్ పరిధిలోని దోమలగూడ రోజ్ కాలనీలో ఈనెల 11న పిండి వంటలు చేస్తుండగా గ్యాస్ లీకేజీ అయి మంటలు అంటుకోవడంతో ఏడుగురు తీవ్రంగా గాయపడ్డారు. వారిని వెంటనే గాంధీ ఆస్పత్రికి తర లించి చికిత్స అందజేశారు. అయితే గాయపడిన వారిలో విహన్ (4) చికిత్స పొందుతూ మృతి చెం దాడు. శనివారం నాగమణి (38), రెండు రోజుల క్రితం ఈనెల 14న పద్మ (53), ఆమె కూతురు ధనలక్ష్మి (28), ధనలక్ష్మి కుమారుడు అభినవ్ (7) మృతి చెందగా 12వ తేదీ ధన లక్ష్మి కూతురు శరణ్య చికిత్స పొందుతూ మృతి చెందింది. దీంతో గ్యాస్ లీకేజీ అయి మంటలు అంటు కున్న ఘటనలో మృతుల సంఖ్య ఆరుకు చేరింది. 7 రోజుల వ్యవధి లోనే ఒకే కుటుంబానికి చెందిన మొత్తం ఆరుగురు చనిపోవడంతో స్థానికంగా విషాదఛాయలు అలుముకున్నాయి. ఇదే ఘటనలో గాయపడిన ఆనంద్ (41) ప్రస్తుతం ఆస్పత్రిలో చికిత్స పొందుతు న్నాడు అతని పరిస్థితి కూడా విషమంగా ఉందని వైద్యులు తెలిపారు.

అక్టోబర్‌లో తెలంగాణ అరసం రాష్ట్ర మహాసభలు



నవతెలంగాణ-సుల్తాన్ బజార్

తెలంగాణ అభ్యుదయ రచయితల సంఘం (అరసం) రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఆదివారం మగ్దూర్ భవన్‌లో నిర్వహించారు. అరసం రాష్ట్ర అధ్యక్షులు ఆర్వీ రామారావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అరసం తెలంగాణ రాష్ట్ర మహా సభలను అక్టోబర్‌లో హైదరాబాద్‌లో నిర్వహించాలని తీర్మానించారని తెలిపారు. ఇటీవల మేధావులను, కళాకారులను అణచడానికి ఉపా చట్టం ప్రయోగించడం, యూనిఫామ్ సివిల్ కోడ్ కోసం యత్నించడం మొదలైన ప్రజా స్వామ్య వ్యతిరేక ప్రభుత్వ కార్యకలాను ఈ సభ ఖండించింది. జి. చంద్రమోహన్ గౌడ్, కన్నం లక్ష్మీనారాయణ తాజా పాటల్ని వినిపించారు. వేల్పుల నారాయణ, నిధి, బి. నాగ భూషణం, ప్రధాన కార్యదర్శి డాక్టర్ రాపోలు సుదర్శన్, పల్లేరు వీరస్వామి, కెవిఎల్. ఏలేశ్వరం వెంకటేశం, వై. లెనిన్‌లు తదితరులు పాల్గొన్నారు.

శ్రీలంకబస్తీలో మన్నె క్రిశాంక్ 17వ బస్తీనిద్ర



నవతెలంగాణ-కంటోన్మెంట్

రాష్ట్ర మినరల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మన్నె క్రిశాంక్ కంటోన్మెంట్ 2వ వార్డులోని శ్రీలంక బస్తీ, రసూల్‌పురాలో 17వ బస్తీ నిద్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 400 మంది స్థానికులు పాల్గొన్నారు. సందర్భంగా స్థానికులు మాట్లాడుతూ పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. ముఖ్యంగా కంటోన్మెంట్ బోర్డు నిర్లక్ష్యం కారణంగా డ్రయినేజీ సమస్య అధికంగా ఉందని సరియైన, రోడ్లు లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు, అంతేకా కుండా కంటోన్మెంట్ బోర్డు అధికారులు 35,000 ఓట్లను అనైతికంగా తొలగించారని వాటిని ఇంకా పునరుద్ధరించలేదని ఆగ్రహాన్ని వెలిబుచ్చారు. ఈ సందర్భంగా క్రిశాంక్ మాట్లాడుతూ ఓటు హక్కు కోసం కలిసి పోరాడుదామని, ఈ విషయం కేటీఆర్‌కి కూడా తీసుకువెళ్లినట్లు, ఆయన సానుకూలంగా స్పందించి రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌కు లేఖ రాసారని తెలిపారు. మంత్రి కేటీఆర్ కంటోన్మెంట్‌లోని పౌర భూములను రాష్ట్రానికి అప్ప గించాలని భారత ప్రభుత్వాన్ని కోరినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బస్తీవాసులతో కలిసి సహపంక్తి భోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో నసీర్, వహాబ్, సజ్జద్, తాజ్, నయీం, ఫహీం, యూనస్, సమీర్, మిన్హాజ్, అస్లాం, మోని, రఘు, సాయి తదితరులు పాల్గొన్నారు.

అప్జల్‌గంజ్ వద్ద రెండు కేజీల గంజాయి స్వాధీనం



నవతెలంగాణ -సుల్తాన్ బజార్

అప్జల్‌గంజ్ వద్ద టాస్క్ ఫోర్స్ పోలీసులు రెండు కేజీల గంజాయిని పట్టుకుని స్వాధీనం చేసుకున్న ఘటన పట్టణ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ ఖాజామోహినుద్దిన్ తెలిపిన వివరాల ప్రకారం ఎక్సైజ్ కమీషనర్ ముషరఫ్‌అలీ ఫారూఖీ, డిప్యూటీ కమీషనర్ శాస్త్రీ సూపరింటెండెంట్ పవన్ కుమార్ అనుమానాస్పద ప్రాంతాల్లో తనిఖీలు చేయాలని ఆదేశాలు జారీచేశారు. దీంతో టాస్క్ ఫోర్స్ సిబ్బంది, నారాయణగూడా ఎక్సైజ్ అధికారులు కలిసి అప్జల్‌గంజ్ ప్రాంతంలో ఈనెల 14వ తేదీన తనిఖీలు చేపట్టారు. ఈజీమనీ కోసం గంజాయి విక్రయాలకు అలవాటు పడిన దిలీప్ రాజా (23) గంజా యిని రవాణా చేస్తున్నట్లు సమాచారం మేరకు అతనిని పట్టుకొని రెండు కేజీల గంజాయిని స్వాధీనం చేసుకు న్నట్లు తెలిపారు. అనంతరం అతనిని కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించినట్లు వారు తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు, యువ కులు మత్తు పదార్థా లకు దూరంగా ఉండాలని సూచించారు. మత్తుపదార్థాలు సేవిస్తూ పట్టుబడినా, రవణా చేస్తూ పట్టుబ డినా కఠినమైన శిక్షలు తప్పవని, విద్యార్థులు తమ భవిష్యత్తును పాడు చేసుకోవద్దని సూచించారు. ఈకార్యక్రమంలో టాస్క్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్ కుమార్, ఎస్ఐలు ఖాజామోహినుద్దిన్, సంధ్యలు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికే బస్తీ పోరు


కాంగ్రెస్ అధికారంలోకి రావడం ఖాయం : సంతోష్ కుమార్



నవతెలంగాణ-ఓయూ

ప్రజల సమస్యలు తెలసుకోవడానికి చేపట్టిన బస్తీ పోరు కార్యక్రమంలో ప్రజలు తమ దృష్టికి తీసుకొచ్చిన సమస్యలు పరిష్కరిస్తానని కాంగ్రెస్ సీనియర్ నాయకులు అదం సంతోష్ కుమార్ అన్నా రు. మెట్టుగూడ డివిజన్ వై.జంక్షన్ దగ్గర బస్తీ పోరు కార్యక్రమాన్ని నిర్వహించారు. సంతోష్ మాట్లా డుతూ డిప్యూటీ స్పీకర్ పద్మా రావు నియోజకవర్గంలో నీరుపేదలకు పది వేల డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇస్తానని, ఇప్పటి వరకు 500 కూడా అందిం చలేదన్నారు. సికింద్రాబాద్‌లో అడుగడుగునా సమస్యలు దర్శనమిస్తున్నాయన్నారు. రాష్ట్రంలో ఎక్కడ చూసినా బీఆర్ఎస్ మాటల గారడీ రాజకీయాలే నడుస్తున్నా యని పేర్కొన్నారు. ముఖ్యంగా డ్రయినేజీ సమస్య, పోలీస్ పేట్రోలింగ్ ఏర్పాటు చేయాలని తన దృష్టికి తీసుకొచ్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ఉపా ధ్యక్షు డు అదం సృజన్ కుమార్, జయరాజ్, అనిల్ కుమార్,ఆర్ శ్రీనివాస్, లింగం,లడ్డు, వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

బీసీసీ యునైటెడ్ సాఫ్ట్‌వేర్ సంస్థ 10వ వార్షికోత్సవ వేడుకలు



నవతెలంగాణ-బంజారాహిల్స్

బీసీసీ యునైటెడ్ సాఫ్ట్‌వేర్ సంస్థ 10వ వార్షికోత్సవ వేడుకలు ఫిలింనగర్‌లోని జేఆర్‌సీ కన్వెన్షన్‌లో ఆదివారం వైభవంగా నిర్వహించారు. సంస్థ ఎండీ వడ్లమూడి అరవింద్ మాట్లాడుతూ హైదరాబాద్ నగరం ఐటీ రంగంలో దూసుకుపోతున్నదని విదేశాలకు చెందిన సంస్థలకు మన సాఫ్ట్ వేర్ ఇంజనర్లీ కోట్లాది రూపాయల పనులు చేస్తూ ఉపాధి పొందుతున్నారని, అతి తక్కువ కాలంలోనే దేశంలో హైదరాబాద్ అగ్రగామిగా నిలవబోతుందన్నారు. తమ సంస్థ ద్వారా ఆన్‌టైమ్ సొల్యూషన్స్ అందిం చడంలో అసాధారణమైన ట్రాక్ రికార్డు కలిగి ఉన్నమని ప్రపంచ వ్యాప్తంగా ఉన్న ఫార్చ్యూన్ 500 కంపెనీలతో పాటు హెంకెల్, బేయర్, ఎల్‌జీ వంటి సంస్థలతో కలిసి పని చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా సంస్థలో ఉత్తమ ఉద్యోగులను సన్మానించి వారికి జ్ఞాపికలు అందజేశారు.

అంగరంగ వైభవంగా బోనాల పండుగ



బోయిన్‌పల్లిలో ఘనంగా బోనాలు

నవతెలంగాణ-కంటోన్మెంట్

కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని మారేడ్పల్లి బోయినపల్లిలో ఆదివారం బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. ఏడుగుల దేవాలయంతో పాటు పలు దేవాలయాలలో ఆలయ నిర్వాహకులు ఘనంగా పూజలు చేశారు. కాగా ఏడుగుల దేవాలయానికి కంటోన్మెంట్ బోర్డు సీఈవో మధుకర్ నాయక్ కుటుంబ సభ్యులతో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మల్కాజిగిరి పార్లమెంటరీ ఈఆర్ఎస్ ఇన్‌చార్జీ రాజశేఖర్ రెడ్డి మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి.మోండా డివిజన్ కార్పొరేటర్ దీపిక నరేష్ మాజీ ఉపాధ్యక్షుడు జంపన్న ప్రతాప్ లతోపాటు పలువురు ప్రముఖులు అమ్మవారి దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు అల్లం నరేంద్ర, అల్లం మహేష్, అమరేందర్ రెడ్డితో పాటు ఆలయ ప్రతినిధులు పాల్గొని ప్రముఖులకు శాలువాలు కప్పి సన్మానాలు చేశారు. మారేడ్‌పల్లిలోని పోచమ్మ దేవాలయంలో కూడా ఘనంగా బోనాల వేడుకలను ఆలయ ప్రతినిధులు గొల్లకిట్టి ఆధ్వర్యంలో నిర్వహించారు. భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని అమ్మవారికి పూజలు చేశారు.

పలు ఆలయాలలో మంత్రి తలసాని శ్రీనివాస్ పూజలు



నవతెలంగాణ-బేగంపేట

ఆషాడ బోనాల ఉత్సవాల సందర్భంగా మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆదివారం నగరంలోని పలు ఆలయాలను దర్శించుకొని ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. చిలకలగూడలోని శ్రీ కట్టమైసమ్మ దేవాలయం, సీతాఫల్ మండి డివిజన్ మధురా నగర్ లోని శ్రీబంగారుమైసమ్మ అమ్మవారిని దర్శిం చుకున్న అనంతరం ఆలయ చైర్మన్ గుర్రం పవన్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో మంత్రిని ఘనంగా సన్మా నించారు. ముఠా గోపాల్‌తో కలిసి పూజలలో పాల్గొన్నారు. అదే విధంగా అంబర్‌పేటలోని శ్రీ మహం కాళి అమ్మ వారు, లోయర్ ట్యాంక్ బండ్ లోని కట్ట మైసమ్మ, బేగంపేట లోని కట్ట మైసమ్మ అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయా ఆలయాల వద్ద పూజల అనంతరం ఆలయ నిర్వహకులు మం త్రిని ఘనంగా సన్మానించారు. గోషమాల్ నియోజకవర్గంలోని గౌలిగూడశ్రీమాతా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన గోషామాయిల్ నియోజకవర్గంలో ఇంచార్జ్ నందకిషోర్ వ్యాస్ బిలాల్ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ కలిసి పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈఓ అంబుజ, బేగంపేట కట్ట మైసమ్మ ఆలయ చైర్మన్ సుభాష్, కార్పొరేటర్ మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-సుల్తాన్‌బజార్



ఆదివారం గౌలిగూడ పరిధిలో బోనాల పండగను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలో మహం కాళి అమ్మవారికి తొలి బోనాన్ని బీజేపీ ఫ్లోర్ లీడర్ శంకర్ యాదవ్ సమర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులు భక్తులు కట్టా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ-ఓయు



ఆదివారం బోనాలు వేడుకలను పురస్కరించుకొని చిలకలగుడాలోని చరిత్రతకమైన కట్ట మైసమ్మ దేవాలయంలో డిప్యూటీ స్పీకర్ తీగుల్ల పద్మారావుగౌడ్ ప్రభుత్వం పక్షాన పట్టు వస్త్రాలు సమర్పించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ప్రార్థించి నట్లు తెలిపారు. కార్పొరేటర్లు సామల హేమ, కంది శైలజ, సునిత, బీఆర్ఎస్ యువ నేతలు కిషోర్ కుమార్, కిరణ్ కుమార్, రామేశ్వర్‌గౌడ్ బీఆర్ఎస్ నేత సాయి కిరణ్‌యాదవ్ పాల్గొన్నారు. జల మండలి అధ్వర్యంలో మంచి నీటి క్యాంపు ను, వైద్య శాఖా అధ్వర్యంలో మెడికల్ క్యాంపు ను ప్రారంభిచారు.

గోకలేనగర్‌లోని

బోనాల పండుగ సందర్భంగా రామంతపూర్ గోకలేనగర్ లోని ఊరపోచమ్మ దేవాలయంలో పలువురు నాయకులు ప్రత్యేక పూజలు



నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఉప్పల్ మాజీ శాసనసభ్యులు ఎన్ వీఎస్ఎస్ ప్రభాకర్, హబ్సిగూడ డివిజన్ కార్పొరేటర్ జీహెచ్ఎంసీ బీజేపీ ఫ్లోర్ సెక్రటరీ కక్కిరేణి చేతన హరీష్ ఊర పోచమ్మ దేవాలయం చైర్మెన్ కక్కిరిని హరీష్ పాల్గొన్నారు.చేతన హరీష్ డివిజన్ పరిధిలో వివిధ ప్రాంతాల్లో బోనాల ఉత్సవాల్లో పాల్గొన్నారు.

టీడీపీ సికింద్రాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి వల్లారపు శ్రీనివాస్ కుమార్ బౌద్ధనగర్, సీతాఫల్ మండి, మెట్టుగూడ, తార్నాక డివిజన్ పరిధిలోని



వివిధ ఆలయల వద్ద బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా అమ్మ వారిని సందర్శించుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

అమ్మవారి సన్నిధిలో డిప్యూటీ మేయర్



ఆషాడ బోనాలు పురస్కరించుకొని హైదరాబాద్ లోని చారిత్రాత్మక అక్కన్న మాదన్న మహంకాళి దేవాలయం అమ్మవారిని డిప్యూటీ మేయర్ దంపతులు మోతె శ్రీలత శోభన్‌రెడ్డి, బీఆర్ఎస్ కార్మిక విభాగ అధ్యక్షుడు మోతె శోభన్ రెడ్డి దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా డిప్యూటీ మేయర్ కి ఘనంగా స్వాగతం పలికారు. డిప్యూటీ మేయర్ ప్రత్యేక పూజలు నిర్వహించి తమ మొక్కులు చెల్లిం చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు చైర్మన్, ఆలయ కమిటీ సభ్యులు, దేవదాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు



నవతెలంగాణ-సుల్తాన్ బజార్

శంకర్ నగర్ ఎల్లమ్మ ఆలయంలో బీఆర్ఎస్ నాయకులు వినోద్ కుమార్ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నవతెలంగాణ-బంజారాహిల్స్



పట్టణ పరిధిలో బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఖైరతాబాద్ నియో జకవర్గంలోని బీజేఆర్‌నగర్ ఖైరతాబాద్ డివిజన్ కార్పొరేటర్ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి పి.విజయ రెడ్డి, వివిధ ఆలయాల్లో ప్రత్యేక బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. అనంతరం కనక దుర్గ అమ్మవారి తొట్టెల ఊరేగింపు కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఎస్కే షరీఫ్తో పాటు, యువకులు బస్తీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించిన క్రిశాంక్



నవతెలంగాణ-కంటోన్మెంట్

సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోనాల పండగను స్థానిక ప్రజలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ చైర్మెన్ మన్నె క్రిశాంక్ నియోజకవర్గంలోని పికెట్, మారేడ్‌పల్లి, రసూల్‌పురా, బోయినపల్లి, బొల్లారంలోని పలు ఆలయాలను సందర్శించి, ప్ర త్యేక పూజల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.కార్యక్రమంలో ఆలయ ప్రతినిధులు స్థానిక యువకులు సంఖ్యలో క్రిశాంక్ స్థానికులతో కలిసి పాల్గొన్నారు.

నవతెలంగాణ-అంబర్ పేట

అంబర్‌పేట పరిధిలో బోనాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలో అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, మాజీ



రాజ్యసభ సభ్యులు వీహెచ్ హనుమంతరావు మహంకాళి ఆలయంలో అమ్మ వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మెన్ మాజీ కార్పొరేటర్ పంజాల జ్ఞానేశ్వర్ గౌడ్, స్థానిక నాయకులు దుర్గా ప్రసాద్ రెడ్డి, మోర శ్రీరాములు ముదిరాజ్, ఎర్రబోలు నరసింహారెడ్డి, తదితర నాయకులు పాల్గొన్నారు.



బోనాల సందర్భంగా అంబర్‌పేట మహంకాళి ఆలయాన్ని మాజీమంత్రి సి.కృష్ణయాదవ్, సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనతో పాటు స్థానిక నాయకులు గడ్డం శ్రీధర్ గౌడ్, సుధాకర్, దడిగే జగన్, తదితర నాయకులు పాల్గొన్నారు.



బోనాల సందర్భంగా అంబర్‌పేట మహంకాళి ఆలయాన్ని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. ఆయనతోపాటు సీనియర్ నాయకులు దుర్గా ప్రసాద్ రెడ్డి, తొలుపు నూరి కృష్ణ గౌడ్, గడ్డం శ్రీధర్ గౌడ్ లడ్డు, మెట్టు ధనరాజ్ తదితర నాయకులు పాల్గొన్నారు.

ఆశడమాసం బోనలు పండగ పురస్కరించుకొని ఆదివారం అంబర్‌పేట్, నల్లకుంట, గోల్నాక, కాచి గూడ, బాగ్ అంబర్‌పేట డివిజన్ పరిధిలోని బోనాల పండగను ఘనంగా నిర్వహించారు. పలువురు ప్రముఖులు ఆలయాలలో అమ్మ వారిని దర్శించుకుని పలు పూజలు చేశారు. అంబర్‌పేట మహంకాళి అమ్మవారిని బంగారు మైసమ్మ, నల్లపోచమ్మ, ముత్యాలమ్మ, రేణుక ఎల్లమ్మ అమ్మవార్ల మందిరములను అంబర్‌పేట నియోజకవర్గం బీఆర్ఎస్ ఇంచార్జ్ ఎడ్ల సుధాకర్‌రెడ్డి దర్శించుకొని పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు గరిగంట రమేష్, మాజీ కార్పొరేటర్ పులిజగన్, యువ నాయ కులు నాగేష్ గౌడ్, రాష్ట్ర మహిళా నాయకురాలు దేవిరెడ్డి విజితరెడ్డి, ఉద్యమ నాయకులు జీవన్ గౌడ్, కోట్ల రాము. జనార్ధన్, రాహుల్, దిలీప్ కుమార్ నేత, తదితరులు పాల్గొన్నారు.



సనత్‌నగర్ నియోజకవర్గంలోని బోనాల పండుగ ఘనంగా నిర్వహించారు. కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్ రెడ్డి ఆలయంలో ఉన్న పోచమ్మ తల్లికి పట్టు వస్త్రాలను బోనాల్ని సమర్పించారు.

నవతెలంగాణ-బేగంపేట

ఘనంగా అమ్మవారి బోనాల పండుగ ఉత్సవాలు



నవతెలంగాణ-అడిక్ మెట్

ముషీరాబాద్ నియోజకవర్గంలోని అడికమెట్ డివిజన్ మేడి బాయ్ బస్తిలో శ్రీపోచమ్మ దేవాల యంలో బోనాల పండుగ ఉత్సవాలు ఘనంగా జరిగాయి. శ్రీనివాస షాపింగ్ మాల్స్ చైర్మెన్ ఆనంద్, అరవింద్ అమ్మవారి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మ వారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు ముఠా జైసింహ, బలరాజ్, బస్తీ కమిటీ నాయకులు పాల్గొన్నారు

నవ తెలంగాణ-అంబర్‌పేట



మైసమ్మ ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించిన డాక్టర్ శిరీష యాదవ్, డాక్టర్ ఓం ప్రకాష్ యాదవ్ ఆలయ కమిటీ చైర్మన్ కోట్ల శివకుమార్ కోట్ల సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంబర్ పేట మహంకాళి బోనాల జాతరకు విచ్చేసిన హైకోర్టు న్యాయమూర్తి టీ.తుకారాంజి



హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు . ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు ఎర్రబోలు నరసింహారెడ్డి, మోర శ్రీరామ ముదిరాజ్, వి. మహేందర్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, బింది మల్లికార్జున గౌడ్, శ్రీనివాస్, ప్రవీణ్ పటేల్ పాల్గొన్నారు.

నవతెలంగాణ -సుల్తాన్ బజార్



హనుమాన్‌టెకిడిలో నిర్వహించిన బోనాల ఉత్సలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఆర్ వి.మహేందర్ కుమార్, శంకర్, రవీంద్రచారి తదితరులు పాల్గొన్నారు.





యువ శాస్త్రవేత్త అవార్డు

వరల్డ్ ఎకనామిక్ ఫోరమ్ ప్రకారం రీతూ 20కి పైగా పరిశోధనా పత్రాలను ప్రచురించారు. 2007లో డాక్టర్ అబ్దుల్ కలాం చేతుల మీదుగా యువ శాస్త్రవేత్త అవార్డును అందుకున్నారు. అలాగే సొసైటీ ఆఫ్ ఇండియన్ ఏరోస్పేస్ టెక్నాలజీస్ & ఇండస్ట్రీస్ (SIATI) ఆమెకు 2017లో విమెన్ అచీవర్స్ ఇన్ ఏరోస్పేస్ అవార్డు అందుకున్నారు. ఇంకా బ్యాంక్ ఆఫ్ బరోడా ఆమెను బిర్లా సన్ అచీవ్‌మెంట్ అవార్డుతో సత్కరించింది. మార్స్ ఆర్బిటర్ మిషన్ విజయాన్ని వివరించే TED, TEDx ఈవెంట్లలో కూడా ప్రదర్శించారు.

'రాకెట్ మహిళ' జాబిల్లి అన్వేషణ

రీతూ కరిధాల్... ఏరోస్పేస్ ఇంజనీర్, భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ(ఇస్రో)లో సీనియర్ సైంటిస్ట్. ఆమెను భారతదేశపు 'రాకెట్ మహిళ' అని కూడా పిలుస్తారు. రెడ్ ప్లానెట్‌కు మొదటి మిషన్ అయిన మార్స్ ఆర్బిటర్ మిషన్ (MOM)లో, మంగళయాన్‌లో కూడా ఆమె ముఖ్య పాత్ర పోషించారు. ప్రస్తుతం జాబిల్లిని చేరేందుకు ఆకాశంలోకి దూసుకెళ్ళిన చంద్రయాన్-3 మిషన్ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆమె పరిచయం నేటి మానవిలో...

రీతూ ఉత్తరప్రదేశ్‌లోని లక్నో నగరంలోని రాజాజీపురంలో 1975 ఏప్రిల్ 13న పుట్టారు. ఆమెకు ఇద్దరు సోదరులు, ఇద్దరు సోదరీమణులు ఉన్నారు. చదువుకు ప్రాధాన్యతనిచ్చే మధ్యతరగతి కుటుంబం వారిది. తండ్రి రక్షణ రంగంలో పని చేశారు. కోచింగ్ సంస్థలు, ట్యూషన్లు అందుబాటులో లేకపోయినా ఆమె తన స్వశక్తిని నమ్ముకొని గొప్ప శాస్త్రవేత్త అయ్యారు. చిన్నతనం నుంచి ఆమెకు అంతరిక్షం గురించి తెలుసుకోవాలని కోరిక. రాత్రి ఆకాశం వైపు చూస్తూ అంతరిక్షం గురించే ఆలోచించేవారు. చంద్రుడు, దాని ఆకారం, పరిమాణాన్ని ఎలా మారుస్తుందో చూసి ఆశ్చర్యపోయేవారు. నక్షత్రాలను అధ్యయనం చేసి, ఆ చీకటి వెనుక ఏముందో తెలుసుకోవాలను కున్నారు. పాఠశాల రోజుల్లోనే ఇస్రో, నాసా నిర్వహించిన అంతరిక్ష కార్యకలాపాలకు సంబంధించిన వార్తా కథనాలను సేకరించి దాచుకునేవారు.

ఇస్రోలో ఉద్యోగం

రీతూ తన ప్రాథమిక విద్యను లక్నోలోని సెయింట్ ఆగ్నెస్ స్కూల్లో పూర్తి చేశారు. ఆ తర్వాత నవయుగ కన్యా విద్యాలయంలో చదువుకున్నారు. లక్నో విశ్వవిద్యాలయం నుంచి ఫిజిక్స్‌లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజనీరింగ్ (గేట్) పరీక్షలో ఉత్తీర్ణత సాధించింది, ఏరోస్పేస్ ఇంజనీరింగ్‌లో మాస్టర్స్ డిగ్రీని అభ్యసించడానికి బెంగుళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ (ఐఐఎస్సి)లో చేరారు. ఎంటెక్ తర్వాత పీహెచ్‌డీ ప్రారంభించారు. ఆ సమయంలో ఓ కళాశాలలో పార్ట్‌టైం ప్రొఫెసర్‌గా పని చేశారు. 1997లో ఇస్రోలో దరఖాస్తు చేసుకొని ఉద్యోగం సంపాదించారు. అయితే అప్పటికి ఆమె ఉద్యోగానికి అంత సిద్ధంగా లేరు. ఎందుకంటే పీహెచ్‌డీ మధ్యలోనే వదిలేయాల్సి వస్తుందని బాధపడ్డారు. అయితే తన పీహెచ్‌డీ గైడ్ ప్రొఫెసర్ మనీషా గుప్తా, రీతూని వెంటనే ఇస్రోలో చేరిపొమ్మని సలహా ఇచ్చారు. దాంతో అప్పటి నుండి ఆమె ఇస్రోతో కలిసి పని చేయడం ప్రారంభించారు.

కీలక పాత్ర పోషించారు

యూఆర్ రావు శాటిలైట్ సెంటర్‌లో రీతూ తన మొదటి పోస్టింగ్ పొందారు. అక్కడ ఆమె పని అందరినీ ఆకర్షించింది. దాంతో మార్స్ మిషన్‌లో భాగస్వామి అయ్యారు. అలాగే మంగళయాన్ అభివృద్ధిలో ఆమె కీలక పాత్ర పోషించారు. మంగళయాన్ ఇస్రో సాధించిన గొప్ప విజయాలలో ఒకటి. ఇది అంగారక గ్రహానికి చేరుకున్న ప్రపంచంలో నాల్గవ దేశంగా భారత్‌గా నిలిచింది. ఇది 10 నెలల వ్యవధిలో జరిగింది. దీనికి అయిన ఖర్చు 450 కోట్లు మాత్రమే. ఆమె పని క్రాఫ్ట్ స్వయంప్రతిపత్తి వ్యవస్థను సంభావితం చేయడం, అమలు చేయడం. అలాగే చంద్రయాన్ 2 మిషన్‌లో కూడా పని చేశారు. ఇది చంద్రుడి ఉపరితలంపై రోవర్‌ను పంపించి 2019లో చంద్ర మట్టిని అధ్యయనం చేయడానికి ప్రయత్నించింది. బెంగుళూరుకు చెందిన టైటాన్ ఇండస్ట్రీస్‌లో పని చేస్తున్న అవినాష్ శ్రీవాస్తవను రీతూ వివాహం చేసుకున్నారు. వీరికి ఇద్దరు పిల్లలు.

ఆపరేషన్స్ డైరెక్టర్‌గా...

ఇస్రో చేపట్టిన అనేక ప్రాజెక్ట్‌లకు రీతూ పనిచేశారు. వీటిలో కొన్నింటికి ఆపరేషన్స్ డైరెక్టర్‌గా కూడా ఉన్నారు. MOM కోసం ప్రాజెక్ట్ మేనేజర్, డిప్యూటీ ఆపరేషన్స్ డైరెక్టర్‌గా, ఆర్బిటర్ భూమిని విడిచిపెట్టి, అంగారక గ్రహాన్ని పట్టుకో వడంలో క్లిష్టమైన కార్యకలాపాలు నిర్వహించిన బృందానికి నాయకత్వం వహించారు. ప్రస్తుతం చంద్రయాన్-3 మిషన్‌కు డైరెక్టర్‌గా ఉన్నారు. చంద్రుని దక్షిణ ధ్రువంపై చంద్రయాన్-3 ల్యాండర్‌ను సున్నితంగా ల్యాండ్ చేయాలని భారత్ లక్ష్యంగా పెట్టుకుంది. ఈ మిషన్ విజయవంతమైతే భూమి యొక్క సహజ ఉపగ్రహంపై అంతరిక్ష నౌకను సాఫ్ట్ ల్యాండింగ్‌ని విజయవంతంగా పూర్తి చేసిన నాల్గవ దేశంగా భారత్ అవతరిస్తుంది. అలాగే చంద్రుడి దక్షిణ ధ్రువంపై అంతరిక్ష నౌకను ల్యాండ్ చేసిన ప్రపంచంలోనే తొలి దేశంగా భారత్ అవతరిస్తుంది.



కుటుంబ సభ్యులతో రీతూ

ఇస్రో ఉద్యోగమే లక్ష్యంగా



కల్పన... చిత్తూరు జిల్లాకు చెందినచంద్రయాన్-3కి అసోసియేటెడ్ డైరెక్టర్‌గా ఉన్నారు. ఈమె చెన్నైలో బీటెక్ ఈసీఈ పూర్తి చేశారు. తండ్రి మద్రాసు హైకోర్టులో ఉద్యోగి. తల్లి గృహిణి. కల్పన చిన్నతనం నుంచే ఇస్రోలో ఉద్యోగం చేయాలనే లక్ష్యంతో తన చదువు కొనసాగించారు. బీటెక్ పూర్తయిన వెంటనే ఇస్రోలో 2000లో శాస్త్రవేత్తగా విధుల్లో చేరారు. మొదట శ్రీహరికోటలో ఐదేండ్లపాటు విధులు నిర్వహించారు. 2005లో బదిలీపై బెంగళూరులోని ఉపగ్రహ కేంద్రానికెళ్లి అక్కడ పని చేశారు. ఐదు ఉపగ్రహాల రూపకల్పనలో భాగస్వాములయ్యారు. శ్రీహరికోట రాకెట్ కేంద్రం నుంచి 2018లో పంపిన చంద్రయాన్-2 ప్రాజెక్టులో కూడా కల్పన భాగస్వామ్యం ఉంది. ప్రస్తుతం చంద్రయాన్-3 ప్రాజెక్టు అసోసియేటెడ్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు.

బ్లాక్ టీతో...

ప్రస్తుతం ప్రతి ఒక్కరూ బిజీ లైఫ్‌స్టైల్‌నే గడుపుతున్నారు. దీని వల్ల ఆహారపు అలవాట్లలో మార్పులు, శారీరకంగా అనేక సమస్యలు ఏర్పడుతూనే ఉన్నాయి. అందులో కొన్నింటికి బ్లాక్ టీ పరిష్కారం చూపగలుగుతుందని నిపుణులు సూచిస్తున్నారు. అవేంటంటే...

❑ రోగ నిరోధక శక్తిని పెంచి.. జీర్ణ వ్యవస్థను కాపాడేందుకు ఇది తోడ్పడుతుంది. అలాగే జ్వరం, జలుబు వంటి చిన్న చిన్న సమస్యలను కూడా ఇది ఇట్టే తగ్గించేస్తుంది.



అలాగే మన శరీరంలోని వైరస్, బ్యాక్టీరియాలను బయటకు పంపడంలో ప్రధాన పాత్ర పోషిస్తుంది.

❑ ప్రస్తుత పరిస్థితుల్లో ఏ వయసులో అయినా డయాబెటిస్ వచ్చేస్తోంది. కానీ రీసర్చ్ ప్రకారం రోజూ ఒకటి లేదా రెండు కప్పుల బ్లాక్ టీ తాగితే 70 శాతం మేర డయాబెటిస్ వచ్చే ముప్పు తగ్గుతుంది. ఇందులోని యాంటీ ఆక్సిడెంట్లు టైప్ 2 డయాబెటిస్‌ని రాకుండా చేస్తాయి.

❑ ఇందులోని లిథినైన్ యాసిడ్ ఒత్తిడితో పాటు అలసటను కూడా తగ్గిస్తుంది.

❑ ముప్పైల తర్వాత మహిళల్లో ఎముకల సాంద్రత తగ్గుతూ వస్తుంది. రోజూ బ్లాక్ టీ తాగడం వల్ల ఎముకలు బలంగా మారే వీలుంటుంది. యాంటీ ఆక్సిడెంట్లు ఎముకలను బలంగా ఉండేలా చేస్తాయి. అంతేకాదు అర్థరైటిస్ వంటి వ్యాధులు కూడా దూరంగా ఉంటాయి.

❑ నోటి దుర్వాసన వల్ల వచ్చే సమస్యలు అన్నీ ఇన్నీ కావు. దీని వల్ల పంటిలో క్యావిటీలు ఏర్పడతాయి. బ్లాక్ టీ తాగడం వల్ల క్యావిటీలను కలిగించే బ్యాక్టీరియా నోటి నుంచి తొలగిపోతుంది. ఇందులోని పాలిఫినాల్స్ పళ్ల పిప్పిని తొలగిస్తాయి.

❑ బ్లాక్ టీ తాగడం వల్ల మెటబాలిజం పెరిగే వీలుంటుంది. దీని వల్ల బరువు తగ్గే అవకాశాలు ఎక్కువ. అయితే మెటబాలిజం పెరుగుతుంది కదా అని.. తరచూ బ్లాక్ టీ తీసుకోవడం కూడా సరికాదు. రోజూ ఒకటి లేదా రెండు కప్పుల బ్లాక్ టీ తాగుతూ ఆరోగ్యకరమైన ఆహారం, మంచి వ్యాయామం చేయడం వల్ల బరువు సులభంగా తగ్గే వీలుంటుంది.

తయారీ ఇలా... : బ్లాక్ టీని కూడా మామూలు టీ మాదిరిగానే తయారు చేయవచ్చు. కాకపోతే ముందుగా నీటిని మరిగించి అందులో టీ పొడర్ వేసుకోవాలి. ఇది మరుగుతున్నప్పుడు కావాలంటే చక్కెర కూడా వేసుకోవచ్చు. అలాగే యాలకులు, అల్లం లేదా నిమ్మరసం కలుపుకోవచ్చు. లేదంటే మార్కెట్‌లో బ్లాక్ టీ బాగ్స్ అందుబాటులో ఉంటున్నాయి. తెచ్చుకొని ఉపయోగించుకోవచ్చు.

ఇంజినీరింగ్ మొదటి దశలో 70,665సీట్ల కేటాయింపు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణ ఎంసెట్ ఇంజినీరింగ్ మొదటి దశలో సీట్లను కేటాయించారు. ఈ దశలోనే 85.48శాతం సీట్ల కేటాయింపు పూర్తయింది. 31 కాలేజీల్లో 100 శాతం పూర్తయ్యాయి. దీంతోపాటు కంప్యూటర్ సైన్స్ అనుబంధ కోర్సులకే భారీగా డిమాండ్ పెరిగింది. ఈ కోర్సుల్లో 94శాతం సీట్లు నిండాయి. కేటాయించిన సీట్లకు సంబంధించిన విద్యార్థులు ఈనెల 22 వరకు ఫీజు చెల్లించి సెల్ఫ్ రిపోర్టు చేయాలి. లేకపోతే ఆటోమెటిక్‌గా సీట్ క్యాన్సిల్ అవుతుందని ఎంసెట్ అధికారులు తెలిపారు.

70,665సీట్ల కేటాయింపు

రాష్ట్రంలో ప్రభుత్వ యూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీలు 16, ప్రయివేటు యూనివర్సిటీ కాలేజీలు రెండు, ప్రయివేటు ఇంజినీరింగ్ కాలేజీలు 155తో కలిపి మొత్తం 173 కాలేజీలు ఉన్నాయి. వీటిల్లో కంప్యూటర్ సైన్స్ అనుబంధ కోర్సులతోపాటు ఎలక్ట్రికల్, మెకానికల్, సివిల్, ఇతర ఇంజినీరింగ్ కోర్సులు మొత్తం 82,666 సీట్లకు మొదటి దశలో 70,665 సీట్లను కేటాయించారు. ఇంకా 12001 సీట్లు ఖాళీగా ఉన్నాయి. ఈ లెక్కనా యూనివర్సిటీల్లో 85.12శాతం, ప్రయివేటు యూనివర్సిటీల్లో 75.08 శాతం, ప్రయివేటు కాలేజీల్లో 85.71 శాతం సీట్లు నిండాయి. వీటిని రెండు, మూడో దశలో కేటాయించనున్నారు. అయితే మొదటి దశలోనే మూడు యూనివర్సిటీ కాలేజీలు, 28ప్రయివేటు ఇంజినీరింగ్ కాలేజీలతో కలిపి మొత్తం 31కాలేజీల్లో 100శాతం సీట్లు నిండాయని అధికారులు ప్రకటించారు.

కంప్యూటర్ సైన్స్ అనుబంధ కోర్సులవైపే

ఇంజినీరింగ్ సీట్ల కేటాయింపులో అత్యధిక మంది విద్యార్థులు కంప్యూటర్ సైన్స్, ఐటీ సంబంధిత కోర్సులకే మొగ్గుచూపారు. ఈ కోర్సుల్లో 55,876 సీట్లుంటే 52,637 సీట్లను అధికారులు కేటాయించారు. అత్యధికంగా 94.20 శాతం సీట్లు భర్తీ కాగా, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ కోర్సుల్లో 78.70 శాతం, సివిల్, మెకానికల్ ఇంజినీరింగ్ కోర్సుల్లో 44.09 శాతం, ఇతర ఇంజినీరింగ్ కోర్సుల్లో 63.03 శాతం సీట్లు భర్తీ అయ్యాయి. కంప్యూటర్ సైన్స్, ఐటీ ఇంజినీరింగ్ అనుబంధ కోర్సులైన ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, కంప్యూటర్ ఇంజినీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ బిజినెస్ సిస్టం, బ్లాక్ చైన్ టెక్నాలజీతో కలిపి సైబర్ సెక్యూరిటీ, కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్(నెట్‌వర్క్స్), కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్(ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్) కోర్సుల్లో 100శాతం సీట్లు భర్తీ అయ్యాయి. మరో ఐదు కోర్సుల్లో 90శాతానికిపైగా, ఇంకొక ఐదు కోర్సుల్లో 80శాతానికిపైగా సీట్లు భర్తీ అయ్యాయి. ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ విభాగంలో 17,274 సీట్లకుగాను 13,595సీట్లు భర్తీ అయ్యాయి. వీటిలో బయోమెడికల్ ఇంజినీరింగ్, ఎలక్ట్రానిక్స్ కమ్యూనికేషన్ అండ్ ఇన్‌స్ట్రూమెంటేషన్, ఎలక్ట్రానిక్స్ అండ్ టెలిమ్యాటిక్స్ కోర్సుల్లో మాత్రం 100శాతం సీట్లు నిండిపోయాయి. సివిల్, మెకానికల్ అనుబంధ కోర్సులకు సంబంధించి 8,261 సీట్లకుగాను 3,642 సీట్లు భర్తీ అయ్యాయి. వీటిలో మెటాల్లార్జికల్, మెకానికల్ విత్ ఎంటెక్ మ్యానిఫ్యాక్చరింగ్ సిస్టమ్స్, మెకానికల్ విత్ ఎంటెక్ థర్మల్, ఏరోనాటికల్, మెక్ట్రానిక్స్, ఆటోమొబైల్ ఇంజినీరింగ్ కోర్సుల్లోని 100శాతం సీట్లు నిండిపోయాయి. ఇతర ఇంజినీరింగ్ కోర్సులకు సంబంధించి 1,255సీట్లకుగాను 791 సీట్లు భర్తీ అయ్యాయి. కెమికల్ ఇంజినీరింగ్‌లో 98.65 శాతం, జియో ఇన్ఫర్మెటిక్స్‌లో 95.38 శాతం, అగ్రికల్చర్ ఇంజినీరింగ్‌లో 93.94 శాతం సీట్లు భర్తీ అయ్యాయి. ఇండస్ట్రీయల్ ప్రొడక్షన్ ఇంజినీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ టెలి కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ కోర్సుల్లో ఒక్క సీటు కూడా భర్తీ కాలేదు.

22లోపు ఫీజు చెల్లించి, సెల్ఫ్ రిపోర్టింగ్

ఎంసెట్ మొదటి దశలో ఇంజినీరింగ్ సీట్లు పొందిన విద్యార్థులు ఈనెల 22వ తేది లోపు ఫీజు చెల్లించి సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలి. లేకపోతే ఆటోమెటిక్‌గా సీటు కాన్సిల్ అవుతుందని అధికారులు చెబుతున్నారు. అయితే విద్యార్థులు వెబ్‌సైట్ నుంచి అలాట్‌మెంట్ ఆర్డర్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. అలాట్‌మెంట్ ఆర్డర్‌లో పేర్కొన్న ఫీజును క్రెడిట్ కార్డు లేదా డెబిట్ కార్డు లేదా నెట్ బ్యాంకింగ్ ద్వారా ఆన్‌లైన్‌లో చెల్లించాలి. ఆ తర్వాత సీటు కన్ఫర్మేషన్ అవుతుంది. అయితే ట్యూషన్ ఫీజు చెల్లించే విద్యార్థులు.. వారి తల్లిదండ్రుల ఖాతా నుంచి చెల్లిస్తే మంచిదని సూచించారు. ఎందుకంటే.. రీఫండ్ చేసేందుకు సులభంగా ఉంటుందని తెలిపారు. ఈ నెల 22వ తేదీ లోపు ఫీజు చెల్లించి, సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలి. తుది దశ కౌన్సెలింగ్ ముగిసిన తర్వాత సంబంధిత కాలేజీల్లో విద్యార్థులు ఆగస్టు 9 నుంచి 11వ తేదీ మధ్యలో రిపోర్టు చేయాల్సి ఉంటుంది.

గాంధీ భవన్‌లో గాడ్సే

(మొదటిపేజి తరువాయి)

పనిచేసి ఇప్పుడు గాంధీ భవన్‌లో గాడ్సేలా దూరారని విమర్శించారు. విభజన చట్టంలోని అంశాలను అమలు చేయకపోవడం మీద, రాష్ట్రానికి రావాల్సిన నిధుల మీద.. రేవంత్‌రెడ్డి ప్రధాని మోడీని నిలదీయకపోవడానికి ప్రధాన కారణం.. ఆయన ఆర్‌ఎస్‌ఎస్ ఏజెంట్ అని విమర్శించారు. ఐదు దశాబ్దాలుగా రైతులకు సాగునీరు, కరెంట్, ఎరువులు ఇవ్వకుండా, ప్రాజెక్టులు కట్టకుండా వ్యవసాయాన్ని కాంగ్రెస్ పార్టీ అధోగతి పట్టించిందన్నారు. కేసీఆర్ పాలనతో ఇప్పుడిప్పుడే కుదుట పడుతున్న సమయంలో మరోసారి కరెంట్ విషయంలో విష ప్రచారం చేస్తూ ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు నిస్సిగ్గుగా, నిర్లజ్జగా వ్యవహరిస్తున్నరని ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడు రోజులుగా వ్యవసాయానికి కరెంట్ సరఫరా విషయంలో రేవంత్‌రెడ్డి చేస్తున్న వ్యాఖ్యల మీద ఆ పార్టీలో గతంలో మంత్రులుగా పని చేసిన నాయకులు కానీ, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మౌనంగా ఉండటం వారి విజ్ఞతకే వదిలేస్తున్నామని తెలిపారు. రేవంత్‌రెడ్డి తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకొని రైతులకు బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. రైతులకు అందిస్తున్న వసతులను చూసి పక్క రాష్ట్రాలైన మహారాష్ట్ర, కర్నాటక, తమిళనాడు నుంచి పెద్ద ఎత్తున రైతులు కేసీఆర్‌కు మద్దతు తెలుపుతున్నది కనిపించట్లేదా అని ప్రశ్నించారు. వ్యవసాయం పట్ల, ఉచిత కరెంట్ పట్ల అవగాహన లేమితో రేవంత్ రెడ్డి మాట్లాడుతున్నారని విమర్శించారు. వ్యవసాయానికి కరెంటు సరఫరా అంశం మీద 2004 నుంచి 2014 వరకు ఉన్న కరెంటు సరఫరా తీరు, 2014 తర్వాత ఉన్న తీరు పట్ల రైతులనే అడుగుదామని సవాల్ విసిరారు.

రుణమాఫీ ఏమైంది?

(మొదటిపేజి తరువాయి)

రైతు వ్యతిరేక విధానాలను తిప్పికొట్టాలంటూ రైతులకు ఆదివారం ఈమేరకు రేవంత్ బహిరంగ లేఖ రాశారు. రాష్ట్రంలో రుణమాఫీకి అర్హులైన రైతుల సంఖ్య అక్షరాలా 31 లక్షలు అనీ, రూ.20వేల కోట్లమేర రుణాలు మాఫీ చేయాల్సిన ప్రభుత్వం రైతులను నిలువునా మోసం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. కేసీఆర్ మాటలకు మోసపోయి అప్పుల ఊబిలో చిక్కిన మన సహచర రైతులు దిక్కుతోచని స్థితిలో ఆత్మహత్యలకు ఒడిగడుతున్నారని పేర్కొన్నారు. రైతుతో రాజకీయం చేసేందుకు బీఆర్ఎస్ బయలు దేరిందని ఎద్దేవా చేశారు. రైతులు ఎదుర్కొంటున్న బాధలు, ఇబ్బందులను బీఆర్ఎస్ నేతల దృష్టికి తీసుకెళ్లాలని విజ్ఞప్తి చేశారు. రైతు వేదికలను ఇన్నాళ్లు అలంకారప్రాయంగా ఉంచిన ఆ పార్టీ...ఇప్పుడు వాటిని రాజకీయ వేదికలుగా మార్చేందుకు బరితెగించిందని విమర్శించారు. ధాన్యం సేకరించిన 48 గంటల్లో రైతుల ఖాతాల్లో డబ్బు జమ చేస్తామంటూ జారీ చేసిన ఆదేశాలు కాగితాలకే పరిమితమయ్యాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. జూన్ 15 నాటికి రూ.6,800 కోట్లమేర బకాయిలు ఉన్నాయని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా గత తొమ్మిదేండ్లలో లక్షల ఎకరాల అసైన్డ్ భూములను పేదల నుంచి ప్రభుత్వం లాక్కుందని ఆవేదన వ్యక్తం చేశారు. పేద గిరిజన, దళిత బిడ్డలకు భూములు ఇచ్చేందుకు ఈ ప్రభుత్వానికి చేతులు రాలేదని తెలిపారు. కానీ ఎన్నికలు సమీపిస్తుండటంతో పోడు భూముల పట్టాలపై కేసీఆర్ ప్రభుత్వం హడావుడి మొదలు పెట్టిందని ఎద్దేవా చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 11.50 లక్షల మంది ఆదివాసీలు పోడు పట్టాలకు అర్హులని తేలిందనీ, కేవలం నాలుగు లక్షల మందికి పట్టాలిచ్చి చేతులు దులుపుకుందని విమర్శించారు. రైతులకు ఎరువులు ఉచితంగా ఇస్తామనీ ఎన్నికల్లో హామీ ఇచ్చిన బీఆర్ఎస్...అధికారంలోకి వచ్చిన తరావ్త రైతులను మోసం చేసిందని విమర్శించారు. రైతుకు 24 గంటల ఉచిత విద్యుత్ ఇస్తామని చెప్పి కేవలం 10 గంటలు కూడా ఇవ్వడం లేదని పునరుద్ఘాటించారు. సబ్ స్టేషన్‌లలో లాగ్‌బుక్‌లే దీనికి సాక్ష్యమని పేర్కొన్నారు. కాంగ్రెస్ ఈ ఆధారాలను బయటపెట్టడంతో ప్రభుత్వం ఉలిక్కిపడిందని వ్యాఖ్యానించారు. అందుకే అన్ని సబ్‌స్టేషన్లలో లాగ్‌బుక్‌లను వెనక్కి తెప్పించుకుందని విమర్శించారు. ధాన్యం కొనుగోళ్లపై కేంద్రంలోని బీజేపీ సర్కారు, రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం దొంగాట ఆడుతున్నాయని విమర్శించారు. రైతులను మోసం చేసిన విషయంలో కేసీఆర్‌ది ఆల్ టైం రికార్డు అని ఎద్దేవా చేశారు. రైతు వేదికల సాక్షిగా రాజకీయం చేసేందుకు బీఆర్ఎస్ నేతలు వస్తున్నారనీ, ఆ రైతు ద్రోహులకు బుద్ధి చెప్పేందుకు దీన్నిదొక సదవకాశం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశాల్లో మన సమస్యలపై నిలదీసేందుకు సిద్ధం కావాలని కోరారు. రైతు రుణమాఫీ ఎప్పుడు చేస్తారో ప్రశ్నించాలనీ, ధాన్యం డబ్బులు ఎప్పుడు జమ చేస్తారో అడగాలని పిలుపునిచ్చారు. పోడు భూములకు పట్టాలు ఎప్పుడు ఇస్తారో నిలదీయాలని కోరారు. 'సమస్యలు పరిష్కరించుడో... బీఆర్ఎస్‌ను బొంద పెట్టుడో తేల్చేద్దాం. ఈ రైతు ద్రోహి ప్రభుత్వాన్ని నిలువునా పాతరేద్దాం. ఇందుకు యావత్ తెలంగాణ రైతు లోకం సిద్ధం కావాలని పిలుపునిచ్చారు.

వర్షాకాల సమావేశాల్లో 21 బిల్లులు

(మొదటిపేజి తరువాయి)

ప్రవేశపెట్టిన బిల్లుల పైన, వివిధ బిల్లులపై పార్లమెంటరీ కమిటీలు అందజేసిన నివేదికల పైన కూడా చర్చ జరుగుతుంది. జీవ వైవిధ్య సవరణ బిల్లు, జనవిశ్వాస్ (నిబంధనల సవరణ) బిల్లు, వివిధ రాష్ట్రాల సహకార సొసైటీల (సవరణ) బిల్లు, అటవీ (సంరక్షణ) సవరణ బిల్లు, మధ్యవర్తిత్వ బిల్లును వివిధ పార్లమెంటరీ కమిటీలు ఇప్పటికే పరిశీలించి నివేదికలు అందించాయి. ఇవి సభ ఆమోదం పొందాల్సి ఉంది. కాగా దేశ రాజధానిలో సేవలపై నియంత్రణ విషయంలో జారీ చేసిన వివాదాస్పద ఢిల్లీ ఆర్డినెన్స్ స్థానంలో ప్రభుత్వం బిల్లును ప్రవేశపెడుతుంది. దీనిపై పార్లమెంటులో వాడివేడి చర్చ జరిగే అవకాశం ఉంది. ఈ ఆర్డినెన్స్‌పై తక్షణమే మధ్యంతర స్టే ఇచ్చేందుకు సుప్రీంకోర్టు నిరాకరించిన విషయం తెలిసిందే. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వంపై లెఫ్టినెంట్ గవర్నర్‌కు పెత్తనం కట్టబెట్టేందుకు ఉద్దేశించిన ఈ ఆర్డినెన్స్‌ను ఆమ్‌ఆద్మీ పార్టీతో పాటు వివిధ ప్రతిపక్ష పార్టీలు వ్యతిరేకిస్తున్నాయి. రాజ్యసభలో ఎన్డీఏ ప్రభుత్వానికి తగిన మెజారిటీ లేకపోవడంతో పెద్దల సభలో దీనిని ఎలాగైనా అడ్డుకునేందుకు ఆమ్‌ఆద్మీ పార్టీ ప్రయత్నిస్తోంది. ఈ బిల్లుపై నిన్నటి వరకూ స్పష్టమైన వైఖరి ప్రకటించని కాంగ్రెస్ పార్టీ తాజాగా ఆదివారం నాడు ఢిల్లీ ఆర్డినెన్సుకు మద్దతు ఇవ్వబోమని స్పష్టం చేసింది. రాజధానిలో ప్రభుత్వ అధికారుల బదిలీలు, నియామకాల విషయంలో తీసుకొచ్చిన ఈ ఆర్డినెన్సును సమర్థించే ప్రసక్తే లేదని తేల్చి చెప్పింది.

డేటా ప్రొటెక్షన్ బిల్లును కూడా ఈ సమావేశాలలోనే ప్రవేశపెట్టాలని మోడీ ప్రభుత్వం నిర్ణయించింది. హిండెన్‌బర్గ్ నివేదికలో అదానీ గ్రూప్‌పై చేసిన ఆరోపణలపై చర్చించాలని, ఈ వ్యవహారంపై సంయుక్త పార్లమెంటరీ కమిటీతో దర్యాప్తు జరిపించాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. అయితే ఇందుకు మోడీ ప్రభుత్వం సుతరామూ ఇష్టపడడం లేదు. ఈ నేపథ్యంలో అదానీ గ్రూపు వ్యవహారం మరోసారి పార్లమెంటును కుదిపేసే అవకాశం ఉంది. కాగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై అనర్హత వేటు పడిన తర్వాత పార్లమెంట్ సమావేశాలు జరగడం ఇదే మొదటిసారి. అంతేకాక నూతన పార్లమెంట్ భవనంలో తొలిసారి సమావేశాలు జరుగుతున్నాయి. పాత భవనంలో సమావేశాలను ప్రారంభించి, ఆ తర్వాత నూతన భవనంలోకి మారుస్తారని తెలుస్తోంది.

ఆర్‌టీఐ చట్టం పరిధిని కుదిస్తుంది
డేటా ప్రొటెక్షన్ బిల్లుపై ఎంపీలకు లేఖ

మోడీ ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టే డిజిటల్ పర్సనల్ డేటా ప్రొటెక్షన్ (డీపీడీపీ) బిల్లు సమాచార హక్కు చట్టం పరిధిని కుదిస్తుందని, కేంద్రానికి విశేష విచక్షణాధికారాలు కట్టబెడుతుందని నేషనల్ క్యాంపెయిన్ ఫర్ పీపుల్స్ రైట్ టూ ఇన్ఫర్మేషన్ (ఎన్‌సీపీఆర్‌ఐ) అనే సంస్థ ఆందోళన వ్యక్తం చేసింది. బిల్లును అడ్డుకోవాలంటూ పార్లమెంట్ సభ్యులకు లేఖలు రాసింది. ఈ బిల్లు ద్వారా ప్రజలు తమ వ్యక్తిగత సమాచారాన్ని గోప్యంగా ఉంచుకునే హక్కును కోల్పోతారని ఎన్‌సీపీఆర్‌ఐ ఆ లేఖలో తెలిపింది. 'ఆర్‌టీఐ చట్టానికి ప్రతిపాదించిన సవరణల ప్రకారం ప్రజలు విధిగా తమ వ్యక్తిగత సమాచారాన్ని కూడా బహిర్గతం చేయాల్సి ఉంటుంది. ప్రస్తుత చట్టంలో ఇందుకు కొన్ని మినహాయింపులు ఉన్నాయి. నూతన బిల్లులో వాటిని తొలగించారు. సున్నితమైన వ్యక్తిగత సమాచారం వెల్లడికే ఈ బిల్లు పరిమితం కావడం లేదు. దీనివల్ల ఎన్నో సమస్యలు వస్తాయి. ఆర్‌టీఐ చట్టాన్ని సరిగా అర్థం చేసుకోకుండా ఈ బిల్లును ప్రతిపాదించారు' అని వివరించారు.

ఓల్డ్‌సిటీకి మెట్రో రైలు..

(మొదటిపేజి తరువాయి)

మేరకు పాతబస్తీలో మెట్రో రైలు పనులు చేపట్టేందుకు సన్నాహక పనులను షురూ చేసినట్టు తెలిపారు. పాత నగరంలో 5.5కి.మీ బ్యాలెన్స్ మెట్రో అలైన్‌మెంట్ ఎంజీబీఎస్ నుంచి దారుల్షిఫా జంక్షన్- పురానీ హవేలీ - ఇత్తెబార్ చౌక్ - అలీజాకోట్ల - మీర్ మోమిన్ దైరా - హరిబౌలి - శాలిబండ - శంషీర్‌గంజ్, అలియాబాద్ మీదుగా ఫలక్‌నుమా వరకు ఉంటుందని తెలిపారు. మెట్రో రైలు మార్గంలో 5స్టేషన్లు ఏర్పాటు చేసే అవకాశం ఉండగా.. వీటిలో సాలార్‌జంగ్ మ్యూజియం, చార్మినార్, శాలిబండ, షంషీర్‌గంజ్, ఫలక్‌నుమా ఉండనున్నాయన్నారు.

మెట్రో స్టేషన్లు సాలార్‌జంగ్ మ్యూజియం, చార్మినార్‌లకు 500మీటర్ల దూరంలో ఉన్నప్పటికీ, ఈ రెండు స్టేషన్‌లకు నగరంలో ఉన్న ప్రాముఖ్యత దృష్ట్యా వాటి పేరు పెట్టడం జరిగిందని తెలిపారు. ఎంజీబీఎస్-ఫలక్‌నుమా 5.5 కిలోమీటర్ల మెట్రోరైలు మార్గంలో 21 మసీదులు, 12 దేవాలయాలు, 12 అషూర్ఖానాలు, 33 దర్గాలు, 7 శ్మశానవాటికలు, 6 చిల్లాలతో సహా మొత్తం 103 మతపరమైన, ఇతర సున్నితమైన నిర్మాణాలున్నాయని తెలిపారు.

కర్వేచర్ సర్దుబాటు, వయాడక్ట్ డిజైన్, ఎత్తులు, మెట్రో పిల్లర్ లొకేషన్‌లలో తగిన మార్పు.. మొదలైన ఇంజనీరింగ్ పరిష్కారాల ద్వారా.. నాలుగు తప్ప మిగిలిన అన్ని మతపరమైన, సున్నితమైన నిర్మాణాలు పరిరక్షిస్తామని చెప్పారు. మతపరమైన, సున్నితమైన నిర్మాణాలను కాపాడేందుకు, రోడ్డు విస్తరణ 80 అడుగులకు పరిమితం చేయబడుతుందని, మొదటి ఫేజ్ ప్రాజెక్ట్ నుంచి అనుభవాల దృష్ట్యా స్టేషన్ స్థానాల్లో మాత్రం రహదారిని 120 అడుగులకు విస్తరిస్తారు. ఇక విస్తరణలో ఎఫెక్ట్ అయ్యే దాదాపు 1000 ఆస్తుల వ్యక్తిగత స్కెచ్‌ల తయారీ ప్రారంభించినట్టు తెలిపారు.

యువతిపై సామూహిక లైంగికదాడి...

(మొదటిపేజి తరువాయి)

చేసుకొని.. ఓ యువకుడితో పాటు ఇద్దరు మైనర్లను పోలీసులు అరెస్టు చేశారు. అయితే, నిందితులందర్నీ అరెస్టు చేసి, కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ బాధితుల బంధువులు, స్థానికులు పోలీస్ స్టేషన్‌ను ముట్టడించడంతో అక్కడ పరిస్థితులు ఉద్రిక్తంగా మారాయి. నిందితుల్లో బీజేపీ ఆఫీస్ బేరర్ కుమారుడి (మైనర్) పేరు ఉండటంతో రాజకీయంగానూ ఇది తీవ్ర దుమారం రేపుతోంది. 'తనతోపాటు తన సోదరిని నలుగురు యువకులు అపహరించారు. అనంతరం ఓ ఇంటికి తీసుకెళ్లారు. అక్కడ సోదరిపై సామూహిక లైంగికదాడికి పాల్పడ్డారు. తననూ లైంగికంగా వేధించారు' అని శుక్రవారం బాలిక తన ఫిర్యాదులో పేర్కొన్నట్టు జిల్లా ఎస్పీ ప్రదీప్ శర్మ వెల్లడించారు. అనంతరం ఇరువురు ఇంటికి చేరుకున్న తర్వాత.. బాధిత యువతి ఆత్మహత్యకు ప్రయత్నించిందన్నారు. ప్రస్తుతం ఆమె ఝాన్సీ ఆస్పత్రిలో చికిత్స పొందుతోందని.. బాలిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు సామూహిక లైంగికదాడి, పోక్సోతోపాటు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు. నాలుగో వ్యక్తి ఆచూకీ చెప్పిన వారికి రూ.10వేల రివార్డును ప్రకటించామన్నారు.

అమిత్ షా ఓఎస్‌డీనంటూ..

- యూపీ ఇంజినీర్ నకిలీ అవతారం
- అరెస్టు చేసిన పోలీసులు

న్యూఢిల్లీ : పీఎంఓ సీనియర్ అధికారిగా తనను తాను పరిచయం చేసుకొని పోలీసులకు చిక్కిన నకిలీ అధికారి కిరణ్ పటేల్ ఘటన మరవకముందే అలాంటి ఘటననే చోటు చేసుకున్నది. అయితే, ఈ సారి కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా డిపార్ట్‌మెంట్‌లో చోటు చేసుకున్నది. అమిత్ షా ఓఎస్‌డీ(ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ) నంటూ యూపీకి చెందిన ఒక సివిల్ ఇంజినీర్ నకిలీ అధికారి అవతారమెత్తాడు. అయితే, పోలీసులు అతని ఆటకట్టించారు. అరెస్టు చేసి కేసు నమోదు చేశారు. పీఎంఓ సీనియర్ అధికారినంటూ నమ్మించిన మోసగాడు కిరణ్ పటేల్ గతేడాది అరెస్టయిన విషయం తెలిసిందే.అమిత్ షా ఓఎస్డీ నంటూ నమ్మించిన నిందితుడు రాబిన్ ఉపాధ్యాయ్(48)ను యూపీలోని మీరట్‌వాసిగా గుర్తించారు. నిందితుడు గత 25 ఏండ్లుగా పలు బహుళజాతి కంపెనీలలో వృత్తిరీత్యా పని చేసినట్టు అధికారులు తెలిపారు. గంగా ఎక్స్‌ప్రెస్‌వే ప్రాజెక్టుకు ఉపాధ్యక్షుడు, ప్రాజెక్టు కోఆర్డినేటర్ పదవిపై ఉపాధ్యాయ్ దృష్టి సారించారు. అక్షత్ శర్మ అనే వ్యక్తి న్యూఢిల్లీలోని పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయటంతో ఈ విషయం వెలుగులోకి వచ్చిందని పోలీసులు తెలిపారు. రాబిన్ ఉపాధ్యాయ్‌ను అరెస్టు చేసినట్టు చెప్పారు. గతంలో కూడా పీఎంఓలో అధికారినంటూ జమ్మూకాశ్మీర్‌లో హల్‌చల్ చేసిన విషయం విదితమే.

జ్యోతికి రజతం

- అబా కటువ జాతీయ రికార్డు
- ఆసియా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్స్

బ్యాంకాక్ (థాయ్‌లాండ్)




తెలుగు తేజం, వర్థమాన స్ప్రింటర్ జ్యోతి ఎర్రాజి ఆసియా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్స్‌లో మరో పతకం సాధించింది. మహిళల 100 మీటర్ల హార్డిల్స్‌లో పసిడి పతకంతో ఈ ఘనత సాధించిన తొలి భారత అథ్లెట్‌గా రికార్డు నెలకొల్పిన జ్యోతి ఎర్రాజి.. ఆదివారం జరిగిన మహిళల 200 మీటర్ల రేసులో రజతం సొంతం చేసుకుంది. 23.13 సెకండ్లలో 200 మీటర్ల పరుగు పూర్తి చేసిన జ్యోతి ఎర్రాజి ప్రతిష్టాత్మక ఈవెంట్‌లో రెండో పతకం దక్కించుకుంది. భారత స్టార్ మారథాన్ రన్నర్ పారుల్ చౌదరి సైతం రెండో పతకం గెలుచుకుంది. 3000 మీటర్ల స్టీపుల్‌ఛేజ్‌లో స్వర్ణం నెగ్గిన పారుల్.. తాజాగా మహిళల 5000 మీటర్ల రేసులో రెండో స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్ కైవసం చేసుకుంది. 15 నిమిషాల 52.35 సెకండ్లలో రేసు ముగించిన పారుల్ చౌదరి.. జపాన్ అథ్లెట్ యుమ యమమోట తర్వాతి స్థానంలో నిలిచింది. ఇదే ఈవెంట్‌లో భారత అథ్లెట్ అంకిత 16.0.3.33 సెకండ్లతో మూడో స్థానంలో నిలిచి కాంస్య పతకం అందుకుంది.

ఇక మహిళల షాట్‌పుట్‌లో అబా కటువ సంచలన ప్రదర్శన చేసింది. ఏమాత్రం అంచనాలు లేకుండా ఆసియా చాంపియన్‌షిప్స్‌కు వచ్చిన అబా కటువ ఆదివారం జరిగిన పోటీల్లో ఏకంగా 93 సెమీ మెరుగుదల చూపించింది. నాలుగు కేజీల ఇనుప గుండును 18.06 మీటర్ల దూరం విసిరిన అబా కటువ.. సిల్వర్ మెడల్ సాధించింది. చైనా అథ్లెట్ సాంగ్ జియయూన్ 18.88 మీటర్లతో పసిడి పతకం సాధించింది. భారత వెటరన్ అథ్లెట్ మన్‌ప్రీత్ కౌర్ 17 మీటర్ల త్రోతో కాంస్య పతకం అందుకుంది. మన్‌ప్రీత్ కౌర్ నెలకొల్పిన జాతీయ రికార్డును ఆసియా పోటీల్లో అబా కటువ సమం చేసింది. పురుషుల జావెలిన్ త్రోలో డిపి మను 81.01 మీటర్ల త్రో స్వర్ణం సాధించగా, మెన్స్ 5000 మీటర్ల రేసులో గుల్వీర్ సింగ్ 13 నిమిషాల 48.33 సెకండ్ల టైమింగ్‌తో కాంస్య పతకం దక్కించుకున్నాడు. మెన్స్ 800 మీటర్ల రేసులో కిషన్ కుమార్ 1.45.88 సెకండ్లతో, మహిళల 800 మీటర్ల రేసులో కెఎం చంద 2.01.58 సెకండ్లతో సిల్వర్ మెడల్స్ గెల్చుకున్నారు.

ఉత్సాహంగా మోటోజీపీ రేసు

- హైదరాబాద్ టూర్‌లో 400 మంది రైడర్ల పోటీ



హైదరాబాద్ : మోటోజీపీ భారత్ కౌంట్‌డౌన్ ఘనంగా మొదలైంది. ఆదివారం హైటెక్ సిటీలో హైదరాబాద్ టూర్ రేసుకు విశేష స్పందన లభించింది. మోటోజీపీపై అవగాహన, ఔత్సాహిక రైడర్లను ఏకతాటికిపైకి తీసుకురావటమే లక్ష్యంగా సాగిన హైదరాబాద్ రేసులో సుమారు 400 మంది రైడర్లు పోటీపడ్డారు. 'హైదరాబాద్ రేసులో మహిళా రైడర్లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. రేసింగ్ కమ్యూనిటీలో మహిళల సంఖ్య విశేషంగా పెరిగంది అనేందుకు ఇదే సంకేతం. హైదరాబాద్ టూర్ రేసు విజయవంతమైన ఉత్సాహంలో తదుపరి రేసును ఈ నెల 23న అహ్మదాబాద్‌లో నిర్వహిస్తున్నాం. సెప్టెంబర్ 22-24 వరకు గ్రేటర్ నోయిడాలోని బుద్ధ ఇంటర్నేషనల్ ట్రాక్‌లో మోటోజీపీ భారత్ ఫైనల్స్ జరుగుతాయని' ఫెయిర్ స్ట్రీట్ స్పోర్ట్స్ ఎండీ సుశాంత్ తెలిపారు. హైదరాబాద్ రేసు సందర్భంగా రేసు ట్రాక్ ప్రాంతంలో మెగా డీజే షోలు, బైక్ స్టంట్లు, ఫుడ్ స్టాల్స్, సెల్ఫీ బూత్‌లు, 360 వీఆర్, గేమింగ్ బూత్‌లు అభిమానులను ఆకట్టుకున్నాయి.

అమ్మాయిలకు భంగపాటు

- వన్డేల్లో తొలిసారి భారత్‌పై బంగ్లా గెలుపు
- 154 పరుగుల ఛేదనలో భారత్ చతికిల

మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) అనుభవం అక్కరకు రాలేదు. స్లో వికెట్‌పై పరుగులు రాబట్టేందుకు టీ20 అనుభవం ఉపయోగపడలేదు. బంగ్లాదేశ్ స్పిన్నర్ల మాయలో భారత మహిళల జట్టు విలవిల్లాడింది. తొలిసారి వన్డే మ్యాచ్‌లో భారత్‌పై బంగ్లాదేశ్ విజయం సాధించింది. స్వల్ప స్కోర్ల థ్రిల్లర్‌లో భారత మహిళలు 40 పరుగుల తేడాతో దారుణ ఓటమి చవిచూశారు.

మీర్పూర్ (బంగ్లాదేశ్)



భారత్‌కు భంగపాటు. 154 పరుగుల ఛేదనలో 113 పరుగులకే కుప్పకూలిన టీమ్ ఇండియా అమ్మాయిలు 40 పరుగుల తేడాతో ఘోర ఓటమి చవిచూశారు. మీర్పూర్‌లో ఆదివారం బంగ్లాదేశ్‌తో తొలి వన్డేలో భారత్ పరాజయం పాలైంది. స్పిన్నర్ల మాయజాలంతో స్వల్ప స్కోరును కాపాడుకున్న బంగ్లాదేశ్.. 50 ఓవర్ల ఫార్మాట్‌లో భారత జట్టుపై తొలిసారి గెలుపు రుచి చూసింది. ఛేదనలో దీప్తి శర్మ (20, 40 బంతుల్లో), అమన్జోత్ కౌర్ (15, 40 బంతుల్లో 1 ఫోర్), యస్తికా భాటియా (15, 24 బంతుల్లో 1 ఫోర్) మినహా ఎవరూ కనీస పోరాట స్ఫూర్తి చూపించలేకపోయారు. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (5), వైస్ కెప్టెన్ స్మృతీ మంధాన (11), స్నేహ రానా (0) విఫలమయ్యారు. 35.5 ఓవర్లలో 113 పరుగులకే చేతులెత్తేశారు. తొలుత బ్యాటింగ్ చేసిన బంగ్లాదేశ్ మహిళలు 43 ఓవర్లలో 152 పరుగులకు ఆలౌటయ్యారు. కెప్టెన్ నిగార్ సుల్తానా (39, 64 బంతుల్లో 3 ఫోర్లు), ఫర్జానా హక్ (27, 45 బంతుల్లో 5 ఫోర్లు) రాణించారు. వర్షం అంతరాయంతో మ్యాచ్‌ను 44 ఓవర్లకు కుదించారు. డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో భారత్ లక్ష్యాన్ని 44 ఓవర్లలో 154 పరుగులుగా నిర్ధారించారు. బంగ్లాదేశ్ బౌలర్ మారూఫ అక్తర్ 'ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్' అవార్డు అందుకుంది. భారత్, బంగ్లాదేశ్ రెండో వన్డే బుధవారం మీర్పూర్‌లోనే జరుగనుంది.

ఛేదనలో చతికిల : డక్‌వర్త్ లూయిస్ పద్ధతిలో సవరించిన లక్ష్య ఛేదనలో టీమ్ ఇండియా తడబాటుకు గురైంది. స్లో వికెట్‌పై పరుగులు చేసేందుకు భారత బ్యాటర్లు విఫలమయ్యారు. టీ20 సిరీస్‌లో భారత్‌కు సవాల్ విసిరిన బంగ్లాదేశ్ స్పిన్నర్లు వన్డేల్లో మాయ చేశారు. కొత్త బంతితో బంగ్లాదేశ్ పేసర్ మరూఫ అక్తర్ విజృంభించింది. నాలుగు వికెట్లు పడగొట్టి భారత పతనాన్ని శాసించింది. స్పిన్నర్ రబేనా ఖాన్ (3/30) మిడిల్ ఓవర్లలో కీలక వికెట్లతో కోలుకోలేని దెబ్బకొట్టింది. హర్మన్‌ప్రీత్ కౌర్, జెమీమా రొడ్రిగస్, స్మృతీ మంధాన, ప్రియ పూనియా తేలిపోయారు. అంతకుముందు, ఆమన్జోత్ కౌర్ (4/31), దేవిక వైద్య (2/36) రాణించటంతో బంగ్లాదేశ్ 152 పరుగులకే కుప్పకూలింది.

మెస్సి, ఇంటర్ మియామీ దోస్తీ షురూ

- మేజర్ లీగ్ సాకర్‌లో 2025 వరకు ఒప్పందం ఖరారు



ఫ్లోరిడా (యుఎస్ఏ) : అమెరికా ఫుట్‌బాల్ అభిమానులు ఎదురుచూస్తున్న ఘట్టం రానే వచ్చింది. ప్రపంచ ఫుట్‌బాల్ సూపర్‌స్టార్, అర్జెంటీనా జాతీయ జట్టు కెప్టెన్ లియోనల్ మెస్సి అమెరికా మేజర్ లీగ్ సాకర్‌లో ఆడనున్నాడు. ఈ మేరకు ఎంఎల్ఎల్ ఫ్రాంచైజీ ఇంటర్ మియామీతో లియోనల్ మెస్సి ఒప్పందం కుదుర్చుకున్నాడు. 2025 వరకు కాంట్రాక్టుపై లియోనల్ మెస్సి సంతకం చేసినట్టు శనివారం ఇంటర్ మియామీ వర్గాలు తెలిపాయి. ఆదివారం జరిగే ఓ ఎంటర్‌టైన్‌మెంట్ కార్యక్రమంలో లియోనల్ మెస్సిని అభిమానులకు పరిచయం చేయనున్నారు. లియోనల్ మెస్సి, ఇంటర్ మియామీ యాజమాన్యం సోమవారం విలేకరుల సమావేశంలో పాల్గొంటారని ఇంటర్ మియామీ క్లబ్ తెలిపింది. 'ఇది నాకు గొప్ప అవకాశం. మీతో కలిసి ఈ అందమైన సౌధం నిర్మాణంలో పాలుపంచుకుంటాను (అమెరికాలో ఫుట్‌బాల్‌ను పాపులర్ చేయటం). ఇంటర్ మియామితో కలిసి పని చేసేందుకు ఎంతో ఆసక్తితో ఎదురు చూస్తున్నాను' అని లియోనల్ మెస్సి అన్నారు.

దులీప్ ట్రోఫీ సౌత్‌జోన్‌దే!

బెంగళూర్ : సౌత్ జోన్ దులీప్ ట్రోఫీ విజేతగా నిలిచింది. 298 పరుగుల ఛేదనలో 222 పరుగులకే కుప్పకూలిన వెస్ట్‌జోన్ 75 పరుగుల తేడాతో పరాజయం పాలైంది. సౌత్ జోన్ బౌలర్లు వాసుకి కౌశిక్ (4/36), సాయి కిశోర్ (4/57) నాలుగేసి వికెట్లు పడగొట్టారు. వెస్ట్ జోన్ బ్యాటర్లు ప్రియాంక్ పంచల్ (95), సర్ఫరాజ్ ఖాన్ (45) మెరిసినా.. ఆ జట్టుకు ఓటమి తప్పలేదు. పృథ్వీ షా (7), పుజారా (15), హార్విక్ దేశాయ్ (4) విఫలమయ్యారు. సౌత్‌జోన్ వరుస ఇన్నింగ్స్‌ల్లో 213, 230 పరుగులు చేయగా.. వెస్ట్ జోన్ తొలి ఇన్నింగ్స్‌లో 146 పరుగులకే ఆలౌటైంది. సౌత్‌జోన్ బౌలర్ విద్వత్ కావేరప్ప 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్', మ్యాన్ ఆఫ్ ది సిరీస్ (15 వికెట్లు) అవార్డులు అందుకున్నాడు.

సింధు పుంజుకోగలదు!

- పర్సనల్ కోచ్ హఫీజ్ హషీమ్



హైదరాబాద్ : భారత బ్యాడ్మింటన్ అగ్రశ్రేణి షట్లర్, రెండు సార్లు ఒలింపిక్ మెడలిస్ట్ పి.వి సింధు త్వరలోనే గెలుపు బాట పడుతుందని ఆమె నూతన వ్యక్తిగత కోచ్ హఫీజ్ హషీమ్ అన్నారు. పి.వి సింధుతో కలిసి ఇప్పటికే ట్రైనింగ్ మొదలుపెట్టిన హఫీజ్.. ఈ వారంలో జరుగనున్న కొరియా ఓపెన్ నుంచే సింధు పుంజుకోగలదని ఆశాభావం వ్యక్తం చేశారు. 'ఒలింపిక్స్ అర్హత ప్రక్రియ మొదలైంది. షట్లర్లు అందరూ బరిలో నిలువటంతో కాస్త ఒత్తిడి కూడా ఉంటుంది. మా లక్ష్యం ఒలింపిక్స్‌కు అర్హత మాత్రమే కాదు, పారిస్‌లో పసిడి పతకం సాధించటం. ప్రాక్టీస్‌లో సింధు మెరుగ్గా ఆడుతోంది. గేమ్ ప్లాన్, వ్యూహాలపై చర్చించాం. సింధు బలం స్మాష్‌లు. స్మాష్‌లు నిలకడగా సంధించటం, సులువైన పాయింట్లు సొంతం చేసుకోవటం, గేమ్ వ్యవధి కుదించటం, గేమ్‌పై ఆలోచించకుండా వీలైనన్ని ఎక్కువ పాయింట్లు సాధించటం వంటి వాటిపై దృష్టి నిలిపాం. సింధు బిగ్ మ్యాచ్ ప్లేయర్. ఇటీవల నిలకడలేమి ఫామ్‌పై ఆందోళన అవసరం లేదు' అని హఫీజ్ తెలిపారు. పారిస్ ఒలింపిక్స్ వరకు హఫీజ్‌ను సింధు వ్యక్తిగత కోచ్‌గా కొనసాగించాలని సాయ్ (స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా)ను కోరినట్టు ఆమె తండ్రి పి.వి రమణ వెల్లడించారు.



లక్ష్యసేన్ పరాజయం

- యుఎస్ ఓపెన్ బ్యాడ్మింటన్

కౌన్సిల్ బ్లఫ్స్ (యుఎస్ఏ) : భారత యువ షట్లర్ లక్ష్యసేన్ యుఎస్ ఓపెన్ సెమీఫైనల్లో పోరాడి ఓడాడు. గత వారం కెనడా ఓపెన్ ఫైనల్లో చైనా షట్లర్ లి షి ఫెంగ్‌ను చిత్తు చేసి విజేతగా నిలిచిన లక్ష్యసేన్.. పురుషుల సింగిల్స్ సెమీఫైనల్లో అతడి చేతిలో మూడు గేముల పోరాటంలో తలొగ్గాడు. 76 నిమిషాల పాటు హోరాహోరీగా సాగిన సెమీఫైనల్ పోరులో మూడో సీడ్ లక్ష్యసేన్ 17-21, 24-22, 17-21తో రెండో సీడ్ ఫెంగ్ చేతిలో పరాజయం పాలయ్యాడు. తొలి గేమ్‌లో ఓటమి అంతరం తక్కువే కానీ.. లక్ష్యసేన్ అంచనాలను అందుకోలేదు. ఏ దశలో ఫెంగ్‌పై ఆధిపత్యం చూపించలేదు. 11-7తో విరామ సమయానికి ముందంజ వేసిన ఫెంగ్.. ద్వితీయార్థంలోనూ దూసుకెళ్లి తొలి గేమ్‌ను నెగ్గాడు. ఇక ఉత్కంఠగా సాగిన రెండో గేమ్‌ను టైబ్రేకర్‌లో లక్ష్యసేన్ సొంతం చేసుకున్నాడు. 10-11తో విరామ సమయానికి వెనుకంజ వేసిన లక్ష్యసేన్.. ఆ తర్వాత పుంజుకున్నాడు. వరుసగా మూడు పాయింట్లతో ఆధిక్యంలోకి దూసుకెళ్లాడు. 13-13తో ఫెంగ్ స్కోరు సమం చేయగా.. ఇక అక్కడ్నుంచి నువ్వా నేనా అన్నట్టు సాగింది మ్యాచ్. 20-20 వద్ద స్కోర్లు సమమైన వేళ వరుసగా రెండు పాయింట్లతో లక్ష్యసేన్ ముందంజ వేశాడు. మ్యాచ్‌ను నిర్ణయాత్మక మూడో గేమ్‌కు తీసుకెళ్లాడు. చావోరేవో తేల్చుకోవాల్సిన గేమ్‌లో లక్ష్యసేన్ నిరాశపరిచాడు. ఏ దశలోనూ ఫెంగ్‌కు గట్టి పోటీ ఇవ్వలేదు. మూడో గేమ్‌తో పాటు ఫైనల్స్ బెర్త్ దక్కించుకున్న ఫెంగ్ కెనడా ఓపెన్ ఓటమికి ప్రతీకారం తీర్చుకున్నాడు!. లక్ష్యసేన్ ఓటమితో యుఎస్ ఓపెన్‌లో భారత పతక ఆశలకు తెరపడింది.

ముగిసిన జాతీయ కరాటే పోటీలు



హైదరాబాద్ : జాతీయ ఓపెన్ కరాటే పోటీలు ఆదివారం ముగిశాయి. యూసుఫ్‌గూడలోని కోట్ల విజయభాస్కర్ రెడ్డి ఇండోర్ స్టేడియంలో జరిగిన నేషనల్ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్స్‌లో స్పోర్ట్స్ కరాటే డూ అకాడమీ అథ్లెట్లు నాలుగు పసిడి, రెండు రజత, రెండు కాంస్య పతకాలు సహా ఎనిమిది మెడల్స్ సాధించారు. అండర్-12 (50కేజీలు) విభాగంలో వై. శివ దీపేశ్ పాత్రో, 45కేజీలు విభాగంలో వేదాన్ష్ ప్రసాద్‌లు స్వర్ణ పతకాలు గెల్చుకున్నారు. అర్జున్ అభిలాశ్ (అండర్-10, 55 కేజీలు), ఆరవ్ భువానియ (అండర్-10, 40 కేజీలు) గోల్డ్ మెడల్స్ నెగ్గారు. అభిరామ్, ఆలేటి అభినవ్ సిల్వర్ మెడల్స్ కొట్టగా.. భవ్య మీనాక్షి, మోహిత్ యడలు కాంస్య పతకాలు నెగ్గారు. జాతీయ పోటీల్లో పతకాలు సాధించిన అథ్లెట్లను కోచ్ డెవిడ్ అభినందించారు.

వేతనాలు పెంచండి

- 63 ఏండ్ల తర్వాత హాలీవుడ్‌లో సమ్మె సైరన్
- ఏఐతో వినోద రంగంలోనూ కలకలం

పారితోషికాలను పెంచకపోగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ)తో తమ జీవితాలపై దెబ్బ కొట్టాలని ఆలోచిస్తున్న హాలీవుడ్ స్టూడియోలు, నిర్మాణ సంస్థలపై నటీనటులు, రచయితలు సమ్మె సైరన్ మోగించారు. 63 ఏళ్ల తర్వాత హాలీవుడ్‌లో సమ్మె మాట వినిపించడం అరుదైన విషయం. వేతనాల పెంపుతో పాటు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వల్ల భవిష్యత్తులో తమ మనుగడకే ముప్పు వాటిల్లనుందని 'సాగ్' సభ్యులు ఆందోళన బాట పట్టారు.

హాలీవుడ్‌కు చెందిన 'సాగ్' (స్క్రీన్ యాక్టర్స్ గిల్డ్- అమెరికన్ ఫెడరేషన్ ఆఫ్ టెలివిజన్ అండ్ రేడియో ఆర్టిస్టు) అసోసియేషన్ శుక్రవారం నుంచి సమ్మెకు పిలుపునిచ్చింది. ఈ అసోసియేషన్‌లో లక్షా అరవై వేల మంది నటీనటులున్నారు. వారిలో టామ్ క్రూజ్, ఏంజెలినా జోలి వంటి అగ్రశ్రేణి తారలు ఉండటం విశేషం.

'సాగ్' పిలుపుతో హాలీవుడ్‌లో షూటింగ్స్ మొత్తం నిలిచిపోయాయి. ఈ సమ్మెకు సంఘీభావం తెలియజేస్తూ ప్రముఖ దర్శకుడు క్రిష్టోఫర్ నోలన్ రూపొందించిన 'ఒప్పెన్ హైమర్' ప్రీమియర్ షోను ఆ చిత్ర నటీనటులు బహిష్కరించడం సంచలనంగా మారింది. ఇదిలా ఉంటే, మే 1వ తేదీ నుంచి 'రైటర్స్ గిల్డ్ ఆఫ్ అమెరికా' ఆధ్వర్యంలో నిరవధిక సమ్మె జరుగుతోంది. తమ మేధస్సునంతా ధారబోసి రాసే కథలతో హాలీవుడ్ స్టూడియోలు కోట్లకు పడగలెత్తు తున్నాయని, తమకు మాత్రం నామమాత్రపు పారితోషికాలు అందుతున్నాయని రైటర్స్ గిల్డ్ ఆఫ్ అమెరికా ఆరోపిస్తోంది. అటు నటీనటులు, ఇటు రచయితలు ఈ సమ్మెని ఇలాగే కొనసాగిస్తే బోల్డెని హాలీవుడ్ చిత్రాల విడుదల వాయిదా పడి, భారీ నష్టాన్ని హాలీవుడ్ స్టూడియోలు ఎదుర్కోవాల్సి రావడం ఖాయం.

యూనిక్ కాన్సెప్ట్

డిస్నీ ఫ్లస్ హాట్ స్టార్ ద్వారా రాబోతున్న మరో యూనిక్ వెబ్ సిరీస్ 'దయా'. పవన్ సాధినేని దర్శకత్వంలో ఎస్వీఎఫ్ ఎంటర్ టైన్‌మెంట్ సంస్థ నిర్మించింది. జేడీ చక్రవర్తి, రమ్య నంబీశన్, ఈషా రెబ్బా ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సిరీస్ ఆగస్టు 4 నుంచి స్ట్రీమింగ్ కానుంది. ఆదివారం ఈ వెబ్ సిరీస్ ట్రైలర్‌ను దర్శకుడు కృష్ణవంశీ విడుదల చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'ఈ వెబ్ సిరీస్ ట్రైలర్ బాగుంది. ఈ సిరీస్‌లోని బ్యాక్ గ్రౌండ్స్, ఎడిటింగ్ ప్యాటర్న్స్, మ్యూజిక్ అన్నీ బాగున్నాయి. పవన్ కథను ఆకట్టుకునేలా తెరకెక్కించాడు. చక్రికి చాలా రోజుల తర్వాత ఎనర్జిటిక్ క్యారెక్టర్ దొరికింది. ఈషా, విష్ణు ప్రియ క్యారెక్టర్స్ కూడా బాగున్నాయి' అని తెలిపారు. "గులాబీ' సినిమాతో నన్ను హీరోగా చేసిన కృష్ణవంశీ ఈ కార్యక్రమానికి రావాలని నా కోరిక. అలాగే వచ్చాడు. నేను చేస్తున్న తొలి వెబ్ సిరీస్ ఇది. పవన్‌ను కలిసినప్పుడు డైరెక్టర్‌గా అతనిలో ఒక ప్రామిసింగ్ క్వాలిటీ కనిపించింది. ఫొటో షూట్ దగ్గర నుంచి ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా తను షూటింగ్ చేశాడు. ప్రతి ఒక్కరి క్యారెక్టర్ సూపర్బ్‌గా ఉంటుంది. కమల్, విష్ణు ప్రియ క్యారెక్టర్స్ సర్‌ప్రైజ్ చేస్తాయి. జోష్ రవికి మంచి క్యారెక్టర్ ఉంది. వెబ్ సిరీస్ బాగుంటుంది చూడండి అని మేము పదే పదే చెప్పనక్కర్లేదు. మీకు నచ్చుతుంది. నచ్చితే తప్పకుండా చూస్తారు' అని హీరో జేడీ చక్రవర్తి చెప్పారు.



నవచిత్రం

అరుదైన విశ్వ విజయ శతక వేడుక

ప్రియదర్శి, కావ్య కళ్యాణ్‌రామ్, సుధాకర్ రెడ్డి, మురళీధర్ గౌడ్ ప్రధాన పాత్రల్లో నటించిన సినిమా 'బలగం'. దిల్ రాజు ప్రొడక్షన్స్ బ్యానర్‌పై హర్షిత్ రెడ్డి, హన్షిత నిర్మించిన ఈ సినిమాకు వేణు ఎల్దండి దర్శకత్వం వహించారు. ఈ చిత్రానికి ప్రపంచవ్యాప్తంగా వంద అంతర్జాతీయ అవార్డులు వచ్చాయి.



ఈ సందర్భంగా విశ్వ విజయ శతకం ఈవెంట్‌లో దిల్ రాజు మాట్లాడుతూ, 'నేను ఎన్నో వంద రోజుల ఫంక్షన్‌లు చూశాను.. వంద కోట్ల పోస్టర్‌ను చూశాను. కానీ మొదటి సారి ఇలా వంద అవార్డుల ఫంక్షన్‌ను చూస్తున్నాం. ఈ కథను మా దగ్గరకు తీసుకొచ్చిన వేణుకి, వేణుని మా దగ్గరికి తీసుకొచ్చిన ఈస్ట్ డిస్ట్రిబ్యూటర్ శివరాంకు థ్యాంక్స్. మళ్లీ ఇలాంటి అద్భుతాలు జరుగుతాయో లేదో తెలిదు. అందుకే ఈ రోజు ఇలా ఈవెంట్ చేసుకుంటున్నాం' అని తెలిపారు. హన్షిత మాట్లాడుతూ, 'నేను, అన్న కలిసి స్టార్ట్ చేసిన ప్రొడక్షన్‌లో చేసిన మొదటి సినిమా ఇది. ఇంత పెద్ద విజయం సాధిస్తుందని అనుకోలేదు. అంతర్జాతీయంగా వంద అవార్డులు రావడం, ఇలా ఫంక్షన్ చేయడం ఇదే మొదటి సారి' అని తెలిపారు. 'మూలాల్లోంచి రాసుకున్న కథ, అంతే సహజంగా తీయాలని అనుకున్నాను. అందుకే ప్రపంచంలో ఉన్న సినిమాలన్నీ చూశాను. అవార్డులు వచ్చిన సినిమాలు చూశాను. కానీ నా సినిమాకే వంద అవార్డులు వచ్చాయి. బలగం సినిమాకు మొదటి హీరో దిల్ రాజు. ఆయన నమ్మడం వల్లే ఈ సినిమా స్టార్ట్ అయింది. చిన్న సినిమాను నమ్మి పెద్ద ఎత్తుకు తీసుకెళ్లారు. శిరీష్, హన్షిత, హర్షిత్‌కు థ్యాంక్స్' అని దర్శకుడు చెప్పారు.

రొమాంటిక్ ఫాంటసీ ఎంటర్‌టైనర్


రష్మిక మందన ప్రధాన పాత్రలో రూపొందుతున్న తెలుగు, తమిళ ద్విభాషా రొమాంటిక్ ఫాంటసీ ఎంటర్‌టైనర్ 'రెయిన్‌బో'. డ్రీమ్ వారియర్ పిక్చర్స్ నిర్మాతలు ఎస్ఆర్.ప్రకాష్ బాబు, ఎస్ఆర్. ప్రభు నిర్మిస్తున్న ఈ చిత్రంలో దేవ్ మోహన్ మరో ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. నూతన దర్శకుడు శాంతరూబన్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు.

ఇటీవలే ఈ చిత్రం తొలి షెడ్యూల్ షూటింగ్‌ని పూర్తి చేసుకుంది. కోడై కెనాల్, తమిళనాడు పరిసర ప్రాంతాల్లో కీలక సన్నివేశాల్ని చిత్రీకరించారు. తాజాగా ఈ సినిమా సెకండ్ షెడ్యూల్ షూటింగ్‌కి సిద్ధమౌతోంది. త్వరలోనే ఈ షెడ్యూల్ ప్రారంభం కానుందని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి జస్టిన్ ప్రభాకరన్ సంగీతం, భాస్కరన్ సినిమాటోగ్రఫీ, నేషనల్ అవార్డ్ విన్నింగ్ ప్రొడక్షన్ డిజైనర్ బంగ్లాన్ ప్రొడక్షన్ డిజైన్ ఇన్‌ఛార్జ్‌గా పని చేస్తున్నారు. ఈ చిత్రానికి డీవోపీ-కె. ఎం. భాస్కరన్, ఎడిటర్ - ఇ. సంగతమిళన్, ఆర్ట్ డైరెక్టర్: సుబెంథర్ పిఎల్, క్రియేటివ్ ప్రొడ్యూసర్: తంగప్రభాకరన్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: అరవేంద్రరాజ్ భాస్కరన్.


రష్మిక మందన

స్ట్రెస్ రిలీఫ్ చేసే సినిమా

చైతన్య రావ్, లావణ్య జంటగా నటించిన సినిమా 'అన్నపూర్ణ ఫోటో స్టూడియో'. మిహిరా, ఉత్తర, వైవా రాఘవ, లలిత్ ఆదిత్య ఇతర కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రాన్ని బిగ్ బెన్ సినిమాస్ పతాకంపై యష్ రంగినేని నిర్మించారు. చెందు ముద్దు దర్శకత్వం వహించిన ఈ సినిమా ఈ నెల 21న విడుదలకు సిద్ధమవుతోంది. ఈ సందర్భంగా నిర్మాత యష్ రంగినేని మీడియాతో మాట్లాడుతూ, 'చెందు చెప్పిన కథలోని పల్లెటూరి నేపథ్యం, టర్న్‌లు, ట్విస్ట్‌లు, పీరియాడిక్ నేపథ్యం ఆకట్టుకుంది. అలాగే ఆసక్తికరమైన స్క్రీన్‌ప్లే ఒక్క మాటలో చెప్పాలంటే 'ఓ పిట్ట కథ' కంటే ఇందులో స్టోరీ టర్న్లు, థ్రిల్లింగ్ ఎలిమెంట్స్ బాగా ఉంటాయి. పల్లెటూరిలో జరిగే ప్రేమ కథ ఇది. కొన్ని కారణాల వల్ల హీరో పెళ్లి చేసుకోవడం ఆలస్యమవుతుంది. ఇంతలో ఒక అనూహ్య ఘటన జరుగుతుంది. ఆ ఘటన వల్ల వీరి ప్రేమ కథ ఎలాంటి మలుపులు తిరిగింది అనేది ఆసక్తికరంగా సాగుతుంది. జెన్యూన్‌గా తీసిన ఈ సినిమాలో పూర్తి కమర్షియల్ అంశాలుంటాయి. ఇందులో ఉన్న పాత్రలన్నీ కథలో ఏదో ఒక పర్పస్‌తో ప్రవర్తిస్తాయి. ఇందులో ఓ పాత్రలో నేనూ నటించాను. సినిమాలో లొకేషన్స్ ఓ ప్రధాన ఆకర్షణ అవుతాయి. పల్లెటూర్ల ప్రకృతి అందాన్ని చూస్తారు. అలాగే మ్యూజిక్ అలరిస్తుంది. ఈ మధ్య తిరుపతి, విజయవాడ..ఇలా చాలా చోట్ల ప్రివ్యూస్ వేశాం. యూత్ చాలా మంది వచ్చి సినిమా చూశారు. స్ట్రెస్ రిలీఫ్ అయ్యే సినిమా చూశామని అన్నారు. ఇలాంటి రెస్పాన్స్ సంతోషాన్నిచ్చింది. దాదాపు 3 వేల కిలోమీటర్ల టూర్ ఈ సినిమా కోసం తిరిగాం. చైతన్య రావ్ ఈ సినిమాలో బాగా పెర్మార్మ్ చేశాడు. అలాగే లావణ్య కూడా బాగా నటించింది. ఈ సినిమాను ఈటీవీ విన్ యాప్ వాళ్లకు ఇచ్చాం. మా సినిమా చూసి బాగుందని వారు తీసుకునేందుకు వచ్చారు' అని తెలిపారు.


యష్ రంగినేని

ఎపిక్ బయోగ్రాఫికల్ థ్రిల్లర్

ఎపిక్ బయోగ్రాఫికల్ థ్రిల్లర్ 'ఓపెన్ హైమర్' చిత్రం. క్రిస్టోఫర్ నోలన్ రచన, నిర్మాణం, దర్శకత్వంలో రూపొందింన చిత్రమిది. యూనివర్సల్ పిక్చర్స్ ద్వారా ఇంగ్లీష్‌లో మాత్రమే ఈనెల 21న ఈ సినిమా విడుదలవుతోంది.

మాన్‌హట్టన్ ప్రాజెక్ట్‌లో మొదటి అణ్వాయుధాలను అభివృద్ధి చేయడంలో సహాయపడిన సైద్ధాంతిక భౌతిక శాస్త్రవేత్త, అమెరికన్ ప్రోమేథియస్ జె. రాబర్ట్ ఓపెన్‌హైమర్ గురించి 2005లో కైబర్డ్, మార్టిన్ జె, షెర్విన్ రాసిన పుస్తకం ఆధారంగా దీన్ని తెరకెక్కించారు.

ఈ చిత్రంలో సిలియన్ మర్ఫీ టైటిల్ క్యారెక్టర్‌లో నటించగా, ఎమిలీ బ్లంట్, మాట్ డామన్, రాబర్ట్ డౌనీ జూనియర్, ఫ్లోరెన్స్ పగ్, జోష్ హార్ట్‌నెట్, కేసీ అఫ్లెక్, రామి మాలెక్, కెన్నెత్ బ్రానాగ్ తదితరులు ఇతర ముఖ్య పాత్రల్లో నటించారు.

ఈ చిత్రాన్ని 65 ఎం.ఎం.లార్జ్ ఫార్మాట్ ఫిల్మ్ ఫోటోగ్రఫీతో కలిపి ఐమాక్స్ ఫార్మాట్‌లో రూపొందించారు. అలాగే కాలాన్ని బట్టి కొన్ని భాగాలు బ్లాక్ అండ్ వైట్‌లోనూ కనిపిస్తాయి. ఫోటోగ్రఫీలో గగుర్పాటు కలిగించే సన్నివేశాలు, యాక్షన్ సీన్స్ ఎన్నో ఉన్నాయని, అన్ని వర్గాల ప్రేక్షకులను ఈ సినిమా మెప్పిస్తుందనే దీమాతో మేకర్స్ ఉన్నారని చిత్ర బృందం తెలిపింది.


ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ- హెూయ్టే వాన్ హెూటెమా, సంగీతం- లుడ్విగ్ గోరాన్సన్.


'ఓపెన్ హైమర్' చిత్రంలోని ఒక దృశ్యం

మెప్పించే నా.. నీ ప్రేమకథ

అముద శ్రీనివాస్ హీరోగా, స్వీయ దర్శకత్వంలో రూపొందించిన చిత్రం 'నా.. నీ ప్రేమ కథ'. కారుణ్య చౌదరి కథానాయిక. పోత్నాక్ శ్రవణ్ కుమార్ ఎంటర్ టైన్ మెంట్స్ పతాకంపై పోత్నాక్ శ్రవణ్ కుమార్ నిర్మిస్తున్నారు. ఇటివలే విడుదలైన ఈ చిత్ర టీజర్‌కు మంచి రెస్పాన్స్ వచ్చింది. తాజాగా తెలంగాణ సినిమాటోగ్రఫీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఈ చిత్ర ట్రైలర్‌ని లాంచ్ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'ట్రైలర్ అద్భుతంగా ఉంది. హీరోగా, దర్శకునిగా అముద శ్రీనివాస్ మంచి ప్రతిభని కనబరిచారు. ఈ ట్రైలర్ చూస్తుంటే సినిమా ఖచ్చితంగా పెద్ద విజయం సాధిస్తుందని నమ్మకముంది. నటీనటులు అంతా బాగా చేశారు. ఈ చిత్ర నిర్మాత పోత్నాక్ శ్రవణ్‌కు మంచి లాభాలు రావాలి. హీరో, దర్శకుడు అముద శ్రీనివాస్ మంచి అవకాశాలు అందుకోవాలి' అని తెలిపారు.

'అందర్నీ మెప్పించే ప్రేమకథ ఇది. రొటీన్‌కి భిన్నంగా ఉండదు' అని దర్శకుడు, హీరో అముద శ్రీనివాస్ అన్నారు.రమ్య, అజయ్ ఘోష్, షఫీ, అన్నపూర్ణమ్మ, ఫిష్ వెంకట్ జబర్ దస్త్ ఫణి, నాగిరెడ్డి. బస్ స్టాప్ కోటేశ్వర రావు, మాధవి, వేములూరి రాజశేఖర్, హరి తదితరులు నటిస్తున్న ఈచిత్రానికి డివోపీ: ఎంఎస్ కిరణ్ కుమార్, సంగీతం : ఎంఎల్ పి రాజా, ఆర్ఆర్ :చిన్నా, ఎడిటర్ : నందమూరి హరి.


అముద శ్రీనివాస్, కారుణ్య చౌదరి

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

నాటో విస్తరణతో ప్రపంచ శాంతి, సుస్థిరతకు ముప్పు

- మలేషియా విశ్లేషకులు

కౌలాలంపూర్ : ప్రచ్ఛన్న యుద్ధం తరువాత జరిగిన నాటో విస్తరణతో ప్రపంచ శాంతి, సుస్థిరత ప్రమాదంలో పడ్డాయని మలేషియాకు చెందిన ప్రముఖ రాజకీయ విశ్లేషకులు లీపీ మే విమర్శించారు. యూరప్ భాగస్వాములతో ఏర్పడిన నాటో ఇప్పుడు పూర్తిగా అమెరికా చేతిలోకి వెళ్లిపోయిందని, ఏకపక్షంగా వ్యవహరిస్తుందని ఇంటర్నేషనల్ ఇస్లామిక్ యూనివర్శిటీలో పనిచేసే లీ లీ మే తెలిపారు.

నాటో తన సభ్యులందరి ప్రయోజనం కోసం కాకుండా.. కేవలం అమెరికా ప్రయోజనాల రక్షణ కోసమే ఎలా రూపాంతరం చెందిందో అందరం చూస్తూనే ఉన్నామని అన్నారు. నాటో ఇప్పుడూ ఆసియాలోకి కూడా చొచ్చుకుపోయిందని, చైనాకు వ్యతిరేకంగా అమెరికా తన ప్రయత్నాలకు నాటోను ఉపయోగించుకుంటుందని విమర్శించారు. అయితే చైనాను ప్రత్యర్థిగా చూపాలనే నాటో ప్రయత్నాలకు ఎదురుదెబ్బ తగలిందని అన్నారు.

న్యాయ వ్యవస్థకు తూట్లు పొడిచే బిల్లుపై 28వ వారానికి చేరిన నిరసనలు

జెరూసలెం: న్యాయ వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు బిల్లు తీసుకొస్తున్న ఇజ్రాయిల్‌లోని పచ్చి మితవాద నెతన్యాహు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనలు రోజురోజుకీ ఉధృతమవుతున్నాయి. వరుసగా 28వ వారం కూడా వేలాది మంది టెల్ అవీవ్ వీధుల్లో నిరసన ప్రదర్శనలు నిర్వహించారు. నెతన్యాహు మరో వైపు అనారోగ్యంతో శనివారం ఆసుపత్రి పాలయ్యాడు. నెతన్యాహు ప్రభుత్వం ఈ బిల్లులో కీలక భాగానికి సంబంధిం ప్రాథమిక ఆమోదం పొందింది. ఈ నెల చివరి నాటికి దీనిని చట్టంగా తీసుకురావాలని ప్రభుత్వం పావులు కదుపుతోంది. అయితే అంత తేలిక కాకపోవచ్చు. ఈ బిల్లు చట్టంగా మారడానికి మరో రెండు దశల్లో ఓటింగ్ అవసరమవుతుంది. దీనికి అదే స్థాయిలో ప్రతిఘటన కూడా పెరుగుతోంది. శనివారం టెల్ అవీవ్‌లో పది వేల మంది నిరసనకారులు న్యాయవ్యవస్థను కాపాడాలంటూ ప్రదర్శన నిర్వహించారు. 'ఎస్ఒఎస్' అని రాసి ఉన్న ఫ్లకార్డులను పట్టుకుని, గులాబీ, కాషాయ రంగు పౌడర్‌ను గాలిలోకి విసురుతూ నిరసన తెలిపారు. జెరూసలెంలోని నెతన్యాహు నివాసం ఎదుట కాగడాలతో నిరసన తెలిపారు. ఇజ్రాయిల్‌లోని ప్రధాన పట్టణాలన్నీ శనివారం నిరసనలతో హోరెత్తాయి. బహుళ ప్రాచుర్యం పొందిన టివి సిరీస్‌లోని పాత్రలను పోలిన రెడ్ రోబ్స్ వేష ధారణలో మహిళలు పెద్ద సంఖ్యలో ఈ నిరసన ర్యాలీలో పాల్గొనడం విశేషం. ఈ బిల్లు గనుక చట్టంగా మారితే తమ హక్కులన్నీ ప్రభుత్వం లాగేసుకుంటుందన్న ఆందోళన మహిళల్లో వ్యక్తమవుతోంది. ప్రభుత్వం ఈ బిల్లును ఉపసంహరించుకుంటే సరే, లేక పోతే దేశవ్యాపిత సమ్మెకు వెళ్లాల్సి వస్తుందని, మొత్తం ఆర్థిక వ్యవస్థే స్తంభించిపోయేలా చేస్తామని జాతీయ కార్మిక సంఘ నాయకుడు ఆర్నాన్ బార్ డేవిడ్ హెచ్చరించారు.

న్యాయ వ్యవస్థను దెబ్బ తీసే ఆలోచనను విరమించుకోవాలని మిలిటరీ అధికారులు, యుద్ధ విమాన పైలెట్లు, వ్యాపారవేత్తలు నెతన్యాహును కోరారు. ఈ ఏడాది జనవరిలో నెతన్యాహు ప్రధానిగా తిరిగి పగ్గాలు చేపట్టిన వెంటనే న్యాయవ్యవస్థపై దాడి మొదలెట్టాడు. దీనికి వ్యతిరేకంగా ఇజ్రాయిల్ అంతటా పెద్దయెత్తున నిరసన జ్వాలలు చెలరేగాయి. నెతన్యాహు ఇప్పటికే పలు అవినీతి కుంభ కోణాల కేసుల్లో ఇరుక్కున్నాడు. పలు అక్రమాలకు పాల్పడినట్లు అభియోగాలు ఉన్నాయి. ఈ కేసుల్లో శిక్ష పడకుండా తప్పించుకోడానికే న్యాయ వ్యవస్థ స్వతంత్రతను దెబ్బ తీసేందుకు ఆయన యత్నిస్తున్నాడని పరిశీలకులు పేర్కొన్నారు.

ఆస్పత్రి నుంచి కొలంబియా చిన్నారుల డిశ్చార్జి

బొగోటా : విమాన ప్రమాదం బారిన పడి అమెజాన్ అడవుల్లో సుమారు ఐదు వారాలు ఒంటరిగా గడిపిన నలుగురు కొలంబియా చిన్నారులు ఇటీవలే ఆస్పత్రి నుంచి డిశ్చార్జి అయ్యారు. అమెజాన్ అడవుల నుంచి వీరిని రక్షించిన తరువాత బొగోటా మిలటరీ ఆసుపత్రులో చికిత్స అందించారు. 34 రోజుల పాటు ఆస్పత్రిలో ఉన్న తరువాత వీరిని ఈ నెల 14న డిశ్చార్జి చేశారు. మే 1 జరిగిన విమాన ప్రమాదంలో చిన్నారులు తమ తల్లిని, ఇద్దరు ఇతర పెద్దవాళ్లను కోల్పోయారు. 40 రోజుల పాటు వీరు ఒంటరిగా గడవడం ప్రపంచ వ్యాప్తంగా పతాక శీర్షికలకెక్కింది. వీరిలో పెద్ద అమ్మాయి (లెస్లీ, 13 ఏండ్లు) ధైర్యంగా ఉండటం, అమెకు అడవులపై మంచి అవగాహన ఉండటం ఇందుకు కారణంగా అధికారులు చెబుతున్నారు.

రాజకీయాలు చర్చించలే... శరద్ పవార్‌ను కలిసిన అజిత్ పవార్

ముంబయి: మహారాష్ట్రలోని ఎన్సీపీలో కీలక పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఇటీవల ఎన్సీపీ నుంచి తిరుగుబాటు చేసిన అజిత్ పవార్ సహా పలువురు నేతలు ఈరోజు ముంబయిలో ఎన్సీపీ అధినేత శరద్ పవార్‌ను కలిశారు. ఆయన్ను కలిసిన వారిలో మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్‌తో పాటు ప్రఫుల్ పటేల్, ఛగన్ భుజ్‌బల్, దిలీప్ పాటిల్ తదితరులు ఉన్నారు. తిరుగుబాటు చేసిన తర్వాత తొలిసారి వీరంతా ఆయన్ను కలవడం గమనార్హం. ఈ సందర్భంగా ప్రఫుల్ పటేల్ మాట్లాడుతూ.. శరద్‌పవార్ ఆశీస్సుల కోసమే వచ్చినట్టు తెలిపారు. ఎన్సీపీని ఐక్యంగా ఉంచాలని శరద్‌ను కోరినట్టు పేర్కొన్నారు. తమ విజ్ఞప్తిపై ఆయనేమీ స్పందించ లేదన్నారు.

యూసీసీ అవసరం లేదు

కాంగ్రెస్ సలహా బృందం

న్యూఢిల్లీ : ప్రస్తుతం దేశానికి ఉమ్మడి పౌరస్మృతి (యూసీసీ) అవసరం లేదని కాంగ్రెస్ సలహా కమిటీ అభిప్రాయం వ్యక్తం చేసింది. వ్యక్తిగత చట్టాల సంస్కరణలకు అవకాశం ఉన్నప్పుడు యుసిసి అవసరం లేదని తెలిపింది. యూసీసీ పై సలహా ఇవ్వడం కోసం ఎనిమిది సభ్యులతో సలహా బృందాన్ని కాంగ్రెస్ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో శనివారం ఈ బృందం అంతర్గత సమావేశమయింది. ఈ సమావేశంలో అత్యధిక మంది యూసీసీ అవసరంలేదని అభిప్రాయం వ్యక్తం చేసినట్లు సమాచారం. అలాగే కేంద్రం డ్రాఫ్ట్ ముసాయిదా విడుదల చేసే వరకూ కాంగ్రెస్ పార్టీ యూసీసీ పై వైఖరి వెల్లడించకూడదనే అభిప్రాయాన్ని బృందం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఈ బృందంలో పి.చిదంబరం, అభిషేక్ సంఘ్వి, సల్మాన్ ఖుర్షీద్, మనీష్ తివారీ, వివెక్ తంక, కెటిఎస్ తుల్సి తదితరులు ఉన్నారు.


పవన్‌తో పంచకర్ల భేటీ

- 20న జనసేనలో చేరిక



అమరావతి : జనసేన పార్టీ అధ్యక్షులు పవన్‌కల్యాణ్‌ను విశాఖజిల్లా వైసిపి మాజీ అధ్యక్షులు పంచకర్ల రమేష్‌బాబు మంగళగిరి జనసేన రాష్ట్ర పార్టీ కార్యాలయంలో ఆదివారం కలిశారు. ఈనెల 20న మంగళగిరిలో తన అనుచరులతో కలిసి పార్టీలో చేరనున్నట్లు పంచకర్ల ప్రకటించారు. జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్‌ను కలిసిన అనంతరం పంచకర్ల రమేష్‌బాబు మీడియాతో మాట్లాడారు. జనసేన పార్టీ భావజాలం, రాష్ట్ర శ్రేయస్సుకోసం పవన్‌కల్యాణ్ పడుతున్న తపన చూసి జనసేన పార్టీ కోసం ఒక సైనికునిలా పనిచేయాలని నిర్ణయించుకు న్నానని తెలిపారు. పవన్‌కల్యాణ్ ఎలాంటి బాధ్యతలు అప్పగించినా నూటికి నూరుపాళ్లు న్యాయం చేస్తానని పేర్కొన్నారు. తాజా రాజకీయ పరిణామాలను నాదెండ్ల మనోహర్‌తో చర్చించారు.

మొత్తం అధికారిక సమాచారం సమీక్షించడానికి నూతన ప్యానెల్




న్యూఢిల్లీ : వినియోగ వ్యయం, ఉపాధిపై 2019లో ఏర్పాటు చేసిన స్టాండింగ్ కమిటీ ఆన్ ఎకనామిక్స్ స్టాటిస్టిక్స్ (ఎస్‌సీఈఎస్) సమీక్షించిన చేసిన గృహ సర్వేలు, సమాచారంపై విమర్శలు వస్తున్న నేపథ్యంలో మొత్తం అధికారిక సమాచారాన్ని సమీక్షించడానికి మరొక కొత్త ప్యానెల్‌ను కేంద్రం ఏర్పాటు చేసింది. స్టాండింగ్ కమిటీ ఆన్ స్టాటిస్టిక్స్(ఎస్‌సీఈఎస్)ను ఏర్పాటు కేంద్ర గణాంక మంత్రిత్వ శాఖ గురువారం అర్ధరాత్రి ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. జాతీయ గణాంక కార్యాలయం నేతృత్వంలో చేసిన అన్ని సర్వేల ఫలితాలను, సమాచారాన్ని ఈ కొత్త ప్యానెల్ మరొకసారి సమీక్షిస్తుంది. ఎస్‌సీఈఎస్ కేవలం ఆర్థిక సమాచార సర్వేలపై మాత్రమే సమీక్షించగా, కొత్త ప్యానెల్ మాత్రం ఆర్థిక, సామాజిక అంశాలతో సహా మొత్తం సమాచారంపై సమీక్షలు చేస్తుంది. సర్వే ఫలితాలు, అంతరాలపై కేంద్ర ప్రభుత్వానికి సలహాలు ఇస్తుంది. భారత దేశపు మొట్టమొదటి ముఖ్య గణాంక శాస్త్రవేత్త, జాతీయ గణాంక కమిషన్ (ఎన్ఎస్‌సీ) మాజీ చైర్మన్ ప్రొనబ్ సేన్ ఈ ప్యానెల్‌కు అధ్యక్షులుగా ఉంటారు. ఈ ప్యానెల్ పది మంది అధికారిక సభ్యులు, మరో నలుగురు ప్రముఖ విద్యావేత్తలు అనధికార సభ్యులుగా ఉంటారు. కేంద్ర గణాంక మంత్రిత్వ శాఖ ఉత్తర్వులు ప్రకారం ఈ ప్యానెల్‌లో గరిష్టంగా 16 మంది వరకూ సభ్యులు ఉండవచ్చు.

ప్రధానమంత్రి ఆర్థిక సలహా మండలి సభ్యులు, చైర్‌పర్సన్ వివేక్ దేబ్రాయ్‌తో సహా అనేక మంది ప్రముఖులు ఎస్‌సీఈఎస్ సమాచారంపై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. సర్వేల రూపకల్పనల్లో భారత స్టాటిస్టికల్ సర్వీస్‌కు సరైన నైపుణ్యం లేదని విమర్శించారు. కాగా సర్వే ఫలితాలను ఖరారు చేయడంలో ఈ కొత్త ప్యానెల్ సహాయం చేస్తుంది. ముఖ్యంగా పారిశ్రామిక రంగం, సేవల రంగం, కార్మిక శక్తి గణాంకాలను ప్యానెల్ తప్పనిసరిగా సమీక్షిస్తుంది. అయితే ఈ ఫలితాల వెల్లడిని ఆమోదించే అంతిమ అధికారం ఎన్ఎస్‌సీకి మాత్రమే ఉంటుంది. గత డిసెంబర్‌లో ఎన్ఎస్‌సీని కేంద్రం పునర్మించింది. దాని పార్ట్‌టైమ్ చైర్‌పర్సన్‌గా చెన్నై మ్యాథమెటికల్ ఇనిస్టూట్యూట్ ప్రొఫెసర్ రాజీవ లక్ష్మణ్ కరాండికర్‌ను నియమించారు. ఎన్ఎస్‌సీలో ఇంకా రెండు ఖాళీలు ఉన్నాయి.

రేవంత్‌కు గట్టిగా సమాధానం చెప్పాం

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో



ఉచిత విద్యుత్‌పై పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసిన కామెంట్స్‌కు తమ పార్టీ గట్టిగా సమాధానం చెప్పిందని బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు చెప్పారు. ఆదివారంనాడిక్కడి బీఆర్ఎస్ శాసనసభా కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆపార్టీ ఎమ్మెల్యేలు చంటి క్రాంతి కిరణ్, గూడెం మహిపాల్ రెడ్డి, మదన్‌రెడ్డి, మాణిక్‌రావు, శాసన మండలి మాజీ చైర్మెన్ వీ భూపాల్‌రెడ్డి మాట్లాడారు. నోటుకు ఓటు దొంగకు రాహుల్‌గాంధీ పీసీసీ సీటు ఎలా ఇచ్చారో అని ఎద్దేవా చేశారు. మంత్రి హరీశ్‌రావు, శాసనమండలి చైర్మెన్, శాసనసభ స్పీకర్‌పై రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యల్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

వారికి ఆయన బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఉచిత విద్యుత్‌పై రైతు వేదికల వద్ద చర్చకు పెట్టే సరికి కాంగ్రెస్‌పార్టీ తోకముడిచిందని అన్నారు. రేవంత్ నోటికొచ్చినట్టు మాట్లాడితే కుదరదని హెచ్చరిం చారు. తమ పార్టీ టిక్కెట్లు నిర్ణయించడానికి రేవంత్‌రెడ్డి ఎవరని ప్రశ్నించారు. దమ్ముంటే గత ఎన్నికల్లో కాంగ్రెస్ టిక్కెట్ల మీద పోటీ చేసిన వారికే తిరిగి టిక్కెట్లు ఇచ్చి పోటీలో నిలపాలని సవాలు విసిరారు.

కాంగ్రెస్...పిచ్చోడి చేతిలో రాయి: మంత్రి హరీశ్‌రావు

కాంగ్రెస్‌పార్టీ పరిస్థితి పిచ్చోడి చేతిలో రాయిలా మారిందని మంత్రి టీ హరీశ్‌రావు విమర్శించారు. ఆ పార్టీతో తెలంగాణకు ఒరిగేదేం లేదని అన్నారు. ఆదివారంనాడిక్కడి తెలంగాణ భవన్‌లో మంత్రి హరీశ్ రావు సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరిన జహీరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, రిటైర్డ్ ఉపాధ్యాయులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. వ్యవసాయం దండుగ అన్న చంద్రబాబుకు పీసీసీ అధ్యక్షుడు నిజమైన వారసుడని ఎద్దేవా చేశారు. గడచిన పదేండ్ల కాంగ్రెస్ పాలనలో కరెంట్ బాగుందా... 9 ఏండ్ల కేసీఆర్ పాలనలో కరెంట్ బాగుందో చూసి ప్రజల్ని ఓటు వేయాలని అడుగుదామని అన్నారు.

కరెంట్ మీద ఎంత చర్చ జరిగితే బీఆర్ఎస్ పార్టీకి అంత మేలు అని చెప్పారు. మొదటి నుంచీ కాంగ్రెస్ పార్టీ తెలంగాణకు వ్యతిరేకిగా ఉందనీ, నాడు ఉన్న రాష్ట్రాన్ని ఆంధ్రతో కలిపింది కాంగ్రెస్ పార్టీనే అనీ, 1969లో ఉద్యమం చేస్తే 369 మందిని కాల్చి చంపింది కూడా కాంగ్రెస్ పార్టీనే అనీ, 2004లో గులాబీ జెండాతో పొత్తు పెట్టుకొని తర్వాత ఇవ్వమని ఎగ్గొట్టింది కూడా కాంగ్రెస్ పార్టీనే అని విమర్శించారు.

కేసీఆర్‌కు పోటీ ఉండదనీ, ఆయన ఎక్కడ పోటీ చేసినా కళ్లకద్దుకొని గెలిపిస్తారని చెప్పారు.

వట్టిపోయిన వాగుల్లోకి కాళేశ్వరం జలాలు

- కరువులో కూడా పొలాలకు సాగు నీళ్లు : మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి
- చింతలూరు పెద్దవాగులోకి నీటి విడుదల



నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

కాళేశ్వరం జలాలను నిజామాబాద్ జిల్లాలో వట్టిపోయిన వాగుల్లోకి కాళేశ్వరం జలాలను తీసుకొచ్చి రైతుల పంట పొలాలకు చేర్చిన ఘనత సీఎం కేసీఆర్‌కే చెందుతుందని రోడ్లు, భవనాలు, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. ఎస్సారెస్పీ నుంచి పైపు లైన్లు, పంపు హౌజ్‌ల ద్వారా 20వ ప్యాకేజీతో కాళేశ్వరం నీళ్ళు తీసుకు వచ్చామని, అర్థం పర్థం లేని ఆరోపణలు చేసే ప్రతి పక్షాలకు ఇక్కడికి వచ్చిన నీళ్ళే సరైన సమాధానమని స్పష్టంచేశారు. తాము ఇచ్చిన మాట మేరకు 20, 21 ప్యాకేజీల ద్వారా నీటిని తీసుకువచ్చామని, వాటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

నిజామాబాద్ జిల్లా జక్రాన్‌పల్లి మండలం చింతలూరు వద్ద పెద్దవాగులో ప్యాకేజీ 20, 21 ద్వారా కాళేశ్వరం జలాలను మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి, ఆర్టీసీ చైర్మెన్ బాజిరెడ్డి గోవర్ధన్‌తో కలిసి ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మిషన్ భగీరథ ద్వారా ఇంటి ఇంటికి తాగు నీరు ఇచ్చినట్టు, ప్రతి మూడు ఎకరాలకు ఒక అవుట్ లేట్ వాల్వును ఏర్పాటు చేయనున్నామని, ఇందుకు అవసరమయ్యే పైపులైను వేసేందుకు రైతులు అవకాశం ఇవ్వాలని కోరారు. కరెంట్, బోరు, వర్షాలతో సంబంధం లేకుండా వాల్వ్ తిప్పగానే సాగు నీరు రైతుల పంట పొలాల్లో చేరుతాయని, కేసీఆర్ ఉన్నన్ని రోజులు రైతులకు సాగు నీటిని డోకా రానివ్వరని స్పష్టం చేశారు. అనంతరం బాజిరెడ్డి గోవర్ధన్ మాట్లాడుతూ.. రూ. 2600 కోట్ల వ్యయంతో ప్యాకేజీ పనులు చేపట్టి రైతులకు ఇచ్చిన మాట నెరవేర్చినట్టు తెలిపారు. ఇజ్రాయిల్ టెక్నాలజీతో ప్రాజెక్ట్ డిజైన్ చేసి పూర్తి చేశామని, కాళేశ్వరం జలాలు రూరల్ నియోజక వర్గం వరకు చేరుకోవటం ఒక చరిత్ర అని, కరువు వచ్చినా సాగునీళ్లకు అంతరాయం ఉండబోదన్నారు. ఇప్పటికే 25 చెక్‌డ్యామ్‌ల నిర్మాణాలు పూర్తయ్యాయని, భూగర్భ జలాలు కూడా పెరుగుతున్నాయని తెలిపారు. రైతులు సీఎం కేసీఆర్‌ను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో ధర్పల్లి జడ్పీటీసీ, జిల్లా ఒలంపిక్ సంఘం ఉపాధ్యక్షులు బాజిరెడ్డి జగన్, ఉమ్మడి జిల్లాల డీసీఎంఎస్ చైర్మెన్ సాంబారి మోహన్, ఎంపీపీ కుంచాల విమల రాజు, వైస్ ఎంపీపీ తిరుపతి రెడ్డి, మండల అధ్యక్షులు నట భోజన, సర్పంచ్ పుప్పాల సుకన్య ప్రసాద్, ఇరిగేషన్ శాఖ అధికారులు, పలువురు ప్రజాప్రతినిధులు, రైతులు, ప్రజలు తదితరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఏపీలో ప్రాజెక్టుల నిర్వహణ లోపభూయిష్టం

నిధుల కొరతే ప్రధాన కారణం అంటున్న నిపుణులు

అమరావతి : రాష్ట్రంలో సాగునీటికి, తాగునీటికి కీలకమైన ప్రాజెక్టుల భద్రతను రాష్ట్రప్రభుత్వం విస్మరిస్తున్న తీరు ఆందోళన కలిగిస్తోంది. ప్రాజెక్టుల నిర్వహణకు సంబంధించిన నిధులు ఇవ్వడంలో జరుగుతున్న జాప్యంతో పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రాని పరిస్థితి నెలకొంది. దీంతో కీలకమైన ప్రాజెక్టుల భద్రతపై ప్రతికూల ప్రభావం పడుతోంది. 2019లో ప్రకాశం బ్యారేజీతో మొదలు పులిచింతల, అన్నమయ్య, గుండ్లకమ్మ, పోతిరెడ్డిపాడు... ఇలా ఏదో ఒక ప్రాజెక్టు నిర్వహణా లోపంతో దెబ్బతింటోంది. కేవలం నిర్వహణకు సంబంధించిన నిధులు ఇవ్వకపోవడంతో 2020 సెప్టెంబర్‌లో గేటుకు గ్రీస్ పూయలేక పులిచింతల ప్రాజెక్టులోని 16వ గేట్ హైడ్రాలిక్ సిస్టం దెబ్బతిని గేటు కొట్టుకు పోయింది. దీంతో ప్రాజెక్టును స్పిల్‌వే వరకు నీటిని ఖాళీ చేయాల్సి వచ్చింది. రాష్ట్రంలో సంచలనం సృష్టించిన ఈ ఘటనతో ప్రాజెక్టుల నిర్వహణకు నిధులు కేటాయించడంతో పాటు పర్యవేక్షణ పెరుగుతుందని ఆశించిన రైతాంగానికి 2021లో అన్నమయ్య ప్రాజెక్టు ధ్వంసం, ఆ తర్వాత గుండ్లకమ్మ ప్రాజెక్టు దెబ్బతిన్న గేట్ల వ్యవహారంతోపాటు పోతిరెడ్డిపాడు హెడ్‌రెగ్యులేటర్ 10వ గేట్ దెబ్బతినడం లాంటి అంశాలు ఆందోళన కలిగిస్తున్నాయి. శ్రీశైలం ప్రాజెక్టు కింద ఫ్లంజ్‌పూల్ పూర్తిగా దెబ్బతింది. శ్రీశైలం ప్రాజెక్టు మరమ్మతుల పనులు చేయాలని కేంద్ర ప్రాజెక్టుల భద్రతా కమిటీ చైర్మన్ పాండ్యా నివేదికలను బుట్టదాఖలు చేశారు. చారిత్రాత్మకమైన ధవళేశ్వరం ప్రాజెక్టు కూడా నిధులు లేక నీరసించి పోతోంది. ధవళేశ్వరం ప్రాజెక్టుకు వున్న 175 గేట్ల మరమ్మతు పనులను 2018లో చేపట్టారు. మరమ్మతుల పనులకు ప్రభుత్వం నిధులను ఇవ్వడం లేదని 53 గేట్లకు మరమ్మతులు చేసి వదిలేశారు. గుండ్లకమ్మ రిజర్వాయర్‌దీ అదే పరిస్థితి. ప్రకాశం జిల్లాలో 80వేల ఎకరాలకు సాగునీరు, తాగునీరు అందించే లక్ష్యంతో 3.87 టిఎంసిల సామర్థ్యంతో గుండ్లకమ్మ నదిపై చేపట్టిన కందుల ఓబులరెడ్డి గుండ్లకమ్మ రిజర్వాయర్ గేట్ల నిర్వహణ కోసం రూ.3 కోట్లతో అధికారులు ప్రతిపాదనలు పంపినా ప్రభుత్వం అందుకు తగ్గ నిధులను ఇవ్వకపోవడంతో మూడవ గేట్ ధ్వంసమైంది. దీంతో ప్రాజెక్టులోని నీరం తా సముద్రం పాలై ఖరీఫ్‌కు సాగుకు నీరివ్వలేని పరిస్థితి నెలకొంది. అన్నమయ్య ప్రాజెక్టు కూడా నిర్వహణా లోపంతోనే పూర్తిగా కొట్టుకుపోయింది. ఎగువన కురిసే వర్షాలకు ఎంతనీరు ప్రాజెక్టులోకి వస్తుంది.. దిగువకు ఎంత నీరు వదలాలి అనే నిర్వహణా యంత్రాంగం సరిగాలేక ప్రాజెక్టు కొట్టుకుపోయింది.

రాష్ట్రంలో అన్నమయ్య ప్రాజెక్టు ఘటన తర్వాత రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అధ్యక్షతన ఇరిగేషన్ ఇఎన్‌సి, ఐఐటి, జెఎన్‌టియు లాంటి ప్రతిష్టాత్మక సంస్థలకు చెందిన నిపుణులతో ప్రాజెక్టుల భద్రత కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన హైలెవల్ కమిటీ నిర్ణయాలు ఏమ య్యాయని రైతులు ప్రశ్నిస్తున్న పరిస్థితి. ఇప్పటికైనా ప్రాజెక్టుల నిర్వహణకు అవసరమైన నిధులు కేటాయించిసాగునీటిని అందించాలని కోరుతున్నారు.

వచ్చే ఆరేండ్లల్లో యునికార్న్‌ల సంఖ్య పదివేలకు పెరగాలి

- స్టార్టప్‌ల సంఖ్య 10రెట్లు పెంచాలి : కేంద్ర ఎలక్ట్రానిక్స్ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

వచ్చే ఆరేండ్లల్లో యునికార్న్‌ల సంఖ్య పదివేలకు పెరగాలని, స్టార్టప్‌ల సంఖ్యను పది రోట్లు పెంచాలని కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖ మంత్రి రాజీవ్‌చంద్రశేఖర్ అన్నారు. శనివారం రాత్రి మాదాపూర్‌లోని హోటల్ వెస్టిన్‌లో జీటో ఇంక్యుబేషన్‌లో ఇన్నోవేషన్ ఫౌండేషన్(జేఐఐఎఫ్) ఆరో వ్యవస్థాపక దినోత్సవ వేడుకలు, పెట్టుబడిదారుల సమ్మేళనంలో మాట్లాడారు. 2030 నాటికి 5 ట్రిలియన్ యూఎస్ డాలర్ల ఆర్థిక వ్యవస్థను లక్ష్యంగా పెట్టుకున్నామని అన్నారు.

జలరంగంలో పుష్కలంగా అవకాశాలు : జీటో ఇన్వెస్టర్స్ కాన్‌క్లేవ్‌లో కేంద్ర మంత్రి జలశక్తి

జలశక్తి రంగంలో స్టార్టప్‌లు అన్వేషించగల అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని కేంద్ర జలశక్తి శాఖ మంత్రి గజేంద్ర సింగ్ షెకావత్ అన్నారు. తాగునీటి నాణ్యతను పరీక్షించడానికి భారతదేశంలో 2వేల ఎన్ఏబీఎల్ వాటర్ టెస్టింగ్ ల్యాబ్‌లు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. నీటి రంగంలో 240 బిలియన్ డాలర్ల కంటే ఎక్కువ పెట్టుబడి పెట్టడానికి భారత ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మాదాపూర్‌లోని టీ-హబ్‌లో జీటో ఇంక్యుబేషన్ అండ్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ (జేఐఐఎఫ్) రెండు రోజుల పెట్టుబడిదారుల సమ్మేళనం, వ్యవస్థాపకుల దినోత్సవాన్ని ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. జనాదరణ పొందినట్లుగా కాకుండా, దేశీయ, పారిశ్రామిక రంగాల కంటే వ్యవసాయ రంగం భారతదేశంలో ఎక్కువ నీటిని వినియోగిస్తుందన్నారు.

ప్రతి స్కీమ్ వెనుక స్కామ్

- 'యువగళం' దెబ్బకు వైసిపి ప్యాకప్ ఖాయం : లోకేష్



ఒంగోలు : ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న ప్రతి స్కీమ్ వెనుక స్కామ్ ఉందని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ ఆరోపించారు. యువగళం దెబ్బకు వైసిపి ప్యాకప్ చేయడం ఖాయమని అన్నారు. యువగళం పేరుతో లోకేష్ చేపట్టిన పాదయాత్ర 156వ రోజుకు చేరింది. ఆదివారం నెల్లూరు జిల్లా లింగసముద్రం మండలం వెంగళాపురం నుంచి ప్రారంభమైన యాత్ర వలేటివారిపాలెం వరకు సాగింది. అక్కడ జరిగిన బహిరంగ సభలో లోకేష్ మాట్లాడుతూ.. జగన్మోహన్‌రెడ్డి వలంటీర్లను పెట్టి ప్రజల వ్యక్తిగత సమాచారం తీసుకుంటున్నారని, డేడా దొంగ జగన్ అని ఆరోపించారు. వ్యక్తిగత సమాచారం ఇస్తే మీకు ఉన్న ఆస్తులను కొట్టేయడం ఖాయమని విమర్శించారు. చంద్రబాబు పోలవరం ప్రాజెక్టు పనులను పరుగులు పెట్టించి 72 శాతం పూర్తి చేస్తే, జగన్ కమీషన్లకు కక్కుర్తితో రివర్స్ టెండరింగ్‌కు వెళ్లి ప్రాజెక్టును ప్రమాదంలో పడేశాడని విమర్శించారు. తన సొంత ప్రయోజనాల కోసం ఢిల్లీ చుట్టూ తిరుగుతూ కేసుల నుంచి తప్పించుకోవాలని చూస్తున్నారేగానీ రాష్ట్ర ప్రయోజనాలు పట్టించుకోవడంలేదని దుయ్యబట్టారు. జగన్ ఇప్పటి వరకు విద్యుత్ ఛార్జీలు తొమ్మిదిసార్లు పెంచారని.. ఆర్‌టిసి ఛార్జీలు మూడుసార్లు పెంచారన్నారు. ఇంటి పన్ను, చెత్త పన్ను, నిత్యావసర సరుకులు, గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు ఆకాశాన్నంటాయని తెలిపారు. బిసిలకు, మైనార్టీలకు, దళితులకు టిడిపి ప్రభుత్వం తీసుకొచ్చి అనే పథకాలను వైసిపి ప్రభుత్వం తొలడించిందని, టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే వీటిని పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చారు. రాళ్లపాడు ప్రాజెక్టు ఎడమ కాలువ పనులు పూర్తి చేస్తామని తెలిపారు. కందురూరును ప్రకాశం జిల్లాలో కలుపుతామని, పేపర్ పరిశ్రమ తీసుకొచ్చి ఈ ప్రాంత రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. కందుకూరును మోడల్ టౌన్‌గా తీర్చిదిద్దుతామని, మామిడి, సపోట రైతులకు మార్కెటింగ్ అవకాశంపాటు గిట్టుబాటు ధర కల్పిస్తామని హామీ ఇచ్చారు. పాదయాత్ర ఆదివారం రాత్రి ప్రకాశం జిల్లా కొండపి నియోజకవర్గంలోకి ప్రవేశించింది. పొన్నలూరు మండలం మాలపాడు వద్ద జిల్లా నేతలు ఆయనకు ఘనస్వాగతం పలికారు.



విదేశీ పక్షుల సందడి

గుంటూరు : దేశంలో పేరెన్నిక గన్న ఉప్పలపాడు పక్షుల కేంద్రంలో విదేశీ పక్షులు సందడి చేస్తున్నాయి. ఆగస్టు దగ్గర పడుతుండటంతో పదుల సంఖ్యలో కొత్త పక్షులు వచ్చి చేరుకుంటుండటం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది.

దక్షిణ కొరియాలో వరద బీభత్సం

కొండచరియలు పడి 26 మంది మృతి..



సియోల్: భారీ వర్షాలు, వరదలతో ఉత్తర భారతదేశం అతలాకుతలం అవుతుండగా.. ఇలాంటి భీకర పరిస్థితే దక్షిణ కొరియా కూడా ఎదుర్కొంటోంది. భారీ వర్షాలతో ఆ దేశం అతలాకుతలం అవుతోంది. వరదలు, కొండచరియలు విరిగిపడడంవల్ల 26 మంది మృతి చెందారు. మరో పదిమంది గల్లంతయ్యారు. మరెంతోమంది క్షతగాత్రులయ్యారు. దక్షిణ కొరియాలోని దక్షిణ ప్రాంతంలో నష్టం ఎక్కువగా సంభవించినట్టు ప్రభుత్వం తెలిపింది. ఈ నెల 9 నుంచి దేశంలో ఎడతెరిపి లేకుండా భారీ వర్షాలు కురుస్తున్నాయి. 5,570 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించగా 25,470 ఇండ్లు చాలా రోజులుగా అంధకారంలో మునిగిపోయాయి. 4,200 మంది పునరావాస శిబిరాల్లో గడుపుతున్నారు. 20 విమాన సర్వీసులు రద్దు కాగా, బుల్లెట్ రైళ్లు సహా పలు రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. భారీ వర్షాల కారణంగా 200 రోడ్లను మూసివేశారు. దేశంలోని కొన్ని ప్రాంతాల్లో నేడు కూడా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని ఆ దేశ వాతావరణశాఖ తెలిపింది. జులై 9న ఒక్క రోజే చెయోంగ్యాంగ్‌లోని గోంగ్జులో ఏకంగా 600 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.